UNIVERSAL
LIBRARY
OU_204130
UNIVERSAL
LIBRARY

OUP—901—26-3-70—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. 84 V44A Accession No. 1961

Author

Title

This book should be returned on or before the date last marked below.

శ్రీ గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారి
సప్తతితమ జన్మదినోత్సవ ప్రచురణములు

౪

ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజము



ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజము

(వర్తమానాంధ్రభాషాచారిత్రకోపన్యాసములు)

రావుసాహెబు, మహోపాధ్యాయ
గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారు, బి. ఏ.

తెలికిచెర్ల వెంకటరత్నము
ప్రకాశకుడు ; గుంటూరు

అన్ని హక్కులూ రామమూర్తిపంతులుగారివి

ప్రథమ ముద్రణము నవంబరు, ౧౯౩౩

ఆంధ్రపత్రికా ముద్రణాలయమున ముద్రితము, చెన్నపురి

సంపాదకీయ భూమిక

శ్రీ రామమూర్తిపంతులుగారు వ్యావహారిక భాషను పునఃప్రతిష్ఠితము చేయడానికి సుమారు పాతిక సంవత్సరములనుంచి చేస్తూవున్న వాదములో ప్రధానముగా నాలుగు మార్గములు గోచరిస్తున్నవి.

భాషాతత్త్వ ప్రదర్శనపూర్వకముగా ప్రపంచములోని ఇతర భాషా వాఙ్మయముల చరిత్రములున్ను వాటితో పోల్చి ఆంధ్రభాషావాఙ్మయముల చరిత్రములున్ను బోధించి తక్కిన భాషలవలెనే తెలుగుకూడా నానాటికి మారుతూ వచ్చినదనీ, ఆయా కాలముల కవులు తమనాడు శిష్టవ్యవహారసిద్ధమయిన భాషను కావ్యాలలో ప్రయోగిస్తూవచ్చినారనీ, నేటి రచయితలు కూడా ఈ శిష్టాచారమే పాటించి వ్యావహారిక భాషలో గ్రంథములు వ్రాస్తే భాషాప్రయోజనము చక్కగా నెరవేరుతుందనీ, నోటిమాటకూ చేతివ్రాతకూ సామరస్యము కుదిరి ఒకదాని కొకటి పోషకముగా ఉన్నప్పుడే వాఙ్మయములోని భాష సహజముగానూ, సరళముగానూ, సుబోధకముగానూ పరమ ప్రయోజనకారిగానూ ఉంటుందనీ నిరూపించడము ఒకమార్గము.

వ్యావహారిక భాషను బహిష్కరించి గ్రాంథికాంధ్రమును దాని స్థానములో నెలకొల్పడానికి ప్రయత్నిస్తూ ఉన్నవారు ప్రాచీన తాళపత్రగ్రంథములలో ఉన్న లౌకికభాషను ఎట్లు గ్రాంథికీకరణముచేసి కూటకరణ దోషమునకు పాల్పడి భాషకు అపారమయిన అనర్థము కలుగజేసినారో ఋజువు చేసి పూర్వులు వ్రాసిన పురాణ (వచన) ములూ, లక్షణగ్రంథములూ, వ్యాఖ్యానములూ, టీకలూ, వివిధశాస్త్రగ్రంథములూ, దేశచరిత్రములూ, జానపదవృత్తాంతములూ, వార్తాపత్రికలూ, శాసనములూ, కథలూ, బడి పుస్తకములూ మొదలయిన అన్నివిధముల రచనలలోనూ వచనము వ్యావహారికభాషలోనే ఉన్నదని నిదర్శనపూర్వకముగా సిద్ధాంతీకరించి, ఏ

భాషలోనయినా ఇదే నిజమయిన వచనరచనా సంప్రదాయమని నిరూపించడము రెండోది.

'గ్రాంథికభాష' అని మన పండితులు వ్యవహరించేదాని స్వరూపము ఇదమిద్ధమని నిర్ణయించడానికి వల్లపడదనీ, మన వ్యాకరణములు పరస్పరవిరుద్ధములుగానూ, అసమగ్రములుగానూ ఉండడమువల్ల ఏది తప్పో ఏది ఒప్పో నిర్ధారణచేయడము దుష్కరమనీ, ఒక పండితుడికి గ్రాహ్యమయిన ప్రయోగము ఇంకొకరిమతములో అగ్రాహ్యమనీ, ఒక మహామహోపాధ్యాయుల గ్రంథాలలో ఇంకో మహామహోపాధ్యాయులవారికి వేనవేలు తప్పులు కానవస్తూ ఉన్నవనీ, గ్రాంథిక భాషలో నిర్దుష్టముగా వ్రాసిన గ్రంథము మచ్చుకి ఒక్కటిఅయినా లేదనీ, గ్రాంథికభాష పండితప్రకాండులకయినా సాధ్యపడక ఇంత అవ్యవస్థముగా ఉన్నదనీ ప్రాచీనభాషలో శబ్దస్వరూపమూ శబ్దార్థమూ నిర్ణయించడమే బహుకష్టముగా ఉన్నందువల్ల ఆభాషలో స్వతంత్రరచన సాగించడము అసంభవమనీ నిరూపించడము మూడోమార్గము.

ప్రాచీనకవుల కావ్యములన్నీ సమగ్రముగా పరిశీలించకపోవడమువల్ల వ్యాకరణకర్తలూ, కోశకారులూ, పండితులూ తప్పులుగా భావించి లక్షణవిరుద్ధములనీ గ్రామ్యములనీ నిందించిన రూపములు వందలకొలదిగా కవుల కావ్యములలో ప్రయుక్తములై ఉన్నవనీ, వ్యాకరణము ప్రయోగమూలము కావడమువల్ల కవిప్రయోగము లక్షణముకంటె బలవత్తరమైనదనీ, కవులు ప్రయోగించిన రూపములు లక్షణములో చెప్పకపోతే లక్షణమే అసమగ్రమూ దుష్టమూ అవుతుంది కాని ప్రయోగములు నింద్యములు కావనీ నిరూపించి, అట్టి రూపములకు—ప్రతిపక్షులు ఎదురాడుటకు వీలులేనట్టుగా—కవుల కావ్యములనుంచి వందలకొద్దీ ప్రయోగములు చూపి నిర్దుష్టత్వ మాపాదించడము నాలుగోమార్గము.

ఈనాలుగుమార్గములూ వ్యక్తపరిచే గ్రంథములు వరుసగా శ్రీపంతులుగారి సప్తతితమ జన్మదినోత్సవ ప్రచురణములలోని వ్యాసావళి, గద్యచింతామణి, ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజము, బాలకవి శరణ్యమున్నూ.

ప్రకృతగ్రంథములో కళాప్రపూర్ణ వేదం వెంకటరాయశాస్త్రులవారి గ్రాంథికాంధ్రభాషాపాండిత్యమును శ్రీ రామమూర్తిపంతులుగారు విమర్శించినారు. తెలుగుపండితులలో అగ్రగణ్యులైన వీరి భాష దోషభూయిష్ఠముగా ఉన్నదని ఋజువుచేస్తే గ్రాంథికాంధ్రము నిర్దుష్టముగా వ్రాయడము ఎంతటి పండితులకయినా అసాధ్యమని బోధపడుతుంది; ప్రజలు కృతకభాషావ్యామోహమును పరిత్యజిస్తారు.

ఇందులో ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజమనీ, మిథ్యాపవాదమనీ రెండు వ్యాసములు ఉన్నవి. మొదటిది పంతులుగారు ప్రకటించిన 'తెలుగు' పత్రిక నుంచిన్నీ, రెండోది ఏలూరిపాటి రామభద్రచయనులుగారు ప్రకటించిన 'సారస్వత సర్వస్వము' నుంచిన్నీ పునర్ముద్రితములు.

జన్మదినోత్సవనిర్వాహకసంఘమువారి కోరికపైని భాషాపోషకులూ, ఉదారహృదయులూ శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఈ గ్రంథము ఉచితముగా ముద్రించి ఇచ్చి గొప్ప సహాయము చేసినందుకు ఈ సంఘముపక్షమున వారికి కృతజ్ఞతతో వందనము లర్పిస్తున్నాను. ఈ గ్రంథము ప్రూఫులు ఓపికతో దిద్ది నాకత్యంత సాహాయ్యముచేసినవారు శ్రీ రామమూర్తిపంతులుగారి శిష్యకోటిలో ప్రధానులూ, సహృదయులూ, నాకు గురుతుల్యులూ అయిన శ్రీ కాళ్లకూరి సూర్యనారాయణపంతులుగారు. వారికి నాహృదయపూర్వక ప్రణామములు.

జన్మదినోత్సవ సంఘమువారికి శ్రీ పంతులుగారు తమ రచనలు ప్రకటనార్థము ఇచ్చినందుకు వారికి ఈ సంఘముతరపున కృతజ్ఞతాపూర్వక వందనములు సమర్పిస్తున్నాను.

గుంటూరు
నవంబరు, ౧౯33.

తెలికిచెర్ల వెంకటరత్నం,
సంపాదకుడు.

*

కందుకూరి వీరేశలింగకవి
స్మృతిచిహ్నముగా అంకితము

*



మిథ్యాపవాదము — భాషాభేషజము

మ-రా-రా-శ్రీ రావుసాహేబు

గిడుగు వేంకటరామమూర్తిపంతులు, బి. ఏ. గారు

వ్రాసినది

శ్రీ రామమూర్తి పంతులుగారి డబ్బైయేడవ జన్మదినమున

ప్రకటితము

రాజమహేంద్రవరము

1933

చెన్నపురి:
ఆంధ్రపత్రికా ముద్రాలయమున
ముద్రితము.

మిథ్యాపవాదము

మిథ్యాపవాదము

ప్ర స్తా వ న

ఈవ్యాసమునకు పీఠిక వ్రాయనారంభించినప్పుడు నామిత్రులిద్దరు నన్ను చూడవచ్చి, దీనిలోని విషయమును గురించి ప్రసంగించినారు. ఆప్రసంగమే ప్రస్తావనగా రచించి చేర్చినాను.

నాయుడుగారు—మేము వచ్చినపనిఅయినది ; గాని మీపనికి ఆటంకమైనది ; ఏదో వ్రాస్తున్నారు—రేపు మళ్లీ వస్తాము.

నేను—చిన్న వ్యాసమొకటి—

నా—దేన్ని గురించి ?

ఆచార్లుగారు—విషయమేమిటండి ?

నేను—మిథ్యాపవాదము — కూర్చునివినండి, చెప్తాను — మీరు విన్నారో లేదో ?— దుష్టప్రబంధనిర్మాతలట ! భాషాదేవికట ! విషప్రయోగముచేసినారట ! విషముశల్యములోనికి దిగినదట ! దేవిగారు ప్రాణసంశయదశలో ఉన్నారట ! వెంటనే తగినచికిత్స చేయకపోతే—

ఆ—(చెవులు మూసుకొని) కృష్ణకృష్ణ ! ఏమిటో అవాచ్యము ! ఎవ రావిషప్రయోగముచేసిన పాపాత్ములు ?

నేను—దుష్టప్రబంధ నిర్మాతలని చెప్పినానే.

ఆ—ఎవ రాపాపిష్ఠదుష్టప్రబంధనిర్మాతలు ?

నేను—అనేకులట. వారికి ప్రతినిధులు, ప్రధానులు, కీర్తిశేషులయిన రావుబహదూరు కందుకూరి వీరేశలింగం పంతులుగారట !

నా—ఎంతమాట! ఎంతమాట! భాషాదేవికి విషంపెట్టి ప్రాణసంశయదశలోకి తెచ్చినవారా వీరేశలింగంపంతులుగారు? యావజ్జీవము గాఢమైనభక్తితో భాషాదేవికి నిరంతర సేవచేసిన వీరేశలింగం పంతులుగారేమిటి, భాషాదేవికి విషంపెట్టడమేమిటి? ఎవరండీ ఇట్టితొందరమాటలాడినవారు?

నేను—చెప్పనా?—బ్రహ్మశ్రీ వేదం వేంకటరాయశాస్త్రిలవారు.

ఆ—(ముక్కుమీద వేలుపెట్టుకొని) ఆ! ఏమిటీ! వేదం వేంకటరాయశాస్త్రిలుగారే? ఎంతదారుణము! ఎప్పుడన్నా రీలాగున? ఎక్కడ?

నేను—1919-వ సం॥ జూన్ 7 తేదీని నెల్లూరిపురమందిరమందు ఆంధ్రసాహిత్య పరిషదష్టమవార్షిక సభలో—

నా—అన్నట్టు జ్ఞాపకంవచ్చినది! ఆసభకు నేనువెళ్ళినాను. ఆ శాస్త్రిలుగారే సభాధ్యక్షులు. అధ్యక్షోపన్యాసము మొదలుపెట్టి ముగించినదాకా ఏవో హాస్యాలూ పరాచికాలూచెప్పిఅందరినీ నవ్వించినారు. ఏవో పుస్తకాలలోని వాక్యాలున్ను శబ్దాలున్ను ఉదాహరించి అవి విషప్రయోగాలని చెప్పినారు. అధ్యక్షోపన్యాసమంతా ప్రహసనమే. మాటిమాటికీ చప్పట్లే. ముచ్చట్లు చెప్పుకొంటూఉన్నవారుకూడా చప్పట్లువినబడ్డప్పుడు కొంచెముఆగి, తాముకూడా గట్టిగా చప్పట్లుకొట్టి, ఒకమారు నవ్వి, మళ్ళీ ముచ్చట్లు చెప్పుకొనేవారు. అయితే ఈప్రహసనమునకు నాయకులు వీరేశలింగంపంతులుగారే అని ఎవ్వరికీ తెలియలేదుసుమండీ. శాస్త్రిలుగారు పంతులుగారిపేరు ఎక్కడా ఎత్తలేదు; మీ రేలాగున కనుకొన్నారోగాని—

ఆ—ఇది హాస్యానికి విషయమా? భాషాదేవిని ప్రాణసంశయ దశలోనికి తెచ్చినారంటే, జాలిపుట్టి ఏడుస్తారుగాని నవ్వుతారా ఎవ్వరైనా? భాషాదేవికి విషంపెట్టినారని చెప్పినప్పుడు కోపంవచ్చి ఒళ్ళుమండవలసినది నిజముగా భక్తిగలవాళ్లయితే. మననాయుడుగారు కూడా—

నా—ఎంత సత్యకాలం వాళ్ళండీ ఆచార్లుగారూ, మీరు! ఉపన్యసించిన అధ్యక్షులకు ఏమైనా జాలీ, కోపము, దుఃఖము నిజముగా ఉంటే గదా, సభవారిమనస్సులో ఆభావాలు ఉద్రేకించడం?—ఆయన నవ్వుటాలకోసమే ఉపన్యసించినప్పుడు విన్నవాళ్లకు నవ్వుటాలుకాక మరేమిటో? మీరాసభలోఉంటే నాలాగే మీరూ నవ్వుదురు. ఆయన విమర్శించిన గ్రంథాలు చిన్నబడులలోను, పెద్దకాలేజీలలోను పిల్లవాళ్లు చదివే పుస్తకాలట! అవి గ్రామ్యవాదులు రచించినవిగాబోలు; గ్రామ్యప్రయోగాలు చూపించి శాస్త్రులుగారు ఎప్పటిలాగే హాస్యాలుచేసి గ్రంథకర్తలను వెక్కిరిస్తున్నారు గాబోలును అని పండితులు హర్షించి ఉంటారు. ఇది పండితులకు ఇప్పుడు మామూలు అయినది గదా.

ఆ—వీరేశలింగం పంతులుగారు గ్రామ్యవాదులు కారేమో!

నా—కారు; మొట్టమొదట పంతులుగారు గ్రామ్యవాదమును ఖండించినవారే; గాని, ఆయనమతం—

నేను—ఆయనమతం ఇదమిత్థమని ఎవరున్ను చెప్పలేరు. పూర్వము పండితులనుకూడా "పెడెంట్లు" అని ఆయన ఆక్షేపించలేదా ఏమి? ఆలాగున ఆక్షేపించినందుకేగదా వెంకటరాయశాస్త్రులుగారికి పంతులుగారిమీద కోపమువచ్చినది! పంతులుగారికి ఎప్పుడు ఏది మంచిదనితోస్తుందో అప్పుడు అదేసమ్మతము. భాషావిషయములో చూడండి. చిన్నయసూరి మిత్రభేదము రచించినట్టు ప్రాచీనాంధ్ర కావ్యములలోని భాష అభ్యసించి విగ్రహము, సంధి రచించినారు. అప్పుడు అదే యుక్తమని ఆయనకు తోచినది. అది అయుక్తమని తోచినతర్వాత అట్టి గ్రంథములు ఆయన మరి రచించలేదు. అట్టి అయుక్తమయినపని చేసినందుకు తమ్ముతాము నిందించుకొన్నట్టు స్వీయచరిత్రము రెండోభాగములో వారు ప్రకటించినారు; చూడండి పుట 156. అందరికి తెలిసేటట్టు సుపరిచితమైన భాషలో రచించడము ఉచితమని తోచినప్పుడు నాటకాలు, నవలలు ప్రహసనములు మొదలయినవి

ఆలాగున రచించినారు. పండితులు ఆక్షేపించినా, పంతులుగారు లక్ష్య పెట్టలేదు. ఎన్నో సార్లు వ్యావహారిక భాషాప్రయోజనమునుగురించి వారితో నేను చర్చించినాను. అంతకంతకు నాఉద్దేశము వారికి సమ్మతమైనది. తుట్ట తుదకు 1919-వ సం॥ ఫిబ్రవరి నెల 28 తేదిని నాసలహా అంగీకరించి, "వర్తమానవ్యావహారికాంధ్రభాషా ప్రవర్తకసమాజము" ఒకటి రాజమహేంద్రవరమునందే స్థాపించి దానికి వారే అధ్యక్షులయినారు. అప్పుడు వారు కవులచరిత్రము రెండవపూర్వ అచ్చువేయించుచుండుగాను గ్రంథము సవరిస్తూ ఉండిరి. ఈపని పూర్తికాగానే వాడుకభాషలో గ్రంథరచనకు పూను కొంటామని సభలో చెప్పినారు. అయితేమన దురదృష్టముచేత మరి మూడు మాసములకే పంతులుగారు కాలంచేసినారు. వీరు మొదట "గ్రామ్యవాదము" ఖండించినవారే అయినా, పూర్వులు ప్రయోగించని నేటి వాడుకమాటలు మొదటనుండిన్ని వాడినట్లు వారిగ్రంథాలలో కనబడుతున్నది. అది దోష ముగా వారు ఒప్పుకోలేదు. ఈవిషయములోకూడా వెంకటరాయశాస్త్రిలు గారికిన్ని పంతులుగారికిన్ని మతభేదమున్నది. వ్యావహారికభాష శాస్త్రిలు గారి మతమందు అస్పృశ్యము, అవాచ్యము; పంతులుగారి మతమందు యోగ్యము, సేవ్యము.

ఆ—అయితే, ప్రతిపక్షులపేరుచెప్పి మరీ శాస్త్రిలవారు ఆక్షేపించ వలసిఉండెను. పిరికివారులాగున ఊరూపేరూచెప్పకుండా, కాకిమీదనో గద్దమీదనో పెట్టి, దుర్భాషలాడి తిట్టడము నీచమైనపనికాదా ?

నా—వీరేశలింగం పంతులుగారిని పేరుపెట్టి ఆలాటి తిట్లుతిట్టితే సభవారు సహింతురా? పరిషత్తువారికి పంతులుగారియెడల చాలా గౌరవము కద్దు. ఒక సంవత్సరము పంతులుగారిని పరిషద్వార్షికసభకు అధ్యక్షులుగా చేసి గౌరవించినారు. పంతులుగారి మరణమువల్ల దేశమునకు గొప్పలోటు వాటిల్లినదని నెల్లూరిసభలోనే సభవారందరూ లేచి నిలబడి, తమ విషాద

మును వ్యక్తపరచినారని వార్తాపత్రికలలో ప్రకటించినారు. అందుచేతనే శాస్త్రిలుగారు పంతులుగారి పేరు ఎత్తలేకపోయినారు.

నేను—పంతులుగారు కాలంచేసి అప్పటికి పదిపంద్రెండు రోజులకన్న అధికముకా లేదు; గనుక పేరుపెట్టి తిట్టడము మర్యాదగా ఉండదని మొగమాటముచేత స్పష్టముగా చెప్పక పంతులుగారి పేరు ప్రచ్ఛన్నంగా ఉంచినారు. పంతులుగారి పుస్తకములలోని వాక్యములు, శబ్దములు పుటల వరుసను ఎత్తుకొని జాబితాలు వ్రాసి ప్రకటించినప్పుడు పేరుచెప్పకపోతే నేమి? ప్రయోగములను బట్టి గ్రంథములనున్ను, గ్రంథములనుబట్టి గ్రంథకర్తలనున్ను తెలుసుకోవలెనని కోరికగలవారు తెలుసుకోవచ్చునుగదా.

నా—మీ రనుకొన్నట్లు మొగమాటమున్నూ కాదు; ఆచార్లుగా రనుకొన్నట్లు పిరికితనమున్నూ కాదు; గడుసుతనము. పంతులుగారి పేరు స్పష్టముగా సభలో తెలియజేస్తే, వోరారా ఇష్టమువచ్చినట్లు వారిని తిట్టనిస్తూరా సభవారు? చాలాకాలమయి అణగిఉన్న కోపము వెళ్ళగక్కి కడుపుబ్బ తీర్చుకోవడమునకు శాస్త్రిలుగారికి మంచి అవకాశముదొరికినది. ఈ ఉపాయముచేత కసిదీర్చుకొని సిద్ధసంకల్పు లయినారు.

ఆ—సరే కాని, నిందితుని పేరు తెలియజేయకుండా ఎవరినో గ్రంథకర్తను పరోక్షమందు దుర్భాషలాడి శాస్త్రిలుగారు తిట్టుచున్నారనైనా సభవారికి తెలిసినదంటారా లేదా? ఆపని శాస్త్రిలవారికి నైజమైనా, సభలోనున్న సభ్యజనులకు ఏలాగున వినోదకరమైనదో నాకు తెలియదు.

నేను—సభ్యత, మర్యాద కేవల తత్త్వవిచారమందు పాటించక పోవడము గొప్పదోషము కాకపోవచ్చును. గ్రంథకర్త వీరితిట్లకు పాత్రమైనప్పుడు పరిషత్తువారు శాస్త్రిలవారిని పురికొల్పి వారిచేత ఈలాగున తిట్టించినా అన్యాయ్యమని నేను వాదించను. గ్రంథకర్త ఎవడయితేనేమి,

అనోన్యాడైనప్పుడు? వీరేశలింగం పంతులుగారైతే ఆక్షేపించకూడదనిన్ని, ఇతరులెవరైనా అయితే ఆక్షేపించవచ్చుననిన్ని, వివేకులు ఎవ్వరూ అనరు. విమర్శకు విషయము గ్రంథముగాని గ్రంథకర్త కాదు. అయితే, ఆరోపించిన నింద యథార్థమవునా కాదా అని మాత్రము విచారించవలెను.

ఆ—ఆవిచారణ పరిషత్తువారు చేయవలసియుండెను. చేసినారా ?

నేను—చేయలేదు. శాస్త్రులుగారు చదివిన అధ్యక్షోపన్యాసము మాత్రము కొంతకాలముగడిచిన పిమ్మట పరిషత్పత్రికలో ప్రకటించినారు. గాని ఇప్పటికిన్ని—

నా—ఆంధ్రపత్రికలో మాత్రము వెంటనే ప్రకటించినారు; గాని, మీరన్నట్టు ఇప్పటికిన్ని శాస్త్రులుగారు ప్రకటించిన అపవాదము ఎవ్వరును విమర్శించలేదు.

ఆ—పరిషత్తువారు, సభవారు, పరిషత్పత్రికాసంపాదకులు, ఆంధ్ర పత్రికాసంపాదకులు ఈపత్రికలు చదివినవారు—వీరందరూ ఉపేక్షించి ఊర కున్నందున అపవాదము స్థిరపడినట్టే అయినది. పండితులందరూ నిరుత్తరులయి మౌనము వహించినట్టే వీరేశలింగంపంతులుగారి కీర్తి కళంకితమైనదన్న మాటే. ఆహా! పంతులవారితోకూడా పంతులవారియెడల లోకులకున్న గౌరవము, అభిమానము, అనురాగము—అన్నీ చచ్చినట్టే—

నా—ఆలాగనడం ధర్మంకాదు. వీరేశలింగంపంతులుగారిమీద శాస్త్రులుగారు ఈ నిందమోపినారని ఇంకా ఎవ్వరికీ తెలియలేదు. ఒక్క రామమూర్తిపంతులుగారు మాత్రము తెలుసుకొన్నారు.

ఆ—వీరైనా పంతులుగారి కీర్తికి కళంక మంటకుండా చేస్తే లోక మంతా సంతోషిస్తారు.

నేను—పంతులవారికీర్తి ప్రతిష్ఠలను గురించి మనకంత ఔత్సుక్యముండనక్కరలేదు. వాటికి ఆధారము కేవలము సత్యము. సత్యము శాశ్వతము. సత్యము అసత్యముగాను, అసత్యము సత్యముగాను అవివేకులు ప్రకటించినా సత్యాసత్యములు తారుమారు అయిపోవు; గాని కొంతకాలము కొంతహాని కలిగితే కలుగవచ్చును. సదాచారమును దురాచారమని నిందించడమువంటిదే సుశబ్దము అపశబ్దమని దూషించడము కూడాను. అందువల్ల లోకులు సదాచారమును విడిచి దురాచారము అవలంబించినట్లే సుశబ్దాలు విడిచి అపశబ్దాలు వాడుతారు. ఇప్పుడు నేను రచించిన ఉపన్యాసములో నాకు తెలిసినంతమట్టుకు సత్యమే ప్రకటించినాను. వీరేశలింగంపంతులుగారు ప్రయోగించిన శబ్దాలలో ఏవి దుష్ప్రయోగములని శాస్త్రులుగారు నిందించినారో అవి ఒక్కొక్కటి శ్రద్ధగా విమర్శించి చూచి ఏవి సాధువులని తెలుసుకొన్నానో అవి సాధువులని రుజువుచేసినాను. శాస్త్రులుగారివాదములోని దోషములు నాకు కనబడ్డంతమట్టుకు చూపించినాను. ఏవో కొన్ని అంశములు మినహాగా మొత్తముమీద శాస్త్రులుగారి అపవాదము నిరాధారముగా నాకు తోచినది.

ఆ—మంచిపని చేసినారు. అయితే మరి వేంకటరాయశాస్త్రులవారు గొప్ప పండితులని లోకములో ప్రసిద్ధిగదా. సుశబ్దమేదో అపశబ్దమేదో తెలుసుకోకుండా గొప్పసభలో సాటిపండితున్ని గురించి మిథ్యాపవాదము ప్రకటించుటకు సాహసించినారేమి?

నా—ఆయనస్వభావమండీ అది; ఇరవైయేండ్ల క్రిందట కొక్కొండ వెంకటరత్నం పంతులుగారిని గురించి ఇలాగే శాస్త్రులుగారు మిథ్యాపవాదము ప్రకటించినారు. ఆపంతులుగారు తెలిగించిన ప్రసన్నరాఘవములోని సుశబ్దాలే కొన్ని అపశబ్దాలని దూషించి గ్రంథకర్తను అతినీచముగా తిట్టినారటండి. అన్నట్టు—రెండేండ్ల క్రిందట మన రామమూర్తిపంతులుగారే తమ తెలుగు పత్రికలో "పండిత భిషక్కుల భాషాభేషజము" అని

పేరుపెట్టి ఒక వ్యాసము రచించి శాస్త్రులుగారి విమర్శను విమర్శించి, సత్యము ప్రకటించినారండి—అయ్యా! పంతులుగారూ! మీరు వ్రాసిన దానికి ప్రత్యుత్తరమేమైనా శాస్త్రులుగా రిచ్చినారా?

నేను—లేదు. నావాదము ఖండించి వారు ఏమైనా వ్రాసేయెడల నాపత్రికలో ప్రకటిస్తానని కబురు పంపినాను. అయితే వారు ఊరకున్నారు.

ఆ—ఊరుకోక ఏమిచేస్తారు? మీ పత్రిక సాగకుండా ఆగిపోవడము దురదృష్టమండీ.

నా—దానిని ఏమిచేయమన్నారు? మొదటి సంపుటము 12 సంచికలు అచ్చువేయించిన కర్చులయినా చందాలవల్ల రాలేదు. సాయము చేస్తామన్నవారు ఉపేక్షించినారు. కొందరు చందా లియ్యనేలేదు. భాషాభిమానముగలవారు లేరండీ. ఈయన పత్రికవల్ల వ్యావహారిక భాష అపరిహార్యమనిన్నీ అపరిమిత ప్రయోజనమైనదనిన్నీ ఋజువయినది సుమండీ.

నేను—"గ్రాంథిక భాష" అనేది కృతక భాషగాని వాస్తవమైనది కాదని స్పష్టపరచినాను. గ్రాంథికాంధ్రమనేదానిలో కొంత పూర్వులు వాడిన భాష, కొంత మనము వాడుకొనే భాష కలిసి ఉంటుంది. మనము వాడుకొనే మాటలలో ఏవి పూర్వుల గ్రంథాలలో కూడా ఉన్నవో అవే సాధువని పండితులంటారు. పూర్వులు రచించిన గ్రంథాలన్నీ చదివి, నాటిలోని శబ్దాలు జ్ఞప్తియందుంచుకొన్నవారికిగాని ఇట్టి వివేకము కలుగదు. అట్టి వివేకముగల భాషాపండితులు అరుదు. మన వాడుకలో ఉన్న మాటలుగానీ, లేనిమాటలుగానీ ఎవరైనా బుద్ధిపూర్వకముగానో ప్రమాదముచేతనో మార్చివేస్తే, తప్పో ఒప్పో తెలుసుకోవడం కష్టం. అందుచేత కృతకభాష నిరాక్షేపముగా పుస్తకాలలోనికి ఎక్కుతున్నది.

ఆ—కృతకభాష అంటే ఏమిటి? బాగా తెలిసిందికాదు.

నేను—వాస్తవమైనది కాదన్నమాట; ప్రాచీనాంధ్రగ్రంథములలో గాని, నేడు మన వ్యవహారములోగాని ఉన్నభాష వాస్తవమయినది.

అందులోగానీ ఇందులోగానీ లేనిది కృతకభాష; కేవలకల్పితం. శరణుచొచ్చుము, ఏతెంచవలెను, దొలుకదు, ఊరునకు, అచ్చటకు, అచ్చోటునకు పండ్రెండ్రుగురు—ఈ లాటివి వందలు వందలుగా పెద్దపేరుగల పండితుల గ్రంథాలలో ఉన్నవి.

ఆ—ఎక్కడాలేని శబ్దాలు పండితులు ఎందుకు కల్పించివాడుతారు? ఇతరులు ఆలాగున కల్పించరే.

నేను—అవును; ఆపనిచేసేవారు పండితులే. వ్యావహారికభాష గ్రామ్యమని దానిలోని శబ్దాలు వారు ముట్టుకోరుగదా! ప్రాచీన గ్రంథాలలోని శబ్దాలు సుపరిచితమైనవికావుగనుక చట్టున ఎవరికీ జ్ఞప్తికిరావుగదా. ఏవో శబ్దాలులేనిదీ గ్రంథం సాగదు. అందుచేత, వ్యావహారికభాషలోని శబ్దాలే అచ్చో, హల్లోమార్చి గ్రామ్యత్వము తొలగించి, గ్రాంథికీకరణము చేసి ప్రయోగిస్తారు. మనపిల్లలు బడులలో చదువుకొనే శిశుబోధలు, బాలబోధలు, కృతకభాషలో రచించినవే. ఇవిచదివి గ్రాంధికాంధ్రము నేర్చుకొని, పెద్దవాళ్లయినపిమ్మట, ఆలాటి కృతకభాషలోనే గ్రంథాలు రచిస్తున్నారు. ఈ యాభై యేండ్లలో ఈ దురభ్యాసము దేశమందంతటా వ్యాపించినది. మనతండ్రులకాలములోనూ మన తాతలకాలములోనూ లేదు. మనపురోహితులూ యాజకులూ దోషభూయిష్ఠములుగా మంత్రాలూ శ్లోకాలూ చదువుతూ మనచేత కర్మలూ వ్రతాలూ చేయిస్తూఉంటారుగదా! వాటిలోని తప్పొప్పులు మనకు తెలియకపోయినా ధన్యులము, కృతకృత్యులము అయినామని తృప్తిపొంది దక్షిణ సమర్పించి నమస్కారము చేస్తున్నామా లేదా? ఆలాగుననే గ్రాంథికాంధ్రము చదువుకొని అందరూ తరిస్తున్నారు.

ఆ—నాకు బాగాబోధపడక అడుగుతున్నాను. కోపపడకండి. మావాళ్ళద్రావిడం ఆలాగే ఉంటుంది; అవి దేశభాషలుకావు. తెలుగులో లేని శబ్దాలు కల్పించి ఒకరు వాడితే, కనుక్కొని బయలుపెట్టి బుద్ధిచెప్పేవాడు ఒకడైనా లేడండీ! అందరిదీ గుడ్డిపాండిత్యమే? భాషాభిమానమున్నట్లే

అంటరూ కేకలువేస్తారు. గ్రాంథికభాషాసంరక్షకసమాజాలు, సాహిత్య పరిషత్తులూ, పత్రికలూ—ఇవి అన్నీ ఏమిచేస్తూఉన్నట్టు?

నా—వ్యావహారికభాష నిష్ప్రయోజనముగాచేసి, గ్రాంథిక భాషను రూపుమాపి, కృతకభాషను వ్యాపింపజేస్తూ గొప్పపనిచేసినట్టు వీరంతాబడాయి చెప్పుకొంటున్నారు. మాతృభాషాభిమానమంటే లోకులు వాడుకొంటూఉన్నభాషను నిందించడము, లోకవ్యవహారమందు లేని భాషను స్తుతించడమున్ను—అంటే. పరిచయముగలచోట అనాదరమూ, పరిచయములేనిచోట వ్యామోహమూ అవివేకమూల మే.

ఆ—నేనడిగినమాటకు జవాబుచెప్పినారుకారు. ప్రాచీనాంధ్రగ్రంథాలు చదవని నాలాటివాళ్ళు తప్పులువ్రాస్తే, పండితులైనా కనుక్కోలేరటండీ?

నా—వేంకటరాయశాస్త్రులవారు సరిగా తప్పొప్పులు కనుక్కోగలిగినారా? ఆయన లాటిపండితులేగదా అంటరున్ను.

నేను—కాదు కాదు; అనేకులు ఆయనకంటె తక్కువవారే అనవలెను. ఆయనకంటె ఎక్కువపండితులుంటే వారు ఉపేక్షించి ఊరకొన్నారేమో?

నా—అంతటి పండితులయినా భారతములో ప్రచురముగాఉన్న శబ్దములే వేంకటరత్నం పంతులుగారున్ను వీరేశలింగంపంతులుగారున్ను వాడితే, తెలియక అది తప్పని వారిని పడతిట్టినారు; చూచినారా?

నేను—మరి, శాస్త్రులుగారే నావాదము చాలామట్టుకు బలపర్చినవారయినారు సుమండీ!

ఆ—ఏలాగునండోయ్?

నేను—1898 వ సం॥లో ప్రకటించిన ప్రసన్నరాఘవ విమర్శము యొక్క అవతారికలోను, 1919 వ సంవత్సరమందు నెల్లూరిసభలో చదివిన

అధ్యక్షోపన్యాసము యొక్క అవతారికలోను, శాస్త్రులుగారేమిచెప్పినారో చూస్తే తెలుస్తుంది. రెండింటిలోను మొదటివాక్యాలు చదువుతాను వినండి.

ప్రసన్నరాఘవవిమర్శమందు—"ఈకాలములో ఆంధ్రభాషలో ప్రబంధములు హెచ్చుపెరుగుచున్నవి గదా. వీనిలో అనేకములవలన భాషకు కడుం జెట్ట కలుగుచుంటంగాంచి ఏదే నొకగ్రంథ మాధారముగా నీచెఱుపు నెల్ల విద్యార్థిజనోపయోగముకై భాషారసికు నెల్లడిసేయఁ దలంపుగొన్న వాఁడనై, అట్టి యిప్పటిగ్రంథములలో నెల్ల మ. రా. శ్రీ. కొక్కొండ వేంకటరత్నము పంతులవారు రచియించిన యాంధ్రప్రసన్నరాఘవము నాయుద్యమమున కత్యంతోపయుక్తముగా నున్నందున దానిని విమర్శింప దొరకొంటిని" అని వ్రాసినారు.

నా—తెలిసిందా? ఆచార్లుగారూ! గ్రాంథికాంధ్రము బాగారాని వాళ్లు గ్రంథాలురచించి భాష పాడుచేస్తూ ఉన్నారని శాస్త్రులుగారు నిందించడం వెంకటరత్నంపంతులుగారిని ఒక్కరినేకాదని స్పష్టమైనదిగదా. ఆపంతులుగారి వంటివారికి అనేక మందికి ప్రతినిధిగా ఆయనను ఎంచుకొని, అందరికీ చేయవలసినశిక్ష ఆయనకు చేసినారు.

ఆ—ఆశిక్షవల్ల ఇట్టిపండితులుచేసే నేరాలు కొంతైనా తగ్గినవా? గ్రాంథికాంధ్రమురానివాళ్లు గ్రంథాలు రచించడము మానుకొన్నారా, ఆపిమ్మటనైనాను?

నేను—శాస్త్రులుగారి వాక్యములోనే ఉన్నది మీప్రశ్నకు జవాబు. వారి అధ్యక్షోపన్యాసము సాహిత్యపరిషత్పత్రికలో ఉన్నది. ఇవిగో ఈ బీరువాలోనే ఉన్నవి సంచికలన్నీ; అవి తీసి చదువుతాను: వెంకటరత్నం పంతులుగారికి శాస్త్రులుగారుచేసిన శిక్షవల్ల ఇతరులకెవ్వరికీ బుద్ధివచ్చినట్లు కనబడదు. ఈ యిరవైయేండ్లలోను మరింత, అధికముగా నేరాలు జరిగినవట.

నా—గ్రాంథికాంధ్రము బాగారాని వాళ్ళకు తమకు తెలిసిన విషయములు పుస్తకాలలో వ్రాసి ప్రకటించవలెననే కోరిక మిక్కుటముగా

ఉన్నప్పుడు, వారు అపరిచితమయిన గ్రాంథికాంధ్రములో వ్రాయక, సుపరిచితమయిన వ్యావహారిక భాషలో వ్రాస్తే, గ్రాంథికాంధ్రభాష మరి పాడుకాదు. వ్యావహారికభాష చక్కబడుతుంది. అందువల్ల లోకానికి చాలా మేలుకలుగుతుంది.

ఆ—అలాగయితే, గ్రాంథికాంధ్రము వ్రాసేవాళ్ళు అట్టే ఉండరు; అందరూ వ్యావహారికభాషలోనే గ్రంథాలు రచిస్తారు. అవి—

నా—రచిస్తే లోకము మునిగి పోతుందా ఏమి? మరీమంచిది. పుస్తకాలు చదువుకోవడం సులభముగా ఉంటుంది. అక్షరాలు నేర్చుకొన్నవాళ్ళందరికీ కావలసినన్ని పుస్తకాలు దొరుకుతవి. ప్రజలలో విద్య వ్యాపిస్తుంది. దేశము అభివృద్ధిపొందుతుంది. అందువల్ల అన్నివిధాలా లాభమే కాని నష్టమేమీ లేదు.

ఆ—మరి గ్రాంథికాంధ్రము గతి?

నా—గ్రాంథికాంధ్రము ఆంధ్రపండితులు సత్తుగొన్నది. ఇతరులు దాని జోలికి పోకూడదు. అది సంస్కృతమువంటిది. ముందుగా భాష బాగా నేర్చుకొంటేనేకాని, గ్రంథరచనకు అధికారము కలుగదు. పదేండ్లయినా కష్టం పడకుంటే భాష పట్టువడదు.

నేను—అవును; అయినవాళ్ళూ కానివాళ్ళూ దానిని చేపట్టడము చేతనే దానికి సంకటాలు తగిలినవట. ఇదిగో! వినండి శాస్త్రులుగారి ఉపన్యాసమునకు అవతారిక:

“ఈ కాలమం దెల్లెడలను భాషాభివృద్ధి యగుచున్నదని ఘోషాభివృద్ధి వినఁబడుచున్నది. ఆయభివృద్ధి వాపో, బలుపో యనిన—వాపు ప్రత్యక్షమే, మఱి నాడిని బరికింపఁగా, నాంధ్రసాహిత్యపరిషదుద్దేశ్యములలో సూచితమై విజ్ఞానసర్వస్వాదిమహోద్యమములలోను, నాంధ్రులచరిత్రము లోనగు గ్రంథములలోను బరిషత్పత్త్రికాంధ్రపత్త్రికా హితకారిణ్యాది పత్రికల

లోను ప్రస్ఫుటమై శ్రీ సూర్యరాయ ప్రభునిర్మిత్సిత బృహన్నిఘంటు ప్రస్తావనలం దస్ఫుటమై బలుపునాడియు నాడుచునే యున్నది.

మఱి వాపు ప్రత్యక్షమేయైనను, చికిత్స సేయుటకై నిదానాదికము నరయవలయును. అందుల నిదాన మాధునికవాఙ్మయమే. దినముతప్పక గంట తప్పక శైశవప్రభృతి ఆకౌమారము భాషాదేవతకుఁ బుస్తకనిర్మాతలసంఖ్యేయులు యథాప్రజ్ఞము ప్రయోగించిన విషములచే ధాతువులు సెడి నంజుగలిగి వాపెక్కు మన చేతితో నెటనదిమినను దాని రేఖలుఁగూడ స్ఫుటముగాఁ గానిపించుచు లొత్తలు పడుచున్నవి."

నా—ఆచార్లుగారూ! చూచినారా పరాచకాలు? ఉపన్యాసమంతటా ఇట్లానే—

నేను—పరాచకాలమాటకేమి? నావాదమునకు అనుకూలముగా ఉన్నదా లేదా శాస్త్రిలవారి సాక్ష్యము? మీ ప్రశ్నకు జబాబుకూడా ఈ వాక్యములోనే ఉన్నదిగదా?

నా—అవునండి; నాకు తెలిసిన సారాంశముచెప్తాను. 1898-వ సం॥ లో వెంకటరత్నం పంతులుగారివంటి దుష్టప్రబంధనిర్మాతలు అనేకులున్నారు. 1919-వ సం॥ లోకూడా వీరేశలింగంపంతులుగారివంటి దుష్టప్రబంధనిర్మాతలు అసంఖ్యేయులు. గ్రాంథికాంధ్రము ఒక్క వేంకటరాయశాస్త్రిగారికే కాని మరిఎవరికీ రాదుగాబోలు!

నేను—ఆ విషయముకూడా నావాదమునకు అనుకూలముగానే శాస్త్రిలవారి విమర్శలోని దోషములవల్లనే రుజువైనది. చూడండి.

ఆ—బలుపునాడి ఆడడముమాట?

నేను—అది వేరేవిషయము. దానిని గుఱించికూడా చెప్తాను. ఇప్పుడు నేను సూచించినది వినండి. గ్రాంథికాంధ్రము చక్కగా రానివారు గ్రంథాలు రచిస్తున్నారనిన్ని అట్టి గ్రంథకర్తలు "అనేకులు" "అసంఖ్యేయులు"

అనిన్ని వారు రచించిన గ్రంథములు హెచ్చు పెరుగుచున్నవనిన్ని "భాషాభివృద్ధిఅనుచున్నడని ఘోషాభివృద్ధిమాత్రమేనినబడుచున్న" దనిన్ని శాస్త్రిలుగారు రుజువుచేసి ప్రకటించినారు. దానికి తోడు నేను ప్రకటించేదేమిటో తెలిసినదా? గ్రాంథికాంధ్రము రానివాళ్ళు గ్రంథకర్తలుమాత్రమేకాదు; గ్రంథవిమర్శకులు మనశాస్త్రిలుగారి వంటివాళ్లుకూడా అటువంటివాళ్లే అని. గ్రంథకర్తలకురాదు, గ్రంథవిమర్శకులకురాదు. గ్రంథపాఠకులకు, పఠకులకూ రాదు. మరి ఈ గ్రాంథికభాష వచ్చినవారు ఎవరున్నారో, ఎక్కడ నున్నారో నాకు తెలియదు.

ఆ—బలుపునాడికూడా అనుకున్నదట, ఏవో కొన్ని నోట్లు?

నేను—అదికూడా తెలుసుకోలేక చెప్పినమాటే. మన పండితభిషజ్మణుల నిదానముచొప్పున విజ్ఞానసర్వస్వము, ఆంధ్రులచరిత్రము, పరిషత్పత్రిక, ఆంధ్రపత్రిక మొదలయిన వాటిలో విషప్రయోగములు లేవట! ఐతే 'దుష్టప్రబంధనిర్మాతలు ప్రయోగించిన శబ్దములలో ఏవి విషప్రయోగములని వీరు నిందించినారో అవి ఈనాలుగింటిలో కూడా నాకు కనబడ్డవి. నావిమర్శములో కొన్ని చూపెంచినాను. వీరి భేషజాలు ఎంత మోషాకమయినవో చూడండీ! ఎవ్వరికీ తెలియనివిషయంలో అంపరూ బాగా తెలిసినట్టే నటిస్తారు.

నా—ఇదికూడా వీరివాదమును బలపరచినట్టేకదా, ఆచార్లుగారూ!

ఆ—అవును. రెండువిధాలాను. 'నిర్దుష్టమైన గ్రాంథికాంధ్రమున రచించిన గ్రంథాలుసుతరాం లేకపోలేదు. కొద్దిగానైనా ఉన్న'వనిగదా ఈనాలుగున్ను శాస్త్రిలుగారు పేరుకొన్నారు? ఇవికూడా దుష్టప్రబంధవర్గములో చేరవలసినవే అని రామమూర్తిపంతులుగారు రుజువుచేయడముచేత నిర్దుష్టమైన గ్రాంథికాంధ్రగ్రంథము నేటి గ్రంథాలలో ఒక్కటైనా ఉన్నదా అని పంతులుగారు చేసినప్రశ్నకు ప్రత్యుత్తరము పండితులమీద అప్పుగా నిల్చిఉన్నది. పరిషత్తువారు ఉత్తరవాదులు.

నా—మీరు "రెండువిధాలా" అన్నారే; రెండోవిధమేది?

ఆ—గ్రంథాలు విమర్శించి సాధుత్వాసాధుత్వాలు నిర్ణయించే సామర్థ్యము శాస్త్రులుగారికి లేదని ఇందువల్లకూడా రుజువుకాలేదూ? ఐతే, పంతులుగారూ! గ్రాంథికభాష మీరు బాగా అభ్యసించినవారుగదా! ఒకగ్రంథమైనా రచించి మీరు ప్రకటించినారుకారేమి?

నేను—నాకు గ్రాంథికాంధ్రము పూర్తిగా రాదండీ. వచ్చీరాని భాషలో స్వేచ్ఛగా రచనసాగదు; భావాలు స్పష్టముగా తెలియజెప్పడం కష్టము. ఎంతజాగ్రతగాఉన్నా తప్పులు పడవచ్చును. 'సుయిదాటేవానికిన్ జింతయా | కంటైనన్ గడమేనియుం గడుసుగాదా' అన్నాడు రామకృష్ణ కవి.

నా—కొంతకాలముక్రిందట మనరామమూర్తి పంతులుగారు ప్రాఁదెలుఁగుఁగమ్మ అని ఒక ఉత్తరమువ్రాసి పరిషత్పత్రికలో ప్రకటించినారు. దానికి సరిగా అర్థంచెప్పలేక కొందరు హాస్యాలుచేసినారు.

నేను—ఎంతో ప్రయత్నపూర్వకముగా అది వ్రాసినాను. దానిలో బుద్ధిపూర్వకముగానే అపశబ్దాలు కొన్ని చూర్చినాను. అబుద్ధిపూర్వకముగా ఎన్నివాడినానో నాకే తెలియదు. పండితులెవరైనా తప్పులు కనుక్కుంటారోలేదో చూతామనే ఆలాగున వ్రాసినాను. ఎవరూ కనుక్కోలేదు. త్రికరణశుద్ధిగా నాకుతోచినట్టు నిజము చెప్తున్నాను; నమ్మండీ! సిగ్గూ, లజ్జా ఉన్నవాళ్లయితే, మనవంటివాళ్లు "గ్రాంథికభాషలో" గ్రంథాలు రచించకూడదండీ. అపరిచితమైనభాష వాడినప్పుడు ప్రమాదము సంభవించక మానదు. తప్పెప్పుడైనా బయలుపడకపోదు. అపకీర్తితప్పదు. నిత్యమూ వాడుకొనేభాషలోనైనా చక్కగా అభ్యాసము చేసుకొంటేనేకాని వాక్యవిన్యాసము కుదురుగా ఉండదు. ఔచిత్యమూ అనౌచిత్యమూ లోకమునుపట్టి తెలుసుకోవలెను. ఒకవృత్తాంతము తార్కాణముగా చెప్తాను వినండి.

ఇంగ్లీషునవలలు రచించినవారిలో చాలా ప్రసిద్ధిపొందిన 'థ్యాకరే' అనే ఆయన 1852-వ సం॥లో ఎస్మండ్ అనే నవల రచించినాడు. అప్పటికి 150 సం॥ లక్రిందటనున్న వాడుకభాష అందులో వినోదార్థము వాడినాడు. ఆభాష అతను ఎంతో ప్రయాసపడి అలవర్చుకొన్నాడు. ఆ భాషయొక్క కట్టుబాట్లు బాగా తెలియక అనేకులు ఆనవలను చాలా మెచ్చుకొన్నారు; గాని, అతనిమిత్రుడే ఒకడు అందులోని తప్పులు చూపించి ఆక్షేపించినాడు. అప్పుడు థ్యాకరే సిగ్గుపడి, అటువంటి అవివేకపు పని మరిచేయక తనకు సుపరిచితమైన తనకాలపు వాడుకభాషలోనే గ్రంథములు రచించినాడు.

ఆ—అయితే. ఇంగ్లీషువారు తమవాడుకలో లేని గ్రాంథికభాషలో గ్రంథములు వ్రాయడం లేదంటారా?

నేను—లేదనే చెప్పవలెను. సర్వసాధారణముగా గ్రంథకర్తలందరూ తమకాలపు భాషలోనే గ్రంథములు వ్రాస్తున్నారు. కొంతకాలము క్రిందట ఇంగ్లండ్ దేశములోకూడ, మన పండితులవంటివారు కొందరు స్పెన్సరు మొదలయినవారు తమకు సుపరిచితముకాని "ప్రాచీనగ్రాంథిక" భాషలో గ్రంథములు రచిస్తూ ఉండేవారు; తప్పులుచేస్తూ ఉండేవారు; థ్యాకరేవలెనే పరాభవము పొందుతూ ఉండేవారు. పార్లమెంటుసభలో కొందరు డాంబికులు తమకు వచ్చీరానీ లాటిన్ భాషాపదములు తమ ఉపన్యాసములలో వాడుతూ ఉండేవారు. అందులోని తప్పులు అసందర్భాలు చూపించి కొందరు డాంబికుల దుష్పాండిత్యము బయలుపెట్టుతూ ఉండేవారు. అందుచేత, సుపరిచితమైన వ్యావహారికభాషలోనే గ్రంథరచన చేయవలెనన్నకోరిక అంతకంతకు ప్రజలలో విద్యవ్యాపించినకొద్దీ ఎక్కువయినది. ఇప్పుడు ఇంగ్లండుదేశములో కోట్లకొలది పుస్తకాలు ప్రకటిస్తున్నారు. అన్నిటిలోనూ ఇప్పుడు వ్యవహారములో ఉన్నభాషేకాని ప్రాచీనభాష కనబడదే.

ఆ—అయితే మన దేశమందెక్కడ చూచినా పుస్తకాలు గ్రాంథిక భాషలోనే కనబడుతున్నవే. ఈసంప్రదాయము—

నేను—సరే; తెలిసింది మీరడిగే ప్రశ్న. వినండి దానికి జవాబు చెప్తాను. మన పూర్వుల సంప్రదాయముచొప్పున రచించిన తెలుగుగ్రంథాలు వేలకొలదిగా ఉన్నవి. గవర్నమెంటువారు, పరిషత్తువారు, ఇంకా మరి కొందరువాటిప్రతులు సంపాదించి గ్రంథాలయములలో పెట్టి ఉంచినారు. మనుచరిత్ర, వసుచరిత్ర మొదలయిన ప్రబంధాలు తప్ప తక్కినవన్ని వాడుక భాషలోనే రచించినారని ఆప్రతులు చూస్తే తెలుస్తుంది, బాలసరస్వతి వంటి పండితుడుకూడా ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణమునకు వ్యావహారికభాషలోనే టీక వ్రాసినాడు. అప్పకవీయములోని వివరణమంతా వాడుకభాషలోనే ఉన్నది. 1859 వ సం॥లో మొట్టమొదట అచ్చువేయించినవారు గ్రాంథికభాషలోనికి మార్చివేసినారు. అప్పటినుండి ఇప్పటిదాక ఆలాగుననే పునర్ముద్రితమయినది. అయితే తాటాకుపుస్తకాలు చూచి వాటిలో ఉన్నట్లుగా గ్రంథమంతా దిద్ది ఆగ్రంథము వావిళ్లవారిచేత నాకొమారుడు ఇప్పుడు అచ్చువేయించినాడు. అప్పకవీయపీఠికలో ఈవిషయము సవిస్తరముగా అతడు చర్చించినాడు. అది చదివితే లెస్సగా తెలుస్తుంది. బడులలో పిల్లలు చదివేపుస్తకాలుకూడా పూర్వసంప్రదాయము చొప్పున వ్యావహారికభాషలోనే రచించి అచ్చువేయించేవారు. వాటిలో కొన్నింటిప్రతులు నావద్దనున్నవి. కావలిస్తే చూపిస్తాను. ఉత్తరాలు వ్రాసినట్లే గ్రంథాలు రచించేవారండీ మనపూర్వులు! అందరికీ తెలిసేటట్టు కథలూ, కాలక్షేపాలూ, పాటలూ, పదాలూ—

ఆ—అన్నట్టు జ్ఞప్తికి వచ్చినది. మాయింట్లోనే ఉన్నవండీ కొన్ని పుస్తకాలు అటువంటివి. వైకుంఠమాహాత్మ్యం, ప్రసన్నపరిత్రాణం, సాత్వికబ్రహ్మవిద్యావిలాసం - ఇవి అన్నీ వాడుకభాషలోనే ఉన్నవండీ.

ముముక్షుజనకల్పకములో పద్యాలు గ్రాంథికభాషలో ఉన్నా వాడుక భాషలోనే ఉన్నదిసుమండీ!

నా—మీపూర్వులేకాబోలు తాతాచార్యులుగారు. వారుచెప్పిన కథలట బ్రౌనుదొరగారు అచ్చువేయించినారు. వాడుకభాషలో మాట్లాడినట్లు రచించినారు. మీపొట్టనిండా కథలే. వాటివల్లనే మీపొట్టనిండుతూ ఉన్నది గదా. తాతాచార్యులుగారు వ్రాసినట్లే మీరుకూడా వ్రాసి మీకు వచ్చిన కథలన్నీ అచ్చువేయించరాదూ, అందరూ కొనుక్కొని చదివి సంతోషిస్తారు.

ఆ—ఇప్పటివారికి గ్రాంథికభాషేకాని గ్రామ్యభాషే రుచించదటండీ. కాశీమజిలీలు మొదట ఏలూరిలో గ్రామ్యభాషలోనే అచ్చువేయించినా, ఇప్పుడు అవి గ్రాంధిక భాషలోనే అచ్చుపడుతున్నవి. కథలు నోటను చెప్పినప్పుడు గ్రామ్యభాష వినడానికి ఇంపుగానే ఉంటుందట గాని పుస్తకములు చూచిచదివినప్పుడు బాగుండదట! గ్రాంధికభాషలో ఉంటేనే కాని గ్రంథముకాదని చాలామంది అనుకొంటారు. స్త్రీలకుకూడా గ్రాంధికభాషమీదనే ఎక్కువ మక్కువ సుమండీ, పల్లెటూళ్లలోకూడా తెలిసినా తెలియకపోయినా గ్రాంథికభాషలో ఉన్న పుస్తకాలే అందరూ కొని కూడబలుకుతూ చదువుతారట!

నా—మాపిల్లవాణ్ణి ఏదైనా ఒకకథ చెప్పమని నేను అడిగితే, ఆనందవాచకములలో తానదివరకు చదివిన కథ ఒకటి అందులో ఉన్నట్లే పాఠము అప్పగించినట్లు ఏకరువుపెట్టినాడు. వాడికి ఆకథ ఏమీ బోధపడలేదని కొన్నిప్రశ్నలకు వాడిచ్చిన జబాబువల్ల తెలిసినది. అయినా, మావాళ్లందరూ వాడి పాండిత్యానికి చాలా మెచ్చుకొన్నారు. వాడు పుస్తకములోని కథలు చదువుతూఉన్నప్పుడు వాడి తమ్ములుగాని చెల్లెళ్లుగాని వాడివద్ద కూర్చుని వినరు. మా అమ్మ కథలుచెప్తూఉంటే, అందరూ ఆవిడచుట్టూ కూర్చుంటారు.

నేను—యూరోపులోను, అమెరికాలోను అయిదారేళ్ల పిల్లలుకూడా ఆసక్తితో వినేటట్టుగా రచించిన కథల పుస్తకాలు వందలూ వేలూ ఉన్నవి.

ఆ—అదేమిరుచో! నాటకాలలోకూడా పాఠము అప్పగించినట్టే ఉంటుంది సంభాషణ. మాటచెవిని పడ్డప్పుడు వెంటనే దాని అర్థమున్ను రసమున్ను అందరి మనస్సులలోను స్ఫురించనప్పుడు నాటకమువల్ల లాభమే లేదు. పురాణములోని శ్లోకాలో పద్యాలో చదివినప్పుడు అందరూ అర్థం చేసుకోలేక నేకదా వాడుక మాటలలో నాటికి అర్థం చెప్పడము ఆచారమైనది. నాటకాలలో పాడే పద్యాలకు ఎవరూ అర్థం చెప్పరే?—

నేను—నాటకాలమాట తలపెట్టినారుగనక జ్ఞప్తికివచ్చినది. తంజావూరి రాజులకాలములో పండితులు రచించిన నాటకాలు 60 కి పైగా ఉన్నవి. వాటిలో సంభాషణ ఆకాలపు తెలుగులోనే రచితమైఉన్నది సుమండీ! వాడుకలోనున్నట్లు భాష గ్రంథములో కనబడితే, ఇప్పుడు రుచించదని మీరు చెప్పినారే—అదే గ్రాంథికభాషవల్ల మనదేశానికి కలిగిన గొప్పకీడు. హితమైనది అప్రియమైనది. పిల్లలకు పంచదార చేదయినది; పొగాకుమసాలావేసిన కారపుబీడీలే కావలెను. రుచిమరగినారు. రవీంద్రనాథఠాకూరుగారు ఈవిషయమై మోడరన్‌రివ్యూలో ఏమని వ్రాసినారో చూడండి.

ఆ—అది ఇంగ్లీషుకాబోలు?

నేను—నాయుడుగారు తెలుగునవివరించి చెప్తారు లెండి.

"The artificial language of a learned mediocrity, inert and formal, ponderous and didactic, devoid of the least breath of creative vitality is forced upon our boys at the most receptive period of their life. It is every day becoming a more formidable obstacle in the way of our boys' acquiring that mastery of their mother tongue which is of life and literature."

నా—మీరిప్పుడు చెప్పినసంగతేనండి రవీంద్రనాథఠాకూరుగారి వ్యాసములోఉన్నది. పండితంమన్యుల కృతకభాషలో జీవకళఏమీ ఉండదట! దానివల్ల అర్థమూ, భావమూ, రసమూ ఏమీ స్ఫురించవట! మాపురోహితుడు చెప్పేమంత్రాలలాగున ఉంటుందట! మన పసిపిల్లలు ఏది మంచిదో ఏది చెడ్డదో స్వయం తెలుసుకోలేరు. దగ్గిర ఉన్నవాళ్లు ఏది మంచిదంటే అదేమంచి దనిన్నీ, ఏదిచెడ్డదంటే అదేచెడ్డదనిన్నీ అనుకొంటారు. వారిబుద్ధి లేత మొక్కలాగుంటుంది; ఎటువంచితే అటేవంగుతుంది. అట్టిఅవస్థలో పిల్లలు ఉన్నప్పుడు వాడుకలో ఉన్నభాష అయోగ్యమైనదనిన్నీ, కృతక భాష యోగ్యమైనదనిన్నీ, తోచేటట్టు శిశుబోధలూ, బాలబోధలూ మొదలుకొని వాళ్లుచదివే అన్నిపుస్తకాలలోను వాడుకలో ఉన్నమాటలు వాడకుండా వాటికిమారుగా ఏవోవ్యత్యస్తముగా ఉన్నవీ, లోకములో పండితులయినా ఎన్నడూవాడనివీ, కొన్నికల్పించినవీ, కొన్నిప్రాచీనగ్రంథాలలోనివీ కూర్చి, డాబుగా వింతభాషపుట్టించి నేర్పుతున్నారట! చిన్నప్పుడు తినమరిగినదే తియ్యగాఉన్నట్టు కృతకభాషే విద్యార్థులకు రుచించేదిఅయినది. సాజమైన లౌకికభాషమీద ఉండవలసిన అభిమానము పోయినది. వట్టి వేషాలు వాలకాలు ఇష్టమైనవి. అనేకఅనర్థములకు అదేకారణమైనది. సారస్వతము నిర్జీవమైనది. జీవలోకమునకూ సారస్వతమునకూ ఉండవలసిన సంబంధము ఏమీలేక కవులశ్రమ నిరర్థకమయినది. లోకులకు సారస్వతమూ జ్ఞానమూ అందరాని పండ్లయినవి. పడింతులకృతకభాష అలవాటుచేసుకొన్నవాళ్లు పండితుల భేషజాలు అవలంబిస్తున్నారు. శబ్దార్థము అప్రధానమైనది. వట్టిశబ్దాలువల్లించడమే విద్యాభ్యాసమయినది.

నేను—తెలిసిందా? ఇప్పుడు రవీంద్ర నాథఠాకూరుగారు వ్యావహారిక భాషలోనే కావ్యాలు రచిస్తూఉన్నారు! ఇంకా అనేకులు బంగాళీవారు వాడుకమాటలతోనే కొత్తకొత్తకావ్యాలు ఇంపుగా రచిస్తూన్నారట!—అందుచేతనే అంతకంతకు వారిసాహిత్యము పండితపామరసామాన్య

మైన లౌకికభాషలో విజృంభిస్తున్నది. నేటిస్థితి సునీతికుమారచాటర్జీగారు వివరించివున్నారు. చదువుతాను వినండి—ఇదిగో పుస్తకము! నాయుడుగారూ మీరేచదివి, ఈవాక్యానికిఅర్థం ఆచార్లగారికి చెప్పండి.

"The present day literary Bengali is often nothing but Calcutta colloquial, with only a few archaic inflections of the verb; it is freely used in literature, especially in poetry, drama and fiction; and there is a strong body of writers who advocate the suppression of the old literary language by this living and vigorous form of spoken Bengali."
Dr. Suniti Kumarchatterji: Bengali Phonetics, **1921.**

శాబాష్! ఆచార్లుగారూ! బతుకుతెరవెరిగిన వాళ్లండీ బంగాళీ వాళ్లు! సాధ్యాసాధ్యములు సాధకబాధకములు చక్కగా ఆలోచించి కార్యసిద్ధికి అనుకూలమయినసాధనము చేతబట్టి ఇష్టార్థముసాధిస్తారు; ప్రతికూలమయిన సాధనము విడచిపెట్టడానికి జంకరు. భాష సాధనముగాని సాధించవలసిన పరమార్థముకాదని వారు తెలుసుకొన్నారు. అందరికీ సుపరిచితమయిన వాడుకభాష సాధనముగాచేసి సారస్వతము నిర్మించి ప్రజలలో విజ్ఞానము వెదచల్లుతున్నారు. ఇప్పుడట, కలకత్తాలో శిష్టజనవ్యవహారమందున్న భాషే గ్రాంథికభాషగా గ్రంథాలన్నిటిలోనూ, అందులో ముఖ్యముగా పద్యకావ్యములలోను, నాటకములలోను, నవలలలోను, స్వేచ్ఛగా వాడుతున్నారట. ఏవో పాతక్రియారూపములు కొన్నిమాత్రము ఉంచుకొన్నారట. నిస్తేజము నిర్వీర్యము అయిన ప్రాచీనగ్రాంథికభాష పరిత్యజించి, అవికలమయిన అర్థపుష్టి, శబ్దశక్తిగలిగి జీవకళలతో కలకలలాడుతూ ఉన్న నేటి వాడుకభాషే కావ్యరచనకు ఉచితమైనభాషగా అంగీకరించదగినదని విద్వత్కవులనేకులు పట్టుదలతో వాదిస్తున్నారట! నూరేండ్లక్రిందట మన తెలుగువారికంటె బంగాళీలు ఈవిషయంలో చాలా వెనుక

బడి ఉండేవారట. ఇప్పుడు మనమే చాలా వెనుకబడి ఉన్నాము. మనలో జ్ఞానసంపన్నులు లేకకాదు. అయితే, విషయము తెలిసినవారికి ఆంధ్రపండితుల కృతకభాషరాదు. ఆకృతకభాష అభ్యసించినవారికి విషయము తెలియదు. కృతకభాషలో రచించిన గ్రంథాలేకాని వ్యావహారిక భాషలో రచించినవి బడులలో చదువకూడదని పరిషత్తువారు పట్టుపట్టి ప్రభుత్వమువారిచేత శాసనము చేయించినారు. విద్యావంతులు ముందుగా వాడుకభాషలో గ్రంథము రచించి తర్వాత భాషాపండితులచేత దిద్దించి ప్రకటించవలెనట. అవే బడిపిల్లలు చదువవలెనట! ఆంధ్రవిశ్వవిద్యాలయములలో విజ్ఞానవిషయములు సవిస్తరముగా నోటనే ఉపన్యసించి విద్యార్థులకు చెప్పవలెనే—

నేను—వీరేశలింగంపంతులుగారిని వేంకటరాయశాస్త్రులుగారు నిందించడం కూడా బడిపుస్తకములను గురించే. రవీంద్రనాథఠాకూరుగారు ఏది హానికరమని నిందించినారో అదే ఉత్తమమైనదని శాస్త్రులుగారున్ను పరిషత్తువారున్ను శ్లాఘిస్తున్నారు. గ్రాంథికభాషలోని శబ్దములు విడిచి వ్యావహారిక భాషలోని శబ్దములు ప్రయోగించి పంతులుగారు రచించినపుస్తకాలు చిన్నబడులలో "బాలురపాత్తములు" గాను కాలేజీలలో "శాస్త్రవిద్యార్థుల పాత్తములు" గాను, విద్యాధికారులు నియమించి తెలుగు పిల్లలచేత చదివించి తెలుగువారి దేశభాష పాడుచేస్తున్నారని రెండుతరగతుల గ్రంథాలూ వేరువేరే విమర్శించి శాస్త్రులుగారు తమ అభ్యుదయోపన్యాసము రెండు భాగములుగా విమర్శించినారు. నేనున్ను ఆవిభజనానుసారముగానే నావిమర్శనము రచించినాను. వారుచేసిన అపవాదములో ప్రతిఅంశమున్ను వారిమాటలతోనే ముందుగా ఉదాహరించి వెంబడినే విమర్శచేసి నాప్రత్యుత్తరము ఇచ్చినాను. బుద్ధిపూర్వకముగా అసత్యము ఏక్కడా చెప్ప లేదు. పక్షపాతము వహించలేదు. ప్రమాణముచూపకుండా ప్రతిపక్షులవాదము

ఖండించలేదు. అబుద్ధిపూర్వకముగాచేసినతప్పులు పెద్దలుక్షమింతురనినమ్మి ఈవ్యాసము ప్రకటిస్తున్నాము. మీరు రేపుదయచేస్తే చదివివినిపిస్తాను.

ఆచా—బాగానేఉందిగాని, వెంకటరాయశాస్త్రిగారు గ్రామ్య భాష అంగీకరిస్తారని నమ్మలేము. వారివంటివారిబోధవల్లనే వ్యామోహము నిలిచిఉన్నది.

నాయు—పోనీండి! వారంగీకరించకుంటేమానిరి. భాష వారొక్కరి సొమ్ముకాదు, లోకులందరిదిన్ని. ఇప్పుడు వాడుకభాషలోపుస్తకాలూ, పత్రికలూ చాలా ప్రకటిస్తూనేఉన్నారు. సభలలో అందరూ, అధ్యక్షులు కూడా వ్యావహారికభాషలోనే ఉపన్యసిస్తున్నారు; యథోక్తముగానే పత్రికలలో ఆ ఉపన్యాసాలు ప్రకటిస్తున్నారు. తీర్మానములన్నీ వాడుక భాషలోనే వ్రాస్తున్నారు. యూనియన్ పంచాయతీలు తాలూకాబోర్డులు, జిల్లాబోర్డులు, మ్యూనిసిపల్ బోర్డులు మొదలయిన సంఘముల వ్యవహారము నోటనూ, కాగితమీదనూకూడా వాడుకభాషలోనే జరుగుతున్నది. రేపు ఆంధ్రరాష్ట్రము ఏర్పడ్డతర్వాత ప్రభుత్వసభలోను శాసనసభలోను రాజ్య వ్యవహారము వాడుకమాటలతోనే జరుగకతప్పదు. అప్పుడు గ్రాంథి కాంధ్రములో పండితులు తమబడాయి ప్రకటిస్తే రామమూర్తిపంతులు గారివంటివారు వారి అపశబ్దాలు బట్టబయలుగా వారి భాషవిమర్శించి వెల్లడిచేస్తారు. బలాత్కారముగానయినా ప్రజలందరికీ చదువు వచ్చేటట్టు చేస్తేనేకాని స్వరాజ్యవ్యవహారముసాగదు. ప్రజలందరూ గ్రాంథికాంధ్ర భాషాపండితులుకాలేరు; వాడుకభాష వారికి నేర్పితేచాలును. వాడుక భాషలోనే అన్నివిషయములనుగురించి కావలసినంతజ్ఞానము సంపాదింప వచ్చును. పంతులుగారు చేసేహితోపదేశము నేడుకాకపోతే, రేపయినా గ్రాహ్యమవుతుందిగాని కాకపోదు. బంగాళారాష్ట్రములో అయిందికాదా?

నేను—కానీండి; కాకపోనీండి. నాకుకర్తవ్యమని తోచినపని నేను చేస్తున్నాను. అది లోకమునకు హితమయినదనే నమ్ముతున్నాను

అన్ని దేశములలోను సదాచారముగనున్నదే నే నుపదేశిస్తున్నాను. మన తాతలనాటివరకున్ను మనదేశమందుకూడా బహుకాలము మనపూర్వులు అట్లే ఆచరించినారు. అందుకు నిదర్శనముగా లిఖితపుస్తక భాండాగారములందు వ్యావహారికభాషలో రచించిన గ్రంథములు నానావిషయములనుగురించి పండితులు వ్రాసినవే వేలకొలదిగా ఉన్నవి.

నా. ఆచా—రేపు రెండోపూట వస్తాము, వ్యాసము చదవి వినిపెంతురుగాని నమస్కారములు. సెలవు.

నేను—చిత్తం. నమస్కారములు.

ప్రస్తావనలో చెప్పినచొప్పున కీర్తిశేషులయిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములనుగురించి శ్రీవేదము వేంకటరాయశాస్త్రుల వారు కావించిన దూషణము వారి ఉపన్యాసమందు రెండుభాగములుగా విభక్తమై ఉన్నది. మొదటిభాగము "బాలురపాత్తము" లను గురించినది. రెండోభాగము "శాస్త్రవిద్యార్థుల తెనుఁగుపాత్తములను (College-Telugu)" గురించినది. మొదటిభాగము ఆరుఖండములుగా విడదీసి, ఒక్కొక్కఖండము శాస్త్రులవారు ప్రకటించినట్లే, వారిసొంతమాటలే ఉదాహరించి, దానిలోని అంశములన్నిటినీ వరుసగా ఎత్తుకొని, విమర్శించి నేనీవ్యాసమందు ముందుగా ఉపన్యసిస్తున్నాను. రెండోభాగములో శాస్త్రులవారు తప్పులనిదూషించిన శబ్దములు వరుసగా ఒకొక్కటి పేర్కొని దాని సాధుత్వాసాధుత్వము యథాశక్తి నిరూపిస్తాను. శాస్త్రులవారి ఉపన్యాసములోని విషయానుక్రమణమునే నేనున్ను అనుసరించినందున, దానిలోనిపునరుక్తి నావిమర్శమందున్ను కొంతమట్టుకు అనివార్యమైనది.

(ఈవ్యాసమందు నేనుదాహరించిన గ్రంథములలో శబ్దరత్నాకరమందు పేర్కొని వాటికి సంకేతములు తరచుగా వాడి ఉన్నాను. అవి ఏవంటే, వేదం వెంకటరాయశాస్త్రులవారు రచించినవి: క. సా.=కథా

సరిత్సాగరము; ప్రతా = ప్రతాపరుద్రీయము; ఉప; అలం = అలంకార సంగ్రహము. శి. వ్యా. = శిశువ్యాకరణము. వ్రత. = వ్రతకల్పములు. అముద్రి = అముద్రిత గ్రంథచింతామణి; ఆం. చ. = ఆంధ్రులచరిత్రము. వి. స. = విజ్ఞానసర్వస్వము. ఆం. సా. = ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక. ఆంధ్ర. = ఆంధ్రపత్రిక. ఆం. భా. = ఆంధ్రభాషార్ణవము. శ. ర. = శబ్దరత్నాకరము. ల నా. = లక్ష్మీనారాయణీయము. ప్రౌ. ని. = ప్రౌఢనిఘంటువు.)

మొదటిభాగము—బాలురపొత్తములు

1 దూషణవాక్యము:—ఆవిషయముల నించుక (ఇంచుకయే) ఉద్ఘాటించెద:—

"నవవిల్తుశాస్త్రంపుమినుకులావర్తించు పని వెన్నతోఁ బెట్టినది మాకు" అని పెద్దన్నగారు చేసిన యుపదేశమును దృఢముగా నవలంబించి ప్రథమశిశుపుస్తకములోనే రాజకీయ విద్యాంగమువారీ క్రింది ప్రయోగములను జేయించియున్నారు:

1 జలగ, 2 దవడ, 3 జండా, 4 కాలవ, 5 మనమడు—అని మాటలు నేర్పినారు. జెలగ, దవుడ, జెండా, కాలువ, మనుమఁడు, అని వీనివలెనే యుచ్చరించుటకు సులువగు సాధురూపములుండగా నీయసాధురూపములనే నేర్పుట యవిమృశ్యకారితగాదా?"

2 విమర్శము. తెలుగుశబ్దముల రూపములలో ఏవిసాధువో ఏవి అసాధువో నిశ్చయించుటకు ప్రమాణమేమిటి? 'సిద్ధిర్లోకాత్,' 'శబ్దసిద్ధి లోకంబువలనం దెలియును' అని అన్నిదేశములందున్న పండితులు అంగీకరించినారు. ఏసంఘమందైనా శిష్టజనసామాన్యమైనభాష ఉత్తమమైనదిగాను సాధువైనదిగాను అందరున్ను ఎన్నుకొంటున్నారు. శిష్టజనుల పిల్లలకు ఆభాషే అలవడుతుంది. ఆభాషద్వారానే పిల్లలందరున్ను

జ్ఞానము సంపాదిస్తారు. శిష్టవ్యవహారమునకు వ్యతిరిక్తమైన భాష వాడేవారు కూడా శిష్టులతో సహవాసము చేయడమువల్ల శిష్టులభాష అలవర్చుకొంటారు. బడులలోను సభలలోను శిష్టుల వ్యావహారికభాష నిరంతరంగా వినబడుతూ ఉంటుంది గనుక పిల్లలకూ పెద్దలకూ సామాన్యమై, ఆ భాష దేశభాషగా వ్యాపిస్తుంది. నేడు లోకవ్యవహారమందు రూఢమయి ఉన్న శబ్దము అసాధువని ఎవ్వరికిన్నీ తోచదు. పూర్వకాలమందు ఆశబ్దము మరి ఒకరూపముతో ఉంటే, ఉండుగాక. అప్పటివ్యవహారము అప్పుడు సాధువైనట్టే ఇప్పటివ్యవహారము ఇప్పుడు సాధువు. ప్రజలకు స్వస్థాన వేషభాషాభిమానము శిష్టజనుల వేషభాషలనుపట్టే కలుగుతుంది. వారిని బుద్ధిపూర్వకముగానో, అబుద్ధిపూర్వకముగానో అనుకరించుటవల్లనే ఆవేష భాషలు అందరికీ అలవాటయి, 'దేశవేషము' 'దేశభాష' అవుతవి. అట్లే ఆచారము, నడవడి, శీలము, గుణము మొదలైనవన్నీ ఒంటికి ఎక్కి, లెస్సగా పట్టి ఉండేవి; కాని ఎప్పుడో ఒకప్పుడు ఎరువుగా తెచ్చిపెట్టుకొనేవికావు.

అయితే వేంకటరాయశాస్త్రులవారికి నేటివ్యావహారికభాష శిష్టులదైనా సాధువుకాదు. ఈయన 1885 వ సంవత్సరమున రచించి ప్రకటించిన శిశువ్యాకరణమందు మొదటిసూత్రములో 'పెద్దలు ఎట్టిమాటలకు గ్రంథములయందు ఎట్టిరూపములను వాడిరో, ఆ విషయములను దెలుపునది వ్యాకరణము' అని వ్యాకరణశాస్త్రలక్షణము చెప్పినారు. కాని 'పెద్దలు' అనగా ఏవరో, 'గ్రంథములు' అనగా ఏవో స్పష్టముగా చెప్పినారుకారు. జ్యోతిశ్శాస్త్రం వైద్యశాస్త్రము మొదలయినవిద్యలు తెలుగున వివరించినవారు, ప్రబంధములకు టీకలు వ్రాసినవారు, రామకీర్తనలు రచించినవారు పెద్దలు కారా? వారురచించినవి గ్రంథములుకావా? అవివ్యావహారికభాషలోనే ఉన్నవి. మనతాతముత్తాతలనాడు బాలుర పాఠ్యములు రచించిన రావిపాటి గురుమూర్తిశాస్త్రులుగారు, ఉదయగిరి శేషయ్యగారు పెద్దలుకారా? వారి పుస్త

కములు దుష్టగ్రంథములా? గురుమూర్తిశాస్త్రిగారి పంచతంత్రము 1834 వ సంవత్సరము మొదలుకొని 40 ॥ లు బడిపిల్లలచేత ఉపాధ్యాయులు చదివించే వారు. చిన్నయసూరిగారి నీతిచంద్రిక ఆదర్శమై నెలకొన్నపిమ్మట ఆగ్రంథములోని భాష అనుసరణీయమై అంతకంతకు వ్యావహారికభాషయెడల విద్వేషము పుట్టించినది. అయితే సూరిగారుగాని, వారిశిష్యులుగాని, నేటివరకున్ను “పెద్దలగ్రంథములందు తెలుగుభాషలోని మాటలకన్నిటికిన్ని యెట్టి రూపములు వాడిరో” తెలిసేటట్టు అనుశాసనము నిరవశేషముగా చేయలేదు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారు బృహదాంధ్ర నిఘంటునిర్మాణమే పూనుకొన్నారట; గాని బృహదాంధ్రవ్యాకరణ నిర్మాణము ఇప్పటికిన్ని తలపెట్టనే లేదట.

ఇప్పుడు మన తెలుగుదేశమందున్న రెండుకోట్లమంది తెలుగువారున్ను వాడుకలోనున్న తెలుగుమాట లన్నిటిలోను వేటిరూపములు “పెద్దలు” “గ్రంథములలో” వాడినచొప్పున ఉన్నవో, వేటిరూపములు ఆచొప్పున లేవో తెలుసుకొని సాధుతాసాధుత్వము నిశ్చయించుకొని అసాధువులు పరిత్యజించి సాధువులు అలవర్చుకోవలసి ఉన్నదట! ఇట్టి దేశభాషా సంశోధనము సాధ్యమో అసాధ్యమో వివేకులు ఆలోచింతురుగాక. శాస్త్రులవారి ప్రమాణముచొప్పుననే నాకు వల్లనయి నంతమట్టుకు వారుకావించిన దూషణము యుక్తమో కాదో విచారిస్తాను.

(1) ‘జలగ’ తప్పనుటకు కారణము కనబడదు. ఇది సం. “జలౌ (లూ) కా” నుండి వచ్చినది. మొట్టమొదట ‘జలుగ’ గావుండెనేమో? ‘జ’ కార ముతప్పట! ఏమి? ‘జటా’ నుండి ‘జడ’రాలేదా? ‘చంద్ర’ శబ్దమునుండి చందురుడు రాలేదా? పెద్దలలో పెద్దపెద్ద తిక్కన, భారతము, శాంతి పర్వము (ఆ. 2. 393) లో ‘జ’ కారయుక్తముగానే ‘జలగ’ వాడినాడు. ఆ జకారము యతిస్థానమందున్నది. చూడండి:—‘క’. జలగదిగిచినట్లు నొనఁగ జను నిల సొమ్ముల్; శ-ర-లో ఈశబ్దమున్ను ఈప్రయోగమున్ను ఉన్నవి.

శాస్త్రిలవారు సాధువని చెప్పిన 'జెలగ' శ-ర. లో లేదు. బ్రౌ. ని. లో ఉన్నది. అయితే ఆ నిఘంటువునిండా "గ్రామ్యభాషే" గదా, శాస్త్రిల వారికి అది ప్రమాణమవుతుందా? అయితే నాకు సంతోషమే. ఇకను శాస్త్రిలవారి నిదానము చొప్పున బలుపునాటిగల గ్రంథములందుగూడా 'జలగ' ఉన్నది. వి. స, లో (మా. విన్నపము పుట 10). 'జలగలు' ఆంధ్రపత్రిక (4-1-23) లో సర్ త్యాగరాయశ్రేష్ఠిగారి ఉపన్యాసమందు "మంత్రులీయుద్యోగములను జలగలు పట్టుకొనినట్లు" అని ఉన్నది. ఇప్పటికవులలో మిక్కిలి ప్రఖ్యాతి పొందిన తిరుపతివేంకటేశ్వరులు తమ దేవీభాగవతమందు (1-367) "చ. జలగ శరీరముం బొదివి చయ్యన నెత్తురు గ్రోలుభంగి" అని తిక్కన వలెనే 'జలగ' ప్రయోగించినారు.

(2) 'జండా':—తప్పట! శ-ర-లో 'జండా' 'జెండా' రెండునూ ఉన్నవి. ఇది హిందీ 'ఝండా' నుండి తెలుగులోనికి వచ్చినది. సం. 'జయ' తెలుగు 'జే' అనిన్ని 'జా' అనిన్ని రెండురూపములతో ఉన్నది. రెండున్ను పెద్దలు వాడినారు. శ-రలో 'జా' లేదు. లేకుంటే ఆలోపము నిఘంటువు దోషముగాని శబ్దముయొక్క దోషముకాదు. వరాహపురా. (1-148)లో నందిమల్లన 'జా పరమేశ్వరా యనిన - జంతువులన్నియు' అని యతిస్థానమందు 'జా' ఉంచి వాడినాడు.

(4) 'కాలవ'—శ. ర. లోలేదు గాని బ్రౌ. ని. లోఉన్నది. ల. నా. లోకూడాను; బలుపునాడెగల వి. స. లో. 1332వ పుటలో కనబడుతున్నది. రంగయ్యసెట్టిగారు తెలుగుపీనల్ కోడ్ 432 వ సెక్షనులోవాడినారు. మరాటీభాషలోకూడా 'కాలవా' అని అంటారట! నేనుకాలువ అనేవాడుతున్నాను గాని 'కాలవ' నేను తప్పనలేను. లోకమందున్నది.

(4)'దవడ'—తప్పనుటకుప్రమాణమేమిటి? 'దవుడ' :'దౌడ' అని. శ, ర. లో ఉన్నదిగాని, దవడ లేదు. అదినిఘంటువుదోషము. 'అవల'అవుల 'జౌల' చేర్చినవారు'దవడ, దవుడ, దౌడ' కూడాచేర్చుకోవలసిఉండెను. అం.

భా.(11, 143) లోను ద్విరూపకోశములోను ల. నా, లోను 'దవడ' ఉన్నది. విక్రమాంకదేవ చరిత్రమందు తిరుపతి వెంకటేశ్వరకవులు వాడినారు (చూ. పు. 46). సులభవ్యాకరణమందు వావిలికొలను సుబ్బారావుగారు తాలువులు-దవడలు - వీనియందుఁబుట్టినయక్షములు(?) తాలవ్యములు అని అనుశాసించినారు. బలువునాడిగల వి. స. (పు708) లోను, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి 'వినోదముల' లోను (పు18) అనేకగ్రంథములలోను పెద్దలు వాడియున్నారు. 'దవడ' సం. దంష్ట్ర - ప్రా-దాఢో-నుండివచ్చినది. అయితే సంస్కృతశబ్దము తెలుగు దొంష్ట్రఅనిగాని దొష్ట్రఅనిగాని సాధారణముగా ఉచ్చరిస్తారు. మాటవు, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు క్రొత్తగా రచించిన రామాయణసంగ్రహమందు (చూ. కిష్కి. 22) దొష్ట్రిలు జూచిఅని కనబడుచున్నది. ఇట్టిఉచ్చారణకారణముగా దవుడ అనేరూపము రావచ్చును. మడికిసింగన వాసిష్ఠరామాయణమందు, జ్ఞా - ప్రాసముగా, 'సాజ్ఞాఖ్యానములు' అని కందపద్యములో ప్రయోగించినాడు. సంజ్ఞా సరిగా తెలుసువారు నేడు ఉచ్చరించరు. ఓఢ్రులు యథావిధిగా పలుకుతారు. అట్టిఉచ్చారణనుండి సన్న అనేరూపమున్ను సైంగ్యఅనే ఉచ్చారణమునుండి 'సైగ, అనేరూపమున్ను తెలుగుగ్రంథములలోనికి వచ్చినవి. నేడు 'సాంగ్య, సవుగ్య' అనేవి కనబడుచున్నవి. నేటిలౌకికభాష నేడు సాధువనేవారు నేటిశబ్దరూపములు వాడుతారు. పాతరూపములే కావలెననేవారు వెదకి తెలుసుకోవలెను. మనశాస్త్రిలవారు వి. సా. లో 'ఆవలించు' వాడినారే (చూ. పు. 213. 398). ఇది 'దవడ' వంటిదేకదా. అయితే, ఇది శ. ర. లో లేదు. లేకుంటేనేమి? ల. నా. లోనున్ను, ఆం. భా. లోనున్ను ఉన్నది; లోకములో ఉన్నది; ఆంధ్ర వాల్మీకి రామాయణమందున్నది (బాల. 479). ప్రాచీనులయిన పెద్దలు గ్రంథములందు 'ఆవులించు' అనే వాడినారు. ఈ కాలపు పెద్దలు 'ఆవలించు' అనివాడుతూ ఉన్నారు. మనశాస్త్రిలవారు వాడినశబ్దము నేటి వాడుకనుబట్టి సాధువు, పూర్వుల వాడికనుబట్టి అసాధువు.

(5) 'మనమడు'—అసాధువట! ఎందుచేతనో! 'మనమడు' 'మనమరాలు' అని నేను లోకమందుఅందరూ అంటున్నారు. శ. ర. లో లేకున్నా ల. నా. లోనున్నది. నవలలలోను నాటకాలలోను, కనబడుచున్నవి. అయితే ఇవి పెద్దలగ్రంథాలు కావంటారు శాస్త్రులవారు. వసుచరిత్ర పెద్దల గ్రంథాలలో చాలాచాలా పెద్దదిగదా; అందులో (ఆV 35) "భవ్యగుణ మంజి మనమరాలి మానసమున మనమరాలి మనమరాలి వివాహసంభ్రమముఁ జూడ" అని, రామరాజభూషణుడు 'మనమరాలు' శబ్దము చిత్రరచనలో చమత్కారముగా పొందుపర్చినాడు. "సవ్యవహారగతములగుటంజేసి యగ్రామ్యములును బ్రయోగార్హములును ననుతలంపున రామరాజభూషణుఁడు ప్రయోగించియుండునని తోఁచుచున్నది" అని దీనిని గురించిన్ని, ఇట్టివే మరికొన్నిటిని గురించిన్నీ, బ్ర. శ్రీ. వఝల చినసీతారామస్వామి శాస్త్రులవారు తమవసుచరిత్ర విమర్శనమందు వ్రాసినారు. పుదూరి సీతారామశాస్త్రిగారు 1834 సం|| లో రచించిన ప్రశ్నోత్తరవ్యాకరణమందు ఏకాదిశబ్దములలో 'మనమడు' అనే రూపముగలశబ్దము పేర్కొన్నారు. (అజంతప్రకరణము, 49 వ ప్రశ్న.) కృష్ణజన్మఖండమందు శ్రీ గోపినాథ వేంకటకవీంద్రులు "ధాతకు, న్మనమఁడు పోట" అనివ్రాసినారు (ఆ. 4. పు. 212). వేంకటరాయశాస్త్రులవారి నిదానమునుబట్టి ఆం. చ. లో "బలుపునాడి" ఆడుతున్నదట. కనుక, ఆగ్రంథమందే (1, 86, 142, 194, 271.) నాలుగుపుటలలో నాలుగుచోట్ల. 'మనమఁడు' బలిసిఉన్నదని తెలుసుకొని పండితభిషక్కులు ఇట్టిరూపములు భాషాదేవికి రోగలక్షణములని తలంచకుందురుగాక. ఇవి గ్రంథములలోవాడుట 'అవిమృశ్యకారిత' అని శాస్త్రులవారు అన్నారు; కాని, సాధువయిన శబ్దములను అసాధువులని దూషించడమే అట్టిదనవలెను. తిక్కనవంటి కవీశ్వరుడు భారతమువంటి గ్రంథములో యతిస్థలమందు జ ఉంచి, జలగశబ్దము ప్రయోగించి ఉండగా, 'బాలురపొత్తముల'లో ఆశబ్దమువాడితే రాజకీయవిద్యాంగమువారు సరస్వతికి విష

ప్రయోగము చేయించినారని దూషించేవారు ఎట్టివిమర్శకులో పక్షపాతము లేకుండా ఆలోచించగలవారు చెప్పగలరు.

"జొన్నకంకెకు నూఁగు ఉండునా?"—"కంకె" యేమి? "కంకి" యనిరూపము. ఈపుస్తకములోనే-కంకులను కోయును--అని యికారాంత శబ్దముగాను బ్రయోగమున్నది. "పెంకుటుఇల్లు" ఇందు "టు" ఏమి? పెంకుటిల్లు అనరాదా? "శనగలు"—"సెనగలు" సాధురూపము. పామరులు "శెనిగలు" అందురు. పామరతరులు "శెనిగెలు" అని ఎత్వాంతము చేయుదురు. శెనిగెలన్నందులకు నాగుమాస్తాను బ్రాహ్మణునొకనిని నేను తఱిమివైచితిని. "ఊసరవిల్లి" యట—పల్లిగాని విల్లిగాదు. ఒక్క "గెలుచు" ధాతువునకు వచ్చిన పాట్లు కనుఁడు:—ఎవరు గెలిచెదరో (గెలుచు ప్రకృతి) "నేనుగెలవలేనా" (గెలచు ప్రకృతి), "పందెము (?) గలచెను" (గలచు ప్రకృతి), "గెలుపుకలుగును" (గెలుచు ప్రకృతి)—అన్నిటను గెలుచే ప్రకృతిగా నుండరాదా?

విమర్శనము:—(1) 'కంకి' 'కంకె' 'కంకులు' 'కంకెలు' లోకములో ఉన్నవి. అట్లే ఏ. వ. 'పల్లి' 'పల్లె' ఉన్నవిగాని, పల్లెలు మాత్రమే బ. వ. వాడుకలో కనబడుచున్నవి. 'పల్లులు' లేదు. 'ఐతే' పల్లితప్పా? 'చెఱకుంబల్లి' అని ప్రాచీన తామ్రశాసనమందున్నది. సంపఁగె. సంపెఁగ, గరిటె, గరిట, గగ్గెర, గగ్గిర. పీకె, పీక, ఈఁకె, ఈఁక, తొట్టె, తొట్టి, తొట్టెల, తొట్టిల, గెంటెము, గింటెము, చిత్తకార్తె, చిత్తకార్తి, కోరికె, కోరిక, కోరికి, పోలికె, పోలిక, పోలికి, ఒకతె, ఒకత, ఒకతి. ఇటువంటివి భాషలో వందలకొలదిగా ఉన్నవి. ఎవరికి ఏది అలవాటయితే అది వాడుతారు. కవులు తమ కుచితమని తోచినట్లు వ్రాసినారు; వ్రాస్తున్నారు. వేంకటరాయశాస్త్రిలవారు హితోపదేశములో నెమలి (71) అనిన్ని, క. సా. లో. వదినె (పు. 170), చెడిపె (పు. 444) అనిన్ని వ్రాసినారు. శ. ర. లో. నెమలి, చేర్చలేదు; 'నమిలి' 'నెమిలి' సాధువులని ఉన్నది; 'వదిన'

లేదు 'పదిసె' మాత్రమే ఉన్నది. అయితే, 'పదిన' తప్పా? ల. నా. లో. ఉన్నది. శ. ర. లో: 'చెడిపె' లేదు. చెడిప. మాత్రమేయున్నది. అందుకు ప్రమాణముగా కాశీఖండము (ఆ. 2. ప. 72) "లోని చెడిపతోఁ జాలపో రామి సేయజనదు" అని యుదాహృతమయి యున్నది. ల. నా. లో. ఈ ప్రమాణమే చూపించి 'చెడిప' శబ్దమున్నూ దానితోపాటు 'చెడిపె' రూపాంతరమున్నూ చేర్చుకొన్నారు. అయితే, వావిళ్లవారు ముద్రించిన కాశీఖండములో 'చెడిపె' అని ఉన్నది; కాని, శ. ర. లో. ఉదాహరించినట్లు 'చెడిప' అని లేదు. నావద్దనున్న తాటాకుపుస్తకములో "చెడిపితోడను బోరామి సేయవలదు." అని ఇకారాంత రూపమున్నది. ఇట్లు "చెడిప, చెడిపి, చెడిపె" అని మూడురూపములు కంటికి కనబడుచున్నవి. వాటిలో ఏదిసాధువు? సాధుత్వాసాధుత్వము నిరూపించుటకు ప్రమాణమేమిటి? శ. ర. లో. 'సంపెగ, సంపగె' మాత్రమేయిచ్చుకొన్నారు. ప్రభావతీ ప్రద్యుమ్నములో యతిస్థానమందు 'ప' గలిగి 'సంపంగి' అని ఉన్నది. (చూ. 11, 78) వేంకటరాయశాస్త్రిలుగారు 'క్రొమారిగె' అని 762-వ పుట లోను 'క్రొమారితె' అని 758 పుటలోను క. సా. లో వ్రాసినారు. ఇవి వారి, 'వ్రతకల్పముల'లో కూడా ఉన్నవి. శ-ర-లో మొదటిదేకాని రెండవరూపములేదు. ల. నా. లో రెండున్ను ఉన్నవి. చాలా చోట్ల వ్రతకల్పములలోను (చూ. 68.) తక్కిన గ్రంథములలోను శాస్త్రిలుగారు ప్రయోగించిన 'గాడిదె' శ-ర-మే ప్రమాణమయితే తప్పవుతుంది. ల. నా. ప్రమాణముగా అంగీకరిస్తే సాధువు. ఆకోశకారులు ఎందుకు చేర్చినారు? లోకములో ఉన్నది కనుకనే. చిన్నయసూరి నీతిచంద్రిక మొదటి కూర్పులలో 'గాడిదె' చాలాచోట్ల ఉన్నది; గాని ఈ రూపము శ-ర-లో లేనందున నేటికూర్పులలో 'గాడిద' అని పరిష్కర్తలు దిద్దివేసినారు. ఇప్పటి నీతిచంద్రిక చిన్నయసూరిరచించినట్లు లేదు. క-సా-లో 'సంకిలి' (పు. 211) 'సంకిళ్లు' (44-83) తరుచుగాను 'సంకెలలు' (62)

అరుదుగాను రెండురూపములు కనబడుచున్నవి. మొదటిది ఏకోశమందున్నూ నాకు కనబడలేదు. 'సంకెల' 'సంకలియ' శ-ర-లోను ల-నా-లోను ఉన్నవి. లోకములో 'సంకిళ్లు' 'సంకెళ్లు' బహువచనమందు వాడు చున్నారు. ఏ. వ. రూపము నేను వినలేదు. బ్రౌ. ని. లో 'సంకెల' ఏ. వ., 'సంకిళ్లు' బ. వ. అని ఉన్నది. కనుక 'సంకిలి' శబ్దము 'సంకిళ్లు' అనే బ. వ. రూపమునుండి శాస్త్రులుగారు సాధించినదిగా కనబడుచున్నది. ఇదే కృతకభాష; అనగా వాస్తవమయిన వర్తమాన వ్యావహారిక భాషా కాదు వాస్తవమయిన ప్రాచీనకావ్య భాషా కాదు. నాగపూడి కుప్పుసామయ్యగారి గ్రాంథికాంధ్రముకూడా ఇట్టిదే. వారి భారతసారమందు 'సంకిలెలు' అని ఉన్నది. ఇట్టి అపశబ్దములు వాడుట నిజముగా విప్రయోగమవుతుంది. వాడుకలో ఉన్నవి లౌకికములు. "లోకేవిదితా లౌకికాః."

లోకములో ఉన్న శబ్దమును కోశములోగాని వ్యాకరణములోగాని చేర్చుకోకపోతే కోశమున్నూ వ్యాకరమున్నూ తప్పులవుతవిగాని శబ్దము తప్పు కాదు. పరమప్రమాణముగా గ్రహించదగిన కోశముగాని, వ్యాకరణము గాని తెలుగుభాషకు ఇప్పటికింకా ఒకటీ పుట్టలేదని అందరున్నూ ఎరుగు దురు. ఉన్నమట్టుకైనా అవి పెద్దపెద్దపండితులకే ఉపచరించడములేదు. సామాన్యులు కోశములు, వ్యాకరణములు ఎన్ని ఉన్నవో అన్నిన్ని దగ్గర పెట్టుకొని ఒక శబ్దము సాధువో కాదో అన్నిటిలోనున్నూ వెదికి చూచి తెలుసుకొని గాని వ్రాస్తారా? దేశభాషమాట్లాడినప్పుడు. గాని వ్రాసి నప్పుడుగాని దేశస్థులు ఇంతప్రయత్నము చేయవలసియుంటే లోకవ్యావ హారము సాగుతుందా? ఎంతో గొప్ప పాండిత్యము గలవారని ప్రఖ్యాతి పొందిన వేంకటరాయశాస్త్రిగారికి 'జలగ' శబ్దము సాధువని తెలియలేదు సరిగదా మరిఒకరు ఆశబ్దము ప్రయోగించునప్పుడు ఆలోచించకుండా అది అసాధువని నిందించుటకు సాహసించినారుగాని శ. ర. మైనా చూచి

నారుకారే! అది చూచిఉంటే, తిక్కనప్రయోగమట్లున్నదని తెలుసుకొని ఉందురుగదా! నిష్కారణముగా ఒకరిని నిందించినారన్న నిందకు పాత్రులు కాకపోదురుగదా! తమ అలంకారసంగ్రహమునందు శాస్త్రిలవారు "క. ఆరయ నద్భుత మిథ్యా, ఘోరత్వౌదార్యరచన♦చోఱునత్యుక్తిన్" అని 63 వ పుట లోఅత్యుక్తికి లక్షణము వ్రాసినారు. శ. ర. లో ‘చొచ్చు’ ధాతువున్నది; గాని ‘చోఱు’ లేదు (చోరు అయినా లేదు). చిన్నయ సూరి బాలవ్యాకరణ సూత్రము వారి జ్ఞప్తియందుంచుకోవలసి ఉండెను; లేకుంటే, గ్రంథము వ్రాసినప్పుడైనా చూడవలసి ఉండెను. ఇది వ్యావహారిక భాషలోని శబ్దము కాదు. గ్రాంథిక భాషలో ‘చొచ్చు’ ధాతువుకు ముత్తుపరంబగునప్పుడు మాత్రము ‘చొఱు’ అగును. ఉ. చొఱఁడు, చొఱుము. పోనీ! గ్రంథములలో ప్రాచీన కవులు ఏలాగున వ్రాసినారో తెలుసుకొన్నారా? నేనెరిగినంత మట్టుకు ఏగ్రంథములోనూ ‘చోఱుట’ అని కానీ, ‘చోరుట’ అని కానీ ప్రాచీనకవిప్రయోగము ఒకటైనా కనబడలేదు. రాజమహేంద్రవరము గవర్నమెంటుకళాశాలలో ఆంధ్రపండితులుగా ఉన్న, బ్ర. శ్రీ. మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు ‘శరణు చొచ్చుము’ అని తాము నిరుడు రచించిన భాసనాటక కథలలో (199 పుట) ప్రయోగించినారు. ఆంధ్రపండితులయినవారు బాలవ్యాకరణము చదివినవారని అనుకోవలెనుగదా? చదివినఫలమేది? వ్యాకరణములో అనుశాసించిన మట్టుకైనా సాధువైన గ్రాంథికభాష పెద్దపేరుగలపండితులకే అలవడలేదు. భారతము తిరిగీ తెనుగున రచిస్తూఉన్న బ్ర. శ్రీ. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు-కవిరాజబిరుదాంకితులు, ఆదిపర్వములో ‘చోరి’ అని (ఆ. 5. ప. 4.) చొరినన్ అని (ఆ. 10. ప. 251) ‘చొఱితిని’ అని (ఆ. 7. ప. 72) అనేకపద్యములలో ప్రయోగించినారే! ఇవి కోశమునకున్ను వ్యాకరణమునకున్ను ప్రాచీనకవిప్రయోగములకున్ను విరుద్ధముగా, నాకే కాక, అనేక పండితులకుకూడ కనబడుతున్నవి. ఏశబ్దమయినా ఇప్పటి

లోకవ్యవహారమునుగానీ పూర్వకవుల వ్యవహారమునకుగానీ అనుసరించినట్లు యితే, సాధువైనవర్తమాన వ్యావహారికభాష అనికాని సాధువైన ప్రాచీన కావ్యభాష అనికాని అంగీకరించుటకు యోగ్య మవుతుంది. ప్రాచీనకావ్య భాష వ్యావహారికభాషకంటె వేరుగా ఉన్నంతమట్టుకు దానిలక్షణము ప్రాచీనకావ్యములు లెస్సగా చదివి నేర్చుకొని అభ్యసించి అలవాటుచేసి కొన్నవారికేకాని ఇతరులకు వాటిలో వ్యత్యాసము నిస్సందేహముగా బోధపడదు. మనము చదువుతూఉన్న ప్రాచీనాంధ్రకావ్యములలోనిపాఠము లన్నీ నిర్దుష్టములుకావు. మనము చదువుకొన్న వ్యాకరణములు సంపూర్ణ ములుకావు, నిర్దుష్టములున్నుకావు. మన కున్నకోశములున్ను అట్టివే. చక్కగా రచించినవ్యాకరణము, కోశము ఉన్నా వాటిసాయమునే ప్రాచీనభాషలో మనము రచింపబూనుకొనుట అతిసాహసము. నాఅభి ప్రాయము స్పష్టపరుచుటకు ఒకఅంశము నిదర్శనముగా చూపిస్తాను. చను దెంచు, అరుగుదెంచు, అనుదెంచు, పోవుదెంచు మొదలయిన క్రియలు అనేకము ప్రాచీనభాషలో ఉన్నవి. వీటిలో 'తెంచు' అనుబంధముగా ఉన్నది. వీటికి ముత్తుపరమైనప్పుడు 'తే' 'తేరు' లగునని (బాల. క్రి, ౧౧౩) వ్యాకరణమం దున్నది. చొచ్చు, పుచ్చు, తోచు, మొలచు. వగచుమొదలయిన చ కారాంత క్రియలకు 'తెంచు' అనుబంధముగా చేర్చినప్పుడు ఆ చువర్ణము లోపించుననికూడా వ్యాకరణమందున్నది (బాల. క్రియ. ౧౨౨). ఈ లక్షణము స్పష్టముగా ఉన్నా శ-ర-లో 'వగదెంచు' దే. ప్రే. వగదెగఁ జేయు, పరిష్కరించు అని అర్థము చెప్పి 'వగదెగు' దే. అ. క్రి. (వగ + తెగు) పరిష్కృతమగు అని కృతక శబ్దము కల్పించి చేర్చినారు. ఇది వాస్తవముగా వగచు + తెంచు = వగ తెంచు. శ-ర-లో ఇచ్చిన ప్రయోగమందున్ను, ఇతర ప్రయోగములం దున్ను శ-ర-లో చెప్పినఅర్థము పట్టదు. వ్యాకరణము రచించిన చిన్నయ సూరిగారు నీతిచంద్రికలో 'పుచ్చు,' వాడవలసినచోట 'పుత్తెంచు'

‘పుత్తెంచు’ వాడవలసినచోట ‘పుచ్చు’ ప్రయోగించినారు. మన వేంకటరాయశాస్త్రిలవారు శృంగారనైషధ వ్యాఖ్యానమందు (చూ. V 101) “వాగ్భామ...ఒకమానవేంద్రు సమక్షమునకు నిందు బింబాస్యం దోతెంచి యిట్టులనియె” అని మూలమందు పాఠమిచ్చి టీకలో “తోతెంచి = తోడి తెచ్చి” అని అర్థము చెప్పినారు. నావద్దనున్న రెండు తాటాకు పుస్తకములలోనున్ను మూలమందు ‘తెచ్చి’ ఉన్నదిగాని ‘తెంచి’ లేదు. ఈ అర్థమందు ‘తోతెంచు’ అనే రూప ముండదు. అసంభవము. తోఁచు + తెంచు = తోఁతెంచు (కానవచ్చు; అభిముఖమై కనఁబడు). శ. ర-లో ‘తోఁతెంచు’ ‘తోతెచ్చు’ వేరువేరు శబ్దములుగానే యున్నవి. నైషధమందే VIII. 91 వ పద్యములో ‘దినయౌవనంబు దోతెంచె’ అని యున్నది. అక్కడ ‘తోతెంచెను = కనబడినది’ అని శాస్త్రిలవారు అర్థమువ్రాసినారు. బిందువు మాత్రము తీసివేసినారు. ఆగ్రంథమందే III. 11 లో ఏగుదెంచుచో = పోవుసమయమున అని తెంచు స్వార్థమందున్నట్లు అర్థముచెప్పినారు. కాని అక్కడ కథాసందర్భమునుబట్టి ‘వచ్చు’ అని అర్థమే పొసగి ఉంటుంది. ‘పోవు’ అని చెప్పుట తప్పు. ఇంద్రుడు నారదుని అడుగుతున్నాడు—యుద్ధములో చచ్చిన రాజులు మాయింటికి (అనగా స్వర్గమునకు) అతిథులుగా రారేమి? అని. ఇట్టిసందర్భమందు ‘పోరేమి’ అని అనగూడదుగాదా?

ఇట్లు ఈప్రాచీనాంధ్రశబ్దములు సరిగా తెలుసుకోలేక అకటావికటముగా అవి ప్రయోగించడమేగాక వాటిరూపములు మార్చి పాడుచేయడముకూడా జరుగుతున్నందుకు ఇప్పటివారి గ్రంథములనుండి కొన్ని దృష్టాంతము లుదాహరిస్తాను. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిలవారి శ్రీకృష్ణభారతమందు “రమ్మని నను బాహుబలాఢ్యునిఁ దాఁకు దెంచఁగన్” (సభా 11. 307) వావిలికొలను సుబ్బారావుగారి ఆంధ్రవాల్మీకి రామాయణమునందు “అంగదుఁ డంతటియనదయే రిత్తయే తేరుటకు” (సుంద 1390).

కూచినరసింహంగారి గౌరాంగచరిత్రమందు “కృష్ణుని...ఏతెంచుమని వేఁడరాను” (భా. II. ఆ. Xi. 144). నందిరాజు చలపతిరావుగారి సావిత్రి (కథ) లో ‘కళ్యాణము కల్యాణమని నారదుఁడేతేరెను’ (పు. 15) నడింపల్లి వేంకటహనుమంతరావుగారి సాహసికలో “రాగవల్లరి లీలావతిగృహమున కేతెంచగనే” (పుట. 66.) నేతి వేంకటసుబ్బయ్యశాస్త్రిగారి ధర్మరాజరాజసూయములో రెండుచోట్ల ‘అరుగుదేరునిజకుమారునకు’ (పు. 42 మొదటిపూర్వ, 40 రెండోది) క్రతువుపక్రమించునాఁటికి ‘మీనాటికి మరల నరుగుదేరువాడ’ (89. 84). నాగపూడి కుప్పసామయ్యగారి భారతసారమందు తెచ్చుధాతువిట్లే ప్రయుక్తమైనది. ‘కల్లుదేరు నెపంబున సైరంధ్రి నాయింటికిఁ బంపుము’ (పు. 144) దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు కాంగ్రెస్ సప్తాహమునందు “ఆంధ్రదేశమున కరుదెంచినున్న ధర్మశ్రేష్ఠులగు నాయకశిఖామణులకు అన్నముబెట్టి బిల్లు చేతి కీయవలసినదేనా?’ (ఆంధ్రపత్రిక ది 6-12-23). ఆంధ్రపత్రికలో ఇవి లేఖకుల జాబులలోనేకాక, సంపాదకీయవ్యాసములందు సయితము, తరుచుగా ఇట్టిప్రయోగములు కనబడుతూ ఉన్నవి. (చూ. తే 20-11-22 సంచికలో) ‘అరుగుదెంచక మానదు’ అని రెండుచోట్ల, (తే. 4-1-23 ది లో) ఏతెంచగ అని, (తే 29-1-24 ది లో) ‘స్వరాజ్యసిద్ధి నాటంకపరుచుట కేరికిని వీలులేని పరిస్థితులు త్వరలో నరుదెంచకమానవు’ అని. ప్రజాస్వామికపరిపాలనాభిలాషగల పత్రికాధిపతులు గ్రాంధికాంధ్రమురాని ప్రజలకోసము ప్రకటిస్తూ ఉన్న తమపత్రికలో ప్రజలకు సుపరిచితమయిన భాషకుమారుగా కృతకభాష వాడటముచూస్తే గ్రాంథికాంధ్రభాషావ్యామోహముయొక్క ప్రాబల్యమూ, ప్రభావము అప్రతిహతముగా ఉన్నట్లు కనబడుతున్నది. ప్రరూఢమూలమయిన దురభ్యాసము, దురాచారము పండితులయినా విడిచిపెట్టలేరుగదా! ‘రాకమానదు’ అనుటకు మారుగా ‘అరుగుదెంచకమానదు’ అనునది దురభ్యాసముకాక మరేమిటి? పామరులను మోసపుచ్చడముకాదా?

(2) 'పెంకుటుఇల్లు' తప్పన్నారు. విసంధి వివేకము రచించిన శాస్త్రిలవారు క. సా. లోని పడకయిల్లు (401.443) మొదటికూర్పులోనే 'పడుకటిల్లు'గా వ్రాయవలసిఉండెను. క. సా. లోని 'మూకుడునడుమ బొక్క'లో (478) తప్పుకాదా? మూకుటినడిమి బొక్క అనవద్దా? శ. ర. లో. 'లోవ' రెండవఅర్థము 'రథపీఠముమీఁది చుట్టుపుఅంచు' అని విసంధిగా ఉన్నది. 'పెంటపాడుఅవతల' కొండవీడుఅవతల' మొ॥ ఆంధ్రపత్రికలో కనబడ్డవి. వి. స. నిండా ఇట్టిప్రయోగము లున్నవే.

కృతకభాషలో విసంధివివేకమే కాదు. ఏవివేకమయినా కృతకమే. అది ఒక్కలాగున ఉండదు. 'ఎల్లని' (భీమ. 1.65) 'ఎల్లయని' (అను. IV 166) అని తిక్కనవాడినాడు. ఆఅర్థమందు నేడు లోకులు 'ప్రతీది' అంటున్నారు. ఆంధ్రపత్రికలోని జాబులలో కనబడుతున్నది. మనశాస్త్రిలవారు ఈరూపము గ్రామ్యమని కాబోలు 'ప్రతిది' అని (అలం. పు. 2) పద్యమందే ప్రయోగించినారు. ఎవరో జ్ఞప్తియందులేదు, 'ప్రతియది' అని ఈమధ్యనే వ్రాసినారు!

(3) 'శనగలు' తప్పట! గ్రా. ని. లో ఉన్నదే. బలుపునాడి గల వి. స. లో కూడా ఉన్నదే (పు. 345). "శనిగలు" అన్నందులకు నాగుమాస్తాను బ్రాహ్మణునొకనినితలమీదవైచితిని అని శాస్త్రిలవారు తమగ్రామ్యద్వేషము నెల్లూరిసభలో వెల్లడిచేసుకొన్నారు. ఈలాగుననే స్విఫ్ట్ అనే ఇంగ్లీషుపండితుడు 'మాబ్' అనే ఇంగ్లీషుమాట వాడినవారిని కొట్టబోయేవాడట. అతడు ఉడుక్కోకుండాచేయుటకు అడిసన్ తనపత్రికలో ఆశబ్దము గ్రామ్యమని ప్రకటించినాడట! గాని లోకమందంతటా ఆశబ్దము వ్యాపించి ఆకాలమందే సాధుత్వముపొందినది. కొండె వెంకటప్పయ్య పంతులుగారున్నూ పురాణపండ మల్లయశాస్త్రిలుగారున్నూ తమయింటిపేర్లు ఆకారాంతములుకావని వాదించినా, వారిబంధువులున్నూ లోకులున్నూ ఆకారాంతముగానే వాడుతున్నారు. 'శెనగపప్పు' అని వై. మను

మంతరావుగారు రచించిన సోమశేఖరవిజయమునందున్నది (పు. 98). ఈగ్రంథమునిండా ఎన్నో అపశబ్దాలున్నవి; అయినా, కట్టమంచి రామలింగారెడ్డిగారున్ను, రా. సా. గుమ్మలూరి వేంకటరంగారావుపంతులుగారున్ను దానిని మెచ్చినారు; ఇదికాలేజివిద్యార్థులకు ఈసంవత్సరము పఠనీయగ్రంథము! పినాకిని పత్రికలో ఒకవిలేఖరి 'చెనిగపంట', 'చెనిగబుడ్డలు' వాడినాడు. ఇదిసం. చణకశబ్దమునకు అన్నిటికంటే దగ్గరగా ఉన్నది. వాడుకభాషలో వైవిధ్యముండుట వైయాకరణులకు వింతగా ఉండదు. దేశాంతరమందున్న వివిధశబ్దరూపములు పాణినిఅనుశాసనమందు ఉన్నవి. శవర్ణము తెలుగులోలేదని శాస్త్రిలవారి సిద్ధాంతముగాబోలు! 'శనివారము' 'శరణు' తత్సమములా? తద్భవములా? శలవు, శిస్తు, డిశంబరు తెలుగులోచేరినవి. 'శాలువు' తప్పని 'సేలువు' కొందరు వాడుతున్నారు. 'శెట్టి' ని 'శ్రేష్ఠి' ని చేసినారు. 'చెట్టి' కూడానిలిచిఉన్నది. 'శింగకవి' 'శీతయ్య' అని సంతకాలు చేస్తున్నారు; మొదటిమాట ప్రాచీనశాసనాలలో ఉన్నది. 'పడిశము'న్ను దానికి మందులున్ను పత్రికలలో కంటబడుతూనే ఉన్నవి. మనశాస్త్రిలవారే ఉప. లో (పు. 13) 'శబాస్' అని వాడినారు; అదేమో! షకారముకూడా తెలుగులోఉండకూడదని వీరిఅభిప్రాయము. క. సా. లోను, ప్రతా. లోను, అనేకచోట్ల 'మనిసి' అని శాస్త్రిలవారు ప్రయోగించినారు. క. సా. లో 'మనిసిశవము' (227) 'మనిసిని' (18) 'మనిసిపుట్టె' (206). ప్రతా. లో రాజువాక్యమందు "మీకు మనిసికి ఒక సర్కారిచ్చేదము" (పు. 44; 3-వకూర్పు). 'అంచెమనిసి' (72). ఈనాటకములోనే చాకలిపేరిగాడిభాషలో 'పెతిమనిసికీ' అని ఉన్నది. 'మనిషి' అని లౌకికభాషలో శిష్టవ్యవహారమందున్నది. దీనిలోని 'ష'కారము అనాంధ్రమనికాబోలు ఆవర్ణముగల తెనుగుశబ్దము గ్రామ్యమంటారు! భాషాదేవికి గ్రామ్యవిషయము తగలకుండా షకారము సకారముగామార్చి 'మనిషి'ని 'మనిసి'నిచేసి, గ్రాంథికభాషలో వాడుటకు తగినశబ్దము పుట్టించినారు. అయితే, లోకములో చాకలిపేరిగాడివంటి పామరజనవ్యవహార

మందు సిద్ధశబ్దముగా ఉన్నందుకు పేరిగాడిమాటే ప్రమాణము. సర్వ స్వతంత్రులయిన పండితులు అఘటితఘటనాసమర్థులుగనుక, లోకములో వాస్తవముగా గ్రామ్యమయినది సాధువుగాను, వాస్తవముగా శిష్టజనవ్యవహారమందు సాధువుగా ఉన్నది గ్రామ్యముగాను చేసినారు. ప్రాచీనకావ్యములలో నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, మొదలుగాగల కవిపుంగవులు 'మానసి' అని వ్రాసినట్టు తాటాకుపుస్తకములలో కనబడుచున్నది. అచ్చుపుస్తకములలో 'మానిసి' అని ఉన్నది. అరణ్యపర్వములో ఒకచోట (ఆ. 5. ప. 332) 'క. అక్కట మృదుగాత్రులు గడుఁజిక్కని మనసులు-, అని నాకుకనబడినది. 'మనసులు' అంటే, 'మనస్సు' కలవారు అని అర్థము అగునా? కాకపోతే 'మానసి'కి 'మనసి' రూపాంతరముని చెప్పవలసి ఉంటుంది. క. సా. లో 'షికారు' గ్రామ్యమని దానికి మారుగా 'సికారి' అనేశాస్త్రిలుగారు వ్రాసినారు (చూ. 19, 23). అయితే మోర్చింగు (శ. ర.) కు మారుగా 'మోర్సింగు' అన్నారు. (చూ. ప్రతా. 72). ఇట్లే 'మరుచటి' అని క. సా. (పు. 632)లోను, 'మరుసటి' అని శ. ర. లోను ఉన్నది. 'కొంచము'అని క. సా.(పు. 51, 109) లో. వీజనము(?)విశ(సె)నకఱ్ఱ అయి లోకములోఉన్నా, 'విసనకఱ్ఱ'అని గ్రాంథికముగా వ్రాస్తారు పండితులు (చూ. శ. ర.). అయితే, 'విసరుకఱ్ఱ' అని ఇప్పుడు కొందరు గ్రాంథీకరణము చేస్తున్నారు. ఇది ఇకను విసరుఁగఱ్ఱ అవుతుందేమో. ఉచ్చారణను అనుసరించి ఊయెల, ఉయ్యేల, ఉయ్యాల, ఊయల, ఉయ్యాల, పయ్యేద, పయ్యాద, బోయెత, బోయత, ఆయెలే, ఆయలే, అనే రూపములు ఏర్పడ్డవికావా?

(4) 'ఊసరవిల్లి' లోకములో ఉన్నది. వ్యుత్పత్తిని పట్టిచూస్తే ఊసరవల్లి (సం. పల్లి బల్లి) సాధువు కాబోలును. కన్నడములో 'ఊసరవల్లి' 'ఊసరుల్లి.' కొందరు తెలుగువారు 'ఊసపిల్లి' అంటారని బ్రౌ. ని. లో ఉన్నది. "పల్లి"కిమారుగా 'పిల్లి' అనుటకు 'చెరుకుపిల్లి' వారని,

చెఱకుపల్లి (చెరకుంబల్లి) కిమారుగా వాడుట దృష్టాంతము. ఇది మల్లె మల్లి మొదలయిన వాటివలెనే అయినది. క. సా. లో శాస్త్రిలవారు పల్లి, పల్లిని, పల్లికి, అని వ్రాసి ఎందుకు దిద్దుకొన్నారు ? 'పల్లి' సాధువు కాదా? ఆదంట వేంకటరాయసాంఖ్యాయనశర్మగారు 'రహస్యదర్పణ.' మందు 'గురి వింపగింజలు' (పు 112) అని వాడినారు (శ. ర. గురివెంద). ఏమిచేయను?

(5) గెలుచు, గెలుపు, గెలిచెను, గెలవగలనా, అని అచ్చు వ్యత్యస్తముగా వాడుట దోషమని ఆక్షేపించినారు. కాని తెలుగులో ఒక శబ్దము ఉకారమధ్యమమో అకారమధ్యమమో ఇకారమధ్యమమో నిరూపించుటఎంత కష్టమో ఆలోచించినారుకారు. యతిస్థానమందు కనబడితేనేకాని అచ్చు ఇదమిత్థమని నిశ్చయించిచెప్ప శక్యముకాదు. అట్టిస్థానమందే వివిధముగా కావ్యములలో కనబడినప్పుడు రూపాంతరములు కోశములలోనికిన్ని, వ్యాకరణములలోనికిన్ని, అప్పుడప్పుడు లాక్షణికులు చేర్చుకొన్నారు. ఇంకా చేర్చుకోవలసినవి కొన్ని కనబడుతున్నవి. ♦ ఒక్కొక్క కాలమందు ఒక్కొక్క విధముగా శబ్దరూపము లున్నవి. నన్నయ మొదలయిన ప్రాచీన కవులు 'నడచు (నడక, నడ) మిక్కుటము (ధా. మిక్కు, మిక్కిలి), బోరన, దిగ్గన, నాలుక, కానిక, సడిలి. * పగుల్చి' † అని వాడినట్లు యతిస్థానమందు డ, కు, ర, గ, లు, ని, డి, గు, వర్ణములు కనబడుతున్నవి. ఉత్తరాంధ్రకవులు 'నడుచు, మిక్కుటము, బోరున, దిగ్గున, కానుక, సడలి, పగిల్చి' అని వాడినట్లు అట్టి నిదర్శనమే ఉన్నది. తమ పూర్వుల వాడుకను అనుసరించకుండా దానికి భిన్నముగా ఉన్నా తమ కాలపు వాడుకనుపట్టే వారు వ్రాసినారనక తప్పదు. శ-ర-లో అనేక శబ్దముల రూపము నిర్ణ

♦ మెలుత (అనుశా. III 221)—'లు' యతి. శ-ర-లో మెలఁత ఉన్నది గాని మెలుఁత లేదు.

* సడిల్పక (కాశీ. IV.12—'డి'యతి)

† పగుల్చి (హరివం. పూ. IY. 148. 'గు' యతి.)

యించలేక సీతారామాచార్యులుగారు చాలా చిక్కులు పడ్డారు. వారికి తెలిసినంతవరకు చెప్పి దొరికిన ప్రమాణములను చూపించినారు. తక్కినవి విచార్యములన్నారు. ఎవరైనా మరేమిచేయగలరు? 'తొరఁగు' గురించి 'గ్రంథములయందు అంతట ఇది అకారమధ్యముగానే కనబడుచున్నది. అయినను ఒక మహాకవిమాత్రము ఉకారమధ్యముగా ప్రయోగించి యున్నాఁడు' అని వ్రాసినారు. నాకు తాటాకు పుస్తకములలో 'తొరుఁగు' అని ఉకారమధ్యముగానే కనబడ్డది. ఈ విచారణలో ఎట్టి చిక్కుగలదో తెలియజేయుటకు ఒకశబ్దము తార్కాణగా చూపెండి! 'ఎగచు' 'ఎసుచు' అని రెండు రూపములున్ను శ-ర-లో ఉన్నవి. రెండింటికి ప్రమాణముగా నిర్వచనోత్తర రామాయణము ఆ. 3. 33 వ పద్యమే ఉదాహృత మయినది. దానిలో కొట్టకొసను ఒక్క చోటనుమాత్రమే ఈ శబ్దము ఉన్నది. అది 'ఎగచు' శబ్దముక్రింద 'ఎగవఁగా' అనిన్ని "ఎసుచు" శబ్దముక్రింద 'ఎసవఁగా' అనిన్ని పాఠభేదములతో ఈ ప్రయోగమే ప్రమాణముగా కనబడుతున్నది. ఆ ఒక్కపద్యములోఉన్న ఆ ఒక్కశబ్దమే రెండువిధములా ప్రమాణమని చెప్పి రూపాంతరములు సాధించడము యుక్తమా? తాటాకు పుస్తకములలో 'ఎగవఁగా' మాత్రమే నాకుకనబడినది. కనుక నాబుద్ధికి 'ఎగచు' అకారమధ్యమని తోస్తున్నది. ఎగచి యెగచి యందు నెగయఁకుండఁబట్టె' అని నలచరిత్రము నందు నన్నయ వ్రాసిన పద్యములో 'గ' యతిస్థానమందు లేకున్నా దానివిపట్టి అకారమధ్యమని ఊహించి శ-ర-లో ఉదాహరించినారు.

ప్రస్తుతవిమర్శనకు విషయమైన "గెలుచు" ధాతువు ఉకారమధ్యమని శ. ర. లో ఉన్నది; గాని 'గెలివు' ఎందుండివచ్చినది? (శ. ర. లో. ఉన్న "గెలివి" రూపము తప్పుగాబోలు. ఇది 'ఉలివు, తెలివు' వంటిది. శ. ర. లో ప్రయోగములు దాహరించలేదు. శల్య. III. 100-క. 'ఈ గెలివేలార్చెద'-లో, గెలివు + ఏల + ఆర్చెద అనిశబ్దములరూపములు) కన్నడములో 'గెల్' ధాతువు; గెలల్, గెలవు కృదంతములు; గెలిదు క్త్వార్థ

కము; గెలువిక్కే, గెలుపు అనేరూపములుకూడా ఉన్నవి. అట్లే అరవములో "కెలి" ధాతువు. "కెలిప్" కృదంతము. ధాతువు లనేవి కొన్ని శబ్దముల రూపములు ఆధారముగా చేసుకొని లాక్షణికులు కల్పించిన ప్రకృతులుకాని సహజమైన సిద్ధశబ్దములుకావు. భాషాశాస్త్రసంప్రదాయము చెప్పిన 'కెల్' ధాతువు అనేకకారణములచేత అనేకవిధములుగా శబ్దముల రూపములు మారుతవి. ఈవిచారణ ఇక్కడ విస్తరించి చేయుటకు అనువుపడదు. ఇట్టివివిధరూపములు శాస్త్రులవారి గ్రంథములలోను వారు మెచ్చుకొన్న నాటిగ్రంథములలోను చూపించువారివలెనే బాలురపాత్తములను రచించినవారున్ను వ్రాసినారనిమాత్రము సమాధానము చెప్పవలెను. ఇవి లోకములో ఉంటే వ్యావహారికభాషలోనివి అవుతవి. ప్రాచీనగ్రంథములలో ఉంటే, ప్రాచీనాంధ్రభాషలోనివి అవుతవి. ఎందున్నూ లేకుంటే అపశబ్దములు అవుతవి. శాస్త్రులవారి ప్రయోగములు కొన్ని వర్గీకరణము చేసి చూపిస్తాను. వ్రతకల్పములోని 'తీసుకొని' (102); క. సా. లోని 'తగలఁబెట్టిరి' (21), 'నొక్కిన' (524) "పడక" (401) "ఒడిలి" (232) [శ. ర.-'వడలు' ధాతువు], ముసురుకొని (149) మఱచి (232) కడపక (195) (కడలు-ధాతువుకు ప్రేరణార్థకము) "దగ్గిర" (44, 57) జోపము* (4) అగుపడుట (8) అగుపడెను (18) అగుపడుము (30) అగుపడి (31) అగుపడుచున్నది (36) అగుపడఁగా (49) అగుపడక (56) అగుపడలేదు (56),-[ఇట్టివి 15 చోట్ల ఉన్నవి]-ఈ మొదలయినవి ప్రాచీనకావ్యభాషలో లేవు; అందులో అసాధువులు వర్తమానవ్యావహారిక భాషలో ఉన్నవి; అందులో సాధువులు, క. సా. లోని మఱవక (474) తఱిమి (426)-(గురు రేఫముగానీ లఘు రేఫగానీ) ఈ మొదలయినవి ప్రాచీనకావ్యభాషలోను, వర్తమాన వ్యావహారికభాషలోను ఉన్నవి; రెంటికిన్ని సామాన్యము. క. సా. లోని 'వెదకు' (86) బెదరించె (118)-ఈలాటివి; కేవలము ప్రాచీనకావ్యభాషలోనివి. వ్రతకల్పములోని అడగి (81) [అడిగి]

---

* ప్రతా. లో చాకలివాళ్ల భాషలో 'జోపము' ఉన్నది.

క. సా. లోని కదులని (497) వెనుక (85, 210, 327), తమవసాగెను (281) [తడవు. సమర్థకరూపము], తరముకొని (256)-పదనొకండవుపరు (374) ఈలాటివి ఎందునూపొందని అపశబ్దములు; కృతకభాషలోనివి. ప్రాచీన కావ్యభాష సెన్నగా అభ్యసించక వర్తమాన వ్యావహారికభాష గ్రామ్యమని త్యజింప నుద్దేశించి లౌకికభాషలోని శబ్దముయొక్క రూపము యథేష్టముగా మార్చి చిత్రమైన గ్రాంథికీకరణవిధాన మేర్పరచుకొని కొందరు పండితులు గ్రాంథిక భాషాభివృద్ధిచేస్తున్నారు. లోకములో దొరకదు, వెనకవలెను అనిఉన్నవి గనుక, అవి గ్రామ్యములట. అకారము తీసి ఉకారముపెట్టగానే గ్రామ్యత్వముతొలగి గ్రాంథికమయిపోతుందట! దొరుకదు (గురురేఫముంటే మరీమంచిదని దొఱుకదు), వెనుకవలెను అనికొందరు పండితంమన్యులు వ్రాస్తున్నారు. అట్టే చెప్పనేందుకు? శాస్త్రిలవారు మెచ్చుకొన్న గ్రంథములలో కూడా శబ్దరూపములు ఏలాగునమారిఉన్నవో చూస్తే భాషావేదికి ఎవరువీప్రయోగములు చేసినారో తెలుస్తుంది. శివాజీచరిత్రలో వెనుక(78) వెనకి (78) వెనుకను, దొరకను, దొఱకను, (164), వి. స. లో కరువు (118) కరిగి (152) దొరికిన (347) దొరకలేదు (379) దొరికి (617) దొరకక (619) అనుపను (558) పెరుగును, పెరగవు (657) నరికిన (657) నరకరు (657) ఆం. సా. పత్రికలో అనుపకును. (I. 67, 11, 195) ఒరిగి (I. 64) వెదుకగా (I. 67) తరవాయి (I. 46) దొరికిన (II. 26) ఆం. చ. లో అగుపించదు (I. 96) దగ్గిఱ (I. 96) క. సా. మొదటికూర్పులో 'ఒద్దికి' అనేక వేల వాక్యములలో ప్రయోగించి రెండవకూర్పులో 'ఒద్దకు' అని అన్ని చోట్లను దిద్దుకొన్నారు. ఇది అసాధువుకాదు. ఉత్తరాంధ్రకావ్యములలో తరచుగా కనబడుతున్నది. తిక్కన్నకూడా వాడిఉన్నాడు. (చూ. విరా. I. 230 ఉద్యోగ IV. 105)

"నీవు చాలాబాగా పాడుతావటే!" "పకోడీలు కరకరలాడుచు బాగానేయున్నవి." "నీకుదానిరుచి బాగానే తెలుసును" మరియొక బాల

శిక్షలో "బంధుత్వము తెలియజేసేమాటలు బాగాబోధపడ్డతర్వాత" అని మాటిమాటికి "బాగా" ప్రయోగము. ఎఫ్. ఏ. పరీక్షకుపఠనీయమైన యొక్క నాటకప్రదర్శనోద్ఘాటనువు నాటకములో అనుపమోక్తిగా ఈ "బాగా" ప్రయోగము అయిదారు మాఱులు కానింపబడినది. అంచేతిట్లుండగా అట్టి వానిం జదివి పండితులయిన వారిపాత్రములలో నిట్లుండుట యాశ్చర్యమా? అయినను "బాగాయున్నది" అని అందున్న కళాత్వమునుద్ది యుందు "బాగానే" అని ద్రుతముంచుట మేలుగదా.

ఇది అతిసులభమైన శబ్దము. "బాగుగా" లేక "బాగుగ" అని సాధుప్రకృతి, దానికి "బాగా" అని గ్రామ్యము. ఇట్టే పెద్దపెద్ద వారి గ్రంథములలో "ఆనక" శబ్దము చొచ్చినది. "అలాగా?" "అనుట" అనువానిని ఇంకను నేను ఆధునికవాఙ్మయమునం గనలేను.

విమర్శము:— 'చాలా' 'బాగా' తప్పులట! 'చాలా' శ. ర. లో లేదు; గాని, ల. నా. లో ఉన్నది; ద్విరూపకోశములోను, వేళ్ళ నానార్థకోశములోను ఉన్నవి. 'చాలక' అనగా చాలునంత, చాలునట్లు అని మొదటి అర్థముండెను. కాని, "అధికముగా" అనే అర్థము తెలియ జేయుటకు 'చాలా' అనేది అవ్యయముగా వాడుకలోనికివచ్చి మున్నూరు సంవత్సరములయి ఉంటుంది. ఇట్లే 'కూడా' (కడ) 'తేరా' 'నోరారా' 'తీరా' 'ఇంకా' 'అంతా' 'తిరిగీ'—మొదలయినవి భాషలో పరిణమించినవి. దీర్ఘముచేత అర్థవిశేష మేర్పడుతుంది. 'ధనముకూడబెట్టు' 'ధనముకూడా పెట్టు'—ఈ రెంటికిని ఒక్కటే అర్థముకాదు. 'చాలా యభివృద్ధి (ఆం. పత్రిక పుట 8. 10-1-23), కూడ యుండవలయును (ఆం. ప. పు. 10; 10-1-23)—ఇవి తప్పులు. దీర్ఘముమాని హ్రస్వమునాడితే శబ్దార్థముమారి వ్యవహారహాని సంభవిస్తుంది. వ్యవహారసౌకర్యముకోసమే భాష ఉన్నది. వ్యవహారమునకు హానికలిగించే భాష ఒక్కనిరర్థకమేకాదు. అనర్థకముకూడా అవుతుంది. మరి చర్చించకుండా ప్రసిద్ధకవుల ప్రయోగ

ములు ఉదాహరిస్తాను. అనిరుద్ధచరిత్రము (ii 83), ఇందుమతీపరిణయము (iii. 40) కుచేలోపాఖ్యానము (III. 75), కవికర్ణరసాయనము (IV. 164), గంగాగౌరీ సంవాదము (పు. 17), దశావతార చరిత్రము (పు. 47), ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము (పు. 27), ప్రభులింగలీల (పు. 21), బసవపురాణము (పు. 102), రామస్తవరాజము (పు. 35), వాసిష్ఠ రామాయణము (కొ. ప్రతి XII. 12, 78, 88), వేంకటేశ్వరమాహాత్మ్యము (159), అప్పకవీయము (1859 సం. మొదలు ముద్రించినవారిప్పలున్నట్టు IV, పుటలు 165-188 లో ఎనిమిదిచోట్ల), విజయవిలాసము [వెంపటివారిప్ప III. 56), రంగరాయచరిత్రము ♦ (II. 48, 148), కవిరాజమనోరంజనము (పు. 87)—వీటిలోనే కాక శతకములలోను, దీక్షసలలోను, అనేక ప్రయోగములున్నవి. టీకలలోను, వచనగ్రంథములలోను అపరిమితముగా పండితులు వాడినారు. పరవస్తు శ్రీనివాసాచార్యులవారు సర్వశబ్దసంబోధినిలోను, రంగాచార్యులవారు శ్రీనివాసనిఘంటువులోను 'చాలా' శబ్దము వాడినారు. మనశాస్త్రులవారు 'చాలా' శబ్దము ప్రయోగించినట్టు నాకు ఎక్కడా కనబడలేదు, గాని, వారు మెచ్చుకొన్నవి. స. లో 'చాలాభాగము' (పు. (428), 'చాలాయుగములు' (450) 'చాలాయెత్తు' (470) ఉన్నవి. సంపాదకులు మ॥ కొ. వెం. లక్ష్మణరావుగారు రచించిన హిందూదేశచరిత్రలో మహమ్మదీయయుగమందు 'చాలామారము' (238) ఉన్నది. ఆంధ్రసాహిత్య పరిషత్తువారి పుస్తక భాండాగారాధికారి మ॥ క్రొ. సూర్యనారాయణరావుగారు 'ఫసానే అయూజబ్' అనే గ్రంథములో 'చాలా' ఇరవై అయిదు చోట్ల వాడినారు. అన్నట్టు చెప్ప మరచినాను.

♦ "శా. ఆమాటల్ విని......చా
లాముఖ్యంబుగ......" అని

లాయతిస్థానమందున్ను 'ము' ప్రాసస్థానముందున్ను ఉన్నవి. 'చాలన్' అని దిద్ద వాటముకాదు.

ఆంధ్రపండితోత్తములు శ్రీ సూర్యారాయ బృహదాంధ్ర నిఘంటు సంపాదకులు ఆంధ్రపరిషత్ ప్రతిష్ఠాపకులు మ॥ జయంతి రామయ్యపంతులుగారు తమ ముక్త్యాకశతకములో "క. చాలా లాభముగోరినఁ, గేలఁ గలదిగూడ వెచ్చించఁగవలయుఁగా" (55)అని వ్రాసినారు. ఆంధ్రపరిషదధ్యక్షులు, ఆంధ్ర కాళిదాస బిరుదాంకితులు అపరిమితముగా ఆంధ్రగ్రంథములు రచించినవారు మ॥ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు సారంగధర నాటకములో సారంగధరునివాక్యములందే వాడినట్టు మూడు తూర్పులలోను కనబడుతున్నది. అప్పకవికి పూర్వమునుంచిన్ని లోకములో ఉన్నట్టిది, ద్విరూపకోశములో సంపదరపు వేంకటకవి చాలాకాలము క్రిందటనే చేర్చినట్టిది, లక్ష్మీనారాయణీయ మనే కోశములో 16 ఏండ్లయి ఉన్నట్టిది, కావ్యములలో ప్రాచీన కవిపుంగవులు ప్రయోగించినట్టిది, ఆంధ్రసాహిత్య పరిషదధ్యక్షులు వాడుకున్నట్టిది, బృహదాంధ్ర నిఘంటు నిర్మాతలంతటి ప్రఖ్యాతపండితులు స్వకీయకావ్యమందే ప్రయోగించినట్టిది, సాధుశబ్దము కాదనుటకు కారణమేమిటి? ఇప్పుడు తాము నిర్మిస్తూఉన్న బృహదాంధ్ర నిఘంటువులో దీనిని నిర్మాతలు చేర్చుకోకపోతే ఈ శబ్దము వాడుతూఉన్న ఆంధ్ర లోకమునకు, దానిని ప్రయోగించిన ప్రాచీనకవులకు, దానిని కోశమందు చేర్చిన పూర్వకోశకారులకు, ఆంధ్రసాహిత్య పరిషత్తుకు, దాని అధ్యక్షులకు, వీరందరితోపాటు తమకున్ను, యెంత అగౌరవముగా ఉంటుందో ఆలోచింతురుగాక! లోకమంతు సార్వత్రికమై భూరిప్రయోగమహిమచేత సాధువయిన శబ్దములు విడిచి లోకములోగాని, ఆంధ్రసారస్వతమందుగాని, లేనిశబ్దములు వేనవేలు సంస్కృతకోశములోనుంచి యెత్తుకొనివచ్చి చేర్చినందువల్ల నా శ్రీ సూర్యారాయ బృహదాంధ్రకోశముయొక్క బృహత్త సార్థక మవుతుంది? 'బాగా' తప్పుకాదు. శిష్టజనవ్యవహారమం దున్నది. బ్రౌ. ని. లో ఉన్నది. "నాతాత్మజునికి బాగా తెలుసురా" అని త్యాగరాయలు పాడిన పాటలో వినబడుతున్నది. బాగుగా-బావుగా బాఁగా

బాగా బాగ అయినది. దీనిలో ఉచ్చారణ సౌకర్యము కనబడుచున్నది. పోవడు, పోదు; తటాలున, తటాల్న, తటాన అని కవులు వాడినారు. చక్కా (చక్కగా) అని వాడుకలో ఉన్నది. "నీ తండ్రి బాగున్నాఁడు" అని సులభవ్యాకరణమందు వా. సుబ్బారావుగారు ఉదాహరణగా ఇచ్చి నారు. (మా. III. పు. 14) బాగున్నాడు = బాగ (బాగా-బాగుగా) + ఉన్నాఁడు. వి. స. లో "బాగుండుము" (పు. 1526) అని ఉన్నది. "వానిని గ్రద్దల కేసెద" అని ఉ. హ. లోను (పు. 52) "వదలిపోవు" కు మారుగా 'ఒడిలిపోవు' అని క. సా. లోను (పు. 232) వ్రాసినవారికి ఇది తప్పుగా తోచినదేమి? 'అలాగే' 'ఏలాగున్నది' మొదలయినవి పండి తులు అపరిమితముగా వాడుచున్నారు. 'అలాగే' క. సా. లో ఉన్నది (పు. 11, 30, 74). ఇది 'అలాగుననే' అని ఉండవద్దా? 'ఆనక' అనేదే కాదు 'ఆక' అనేదికూడా గ్రంథాలలోని కెక్కినది. మ॥ దేవులపల్లి రాజ గోపాలరావుగారి లలితలో 'ఆనక ప్రమాదము వచ్చును' అని 121 వ పుట లోను 'అన్ని సౌభాగ్యాలు అయినాకనే' అనిన్ని 'ఈ పెద్దాపురం చేరాక' అనిన్ని 129 వ పుటలోను ఉన్నది. '"అలానా?" అనేదానిని ఇంకను ఆధునిక వాఙ్మయమునం గనలేదు' అని శాస్త్రులవారన్నారు. ఆధునికము మాటకేమి? ఆధునికగ్రంథములు గ్రామ్యదూషితములని వారు వాటివైపు చూడనైనా చూడరు. పూర్వకవుల కావ్యములైనా వారు తిన్నగా చూచి ఉన్నట్టు కనబడదు. దశావతార చరిత్రలో 'శా. ఈలాంగూలము గేలఁ బూని లయకాలేశానుచందంబునన్' అని ఉన్నది. (ఆ. 4. పు. 130) భారతమునందున్న 'నేరనయ్యోదను' వంటిప్రయోగములు కొక్కొండ వేంకటరత్నముపంతులుగారు ప్రయోగిస్తే తప్పులని ప్రసన్నరాఘవవిమర్శ ములో చెడనిందించినవారికి ప్రాచీనాంధ్రవాఙ్మయము సుపరిచితము కాదనక తీరదు. "ఏలాటి" అనే శబ్దము తప్పని మ॥ వావిలికొలను సుబ్బా రావుగారు సులభవ్యాకరణములో వ్రాసినారు. అప్పకవి ఈశబ్దము వాడి నాడు. వేంకటరాయశాస్త్రులవారే అనంతవ్రతకల్పములో "ఆవృమభ

మేలాటిది ?" (మా. 67) అన్నారు. ఆంధ్రసాహిత్యపరిషత్ పత్రిక (IV, 50) లో "ఏలాటిది" ఉన్నది. ఒకరికి సాధువయినది మరిఒకరికి అసాధువు. అంతాపండితులే! అంతా విమర్శకులే! వారిలో వారికే వివాదములు పుట్టినప్పుడు ఎవరిమాటలు లోకులు పాటించవలెనో తెలియదు. ప్రాచీనాంధ్రవాఙ్మయము బాగాచదువుకోని వారికి ప్రాచీనాంధ్రభాషా లక్షణము సంపూర్ణముగా ఏలాగున తెలుస్తుందో! అట్టివారు ఆంధ్రభాషా విమర్శకులయి, నోటికివచ్చినట్లూ ఇదితప్పు అదిఒప్పు అని కారణము చూపించకుండా ధూంధాం అని బూకరిస్తే వీరిభేషజాలుచూచి సామాన్య జనులు మోసపోతారు. బుకాయించగల పెద్దపండితులు చెప్పినదానిలో తప్పొప్పులు తెలిసికోగలవా రరుదు. అది చూపించుటకు చిన్న పండితులు మొగమాటపడతారు. ఎవ రేమన్నా, సామాన్యులు నోరుమూసికొని ఊరుకో వలసినదే. ఇట్టిదా దేశభాష? లౌకికభాష? తెలుగువారి మాతృభాష?

'ఆముసు' తప్పుకాదు. ఆమ్ + అసు. 'ఆమ్' చాలా ప్రాచీన శబ్దము; 'ఇగురు' అని అర్థము; అరవములోను, కన్నడములోను ఉన్నది.

"కూర్చుండు ధాతువునకై కొందఱు పడినపాట్లు పరిహాసనీయములే గాక అనుశోచనీయములుకూడ నైయున్నవి:—కూర్చుని, కూర్చొని, కూర్చున్న, కూర్చొన్న, కూర్చున్నాఁడు, కూర్చొన్నాఁడు. ఇత్యాది బహురూపములను ఒక్కకవియే ప్రయోగించియున్నాఁడు. I have a house అను వాక్యమునకు తెనుఁగునేర్పిన శిశుబోధకుఁడు తొట్టతొలుత కలుగు ధాతువును సకర్మముఁగావించినాఁడు. "I నేను, a house ఒక ఇంటిని, have కలిగియున్నాను," అతనియుపదేశము. ఆసాంప్రదాయమున సకర్మకత్వము నాటకాంతము వ్యాపించినది. ఆధునికవాఙ్మయము నుండి ఎన్ని ప్రయోగముల నేని యుదహరింపవచ్చును. బడిపుస్తకములలోను సమృద్ధిగానే కలవు. మూఁడవ తరగతిపాఠపుస్తకమున (Third class

Reader - Marsden's) 24 వ పుట, "కిటికీలను గొన్నిటినిమాత్రమే కలనై యుండును."

విమర్శము: 'కూర్చుని' 'కూర్చొని' 'కూర్చొనెను' 'కూర్చో' 'నిలుచో' 'ఊరుకో' ఇటువంటివి ప్రాచీనభాషలో లేవు. వర్తమానవ్యావహారికభాషలో దేశమందు అంతటా ఉన్నవి. ఆధునికకవులు కావ్యములలో వాడినారు; వాడుతున్నారు. 'క్షేమజకల్పకము' అనే వైద్యగ్రంథములో "మ.... ప్రాఙ్ముఖుం బునుదగ్వక్త్రిమునైన గూర్చుని..." (ఆ. 4. ప. 13) అని వ్రాసిన కవి మొదటివాడు కాబోలు. మిక్కిలి ప్రఖ్యాతిపొందిన మహాకవి మల్లి నృసింహావిద్వన్మణులచే 60 ఏండ్ల క్రిందట దుందుభి సం. లో ప్రణీతమైన చెన్నపురీ విలాసమున 43 వ పుటలో "చ....పట్టులుగొని దారుపాళి పయిగూర్చుని వ్రాయుచు..." అనిఉన్నది. నారపరాజు కాంతకవి రచించిన కవిజనచకోరచంద్రోదయమునందు "కూర్చొని" పదమూడుచోట్ల ఉన్నది. శ్రీ వెంకటగిరి మహారాజావారి ఆస్థానకవీశ్వరులు గోపీనాథ వెంకటకవిగారు కృష్ణజన్మఖండమునందు "క. వదలక కూర్చుని ప్రొగ్గిరి" (పు. 120) అనిన్ని, "చ...కొలువయి రత్నపీఠమునఁగూర్చునియుండెగ..." (పు. 120) అనిన్ని వ్రాసినారు. ఆంధ్రసాహిత్యపరిషదధ్యక్షులు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు నర్మదాపురుకుత్సీయములోను (రెండవకూర్పు పు. 119), సారంగధరనాటకములోను (3 వకూర్పు పు. 31) "కూర్చుని" మాత్రమేకాక "నిలుచుని" కూడానర్మదాపురుకుత్సీయములో (పు. 136) ప్రయోగించినారు. ఊరకొనుము, ఊరుకొమ్ము అనికూడా దానిలోనేఉన్నవి. అముద్రితగ్రంథచింతామణి (1896, పు. 107) లో పత్రికాధిపతులు "తిక్కన సోమయాజిగారు కూర్చొనిభారతమువ్రాసిన స్థలము" అని స్వయముగావ్రాసివారు. విజ్ఞానచంద్రికాగ్రంథమాలలోని పుస్తకములందు తరచుగా ఈశబ్దములు కనబడుతున్నవి. వ్యవసాయశాస్త్రము (II. పు. 240, 241) లో "కూర్చుని" చంద్రగుప్త చరిత్రములోను, లిం

కనుచరిత్రము (148, 154) లోను "కూర్చొని" మ॥ కట్టమంచి రామలింగారెడ్డిగారుకూడా అర్థశాస్త్రము (పు. 150, 189, 203) లో కూర్చొని 'కూర్చొనవచ్చును' అని వ్రాసినారు. వి. స. లో "వృక్షమూలమునకూరుచొని" (పు. 270) 'కూర్చొనిన' చోటనే (పు. 509) 'కూర్చొని'(707); ఆంధ్రపత్రికలో ప్రతిదినమున్ను 'కూర్చుని'గాని 'కూర్చొని'గాని కంటబడుతూనేఉంటుంది. ఆంధ్రపత్రిక సంపాదకీయవ్యాసములందు(2-1-23: పు. 7; 8-1-23: పు. 9) 'కూర్చొని' దుందుభి సం. ఉగాదిసంచిక (పు. 193) పద్యములలో 'కూర్చొనె' వచనములో 'కూర్చుని' (పు. 227) వందేమాతర ప్రచురణములలో తరచు రామదండులో 'కూర్చొని' 'కూర్చుని' మహాత్మాగాంధి ఆరోగ్యదర్శినిలో 'కూర్చొనుటకు' (13) కూర్చుని(24) కీర్తిశేషులయిన మ॥ గురుజాడ వెంకటప్పారావుపంతులుగారు 'కూచుని' అని ఒక కావ్యములో ప్రయోగించినారు. పాటలలోను, పదాలలోను కీర్తనలలోను దేశమంతా 'కూర్చుని' 'కూర్చొని' 'కూచుని' అనిఅంటూ ఉన్నారు. సార్వత్రికమైనదానిని మనశాస్త్రులవారు గ్రామ్యమని నిందించి రూపుమాపగలరా? గ్రామ్యభాషను నిర్మూలింపవలెనని దీక్షపట్టినవారే చాలాధనమువెచ్చించి 'ఇట్టిగ్రామ్యము' గల గ్రంథము అచ్చువేయించి గ్రామ్యము వ్యాపింప చేసినవారయినారు. ఆంధ్రసాహిత్య పరిషదధ్యక్షుల నాటకములనిండా కావలసినంత గ్రామ్యమున్నది.

"కలుసు" ధాతువు సకర్మకమనికూడా శ. ర. లో ఉన్నది. పండితు లనేకులు అట్లేనమ్ముతున్నారు. వి. స. లో "గ్రామములను పల్లెలను గలిగియుండును" (పు. 486). గ్రామములలక్షణములనే కలవియై (పు. 1330) 'అధికారమునే కలిగియున్న దేశముఖులు' (పు. 1365). ఇంకా అనేక ప్రయోగము లిట్టివి ఉన్నవి.

భాషాభేషజము.

ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజము

———:o:———

ముందుమాట

[“భాషాదేవికి ఆధునిక వాఙ్మయమువలనం గలిగిన యీవాపును ఇంకను శివధాతువుండఁగానే పండితభిషక్కులు కలిసి యాలోచించి తగిన మందులచే తొలఁగించి ఆరోగ్య మొసంగుదురు గాక యని మదీప్సితము” అని బ్ర. శ్రీ. వేదము వేంకటరాయశాస్త్రులవారు ఆంధ్రసాహిత్య పరిషద్వార్షికోత్సవసభలో అధ్యక్షులుగానుండి హెచ్చరించినారు. (మా. ఆం. సా. పత్రిక. VIII. పుట 92.)

మా ఉపదేశము ఏమిటంటే:—ఇద్దరు భాషాదేవు లున్నారు. వారిలో నొకతె లౌకిక భాషాదేవి. ఆయమ్మకు రోగ మేమీ లేదు. పెద్దల యిళ్లే ఆయతనముగా చేసుకొని, వారి నోటిమాట మీరకుండా ప్రవర్తిస్తూ అందరితో కలసిమెలసి, హాయిగా ఆడుతూ, పాడుతూ ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధి కలిగి, కులుకుతూ ఉన్నది. ప్రత్యేకముగా తమకోసమే పండితులు ఉంచుకొన్న భాషాదేవమ్మగారు, ప్రబంధబద్ధయై, ముసుగు వేసుకొని శుద్ధవాయువు, వెలుగులేని చీకటి గదిలోనే పడుండి వ్యాయామము లేక, వింతవింతరోగాలెన్నో తగిలించుకొని, ఎప్పుడుచూచినా మూలుగుతూ ఏక్షణమో ఏగడియో అన్నట్టు ఉంటారు. ఆయమ్మగారి రోగాలు పండిత భిషక్కుల భేషజాలవల్ల కుదిరేవికావు. వీరి భేషజాలవల్లనే కొన్ని రోగాలు పుట్టినవి, వాటివల్లనే అవి ముదిరినవి. అవి కుదరకపోవడమే కాక కొత్తరోగాలుకూడా పుట్టుతున్నవి. పండితభిషక్కుల నిదానము

తప్పినవి. ఈరోగాలకు ఒకటే చికిత్స. ముందుగా వివేచనాలకు మందిచ్చి అజీర్ణపదార్థాలు తొలగించి, లౌకిక భాషాది సంసర్గంలో పండిత భాషా దేహిని ఉంచితే, ఆమె పెట్టే పథ్యపానాలచేతను, చేసే ఉపచారముచేతను, రోగాలు కుదిరి ఈ భాషలుగాను ఆరోగ్యసంపన్నాలు కాగలవు. లౌకికభాషా దానితో కలసి ఉన్నంతకాలము పండితుల భాషగాను ఆరోగ్యము గలిగి బ్రతుకుతాయి. వారిపరస్పర సంబంధము తెలియక, పండితభిషక్కులు చేసే భైషజ్యము వ్యర్థమవుతున్నది. గనుక భాషాశాస్త్రము తెలుసుకొని, భాషారోగములకు భాషాభిషక్కులు భైషజ్యము చేస్తే కృతకృత్యులవుతారు. <u>నాన్యఃపంథావిద్యతేఽయనాయ. ఓం. శాంతిః శాంతిః</u>"].

I. లౌకికభాష శిష్టజనవ్యవహారసిద్ధమయినది గనుక పూజ్యమేగాని ఎంతమాత్రమూ నింద్యము కాదని మామతము. శిష్టజన వ్యవహారసిద్ధమయినా లౌకికభాష గ్రామ్యమే అనిన్ని, గ్రంథములలో వాడుటకు తగినది కాదనిన్ని కొందరు వాదిస్తున్నారు. అయినను వాదించేవారి మతము మా మతమునకు విరుద్ధమయినది గనుక వారితో మాకు విరోధము కలిగినది. వారివాదమును మేము ఖండించుటకు పూనుకొన్నంత మాత్రముచేత వారియెడల మాకు గౌరవము లేదని తలంచ గూడదు. మాకు మిత్రులున్ను పూజ్యులున్ను అయిన పండితులతోనే ముందుగా మేము వాదించవలసి వచ్చినది. మా మతము గ్రాహ్యమని ప్రతివాదులనేకులు ఒప్పుకొన్నారు; ఒప్పుకోని వారు ఇంకా అనేకులున్నారు. అందరినీ మామతములోనికి తిప్పవలెననే మా అభిలాష. అందుకై ప్రయత్నము చేయడము మాత్రమే మావంతుపని. దురభిమానము దురహంకారముగలవారు సత్యము ప్రత్యక్షమయినా ఒప్పుకోరు; అట్టివారు మా మతము నిరాకరిస్తారని మేమెరుగుదుము. మా ప్రతివాదులలో కొందరు సరళహృదయులున్నారు. వారియెడల మాకు చాలా గౌరవము కలదు. అట్టివారిలో కొందరితో సంభాషణకోసమై అభియోగము చేయడము తగిన ఉపాయముగాతోచి ఈవ్యాసము వ్రాస్తున్నాము. పెద్దలతో

అభియోగము అభిప్రాయప్రాధాన్యకము గనుక ఒక్కొక్కరినిగూర్చి వ్రాసినగ్రంథమొక్కొక్క అభియోగముగా విభజిస్తున్నాము.

2. మా అభియోగవిధానము వివరిస్తున్నాము. ప్రతివాదులు తమ తోడి పండితులభాషలలో ఏదోషములు చూపించినారో ఆదోషములుగాని అట్టివిగాని లౌకిక భాషాలక్షణానుసారముగా ఉంటే, అవి దోషములు కావని సాధించడము మాపని. అవి నాయెడపండితులు ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా, మా మతములో నివారితే అవుతాయి. ఇతరులగ్రంథాలలో తప్పులుగా తాము ఎంచిన శబ్దములు తమగ్రంథములలో కూడా కనబడినప్పుడు తాము తప్పులు వ్రాసినవారయి, “గ్రాంథికభాష” లెస్సగా రానివారని పించుకొంటారు. మా ప్రతివాదులు “గ్రాంథికభాష” తప్పులులేకుండా వ్రాయలేరు అని సప్రమాణముగా సిద్ధాంతము చేయబూనుకోవడములో దురుద్దేశము ఏమీ లేదు. నిజము చెప్పవలెనంటే? బహు జాగ్రత్తగా పరిశీలించి చూడగా, “లాక్షణికులు”, “పండితులు” అనే అభిధానములు గల వారందరూ నిర్దుష్టమని ఐకమత్యముగా అంగీకరించదగిన గ్రంథము ఒకటీ నేటివారు వ్రాసినవాటిలో మాకు కనబడలేదు. ఒకరికి సాధువయినది మరి ఒకరికి అసాధువు. ఎవరిమాట ప్రమాణము? ఇక, ప్రాచీనభాషలోని శబ్దములు తిన్నగా వాడలేకపోయినా, తెలియక తప్పు లనుకొని వాటిని దూషించినా ఎంత పండితుడైనా, గ్రాంథికాంధ్రము రానివాడవుతాడు. ప్రాచీనులువాడని ఉత్తరాంధ్ర శబ్దములు వాడినవాడు కొత్త తెనుగు వ్రాసినవాడు కాకపోడు. ఉత్తరాంధ్ర కవుల గ్రంథములలోని ప్రయోగములు కొన్ని తాము ప్రమాణముగా అంగీకరించి, తక్కినవి ప్రమాణము కాదనడము ఎవరికీ న్యాయ్యముకాదు గదా. వృద్ధాచారము ప్రకారము అభియోగము నడుపుతాము. పెద్దలు అనుమతింతురు గాక.

అభివాదనము I.

బ్ర. శ్రీ. వేదము వెంకటరాయశాస్త్రులవారు I. I.

3. వీరు తెలుగు పండితులలో అగ్రగణ్యులు. 'అభినవవాగనుశాసను'లని, 'ఆంధ్రమల్లినాథు'లని, 'శ్రీమన్ మహోపాధ్యాయు'లని వారిపాండిత్యమందభిమానముగల వారిచేత పొగడ్తగన్నవారు; చాలాకాలము కళాశాలా పండితులుగా ఉన్నవారు; అనేక గ్రంథములు రచించినవారు; శృంగార నైషధమునకు సర్వంకష వ్యాఖ్య వ్రాసినవారు, లక్షణజ్ఞులు, విమర్శకులు; ఆంధ్రమే కాక సంస్కృతము ఇంగ్లీషు ఇంకను మరికొన్ని భాషలలో పాండిత్యము సంపాదించినవారు. ఇంతటివారి తెలుగుభాషలో తప్పొప్పులు నిరూపించడమునకు మావంటివాళ్లు పూనుకోవడము అతిసాహసముగా కనబడు నేమోకాని, నిశ్చయముగా మాపూనిక నెరవేర్చుకొనేటందుకు తగిన ఉపాయములు, సాధనములు, ఈ శాస్త్రులవారే మాకు సమకూర్చినారు. ఏలాగంటే:—

4. తమవలెనే కాలేజీపండితులుగా ఉండి, తమవలెనే అనేకగ్రంథములు రచించి, తమవలెనే కవులని, విద్వాంసులని విఖ్యాతిపొందినవారి భాషలో అనేకదోషములు చూపిస్తూ వారిగ్రంథములు ఈశాస్త్రులవారు విమర్శించి ఉన్నారు. అవి మేము చదువుకొన్నాము. ఇతరుల గ్రంథాలు దుష్టప్రబంధములని స్థాపించడమునకు వాటిలో ఏవి దోషములుగా నిరూపించి ఈశాస్త్రులవారు నిరాకరించినారో, ఆదోషములు ఈ శాస్త్రులవారి గ్రంథములలో ఉన్నప్పుడు అవి వెదకిచూపించడము కష్టమయినపని కాదు. ఆదోషములను బట్టి శాస్త్రులవారి గ్రంథాలు కూడా దుష్టప్రబంధములని సిద్ధాంతము చేయడము సాహసమెందుకవుతుంది? అప్పుడు జంకు కళంకు లేనికవిచంద్రులమని విద్వద్వతంసులమని చెప్పుకొన్న శాస్త్రులవారు కూడా ఇతరులతో కలిసి ఏకరాశిలో చేరుతారు. వారి గ్రాంథికాంధ్రభాషా

పాండిత్యము, కేవలము మిథ్యఅనిన్ని, పామరులను మోసపుచ్చుటకు పన్నిన కైతవము అనిన్ని, తెలుసుకొని వివేకము కలవారు దానికోసము దేవులాడరు. మృగతృష్ణలోని నీటికోసము వృథాశ్రమపడక సర్వజన సామాన్యమయిన జలాశయము చేరి దప్పి తీర్చుకొని సుఖిస్తారు.

5. ఈ శాస్త్రిలవారు 1898 సం. లో అద్భుతమైన గ్రంథ మొకటి రచించి ప్రకటించినారు. దాని పేరు "ఆంధ్రప్రసన్న రాఘవవిమర్శము" ఆంధ్రప్రసన్నరాఘవమనే గ్రంథము తెలుగు తర్జుమా. సంస్కృత ప్రసన్న రాఘవము తెలుగులోనికి తర్జుమాచేసినవారు కీర్తిశేషు లయిన కొక్కొండ వేంకటరత్నముపంతులవారు; మహామహోపాధ్యాయులు. ఆంధ్రభాషా సంజీవనీ పత్రికాధిపతులు, నలబైయేండ్లు కాలేజీ తెలుగుపండితులుగానున్న వారు. అనేక గ్రంథములు రచించినవారు. తమవంటి పండితులు ఇంకొకరు లేరనిపించుకొన్నవారు. "సలక్షణమైన తెలుగు భాష', సుళువుగా వ్రాయడమేకాక, నిరాఘాటముగా మాట్లాడడము నేర్చినవారట. నిత్య వ్యవహారములో ఇంటివద్దనుకూడా "సలక్షణమైనతెలుగే" వాడుట ఆయనకు అలవాటట. "సలక్షణమైన తెలుగుభాష"కు ఆయనగ్రంథములే కాక ఆయన నోటిమాటలే ఆదర్శమట. లౌకికభాష గ్రామ్యమని (సంపంగిపువ్వును తుమ్మెదనిందించినట్టు) పంతులవారు పరిత్యజించి నారట. నాటకములలోనయినా, అత్యధమ పాత్రల వాక్యములందైనా గ్రామ్యభాష వాడకూడదన్నారట. వేంకటరాయశాస్త్రిలవారి నాటకములో అట్టివాక్యములలో గ్రామ్యము ప్రయోగించడము దోషముగా పంతులవారిబుద్ధికితోచినది. ఆకాలములో గ్రామ్యద్వేషులందరూ శాస్త్రిల వారిమీదికి దండెత్తివచ్చినప్పుడు, వారికి పంతులవారు కన్నాకుగానుండి శాస్త్రిలవారితోను వారిపక్షమువారితోను ఘోరయుద్ధము జరిపినారు. ఆరు సంవత్సరములక్రిందట సాహిత్యపరిషత్తువారు రాజమహేంద్రవరములో

సమావిష్టులయి సభచేసినపుడు ఈపంతులవారు అధ్యక్షులుగానుండి మాబోంట్ల నందరినీ గ్రామ్యవాదులని నిందించి, బడులలోను సభలలోను పండితులు కూడా "గ్రామ్యభాష" 'మాట్లాడడము మిక్కిలినింద్య'మని నొక్కిచెప్పి తమవలె సదాసలక్షణముగా అందరూ మాట్లాడడము నేర్చుకోవలెనని ఉప దేశించినారు.

6. ఇంతమట్టుకు వేంకటరత్నముపంతులవారిని ఎందుకువర్ణించవలసి వచ్చినదంటే, సలక్షణభాషాభిమానమున్ను గ్రామ్యద్వేషమున్ను వీరియందు మూర్తీభవించినవి గదా; ఇట్టి పండితుల గ్రంథములో 2568 తప్పులున్న వట! వేంకటరాయశాస్త్రిలవారు వరసగా జాబితా వ్రాసి అంకెలు వేసి చూపించినారు. రెండుకోట్లమంది తెలుగువారున్నారు. వెంకటరత్నము పంతులవారివంటిపండితులకే స్వాధీనముకాని "సలక్షణగ్రాంథికాంధ్రము సర్వజనసామాన్యమయిన దేశభాష ఎప్పటికైనా కాగలదని ఆశపడుటకు అవకాశలేశమైనా ఉన్నదా? మాబోంట్లను గ్రామ్యులని తిట్టిన పంతుల వారినే గ్రామ్యులను చేసినారు శాస్త్రిలవారు! చూడండి, ఆంధ్రప్రసన్న రాఘవవిమర్శగ్రంథముయొక్క అవతారికలో విమర్శకులయిన శాస్త్రిల వారు ఏమని వ్రాసినారో:—

'ఈ కాలములో ఆంధ్రభాషలో ప్రబంధములు పెచ్చుపెరుగు చున్నవిగదా. వానిలో అనేకములవలన భాషకు కడుంజెట్ట కలుగుచుం డుటంగాంచి ఏదే నొకగ్రంథ మాధారముగా నీచెలుపునెల్ల విద్యార్థి జనోప యోగముకై, భాషారక్షకై, వెల్లడిసేయం దలంపు గొన్న వాఁడనై, అట్టి యిప్పటి గ్రంథములలో నెల్ల మ.రా.రా.శ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులవారు రచియించిన యాంధ్రప్రసన్నరాఘవము నా యుద్యమమున కత్యంతోపయుక్తముగా నున్నందున దానిని విమర్శింప దొరకొంటిని... ఛందో వ్యాకరణాలంకారముల కిదివేరుపురువు...రసము సున్న. పూర్వులు

చెప్పిన పాకము లిందు లేవు. గ్రచ్చకాయపాకము, మేడిపండు పాకము, ముసిఁడి పండుపాకము, దృష్టిపిష్టతపాకము...ఇత్యాదులుకలవు...అలంకార శాస్త్రమునఁ జెప్పినదోషములలో ఇందులేనిదిలేదు. అందులేనివి ఇందెన్ని యేని గలవు...సావధానముగా తత్త్వమరయు వారు వీరికి సంస్కృతము తెలియదనియు, దేవనాగరలిపి తెలియదనియు, నాటక లక్షణము తెలియనే తెలియదనియు, ఆంధ్రభాషకు వీరు విషము పెట్టినారనియు ఇతరుల గ్రంథముల గుణదోషములను చర్చించుటకు వీరు అధికారులు గారనియు, వీరి మతముచే భాష చెడుచున్నదనియు, గ్రహింతురు. అయినను సామాన్యముగా జనులు పరప్రత్యయనేయబుద్ధులు; తెలిసినవారును పత్రికలయందు రాఁగల దూషణలకు భయపడియు, నిజస్తుతి యొనగొనియు, 'అస్మైతే మాభాగా యేదన్నమమ' మర్యాదగా ఆత్మాభిప్రాయములం బ్రకటింపరు. ఇందువలన భాష చెడిపోదా? కావున, ఇన్ని దోషములుగల దగుటచే ఈ గ్రంథము బుద్బుదప్రాయముగా లయ మొందఁగలదియయ్యైనను, ఆంధ్ర భారతి కటాక్షము వడయువాఁడనై, జయదేవకవికి ఈ తెలుంగు వలనం గలిగిన చెట్టందొలంచుటకై యీవిమర్శారంభముం జేసినాడ.'

8. శాస్త్రులవారు వ్రాసిన విమర్శగ్రంథమంతా మొదటినుండి కొన వరకూ, 324 పుటలున్నూ చదివితేనేగాని ఈ అద్భుతవిమర్శ స్వారస్యము తెలియదు. అయినా కొన్ని వాక్యములు ఉదాహరించి మచ్చు చూపిస్తాము. (ఆ వాక్యములు ఏపుటలోనివో తెలియుటకు పుట సంఖ్య చేర్చినాము) పంతులవారి తెలుగు చక్కనిదికాదని విమర్శకులకు తోచినప్పుడు ఎంత సరసముగా దోషము నిరూపించి ఉద్ఘాటించినారో చూడండి:—

9. 'నోకంబద్దు తెలుగు' (69,79,80,105,120,122,143.276) గార్డెన్ టుకమ్ తర్జుమా (54) హాటెంటాడ్ భాష (73,80,84,131) అసంబద్ధప్రలాపము (282) మదరాసు తెలుఁగు (80) చెన్నపట్టణపుఁ దెనుఁగు (89) అటవ

తెలుఁగు (227) గుజరాతీపేట తెలుఁగు (218) అరబ్బీ మంత్రపారాయణము (82) అసహ్యము (116) దగ్ధపటలము (281) రోత (301) తడఁగడతోక్స (142) చెత్త (21) లొటలొట (251) చచ్చుదు (264) మునిసిపాలిటీవారికి (216) వేసినఅడుగెల్ల ఎంగిలాకులోనే పడవలయునా? (249) ఇట్టి చేతకాని కవనమెవరు చెప్పుకొమ్మన్నారు (314) వాణికి ఓకలింత (12) వీధిలో పారవేయవలసినది (15) బెంకాయపచ్చికొండ (7,110,182) అర్ధమేడ్చినట్లున్నది (97,304) ఏమి యీచేయఁగల విన్నపముల కవనము (162) పంతులవారు స్వారస్యవినాశన ధ్వజ ప్రతిష్ఠాపనాచార్యులుగారు (105) లక్షణనిర్వాహము పీఁచురేఁగుచున్నది (111) ఎవ్వరికేని చూపుకొని యుండరాదా (122) విద్యార్థులతోఁ కలిసి చదువరాదా (171) కవితా తత్త్వవిత్ప్రికాండకుల మని ప్రగల్భింతురు. అజ్ఞులును నమ్మెదురు గతానుగతికులు ఘోషింతురు (16)ఏం శేతూ నేం శేతూనే అని యేడ్చినట్లున్నది (70) నన్నుఁ బెండ్లాడవే చెంచీత నీకు బహుపున్నెముంటదే చెంచీత అని చెంచితపాట సరణిం బురణించుచున్నది (253) ఆంధ్రభాషావధూటిని కడుపార విషము త్రాగించి సంజీవనమువేయుటగాదా? 164) మున్ను తిక్కన శ్రీనాథులు ఆంధ్రీకరించిరి, ఇప్పుడు ఇట్టియ నేడమూకలు తొడఁగినారు. అందును వీరివలె పాడుచేసినవారు మఱి లేరు, వీరు పండితులట! తెలివిగలరట! ని!స్తరపాదపే దేశే ఏరండోపి ద్రుమాయతే (323).

శాస్త్రులవారూ! న్యాయమా యింత పరుషముగా పంతులవారిని తిట్టుడము!

ఈలాగున ఒకరినొకరుదూషించడము పండితులకు చెల్లునుకాబోలు. అది అట్లుండనీయండి. భాష ఒక్కటే మా వ్యాసమునకు విషయము గనుక అలంకారాలు, రసాలు, పాకాలు, యతులు, ప్రాసములు మొదలయిన వాటి విమర్శనముతో గాని, తిట్లతోగాని, మాకు ఇక్కడ పని లేదు. ఆంధ్రవ్యాకరణమర్యాదాతిక్రమణములు ఇంచుమించుగా ఇరవై

అయిదు పంతులవారి గ్రంథములో శాస్త్రిలవారు చూపించినారు. వీటిలో రెండుమూడు తప్ప తక్కినవి రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులవారి నాటకములలో ప్రయుక్తము లయినవనిన్ని ఆపంతులవారు వ్రాసిన "దుష్టప్రబంధముల" విషము ఆంధ్రభారతి దేహమున కెక్కి ఆమెను 'ప్రాణసంశయదశకు' తెచ్చినదనిన్ని శాస్త్రిలవారు మరియొక విమర్శలో వ్రాసినారు. ఆవిమర్శనము ఈవ్యాసము రెండవభాగములో విమర్శించినప్పుడు వేంకటరత్నము పంతులవారి 'తప్పులు' అచ్చట పేర్కొని చర్చించి ఇద్దరు పంతులవార్లున్ను పొరబడ్డారో లేక శాస్త్రిలవారే తప్పొప్పులు కనుక్కోలేక పొరబడ్డారో, విచారిస్తాము. వేంకటరత్నము పంతులువారి తెలుగులో మహాపాతకముతో సమానమైనట్టి దని శాస్త్రిలవారికి తోచిన గొప్పదోషము ఒకటి ముందుగా వివరించి, శాస్త్రిలవారి ఆంధ్రభాషాపాండిత్యవైశిష్ట్యము ప్రకటిస్తాము.

11. ఆంధ్రప్రసన్నరాఘవము, ప్రథమాంకము 11-వ పుటలో కవిగారు 'పంపలేడయ్యోడున్' అని ప్రయోగించినారు. ఈశబ్దము తప్పనుకొని శాస్త్రిలవారు విమర్శనములో ఏమి వ్రాసినారంటే —

12. '<u>పంతులవారి నలువదియేండ్ల యాంధ్రవ్యాకరణోపాధ్యాయతాప్రభావము.</u> అయ్యోడున్ — ఇదేమి జోస్యమా? లూట్టా? లాట్టా? 'ఆశీశ్శాపసంప్రార్థనవిధులందు లూట్టగు' బాల. క్రియా. ౯. ఈయర్థము లం దొకటియు నిటం బొసంగదు. 'తద్ధర్మాదులందు లాట్టగు' బాల. క్రియా. ౬. 'తచ్ఛీలసంభావనా సంప్రశ్నసాతత్య వర్తమాన భావ్యాశీరాదులం లాది పదగ్రాహ్యంబులు' ఈ యర్థములందును భావివక్తకు తెలియునది గాదు. వర్తమానేతరములు పొసంగవు. వర్తమాన మర్థమేని, ఏఁడును ఏమి అయ్యోడున్? ఏమగుటయుంగాదు, అయ్యోడున్ అనునది వ్యతిరేకార్థమునకు అనుప్రయుక్తము అని యుత్తరమేని, ఈసూత్రంబుం గనుండు. ధూతంబున లజెలిడంపంబగు నగుధాతు వనుప్రయుక్తంబగు' బాల. క్రియా.

౧౧౪. దీన నెఱుంగుడు లిడంతమే గాని, అన్యమనుప్రయుక్తంబుగా దని. కావున, నిది పాదము ముగియుటకు ఏదో ఒకడున్న్, దీని పేరు అయ్యెడున్న్.'

13. ఆగ్రంథమందే వేంకటరత్నముపంతులవారు ప్రథమాంకము 16-వ పుటలో మంజీరకునివాక్యములో 'ఎక్కుడఁబడ దయ్యెడు' అని మరి ఒకమారు అట్టిరూపము ప్రయోగము చేసినారు. శాస్త్రులవారును మరి ఒకమారు తమలక్షణజ్ఞత వారి లక్షణాజ్ఞత ఉద్ఘోషించి విమర్శనము వ్రాసినారు. అజ్ఞానవిజృంభితము.

14. భూతంబున లజికి లిడంతంబగు నగుధాతు వనుప్రయుక్తంబగు' బాల. క్రియా ౧౧౪. వాఁడు రాఁడయ్యెను. మేము రామయితిమి— అని యుదాహరణము. ఏతత్సూత్రరీతిని వ్యతిరేకమునకు భూతమున అగు ధాతువు భూతార్థము అనుప్రయుక్తమగును గాని లాడాదికములు కానేరవు. ఎక్కుడఁబడ దయ్యెడునట! నలువదియేండ్ల యాంధ్రపండితుల యాంధ్రవ్యాకరణజ్ఞానము ఎట్లు రేఁగుచున్నదో యరయుఁడు. ఇది రెండవమాటు వీరి తప్పుచేయుట. ౧౧-వపుటలో 'లేఁడయ్యెడున్' అని తొలిమా అయినది, వీరే క్రొత్తవ్యాకరణము చేయవలసినవారు.

15. చూచినారా! శాస్త్రులవారికి ఎంత విశ్వాసమో చిన్నయ సూరి బాలవ్యాకరణ శాస్త్రమందు! పండితులు శాస్త్ర దృష్టిగలవారట గదా! చర్మ చక్షుస్సుకు కనబడేది నమ్మరు! శాస్త్రము అమోఘము; గనుక ప్రమాణము. చిన్నయ సూత్రరీతిని అగు ధాతువు భూతార్థమందే గాని వర్తమాన భవిష్యదర్థములందు అనుప్రయుక్తము కాదని చెప్పి ఊరకుండక, పంతుల వారిని ఎట్లు దూషించినారో విమర్శకులు! అదేమో కారణము తెలియదు గాని, పంతులవారు ఆంధ్రవ్యాకరణము ఒకటి చేయడమునకు యత్నించినట్లు, ఆయన అట్టిపనికి తగినవారు కానట్లు శాస్త్రులవారు తలంచి, సందు దొరికి నప్పుడెల్లా ఇట్లే చెప్పినారు. విమర్శగ్రంథము 55 వ పుటలో:—

'ఏండ్ల తరబడి యాంధ్రోపాధ్యాయులట! కవితాతత్త్వవిత్తట! ఆంధ్రవ్యాకరణ పాండిత్యమిట్లున్నది! ఈ పాండిత్యముతో ఆంధ్రభాషా సంజీవకులట! కాలమహిమ!' అనిన్ని 80 వ పుటలో 'నలువదియేండ్లనుండి ఆంధ్ర వ్యాకరణము పాఠము చెప్పుదురట! ఏదో నూతనవ్యాకరణము చేయుదురు' అనిన్ని 113 వ పుటలో 'తదర్థార్థకవిశేషణమునకు హల్లు పరమగునప్పుడు నుగాగమ మెచట విహితము? క్రొత్తవ్యాకరణముత్వరగా చేసి వేయుదము. ఆజ్ఞపుచ్చుకొనియున్నారము గదా!' అనిన్ని, 313 వ పుటలో 'ఈ కాలమున వీరు నొక—కాదు, వీరొక కాదు, వీరే ఆంధ్రభాషా మర్యాదా వ్యవస్థాపకులు!' అనిన్ని తరచుగా దూషించినారు.

16. శాస్త్రిలవారు ఈ విమర్శను వ్రాసిన సంవత్సరము 1898. 15 సంవత్సరములు గడచినతర్వాత శృంగారనైషధమునకు సర్వంకష వ్యాఖ్య వ్రాసినారు. నైషధము 7 వ ఆశ్వాసము 72 వ పద్యములో 'చేయరయ్యెదరు' అనిన్ని, 8 వ ఆశ్వాసము 185 వ పద్యములో 'లేఁడయ్యెడుఁ' అనిన్ని శ్రీనాథుడే ప్రయోగించినాడు. వేంకటరత్నము పంతులవారిని ఇట్టి శబ్దములు వాడినందుకు అంతగా దూషించిన శాస్త్రిల వారు శ్రీనాథుని ప్రయోగములను గురించి ఏమని వ్యాఖ్యానములో వ్రాసినారంటే:—

'చేయరయ్యెదరు' బాల క్రి. 114 లో లజికి (=వ్యతిరేకార్థమునకు) అగుధాత్వను ప్రయోగమునుభూతంబున మాత్రము చెప్పుట తదను ప్రయోగవైరళ్యమును తెలుపుటకని కొందఱు మతము 'లేఁడయ్యెడున్' బాల క్రి. 144 వలన 'లేఁడయ్యెన్' అను ప్రయోగము సిద్ధించును. ఈ ప్రయోగమునకు గతిమృగ్యము. 'లేఁడయ్యెఁజూ' అని (లేఁడయ్యెఁబో, అనియేని) మార్చిన సరిపడును. 'చేయరయ్యెదరు' ఆ 7-72 ఇత్యాది ప్రయోగంబులం బట్టి బాలవ్యా.లో 'భూతంబున...లిడంతంబు' అనుట ప్రాయోవాద మని తలంపవలయును.'

17. 1898 వ సం. లో ఆంధ్రప్రసన్న రాఘవము విమర్శించినప్పుడు చూపిన అహంకారము, ఆటోపము; అప్పుడు చేసిన సింహనాదము, హాస్యము, అట్టహాసము-ఇవి అన్నీ 1913 వ సం. రములో శాస్త్రిలవారు నైషధమునకు వ్యాఖ్య వ్రాస్తూ ఉన్నప్పుడు అజ్ఞాన విజృంభితములని అంతఃకరణమునందు తోచి ఉండును; లేదా, చిన్నయసూరిగారి వ్యాకరణ శాస్త్రము శ్రీనాథుడు చదువుకోలేదన్న కారణముచేత, అతని శాస్త్ర మర్యాదను అతిక్రమించిన దోషమునకుగాను, వేంకటరత్నము పంతుల వారిని దూషించినట్లు, దూషించక కనికరించి విడిచిపెట్టినారేమో!

18 'లేఁడయ్యెడుణ్' అని శ్రీనాథుడు ప్రయోగించిన శబ్దము తాటాకుపుస్తకాలలోనూ, అచ్చుపడ్డ పుస్తకాలలోనూ, తమ కంటికి కనబడుతూ ఉండగా, 'లేఁడయ్యెఁజూ' 'లేఁడయ్యెఁబో' అని మార్చితే సరిపడును. అని దిద్దడానికి సాహసిస్తారు! శాస్త్రిలవారు! ఈ రూపములు నన్నయ తిక్కన మొదలయిన పూర్వకవులు వాడినవే అని ఎరుగరు. తమ కిష్టముగాని శబ్దములు ప్రాచీనగ్రంథములలో కనబడితే, దిద్ది మరి కనబడ కుండా తీసివేసి, పరిష్కరించి అచ్చువేయించే పండితులలో ఈ శాస్త్రిల వారు అగ్రగణ్యులు. వీరు పరిష్కరించిన పద్యాలు రచించిన కవులు ఇప్పుడు చూడడము సంభవమైతే తాము రచించినవని పోల్చుకోలేనట్లు అవి మారిపోయినవి.

19. అథర్వణుడు, అహోబలుడు, అప్పకవి మొదలయిన లాక్షణికులు శ్రీనాథాదుల ప్రయోగములు తప్పులని నిరాకరించినారు కారా? ఆలాగుననే చిన్నయ సూరిగారున్ను వేంకటరాయశాస్త్రిలవారున్ను, లాక్షణికులు గనుక, 'లేఁడయ్యెషుణ్' వంటి ప్రయోగములు తప్పులని దూషించినారు—అని ఎవరైనా వాదిస్తే, అందుకు మా జవాబు తరుచుగా ఇదివరకే చెప్పి ఉన్నాము; అయినా, తిరిగీ చెప్పుతున్నాము. చిన్నయసూరిగారికి పూర్వమందు ఏ లాక్షణికుడూ ఈ రూపము తప్పని చెప్పనప్పుడు, ఈయన

తప్పనడానికి ప్రమాణమేమిటి? నేటి లౌకికభాషలో ఈ రూపము లేదు గనుక గ్రామ్యమని నిరాకరించినారని చెప్పవల్లకాదుగదా. ఇకను ఒక్కటే వికల్పమున్నది. వీరికి ప్రాచీనగ్రంథములలో ఈరూపములు కనబడలేదు అని చెప్పవలెను. తమకు కనబడనిశబ్దము తప్పని చెప్పేవారు అన్ని గ్రంథములూ ఆమూలాగ్రము జాగ్రత్తతో పరీక్షించినవారయి ఉండవలెను. అంతటి ఆంధ్రభాషా పాండిత్యము చిన్నయసూరిగారికి గానీ, వేంకటరాయ శాస్త్రులవారికిగానీ లేదని మేము రుజువుచేయగలము. అథర్వణుని కారిక ప్రమాణము గాగ్రహించి అహోబలుడు శ్రీనాథుని 'పనిగొంట' అనే ప్రయోగము తప్పని సూచించడము, ఆ యిద్దరి లాక్షణికుల అవిమృశ్యకారిత్వమని తిక్కనాది మహాకవుల ప్రయోగములు అనేకములు ఉదాహరించి సిద్ధాంతముచేసి ఉన్నాము (చూ. బాలకవి శరణ్యము) అట్లే, నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు రచించిన భారతములో నున్న ప్రయోగములు ఉదాహరించి, చిన్నయసూరిగారున్ను వారి శాస్త్రమును వేదవాక్యముగా విశ్వసించిన వేంకటరాయశాస్త్రులవారున్ను భారతము లెస్సగా చదువక, భారతములో ఉన్న ప్రాచీనాంధ్రభాషా శబ్దములే తప్పులని నిరాకరించుటకు సాహసించినారని సిద్ధాంతము చేయగలము. 'కొంట' మొదలయిన రూపములు తప్పన్న అథర్వణుని లక్షణమున్ను అహోబలుని లక్షణమున్ను పాడయినట్టే, వీరి లక్షణముకూడా పాడు లక్షణము కాక తీరదు.

20. ఇక ప్రయోగములు చూడండి: ఆది, అరణ్య, విరాట, స్త్రీ, అనుశాసనిక, అశ్వమేధ, మహాప్రస్థాన, స్వర్గారోహణ పర్వములలోనివి మాకు జ్ఞాపకమున్నవి. ఇందుమించుగా ఇరవై ఉదాహరిస్తున్నాము. ఇంకను ఎన్నో భారతములోనే ఉన్నవి. ఇతర కవులుకూడా ఇవి వాడి ఉన్నారు.

1. చ....యీలలితాంగి యందునా। హృదయము దద్దయుందవిలె
నిప్పులు కింకను నమ్మనేరన। య్యెడ ఆది. IV. 29.

2. చ. అవని యరాజకంబయినయప్పుడ భూప్రజయందసర్వఘో
ర్మ్మువులుఁదొలఁగు...వృష్టి లే| దవు... ఆది. IV. 250.

3. చ....యా| త్యలఘు పరాక్రమాన్వితు మహాభుజునర్జును దివ్యసాయకం|
బులువడయంగ నొక్కరుగన పుచ్చితిఁ దద్దయు వేడ్కనెద్దియుం|
దలపన యొడ్డు తద్విరహితమ్మగు కామ్యక మొప్పదయ్యెడిన్.
అర. II. 290.

4. తే. సహజములు నాకు నిక్కవచంబుఁగుండ
లములు నివి లేక యున్న నే సమరభూమిఁ
గడిది శత్రులచేత భంగంబు వడుదుఁ
గాన యీఁజాలనయ్యెడి వీని నేను. అర. VII. 204.

5. చ. నినునొక యక్షమాత్రుఁడుగ నేమది నమ్మఁగ నేరనయ్యెడన్. ,, 460

6. ఉ. చిత్తము మెచ్చినావలనఁ జిక్కఁగ వెండియు నాలతాంగియ
చ్చొత్తినయట్ల నాకుఁ దనయుల్లము దెల్లముసేయకున్కి దా
నత్తఱిఁ గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గుపెంపున
న్మత్తలమందఁ జేయుటకునో తలపోసియెఱుంగనయ్యెదన్.
విరా. II. 84.

(ఆనందముద్రణములో 'ఎఱుంగనయ్యెదు'. వ్రాతప్రతులలో 'నయ్యె
డన్ 'సాధువు.')

7. క. ఈనరపతి యాస్థానములో నొక్కరుఁడైన ధర్మలోప భయమునం
బూని తగువైన వెడ పలుకైనను బలుకంగఁ జాలఁడయ్యెడు నకటా
,, 141.

8. క. మొగమొప్పదు నాదెస నీజగతీ నాథునకు నే విచారించియునుం
దగ దీనికిఁ గారణమిది యనునని యేర్పఱుప నేర నయ్యోదనెట్లున్.
V. 306.

9. ఉ. ఇమ్మెయిబాలుఁ డొక్కరుఁడ యిందఱఁదోలి వధించె నన్న నేనమ్మఁగ
నేరనయ్యోద... (ద్రోణ II. 86).

10. సీ. గీ....గెల్పు గెల్పుగ మదీయ,
బుద్ధిగైకొనదయ్యోదు సిద్ధముఖ్య. శాంతి. I. 6.

11. చ.............భీతినో,
నినమది తోడనమ్మమిని నెట్టన యియ్యరిఁ ద్రెంపనయ్యోదన్.
,, III. 213.

12. తే. సారచందన హృద్యకస్తూరికాది
లేపనాలిప్తి నుండెడు భూపవర్యు
లకట శోణిత పంకదిగ్ధాంగులగుటఁ
గనుట కోర్వ రాదయ్యోదుఁ గనులనాథ. స్త్రీ. II. 16.

13. తే. అవయవములు రూపఱఁగ గ్రవ్యాదభక్షి
తంబులైయునికిఁ గొన్ని శవంబు లువిద
లెంతనూచియునవి గొంద లెఱుఁగఁ జాల
రయ్యోదరు సూడు తమ బంధులగుటఁ గృష్ణ. స్త్రీ II. 23.

14. వ. అదియన్యాయ్యంబనియలుగనుఁదగవువలుకనుఁదేఁటిచూడనురాదయ్యోదు.
అనుశా. 311.

15. చ....యూహవమునకొల్లనయ్యోదఁ
బ్రియంబులుగావో కోమాకుఁ బ్రాణముల్. అశ్వ IV. 7.

16. చ....ద్రౌపది భీమసేను న,

ర్జును(గవలం ద్యజించుటకు సువ్రతచాలితి చాలవయ్యెదీ,

శునకము విడ్వ...... మహాప్రస్థా. 56.

17. చ. అనవిని ధర్మరాజసుతుఁ డాతని కిట్లను నాగు తమ్ములం

గనుఁ గొనునంతకున్ సుఖముగాఁ గొనవయ్యెద నిత్తెఱంగు. 70. ,,

18. వ. సోదరరహితస్వర్గంబునందు స్వర్గత్వాబుద్ధి పుట్టవయ్యెడు. స్వర్గా. 15

19. సీ. పా. విభ్రాంతిఁ జేసి వివేకింప నేరరాదయ్యెడుసని ,, 27.

21. భారతమందే, అనేక పర్వములలో కనబడుతూ ఇన్ని ప్రయోగములుండగా, 'ప్రయోగవైరళ్య'మని ఈశబ్దములు ఏలాకృతికుడైనా ఉపేక్షించునా ? చిన్నయసూరికి శృంగార నైషధములోని ప్రయోగములు గాని, భారతములోని ప్రయోగములలో ఏదైనాగాని తెలిసి, జ్ఞప్తియందుండిఉంటే, లజికిలిడంతంబగు నగు ధాతువేకాక, తది తరాంతంబగు నగు ధాతువుకూడా అనుప్రయుక్తంబగునని లక్షణము చెప్పి ఉండును. ఆయన పరిష్కరించి అచ్చువేయించిన ఆది పర్వములోనే ఉన్నవి ఇట్టి ప్రయోగాలు. కాబట్టి ఈ ప్రయోగము ఆయన కంట బడినా చూడలేదనిగాని; చూచినా, గురియందు ఉంచుకోలేదని గాని; మన మూహించవలెను. అయితే, ఈ చిన్నయసూరిని ఇందుకై ఎవరున్ను నిందించగూడదు. తాను చెప్పని విషయములు తప్పులనక కవుల ప్రయోగములను బట్టి తెలుసుకోవలసినదని మొట్ట మొదటనే వ్రాసినాడు. గనుక మేము వేదము వేంకట రాయ శాస్త్రులవారి యందే దోషము ఆరోపిస్తున్నాము. చిన్నయ్యసూరి నాటికి భారతమంతా అచ్చు పడలేదు. శాస్త్రులవారు అచ్చుపడ్డ భారతములోని శబ్దరూపములు కొన్ని విమర్శించి అముద్రితగ్రంథ చింతామణిలో వ్యాసములు వ్రాసి ఉన్నారు. తాముగుర్తు పెట్టుకొని ఉన్నవి ఏవో కొన్ని శబ్ద

ములు తప్ప తక్కినవి తిన్నగా చూడలేదు గాబోలు. ఏది ఏమైయినా ఆంధ్ర ప్రసన్నరాఘవము విమర్శించినప్పుడు, (12 వ, 14 వ పేరాలలో మేము ఉదాహరించిన ఆయన వాక్యములను బట్టి) నైషధములోని ప్రయోగములు గాని భారతములోని ప్రయోగములు గాని ఆయన ఎరుగరని నిస్సంశయముగా మనము చెప్పగలము. తమకు తెలియని శబ్దము ప్రాచీనాంధ్రములో ఉండనే ఉండదను కొన్నారో! ఉండనే కూడదను కొన్నారో తమకు తృప్తిగా తమ అంతఃకరణమందు ఏమను కొన్నా అనుకో వచ్చునుగాని, తమసాటి పండితులయిన వెంకటరత్నము పంతుల వారువాడిన సాధు శబ్దము తమ అజ్ఞానము చేత అసాధు శబ్దమనుకొని, 'పంతులవారి నలువది యేండ్ల యాంధ్రవ్యాకరణోపాధ్యాయతా ప్రభావము! అయ్యో పిచ్చి—ఇదేమి జోస్యమా? లూట్టా? లాట్టా? నలువది యేండ్ల యాంధ్ర పండితుల యాంధ్ర వ్యాకరణ జ్ఞానము ఎట్లు రేగుచున్నదో యరయుడు. వీరే క్రొత్త వ్యాకరణము చేయవలసినవారు'! అని కొంచుకొసరు లేకుండా పడతిట్టినారే! ఈలాగున తిట్టడానికి వివేకము గల వారెవరైనా సాహసింతురా? ఇదంతా తమ అజ్ఞాన విజృంభణమని తెలుసుకోలేక పోయిరిగదా! 'జోస్యమా?' అని హాస్యానికి అడుగుతారు! 'లూట్టా? లాట్టా' అని అట్టహాసాలు చేస్తారు! దయ్యాలను పారదోలడమునకు, పామరులను బెదిరించడమునకు, మాంత్రికులుచదివే మారణమంత్రాల లాగున ఏమిటి ఈ బాస బిభీషికలూట్, లాట్? హ్రాం! హ్రీం; హ్రూం! ఫట్; హూత్! హాత్? లా శాస్త్రులవారి పాండిత్యములోటు గాని లాటీ కాదు; లూటీ కాదు పోటీకి వ్రాసిఉంటారు' ప్రాయః సమాన విద్యాః, పరస్పర యశః పురోభాగాః' అని కాళిదాసు చెప్పినట్లు, వేంకట రత్నము పంతులవారిని ఈలాగు అన్యాయముగా, నిష్కారణముగా దూషించడము ఈర్ష్య చేతనని ఊహించవచ్చును. ఈర్ష్యాంధులు ఏదో ఒక కూపములో పడడము ఆశ్చర్యముకాదు. ఇట్టివారిమాటలు వేదవాక్యాలని నమ్మి, వారి వెంట వెళ్లినవారు 'అంధువునఁబడు నంధాను గాంధుని' వంటి

వా రవుదురా కారా? ఇకనైనా ఏకసక్కెము లాడక వివేకము కలిగి తెలుసుకొందురుగాక! "లేడయ్యోడుజ్" అనేది పరాచకముకాదు వాగను శాసనుని ప్రయోగమంత్రము! కవిబ్రహ్మప్రయోగ మంత్రము! ప్రబంధ పర మేశ్వరుని ప్రయోగమంత్రము! మంత్రార్థము తెలుసుకొని యథావిధి పునశ్చరణచేస్తే, శాస్త్రులవారిని పట్టుకొని పీడించి మతిపోగొట్టి అసంబద్ధ ప్రలాపము లాడించిన వైయాకరణ పిశాచము వదలి పారిపోతుంది. తర్వాత పశ్చాత్తాపము నొంది ఆత్మదోషమును ఘోషించి ప్రాయశ్చిత్తము చేసు కొంటే మిథ్యాపవాదపరిహార మవుతుంది. నిర్దుష్టమైన శబ్దమును దుష్టమని నిందించి దిద్దిన మహాపాతకమునకు నిష్కృతి ఏలాగున కలుగుతుందో మేము చెప్పలేము. పతివ్రతను బంధకి అని ప్రకటించి దానిమనువు కూలదోసిన పాపమునకు నిష్కృతి ఉంటే దీనికీ ఉంటుంది. అది ఆలాగుండ నీయండి.

22. నేరనయ్యెదను; నేరనయితిని—ఇట్టి రూపములు ప్రాచీనాంధ్ర ములో కాలభేదము స్పష్టముగా బోధించడమునకు వాడినట్లు మనము తెలుసుకోగలము. త్రిలింగలక్షణ శేషమందు క్రియా పరిచ్ఛేదమున 8 వ సూత్రములో చెప్పినట్లు, వ్యతిరేక క్రియ వర్తమాన భూత భవిష్య దర్థము లను మూడింటిని బోధిస్తుంది. ఆసూత్రము క్రింద ఉదాహరించిన ప్రయో గములన్నీ భారతములోనివి కావు. భూతమునకు 'నలుగాన మివ్వనం బున' అనే అరణ్యపర్వములోని ప్రయోగము ఒక్కటే ఉన్నది. ఆభారత ప్రయోగాలు వేంకటరాయశాస్త్రులవారు మన్నించరేమో అనిన్ని, ఉదాహ రించిన ప్రయోగములో నున్న 'కానము' అనేదానికి వేరే అర్థము చెప్ప వచ్చు నంటారేమో అనిన్ని, భారతములోనివే సందేహమునకు ఎడ మివ్వని ప్రయోగములు మూడు చూపిస్తున్నాము; ఇట్టివి అనేక మున్నవి.

1 ఉ. సంపద పెక్కుయుండఁగ నశక్తులనం జనుమమ్ముఁబిల్చి పూ
జింపఁగ నంత బేలె పతి నెప్పుడు వారల బుద్ధి నాఁడ మ
న్నింపఁడ యింక నేల. ఉద్యో I. 314.

2 క. వారు దెసలొత్తికొనియు ధరా రాజ్యంబిచ్చి పోయిరా పోరా తా
రా రణ్య పీడఁబడియును రారాజుం జెఱుకుఁబాపరా మన మెఱుఁగన్
I. 2041.

3 క. ఇది మున్న యేను ద్రోణుఁడు విదురుండును
జెప్పిన యదియ వినవప్పుడు భీష్మ III 79.

మొదటిపద్యములో 'మన్నింపఁడ' అంటే మన్నించినాడుకాడు, అనిన్ని రెండవదానిలో 'పోరా', 'పాపరా' అంటే 'పోయినారు కారా' పాపినారుకారా, అనిన్ని మూడవదానిలో 'వినవ' అంటే 'విన్నావుకావు' అనిన్ని అర్థము. అట్టిఅర్థము స్పష్టముగాచెప్పవలసినప్పుడు వర్తమానకాలమునకు 'మన్నింపఁడయ్యెడుఁ' 'పోరయ్యెదరు' 'పాపరయ్యెదరు', 'వినవయ్యెదవు' అనే రూపము లుంటవి. వీటికి ఇప్పటి తెలుగులో 'మన్నించకుండా ఉన్నాడు' 'పోకుండా ఉన్నారు!' 'వినకుండా ఉన్నావు' అని ఉంటవి. ప్రాచీనభాషలో 'లేదయ్యెడుఁ' వర్తమానకాలము; లేదయ్యెన్ భూత; లేదగుఁ' భవిష్యత్. ప్రాచీనాంధ్రభాషాలక్షణము సంపూర్ణముగా ఎవరూ తెలుసుకోలేరు; తెలుసుకొనుట అసాధ్యమే. గ్రంథాలలో కొంత వ్యత్యస్తమై ఉన్నంతమట్టుకైనా నేటివరకూ ఎవరు సంపూర్ణముగా తెలుసుకోలేదు అని శాస్త్రిలవారి విమర్శములో ప్రకటితమయిన అవి మృశ్యకారిత్వమే దాఖలా. పెద్దపేరు పెట్టుకొన్న ఆంధ్రపండితులకే ప్రాచీనాంధ్ర భాషాజ్ఞానము చాలనప్పుడు, కేవల గ్రాంథికమయి ఉన్న ప్రాచీనాంధ్రభాష దేశభాషగా నెంచి, వాడుకలో ఉన్న వాస్తవమయిన నేటి దేశ భాష గ్రామ్య మని నిరాకరించడము అవివేకముకాదా? ఆంధ్రభాష గ్రాంథికమయి ఇంచుమించుగా వేయివత్సరము లయినా, ఆంధ్రగ్రంథములు ఆంధ్రపండితులు యావజ్జీవము చదువుతూ ఉన్నా, ఆశు కవిత్వము చెప్పనేర్చినా, సభలో రెండు గడియలు ఈ 'గ్రాంథికభాష' లో దేశవ్యవహారమును గురించి

ఉపన్యసించలేరే! ఇట్టి భాష సర్వజనసామాన్యమయిన దేశభాషగా ఎన్నటికైనా కాగలదా? సర్వజన సామాన్యమైన దేశభాష ఉండవద్దా? దేశహితమును కోరేవారు లెస్సగా ఆలోచింతురు గాక.

23. వేంకటరాయ శాస్త్రులవారు స్వయముగా ఆంధ్రగ్రంథాలు చదువుకొని భాషాలక్షణము తెలుసుకోక, ఇతరులుచెప్పిన లక్షణము ప్రమాణముగా గ్రహించి, సాటిపండితులను దూషించినారనుటకు మరియొక విషయమును ఉదాహరిస్తున్నాము. వేంకటరత్నముపంతులవారి ఆంధ్ర ప్రసన్నరాఘవమునందు 5 వ పుటలో

చ. గొనబగు వాణియెవ్వరికిఁ గోమల కావ్యకలా కలాప యా
ఘనులకు డిందునే యరయఁ గర్కశ తర్కవచో విజృంభణ
న్ననువుగ గోళులుంచఁ బను నన్నుల చన్నుల నేరిచేతనై
న్నను మదకుంభి కుంభదళనమ్మున నమ్ములు పోవ వారిచేన్.

24. ఈపద్యమందున్న 'చన్నులు' అనే శబ్దమునుగురించి శాస్త్రులవారు విమర్శములో ఏమని వ్రాసినారో చూడండి:—

'చన్నులు—ఈ పద్యము వైద్య శాస్త్రోచితముగా నున్నది—

సీ. మదిరాక్షి చెవులు తొమ్మిదిలెక్కలనరాదు। ముద్దియకనులు తమ్ములనరాదు
శుకవాణి బుగ్గలు ముకురంబు లనరాదు । చెలిపండ్లు మల్లెమొగ్గ' లనరాదు
గజయానచండ్లు బంగరు గిండులనరాదు । సతిజొడ్డు సుడిని మెచ్చదనరాదు
సరసిజానన ముడ్డి సైకతం బనరాదు । హరిమధ్య కాళ్లగు శ్లనఁగరాదు
తే. క్రమత వీనికి వీనులు, కన్నుదోయి,
చెక్కలును, బలువరుసయు, నిక్కఁజన్నుఁ
గవయుఁ, బొక్కిలి, పిరుదు, చొక్కంపుటనుగు,
లనుచు మును వాడిరవియ చేకొనఁగవలయు.

అని యప్పకవి చెప్పుహితమును వినఁదగును. చన్నులని కొందరు కవులు ప్రయోగించి యుందురని పంతులువారు ప్రయోగములు చూపుదురు గాఁబోలు! కలవుగాని స్థలవైభవముచే వాని గ్రాహ్యతయుం గలుగునొండె. 'అనువుగ గోళులుంచఁబడు నన్నుల చన్నుల నేరిచేత'—ఇదియెట్లు ధ్వనించు చున్నదనఁగా—మెడికల్కాలేజిలోని యే విద్యార్థులు స్తనస్వరూప పరీక్షార్థమై చచ్చిన యన్ను శవముల స్తనములనుకోసి తెచ్చి యొక బల్లమీఁద నుంచుకొని వానిని ఉపాయముగా తమగోళ్ళతో పట్టి పరిశోధింతురో ఆవిద్యార్థులు—అని; ఇందలి పదమహిమ యట్టిది.

25. అచ్చుపడ్డ అప్పకవీయములో మీఁద నుదాహరించిన సీసపదల మందు మొదటిపాదములో 'కనులు' అని ఉన్నదిగాని తాటాకుపుస్తకాలలో (మేము పదహారు ప్రతులుచూచినాము) 'కండ్లు' ('కంళ్లు' 'కళ్లు') అని ఉన్నది. చక్కని స్త్రీని వర్ణించినప్పుడు, చెవులు, కండ్లు, బుగ్గలు, పండ్లు చండ్లు, బొడ్డు, ముడ్డి, కాళ్లు అనేశబ్దములు ఉచితమయినవి కావనిన్ని, వాటికిబదులుగా వీనులు, కనులు, చెక్కులు, పలువరుస, చనులు, పొక్కిలి, పిఱుఁదు, అడుగులు అనేవి వాడవలె నన్నిన్ని ఉపదేశించి,

తే. రణమువర్ణించుచో వీరరసమునందు, యుద్ధపంచకమునఁ దిక్కయొజ్జసారెఁ
గాళ్లటంచురచించుటగాంచి కవులు, చెప్పుకొనిరిమీఁగాళ్లని చెలఁగికృతుల.

అనిచెప్పి, సారంగధరచరిత్రములో కవి 'మీఁగాళ్లి' అని స్త్రీవర్ణనలో వాడినాడని ప్రయోగ మిచ్చి ఊరకున్నాడు. అయితే అప్పకవి అనుశాసన మేమిటి? 'కాళ్లు' అనే శబ్దము సాధువా? అసాధువా? అసాధువయితే, తిక్కన వాడుక తప్పా? సాధువయితే సారంగధరచరిత్రములో వాడినట్లు స్త్రీవర్ణనలో ప్రయోగించవచ్చునా? లేక తిక్కన వాడినట్లు యుద్ధవర్ణనలోనే వాడవలెనా? కొందరంటారు:—'కాళ్లు' అనేశబ్దమొక్కటేకాదు, 'అనరాదు' అని అప్పకవి చెప్పిన 'చెవులు' మొదలయినఎనిమిది

శబ్దాలకు భహిష్కారణమయినది. ఎవ్వరూ ఎక్కడా వాడకూడదు; పురుషులవిగానీ, స్త్రీలవిగానీ అవయవములను చెప్పినపుడెల్లా గ్రాంథికపదములే వాడవలెను" అని. మరికొందరంటారు:—"యుద్ధపంచకములో తిక్కన వాడినది ప్రమాదము కాదు; ప్రమాణమే" అని, మేమడుగుతున్నాము తెలియక. "అప్పకవి 'చేకొనఁగవలయు' నన్నశబ్దాలు శవాంగములు వర్ణించినప్పుడు వాడవచ్చునా? అప్పుడు వాడితే ఔచిత్యభంగముకాదా?" అని, ఎవరిష్టము వారిదిఅంటే వాదములేదుగాని అప్పకవిమతమేదయి ఉంటుందో స్పష్టముకాదుగదా.

26. మరి, 'చన్నులు' తప్పనిఎందుచేత వేంకటరాయశాస్త్రిలవారు పంతులవారిని దూషించినారో తెలుసుకోవలెను. అప్పకవి తప్పన్న శబ్దము 'చండ్లు' గాని 'చన్నులు' కాదు. ఆతడు చేకొనవలయునన్నది, అక్షరాలా నిక్కచన్నుఁగవ పూర్వమందు 'నిక్క' పరమందు 'కవ' (అర్ధానుస్వారాదేశములతోనే) ఉంటేనేగాని, వట్టి 'చన్ను' శబ్దము వాడకూడదని అప్పకవి మతమంటారా శాస్త్రిలవారు? అట్లయితే కన్నులకున్ను అదేగతి కావలెను; కనుదోయి, అనేవాడవలెనంటారా? 'అడుగులు' అన్నప్పుడెల్లా 'చొక్కింపు' అని ముందుచేర్చవలెనా? అదేమోమాకు తెలియదు; మాకు దివ్యదృష్టిలేదు. శాస్త్రిలవారు స్పష్టముగా చెప్పలేదు; విమర్శములో 68-వ పుటలో 'గొప్పకొప్పు'; 'గొప్పచన్నులు'; 'పెద్దపిఱుఁదులు'; అని "గ్రామ్యభంగిగా చెప్పుట అసహ్యముగా నున్నది," అని ఆక్షేపించినారు.

27. అప్పకవిలక్షణము పట్టుకొని వేంకటరత్నం పంతులవారిని 'పండ్లు' అని ఈక్రిందిపద్యములో ప్రయోగించినందుకు నిందించినారు.

ఆ. చెలియనీదుమొగముచెలఁగుఁజందురుఁడుగఁబండువెన్నెలనిడుఁబండ్లడాలు.

28. అప్పకవి నిరాకరింపకపోయినా, శాస్త్రిలవారు 'చెంపలు' గ్రామ్యమన్నారు దానికిబదులుగా 'చెక్కులు' వాడమని ఆజ్ఞాపించినారు.

అప్పకవి 'బుగ్గలు' గ్రామ్యముచేస్తే, వీరు 'చెంపలు' గ్రామ్యముచేసినారు. మెడికల్ కాలేజీలో విద్యార్థులు ఏశబ్దము వాడవలెనో విధించినారుకారు.

29. పంతులవారు తమనాటకములో 94-వ పుటలో "మాపినతల్లి కాళ్లకు నమస్కరణంబు నొనర్చునప్డు" అని 'కాళ్ల' శబ్దము ప్రయోగించి వ్రాసినారు. అప్పకవి మతమేదో మాకు స్పష్టముగా తెలియలేదని మీదనే చెప్పివేసినాము. మాకు లోకమూ, కవులూ మాత్రమే ప్రమాణము. శాస్త్రిల వారికి అప్పకవిమాట ప్రమాణము. వారివిమర్శము ఇది:

'కాళ్లకు—ఈపదమును కవులువాడినను వాడిరిగాని గ్రామ్యకక్ష్యావగాహి నున్నది.'

'కాళ్లు' అనివాడక చొక్కంపు టసుగులు" అని అనమంటారా?

30. ఇక అప్పకవిగారి మతమున్ను శాస్త్రులవారి మతమున్ను ఇంచుమించుగా ఒకటే గనుక రెంటిని కలిపి మేము విమర్శించ వచ్చును. అథర్వణాచార్యులవారి మాట పట్టుకొని అహోబల పండితులవారు శ్రీనాథుని భాషేకాక తిక్కనభాషకూడా నిందించినట్టే, కాకునూరి అప్పనశాస్త్రిల మాటపట్టుకొని వేదము వేంకటరాయ శాస్త్రిలవారు, కొక్కొండ వేంకటరత్నము పంతులవారి భాషేకాక, నన్నయ తిక్కనాదుల భాషకూడా గ్రామ్యమని నిరాకరిస్తారు. ఈ ఆంధ్రపండితులకు, లౌకికభాషా, గ్రామ్యమే ఆయెను; కవుల గ్రాంథికభాషకూడా నిరాకరించి మూలచ్ఛేదము చేస్తే మరి ఏభాషకు వీరు లక్షణము నిరూపిస్తారు? తమసంకల్పముచొప్పున భాషను పుట్టించి దానిలక్షణము నిర్దుష్టముగా తమతృప్తికై చెప్పుకొని తమ పాండిత్యము సార్థకము చేసుకొంటారా? భారతమయినా తిన్నగా చూడకుండా గ్రాంథికాంధ్ర భాషాలక్షణము చెప్పే ఈపండితులకు గ్రాంథికాంధ్ర భాషాదేవి కలలో నిజస్వరూపము చూపించివేసినది గాబోలు. ఇతరులవలె వారు శ్రమపడి గ్రంథాలు చదువ నక్కరలేదు కాబోలు.

31. 'చన్నులు' మొదలయినశబ్దముల ప్రస్తావము ఈ కాలములో నాగరకుల చెవులకుఇంపుగా ఉండకపోయినా, మామట్టుకు మాకున్ను అపహ్యముగా ఉన్నా, ఇవి గ్రాంథికాంధ్రభాషాలక్షణ శాస్త్రములో మూర్ధాభిషిక్తములుగా పండితులు ఎన్నినవి గనుకను, వేంకటరాయ శాస్త్రులవారు ఇవి అపరిహార్యమని చెప్పిచేసిన విమర్శములో భ్రమాధీనులయి, నిష్కారణముగా వేంకటరత్నము పంతులవారిని నిందించినారని మాకుతోచినది గనుకను, వీటిని మేము చర్చించవలసివచ్చినది. ఇది కేవలము శాస్త్రీయవిషయముగా భావించి సహించవలసినది. వేంకటరాయశాస్త్రులవారు కేవలము శబ్దశాస్త్రజీవులు; శబ్దశాస్త్రమే వారికి జీవాతువు; శబ్దశాస్త్రమే కన్ను; శబ్దశాస్త్రమే చెవి; సర్వమూ శబ్దశాస్త్రమే. లోకము లోకముతోపాటువారున్ను, మారిపోయినా, వారిశబ్దశాస్త్రము మారదు. లోకవ్యవహారము ఏలాగున్నా శబ్దాలు శాస్త్రములో చెప్పినట్టే ఉండవలెనట! నవ్వినా, ఏడ్చినా, దీవించినా, తిట్టినా, తుమ్మినా, దగ్గినా, నిల్చున్నా, కూర్చున్నా, శాస్త్రములో విధించినట్టేకాని, దానికి అణుమాత్రమైనా విరుద్ధముగా గ్రంథాలలోవర్ణించకూడదట. లాక్షణికులు ఏశబ్దాలు వాడమని అనుశాసించినారో ఆశబ్దాలే— అక్షరాలా అవే-ఒక అచ్చుగాని హల్లుగాని, ఎక్కువగానితక్కువగాని, ఉండరాదట! కత్తులమీద నాట్యమట! గ్రంథరచనకు తమవంటి పండితులు తప్ప మరియెవరుసాహసించినా భిన్నమర్మములు కాకతప్పదట. కొక్కొండ వేంకటరత్నముపంతులవారు సాహసించి చేతకానిసాముచేసి ఒళ్లంతా తెగకోసుకొన్నారని లోకానికి వెల్లడిచేస్తే, సామాన్యులు ఇట్టిపనిలో చొరబడి ముప్పుతెచ్చుకోక నిరుపద్రవముగా జీవిస్తారని భూతదయచేతను, శాస్త్రాభిమానముచేతను, వేంకటరాయశాస్త్రులవారు పంతులవారి ప్రమాదములు సవిస్తరముగా నిరూపించి, తమ నైపుణ్యము ప్రకటించి, లోకోపకారకులయినారు. అప్పకవిశాస్త్రరహస్యములు తెలియకపోవడముచేత పంతులవారికి కలిగినవన్న ప్రమాదములు ఈ వ్యాసము 24-29 పేరాలలో ఉట్టంకించినాము. అవి వివరించి ఇప్పుడు ఉపన్యసిస్తున్నాము.

32. వేంకటరత్నము పంతులవారిగ్రంథమందు ఏమి 'గ్రామ్యభంగిగాను' 'గ్రామ్యకక్ష్యావగాహిగాను' ఉన్నవని అప్పకవిశాస్త్రము పట్టి శాస్త్రులవారు నిందించినారో, అవి ముందుగా చర్చిస్తాము:—(1) చన్నులు, (2) గొప్పచన్నులు, గొప్ప కొప్పు, (3) పెద్ద పిఱుఁదులు, (4) బుగ్గలు, చెంపలు (5) పండ్లు, (6) కాళ్లు, తర్వాత అప్పకవి తప్పన్న తక్కిన మూఁడుశబ్దములు, అనగా చెవులు, కన్నులు, బొడ్డు వీటినిగురించి తరుచుగా విమర్శిస్తాము.

33. (1) చన్నులు—23 వ పేరాలో పంతులవారు 'చన్నులు' అనే శబ్దము ఎట్లా ప్రయోగించినారో తెలియుటకు ఆ శబ్దముగల పద్య ముదాహరించినాము; 24 వ పేరాలో శాస్త్రులవారి విమర్శమందలి వాక్యము ఎత్తివ్రాసినాము. 'అన్నుల చన్నులు' అని వ్రాయడము తప్పో, వాటిమీద 'అనువుగగోళులుంచుట' తప్పో పంతులవారి పద్యములో ఏది తప్పో తెలియదు. స్తనశల్య పరీక్షకులయిన శాస్త్రులవారి దృష్టికి పంతులవారి వర్ణన మెడికల్ కాలేజీ విద్యార్థులు శవాంగపరీక్ష చేసినట్టున్నదట. నన్నయాది మహాకవులు ఏలాగుఈశబ్దము వాడిఉన్నారో చూచి,విచక్షణులు ఔచిత్యము అనౌచిత్యము నిరూపించవలెను.

34. నన్నయ గిరికాదేవిని వర్ణిస్తూ 'వలుఁదచన్నుల బెడంగు' అని, తిక్కన ఉత్తరనువర్ణిస్తూ 'చరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు' అనిరి ప్రాచీనులు 'చన్నులు' అని బహువచనముగా వాడడము ప్రసిద్ధము. శ్రీనాథుడుకూడా నైషధమందు:—

క. హారపరీక్షామిషమున భూరమణుఁడు గమిచె నింతి పొంకపుఁ జన్నుల్
 కూరిమి నేరిమిఁబులకాంకురంబులు వొడమఁ జిగురు గోరుల కొనలన్.

అనేపద్యములో, దమయంతి 'చన్నులు' నలుడు 'నేరిమిఁ' 'గోరుల కొనలన్' 'కమిచె' నని చెప్పినాడు. 'తరుణిచన్నులు రాజు చిత్తమును

హరించె' అని ఏ విశేషణమూ పూర్వమందు పెట్టక, పరమందు 'దోయి కవలు' చేర్చక, వట్టి 'చన్నులు' అని బహువచనరూపము దమయంతిని గురించి చెప్పినప్పుడే నైషధములోనే శ్రీనాథుడే వాడినాడు. ఇట్లే సింగన 'చన్నుల క్రొవ్విదంబు' 'ఇట్టి చన్నుల పెంపు' అనిన్ని నాచన సోముడు 'చంద్రికలు వోలెఁ జన్నుల ముత్యాలసరము లమర' అనిన్ని వట్టి బహువచనరూపము, పూర్వమందుగాని పరమందుగాని ఏమి చేర్చకుండానే 'చన్నులు' శబ్దమే వాడినారు. కామశాస్త్రోపనిషద్రహస్య వేత్తలను పండితుల కుపాధ్యాయ యన దగిన ముద్దుపళనికూడా 'ఎటులోర్వ నున్నవో యీ కన్నె 'చన్నులు గోపసింహునిగోటి కుమ్ములకును' అని రాధను గురించి వ్రాసినది. సత్కావ్యములలో నన్నయ మొదలుకొని కవులందరూ ఈ 'చన్నులు' శబ్దము సభ్యవర్ణనలో వాడిఉన్నారని సిద్ధాంతము చేయడమునకు ఈ ప్రయోగములు చాలవా? చాలవంటే, చాలినన్ని ఉదాహరించగలము. మరి, వెంకటరత్నము పంతులవారివాక్యములో శాస్త్రిలవారిబుద్ధికి శవాంగపరీక్ష స్ఫురింప జేసిన శబ్దదోష మేమిటి? 'అన్నులచన్నులు' అని అన్నులు పూర్వమందుండుట దోషమన్నారంటే చూడండి పోతరాజుకూడా దశమస్కంధము పూర్వభాగములో హేమంతఋతు వర్ణనలో సరిగా 'అన్నుల చన్నుల' అనే వాడినాడు.

క. అన్నుల చన్నుల దండవిపన్నులు గాకెల్లవారు బ్రదికిరిగాక
చన్నులుమీఱిన వలి నాపన్నులు గాకుండఁ దరమె? బ్రహ్మాదులకున్.

ఇకను 'అన్నుల చన్నులమీద అనువుగా గోరులుంచుట' శవస్తనములు మెడికల్ కాలేజీ విద్యార్థులు పరీక్షకోసము తీసినట్లున్నదని చెప్పి అసభ్యముగా నెంచినారను కోవడమునకు శాస్త్రిలవారికి తెలియని విషయమా పండితుల సత్కావ్యము లన్నిటిలోనున్న 'నెలవంకలు' 'గోరువంకలు' 'చందురుకూనలు' 'వాఁడిగోళ్ల జీరుటలు' 'చెక్కుటలు', 'నఖకింశు కార్చనలు' 'కుచకుంభములమీఁద గోరంకుశంబాని కలుకు కలుకు కలుకుక్కన నఱికి పట్టుటలు' ఇత్యాదులు?

35. మరి అయితే, పంతులవారివాక్యములో ఎక్కడ నున్నది అసభ్యత? శాస్త్రిలవారి విమర్శమువల్లనే మనమూహించి తెలుసుకోవలెను. పంతులవారి పద్యమునకు మూలమయిన జయదేవుని శ్లోకములో 'కాన్తా కుచమండలే కరరుహాః సానన్ద మారోపితాః' అని ఉన్నది. దానికి పంతుల వారు తెలుగున 'అనువుగ గోరులుంచఁబకు నన్నుల చన్నులన్' అని వ్రాసినారు. దీనిలోని దోషము శాస్త్రిలవారు ఎట్లు వివరించినారో చూడండి:—

(పు. 20)

36. "అన్నులని యీ బహువచనమేల? మూలకారుఁడు 'కుచమండలే' యని ఏకవచనముననే తృప్తిపొందెను గదా! వీరికిమాత్రము 'చన్నుల' నని యీ బహువచనమేల? 'అన్నుచనుంగవ' యన్న నింతరుచిగా నుండదు గాఁబోలు"

అప్పకవి లక్షణములో విహితమైనట్లు 'నిక్కుజన్నుఁగవ' అని ఏక వచనముగా ఈ శబ్దమువాడక బహువచనముగా చన్నులనడము గ్రామ్య కష్యావగాహి శాస్త్రిలవారికి తోచఁబట్టికాబోలు ఇట్లు ఆక్షేపించిఉంటారు' ఐతే జయదేవునిశ్లోకమందు 'కాన్తాకుచమండలే' అనే వాక్యమునకు వైధర్మ్యోపన్యాసపరముగా 'మత్తకరీన్ద్రకుంభశిఖరే' అనే వాక్యమున్నది; గనుక రెంటికి తెలుగులో 'సప్తమ్యేకవచన శబ్దమే' వాడవలెనన్నారుగాని 'చన్నులు' అనే శబ్దము బహువచనమందు ప్రయోగించకూడదని శాస్త్రిలవారితాత్పర్యము గాదంటే, అదివేరే మరి ఒకదోషముగా గణించక, వైద్యశాస్త్రోచితముగా నున్నదని హాస్యముచేసి అప్పకవిలక్షణ ముదాహరించి, 'అప్పకవి చెప్పుహితము వినఁదగు' ఈప్రస్తావమందు ఉపదేశించడము అతిప్రసక్తి అవుతుంది. మూలములో ఏలాగున ఉంటే ఆలాగుననేతూచా తప్పకుండా తెలుగు చేసినారు కారని చాలాచోట్ల పంతులవారిని విమర్శకులు నిందించిఉన్నారు. ప్రసన్నరాఘవము మొట్టమొదటిపద్యములోదే 'చెక్కులు లందు' అనేశబ్దము మూలమందున్న 'గండద్వయె' అనే దానికి సమముగా లేదనిన్ని, 'ఇట

తత్త్యాగము అపకర్షకముగా నున్న'దనిన్ని నిందించినారు. చెక్కుదోయి, చెక్కుఁగవ, చెక్కిలిదోయి, చెక్కిలిగవ-ఇట్టిశబ్దమేదైనా సంఖ్యానస్ఫూర్తికి వాడమంటారు గాబోలు. మరి ఒకచోట మూలములో నున్న 'దిక్కాంతా కుచకుంభకుంకుమ రసన్యాసాయ'అనే వాక్యము తెలుగులో పంతులవారు 'దిక్కరి గమనలు కుంకుమ పూతకై' అని వ్రాస్తే 'మూలములో వీరికి (దిక్కరిగమనలకు) కుచకుంభములున్నవి. కరిగమనము లేదు. సర్వకలా శాలాధిపులకు (యూనివర్సిటీవారికి) నెఱచి పంతులవారు వీరి కుచకుంభ ములను హరించినందున బరువు తగ్గిన పిమ్మట నింక కరిగమనేమి? హరిణప్లు తమే!' అని శాస్త్రులవారు ప్రత్యాఖ్యానము చేసినారు. (చూ. విమర్శము పు. 118) 'కుచకుంభములయెడల శాస్త్రులవారికి గల అభిమానముచేత యూని వర్సిటీవారిని ఈ రసికులు ఎట్లు సాకూతముగా చెనకినారో చూచినారా? వారిశాస్త్రమే వారికిప్రమాణము. యూనివర్సిటీవా రేమంటే నేమి? లోక మేమంటే నేమి? కుచభారములో ఒక వీసమైనా తగ్గించడమునకు శాస్త్రులవా రంగీకరించరు!

కీర్తిశేషులయిన కందుకూరి వీరేశలింగము పంతులవారు గోప్యాంగ వర్ణన నిందించి సత్కావ్యములందు ఇట్టి అశ్లీలదోష ముండకూడ దని తమ గ్రంథములలో వ్రాసినారు. వీరి హితోపదేశము శాస్త్రులవారికి కిట్టదుగదా. కీర్తిశేషులయిన సీతారామాచార్యులవారు శబ్దరత్నాకర పీఠికలో 'వీరు (కవులు) వర్ణనలు సేయ మొదలుపెట్టిరా మీరు నమ్ముదురో నమ్మరో తల్లి నేని కేశాది నఖ పర్యంత మొక్కయంగమైనఁ జిక్కక సివమెత్తినట్లు వర్ణింపక మానరు. అది యెట్టి పారవశ్యమో యెఱుఁగరాదు' అని గర్హించి నారు. మనశాస్త్రులవారి దృష్టికి ఆచార్యులవారున్ను వీరేశలింగము పంతుల వారివలెనే పాషండులు.

37. (2) గొప్ప కొప్పు-గొప్పచన్నులు. వేంకటరత్నము పంతులవారి గ్రంథమునందున్న (చూ. 18-వ పుట) "మామండోదరి గొప్పకొప్పున".

అనేఒకవాక్యము విమర్శించి శాస్త్రిలవారు "గొప్పకొప్పున, పెద్దకొప్పున అనియిట్లు గ్రామ్యభంగిగా 'గొప్పచన్నులు', 'పెద్దపిఱుదులు' అనిచెప్పుట అసహ్యముగానున్నది" అని దూషించినారు; గాని ప్రమాణముచూపించినారుకారు. అప్పకవిలక్షణములో 'గొప్పకొప్పు' గానీ తప్పని చెప్పిఉండలేదు. కుటిలత్వము కోమలత్వము కుంతలముల ముఖ్యగుణములట; అవి చెప్పక గొప్పతనముమాత్రము చెప్పినందుకట ఈదూషణ. కుటిలత్వమున్ను, కోమలత్వమున్ను కవులు కుంతలములకు చెప్పినారుగాని కొప్పుకు ఎవరూ చెప్పలేదు. లక్షణశాస్త్రములో ఈవిషయమును గురించి విధికనబడనప్పుడు కవులప్రయోగములే ప్రమాణము గనుక అవి ఉదాహరిస్తాము. పాండురంగమాహాత్మ్యములో (చూ iii 65) 'పామరప్రమదలకు తేలెడుకన్నుదోయి', 'ముద్దుమొగంబు' 'అన్నువకౌను' తోపాటు 'గొప్ప కొప్పు' పెట్టినట్టే, శ్రీకృష్ణునికిన్ని 'గొప్ప కొప్పు' పెట్టి (చూ. IV. 77) "మాసరంబైన మాయూరపింఛంబుతో నైక్యముంబొంది చిక్కంబుచే గొప్పయైకొప్పు గన్పట్టి" అని రామకృష్ణకవి వర్ణించినాడు. రసికాగ్రగణ్య ముద్దుపళని రాధికాసాంత్వనములో "నీగొప్పకొప్పునకెనయౌనె శిఖికోటిఘనులతో బహుమైత్రి గన్నయంత" అని కృష్ణుని వర్ణించినది. పామరస్త్రీలకు, పురుషులకు 'గొప్పకొప్పు' ఉచితమైనా ఉత్తమస్త్రీలకు 'గొప్పకొప్పు' అనుచితమంటే, చూడండి:—శ్రీగోపీనాథకవి శ్రీకృష్ణ జన్మఖండములోని వాక్యములు.

సీ. విభుఁడు రాధికకొప్పు విచ్చినతోడనే వల్లభుసిగవిచ్చె వనజగంధి (ఆ. 2)

సీ. "కమనీయకాంచన క్రమచేలముగట్టి మోమునకస్తూరి బొట్టుదిద్ది
కుసుమదామంబుల గొప్పకొప్పమరించి నవ్యమణీభూషణములుదాల్చి
భువనమోహనవేషయై" (2) (అని అయోనిజయైన కళావతివర్ణన)

ఈకవి ఆధునికుడని ఆక్షేపమయితే, ఆంధ్రపండిత భిషక్కులకు ఆయుర్వేదము, సరసకవుల జీవాతువు, శృంగార రసార్ణవముగదా తారాశశాంక విజయము! అందలి ప్రయోగము సిద్ధమకరధ్వజమువలె భ్రాంతిని

పోగొట్టి శాస్త్రులవారిని హృష్టపుష్టాంగులనుగా జేయగలదని నమ్ముతున్నాము.

సీ. విప్పుకప్పగు గొప్పకొప్పున విరిసల్ల గలువల దండలు చెలువుమీఱె."

'గొప్పకొప్పు' తోపాటు "గొప్పచన్నులు" అని చెప్పుటకూడ అసహ్యమన్నారు చూచినారా. 35-వ పేరాలో మేమన్నమాటకు ఇది తార్కాణముకాదా?

38. (3) 'గొప్పకొప్పు'ను నిందిస్తూ వ్రాసిన వాక్యములోనే 'గొప్పపిఱుందులు' కూడా గ్రామ్యమన్నారు. 'పిఱుఁదు' శబ్దము కవులువాడినదనిన్ని అదే 'చేకొనఁగవలయు'ననిన్ని అప్పకవి అనుశాసించి ఉండగా, అందుకు విరుద్ధముగా శాస్త్రులవారు 'గొప్పపిఱుఁదులు' తప్పన్నారేమి? మాకువింతగా ఉన్నది. ఐనా, పంతులవారు 'గొప్పపిఱుదులు' అని ఎక్కడ ప్రయోగించినారో శాస్త్రులవారు చెప్పినారుకారు. 'గొప్ప' అనే విశేషణము లేకుండా, బహువచన ప్రత్యయములు వర్ణములేకుండా, 'పిఱుఁదు' అని సీతావర్ణనలో మాకు కనబడ్డది (చూ 75-వ పుట). ఈవాడుక మహాకవుల వాడుకచొప్పున ఉన్నది; గాని దానికి విరుద్ధముగా లేదు. పిఱుఁదు శబ్దము ఏకవచనముగానే గొప్పకవులందరూ వాడినారు. కొందరు 'గొప్పపిఱుఁదు' అనికూడా అన్నారు:—కళాపూర్ణోదయములో "గుబ్బ పాలిండ్లు లేఁగౌను గొప్పపిఱుఁదు"; రాజవాహనవిజయములో "గొప్ప పిఱుఁదు పెంపు" అప్పకవి గ్రామ్యమన్నది 'ముడ్డి'; దీని రూపాంతరము 'మూడి' శబ్దరత్నాకరమందున్నది; దానికి లక్ష్యము కళాపూర్ణోదయములోని ప్రయోగమున్నది. స్త్రీవర్ణనలోనిది కాదు. మల్లయుద్ధవర్ణనలో గణపవరపు వెంకన్న "గడ్డము క్రింద ముడ్డియాని" అని వ్రాసినాడు. నేటి వాడుకలో 'తుంటి' 'పిర్రలు' అనేశబ్దము లున్నవి; గాని శిష్టవ్యవహారముచొప్పున గ్రామ్యశబ్దములు, అంతకన్నను ఎక్కువ అసభ్యము 'ముడ్డి'. సంస్కృతము వాడుకభాషగా ఉన్నప్పుడుగాబోలు 'కటి' శబ్దము గ్రామ్యమని శిష్టులు నిషేధించినారు.

అయినా 'కటిసూత్రము' గ్రామ్యము కాదు; కల్పములలో దేవీపూజలో "కటిం పూజయామి" అనిఉన్నది. శ్రీనాథుఁడు నైషధములో కటిశబ్దము వాడినాడు, తలుశబ్దఘటితమైనది గనుక శాస్త్రులవారు రుపేక్షించినారు.

39. (4) బుగ్గ, చెంప—ప్రసన్నరాఘవములో (చూ. పుట 24).

సీతావర్ణనలో "ఇప్పపూమొగ్గవలెను బుగ్గ" అని ఉన్నది. అందుకు "శుకవాణిబుగ్గలు ముకురంబు లనరాదు" అప్పకవి ఇట్లుపయోగింపరాదని చెప్పినాడు" అని శాస్త్రులవారి విమర్శము; గాని వారున్నూ ప్రయోగించినారు. (చూ. పేరా 42).

40. ప్రసన్నరాఘవము (చూ. పుట 65)

చ. 'క్షితిసుతచేత వీవఁబడు కెంజిగురాకుల చల్లగాలి తత్
క్షితిపతి పుత్త్రియుగ్మకము చెంపలఁ జెమ్మటఁ బాపనోపె."

అని పంతులవారు రాజకుమారులకు "చెంపలు" పెట్టితే, శాస్త్రులవారు ఆశబ్దము 'గ్రామ్య' మని ఆక్షేపించి, 75-వ పుటలో సీతావర్ణనలో మళ్లా ఈశబ్దము కనబడితే, "మరల నీశబ్దమును ప్రయోగించుకొన్నారు. ఇదివాడుకలోకలదే యందురు. వాడుకలోని వన్నియుఁ దెచ్చిపెట్టుదురా? ఇది 'పీఁకుట' వంటిదే అని గట్టిగా బుద్ధిచెప్పినారు.

41. "పీఁకుట" వంటిదే అని చెనకడములో సూచన యేమిటంటే ప్రసన్నరాఘవములో (చూ. పు. 14, 103) రెండు మూడుచోట్ల 'పీఁకుట' అనేశబ్దమున్నది. విమర్శములో—" వీరికింతకన్న శబ్దయునొరకకపోయెనా! ఏనికగున్నలుతొండములతో సెలసింగముల జడలఁజెలఁగుచు బీఁకున్—" ఇటవక్త రాముడు; సప్తమాంకములో వక్త లక్ష్మణుఁడు. ఇట్టియుత్తమోప నాయక ప్రతినాయకులకు ఈగ్రామ్యోక్తి తగదు. పంతులవారు గ్రామ్యత్వ మధమోక్తిషు అని లక్షణము నేర్చుకొనవలయును. వీరిమతమున నీచపాత్రములకు లక్షణవిరుద్ధ మయినగ్రామ్యము పనికిరాదఁట! రావణ లక్ష్మణులకు

ఈగ్రామ్యము పనికివచ్చునఁట. ఏమి సరసవ్యవస్థ!' అని ఆక్షేపము. మేము ఈవ్యాసము ౧వ పేరాలో చెప్పినమాటకు ఇది తార్కాణము. శాస్త్రిలవారు తమప్రతాపరుద్రీయములో నీచపాత్రములకు “ గ్రామ్యభాష వాడితే, పంతులవారు గ్రామ్యద్వేషులు గనుక నాటకములలో నీచపాత్రములేకాదు, లోకమందు ఎక్కడా ఎవ్వరూ గ్రామ్యభాషవాడనే కూడదని వాదించినారు; కానితమమీద గ్రామ్యభాషకనబడితే వారి కండ్లు భగభగమండేవి. ఈ వేంకటరత్నము పంతులువారు అట్టివారుగనుక ఈ పంతులువారు వ్రాసిన యీనాటకములో ఉత్తమపాత్రములచేత గ్రామ్యభాష మాట్లాడించినట్టు చూపించి ఆక్షేపించడమునకు సందు వెదుకుతూ ఉన్న శాస్త్రిలవారికి ఈ ‘ పీఁకు ’ శబ్దముకనబడితే ఎంతో అట్టహాసము, సింహనాదము చేసి ఇట్లు వ్రాసినారు. ఎక్కడపడితే అక్కడ ‘ పీకుబవంటివి ’ అని విధివిరామము లేకుండా, అయినదానికి కానిదానికీ చెనకి చెనకి చంపినారు. అయితే శాస్త్రిలవారి విమర్శములలో ఒకవిశేషమున్నది. అదిచూస్తే కోపమూ వస్తుంది; నవ్వూవస్తుంది. ఇతరులను ఏదోషములకుగాను వీరు నిందిస్తారో, ఆదోషములు తాముచేసినవన్నమాట మరిచిపోతారు గాబోలు; ఒకవేళజ్ఞప్తియందుంటే ఆవిషయము ఎవరికీ తెలియదని, ఎవరూకనుక్కోలేరని అనుకొంటారు గాబోలు. గడుసువారేగాని మోసపోయినారు, ఈవ్యాసము రెండవభాగములో ఇట్టివిశేషములు కొన్ని విమర్శిస్తాము. ‘ పీఁకు ’ శబ్దము గ్రామ్యమని ఇంత పీకులాడిన శాస్త్రిలవారు తాము రచించిన కథాసరిత్సాగరమునందు ఈపీఁకుశబ్దము ఏలాగున వాడినారో చూడండి. ఆఘోర వానరము అతనిమీదబడి బుద్ధిపూర్వకముగా అతనిపాపమునకు శాస్తిచేయు నదియుంబోలె ముక్కుకొఱికివేసి గోళ్ళతో చెవులు పీకివేసిపాఱిపోయెను ” (చూ. పుట. 101, పంక్తి 1) ఈ వాక్యము అధమపాత్రము నోటి నుండి వచ్చినదికాదు; కథకులయిన శాస్త్రిలవారుతమనోటనుతాము పెట్టుకొన్నదే. ఇట్టివాక్యములో “ పీకి ” గ్రామ్యమైతే, ఆశబ్దముప్రయోగించవచ్చునా ? కథా సరిత్సాగరమందు ‘ వానరము ’ సన్న్యాసిచెవులు ‘ పీకుట ’ గ్రామ్యము-

కాకపోతే, ప్రసన్నరాఘవమందు ఏనిక గున్నలు పింగముల జడలుపేయుట గ్రామ్యమెందు కవుతుంది? ద్వితీయ ముద్రణమందుకూడా ఈ పేయుశబ్దమట్లే ఉన్నది. అరసున్న మాత్రము అధికముగానున్నది.(చూ. పు. 186)ఇంకా మరి కొన్ని వాక్యములలోకూడా ఈ 'పేయు' ఉన్నది. యతికథలో (చూ. పు. 242 అడుగునుండి 2 వపంక్తి) 'అభిక్షువు ఒకకంటెని పెకి చేతఁబెట్టుకొని ఇట్లనియె.' అనే వాక్యమున్నది. ఇది నీచపాత్రము నోటిమాటకాదు. హాస్యోక్తి కాదు.కథకులుగాఁశాస్త్రిలవారు స్వముఖమున వచించినవాక్యము. రెండవము ద్రణములో 'పెల్లగించి' అని దిద్దుకొన్నారు.(చూ. పు. 449 పంక్తి 15). మొదటిముద్రణము 1891 సం.ముది; రెండవది 1911 సం॥ముది పంతులవారి ప్రసన్న రాఘవము 1897 వ సం.లోను శాస్త్రిలవారి విమర్శము 1893సం.లోను అచ్చుపడ్డవి. ఇట్టి చిత్రములు ఈ వ్యాసము మూడవభాగములో అనేకములు చూపిస్తాము-ఇపుడివి చాలును.

42. 'బుగ్గలు' గ్రామ్యమని అప్పకవి నిషేధించినది నిజమే! గాని వేంకటరాయశాస్త్రిలవారుకూడా వేంకటరత్నము పంతులవారివలెనే తమ నాటకమందు 'రేకిడుతమ్మి మొగ్గకల రేదొరబుగ్గకు నాదు పట్టికిఁగాకతి వంశవీరునికిఁ గంజజుఁ డేమిగతిన్ లిఖించెనో' (అంక. III) అని ఉత్తమ పాత్ర నోటనే, ఉత్తమపాత్రనుగురించే 'బుగ్గ' అని పలికించినారే! 'చెంపలుమా' గ్రామ్యమనుటకు శాస్త్రప్రమాణము శాస్త్రిలవారు చూపించలేదు. పంతులవారు 'చెక్కిలి' శబ్దము ఎరుగనివారుకారు. మొట్టమొదట పద్యముగాను ఇంకను మరి కొన్నిచోట్లను(చూ.పు. 972)'చెక్కిళులు' ప్రయోగించినారు, 'చెక్కిలి' పద్యమందు పట్టకపోతే 'చెంప' పెట్టుకొన్నారు. చెంపశబ్దము 'కపోలము' 'గండస్థలము'లకు పర్యాయపదముగా పూర్వకవులు వాడకపోయినా; 'చెంపకొప్పు' వర్ణించినారు. (చూ. భానుమతీపరిణయము:ప్రాగ్దిశ చెంపకొప్పు) 'చెంపకాయలు'కు బదులు 'చెక్కిలికాయలు' 'చెక్కుకాయలు' అనరు. 'చెక్కులు' అనగా 'బుగ్గలు' అవునో కాదో?

బుగ్గలు ఉబ్బెత్తుగా నుంటేనే అందము. చెక్కిలి కపోలమయితే, కపోలభిత్తి కపోలఫలకము అని కవులు వర్ణించినారు. చెక్కిళ్లు చెక్కులు, చెంపలు, బుగ్గలు, కపోలము, గండస్థలము, గల్లము: ఇవి అన్నీ కవులు తమయిష్టానుసారముగా వాడితే తప్పుపట్టకూడదని మామతము. నైషధములో (3. 208) శ్రీనాథుడువాడిన గల్ల శబ్దము 'గ్రామ్యతాదోషావహమని ఆలంకారికు లాక్షేపింతు రని' శాస్త్రిలవారు వ్యాఖ్యలో వ్రాసి ఊరుకొన్నారు. ఆత్మవిశ్వాసము ఆత్మగౌరవము గల కవులు శుష్కలక్షణమునకు భయపడరు. భవభూతి గల్లశబ్దము నిరాటంకముగా మాలతీమాధవమందు వాడినాడు కాడా? మనుచరిత్రలో (5. 69) పెద్దన, పాండురంగమహాత్మ్యమందు (1. 94) రామకృష్ణుడు సభ్యవర్ణనమందే గల్లశబ్దము ప్రయోగించినారు. వారిని ఏమిచేయగలిగినది లక్షణశాస్త్రము? పిల్లలను భయపట్టే బూచి! గల్లశబ్దము సంస్కృతములోనిది కానే కాదు. ఇది ప్రాకృతశబ్దము. వాల్మీకి ప్రాకృతసూత్రములలో 1. 3. 105 గోణాద్యాః—51 'గణ్డస్థలే గల్లో' అని ఉన్నది. అందుచేతనే కాబోలు సంస్కృతము వాడుకభాషగా ఉన్నకాలమందు ప్రాకృత సాంకర్యము నిషేధించినారు. వాడుకలో లేని ప్రాచీనశబ్దములు, ఛాంధసములు 'ఆర్షములు అని' సాంకర్యమిష్టములేకనే ఆకాలములో ఇట్టివికూడా శిష్టులు నిరాకరించి ఉంటారు. ఇట్లే వాడుకలో లేని కేవల గ్రాంథికశబ్దములున్ను పామరులుమాత్రము వాడే గ్రామ్యములున్ను శిష్టుల లౌకికభాషలో కలియకూడదన్న నియమము, ఇంగ్లీషులో ఉన్నట్టు, పెట్టుకోవడము మంచిది.

43. (5) పండ్లు—'చెలియ నీదుమొగము చెలఁగుఁ జందురుఁడుగఁ బండువెన్నెల నిడుఁబండ్లడాలు' అని పంతులవారు చేటిచేత సీతను వర్ణింపించినారు. (చూ. పు. 29) ఈ వాక్యమందలి 'పండ్లు' అనే శబ్దమును దూషించి తమ విమర్శమందు—పండ్లట! చెలిపండ్లుమల్లె మొగ్గలనరాదు' 'అని అప్పకవి' అని శాస్త్రిలవారు ఉపదేశించినారు. వీరికి అప్పకవి గురువయితే

వారికి గణపవరపు వెంకటకవి గురువు. చూడండి వెంకటకవి చెప్పిన లక్ష
ణము: ప్రబంధరాజ విజయవెంకటేశ్వరవిలాసము (పు. 114)

సీ. తుఱు మహి మోము చంద్రుఁడు నును రఱసెల
బొమలు విం డ్లకు లేణములు ముకుర
నువుఁబువ్వ చెవులు శ్రీల్ నునుబండ్లు మొల్ల ల
ధర మిసు ర్చెకుర లద్దములు గవుప
తాటిగింజ మెడ చిందము వ్రేళ్ళు పగడముల్
కరము లబ్జములు కక్షములు దిరుసు
దులు కేలు తూండ్లు గుబ్బలు గిరు ల్వళు లల
రిరు వాల్ నాభి గుహ నడుము
కటు లరులు తొడ లంట్లు మోఁకాళ్ళు బొంగ
రములు పిక్కలు పాదులు గుల్ఫము లరడులు
ప్రపదములు సూర్మ్యములు నఖరము లుడుల
దగు లెడదమ్ములు వెనుపల్క వెలఁది కొప్పు.

ఈ వెంకటకవి అప్పకవికి ఎందులో తక్కువ? ఎన్నో గ్రంథాలు వ్రాసినాడు. అతని ప్రబంధరాజ విజయవెంకటేశ్వరవిలాసమునకు కీర్తి శేషులయిన పూండ్ల రామకృష్ణయ్యగారు వ్రాసినపీఠిక చూడండి. 'అమ్మా! ఇంతవాడా ఈయన!' అని మీరు ఆశ్చర్యపడతారు. ఇతడు గొప్ప లాక్షణి కుడని, మహాప్రౌఢుడని శ్రీ మోఘే జగన్నాథ మల్లుగారు వ్రాసినారు. గనుక పంతులవారి ప్రయోగము లక్షణవిరుద్ధము ఎంతమాత్రము కాదు. వెంకట కవి లక్షణముతప్పని ఒకరంటే, 'కాదు అప్పకవి లక్షణమే తప్పు' అని ఇంకొకరంటారు. మా మతము యిదివరకే చెప్పినాము గదా. ఏ లక్షణము కవిప్రయోగానురోధమో అదేఒప్పు. కవిప్రయోగములలో వైవిధ్యముంటే అంగీకరించవలసినదే. కవులు యథేష్టముగా లోకమునుండిగాని గ్రంథముల నుండిగాని శబ్దములు గ్రహిస్తారు. కూడదని నిషేధించడానికి ఈ శాస్త్రిలవా

రెవరు? ఆయన కెవరిచ్చినారు ఈ యధికారము? లేని అధికారము తెచ్చి పెట్టుకొని, ఢూం! ఢాం! హూత్! హాత్! అని అంటే ఎవరు మన్నిస్తారు వారిని ?

44. నన్నయ 'పండ్లు' శబ్దము వాడిఉంటే, మాకు కనబడలేదు; గాని తిక్కనగ్రంథములందు చాలాచోట్ల అది చూచినాము; (స్త్రీవర్ణనలో కాదు.) ఈ ప్రయోగము చూడండి. గ్రామ్యమో అగ్రామ్యమో మీరే విచారించండి.

'చ. వినుము జరానుబంధమున వెంట్రుకతండమునఁ <u>బండ్లు</u> వీనులుం
గనుఁగవయున్ జరంబొరయుఁగాని యొకప్పుడుఁ దృష్ణజీర్ణ గా ।
దు. (అనుశా. 1. 147)

శ్రీనాథుడు కాశీఖండమందు (చూ. 3. 84) గీ. పండ్లు వేర్వాసికదలు చూపకయమున్న కాలుసేయాడుతఱియంద కదలవలయుఁదీర్ఘసేవకు' అనిన్ని సాముద్రికశాస్త్రము చెప్పిన పురుషుని కల్యాణలక్షణములు వర్ణిస్తూ, సీ.గీ....భాగ్యనిధి ముప్పదియు రెండుపండ్లవాఁడు' (చూ. 4. 31) అనిన్ని వ్రాసినాడు. పాండురంగ మాహాత్మ్యమునందు (చూ.2.137) 'భక్తివృద్ధుఁడు గాఁగ బాటించె నే వేల్పు ప్రహ్లాదుఁ గడుఁబాల పండ్లనాఁడ' అనిఉన్నది.

45. (6) కాళ్లు—ఈ వ్యాసము **25**వ పేరాలో, అప్పకవి 'కాళ్లు' శబ్దము గ్రాహ్యమన్నాడో, లేక గ్రామ్యమనిన్ని ఎక్కడా వాడకూడదనిన్ని నిషేధించినాడో, లేక ఒక్క స్త్రీవర్ణనలో మాత్రమే కూడదన్నాడో స్పష్టముగా తెలియడములేదని వ్రాసినాము; గాని సుప్తార్థప్రకాశికయందు బ్ర. శ్రీ కల్లూరి వేంకటరామశాస్త్రిలవారు 'అప్పకవిగారిమతంబున, 'హరిమధ్యకాళ్లిగుళ్లనఁగరాదు' అను పద్యంబుచే 'కాళ్లు' అని ప్రయోగింపఁగూడదనియే సిద్ధాంతపఱచిరి; కాని కాళ్లనుటకుఁ గవిశేఖరుల ప్రయోగంబులు భారతమునందుఁ బెక్కులు గలవు" అనిచెప్పి, ఈ క్రిందను వ్రాసిన మూడు ప్రయోగము ఉదాహరించి 'ఇంకను బ్రయోగంబులు పెక్కులు

గలవు' అన్నారు:—(1) భార. ఆది. క. కడకాళ్లుపట్టివానిని, (2) ఆది. ఆ. 5. క. 'విని రోయుచుఁగ కాళ్లంబెనఁగి' (3) విరా. ఆ. 1) సీ. 'కాళ్ల యొప్పిద మాడు కట్లనుజ్వలము చేయంగ.' సుప్తార్థప్రకాశికాకారులు అప్పకవి మతము అంగీకరించక పోవుటకు కారణ మేమిటి? అతనిమతము కవిశేఖరుల ప్రయోగములకు విరుద్ధముగా ఉండడమేగదా! అప్పకవికి పూర్వులయిన ఆదికవులు నన్నయ తిక్కనలు రచించిన గ్రంథమందు పెక్కు ప్రయోగములుండగా (వాటిని చూడకగాని ఉపేక్షించిగాని నిరాకరించిగాని) వాటికి వ్యత్యస్తముగా అతడు చెప్పిన లక్షణము తప్పని సిద్ధాంతమయినది గదా. కల్లూరి వేంకటరామశాస్త్రిలవారు గ్రామ్యవాదులుకారు; వారికి 'గ్రామ్యము'లు అసహ్యములు. అయితే, వీరికిన్ని వీరివంటిపండితులకున్ను ఇతరుల 'గ్రామ్యము' ఒకప్పుడు సహ్యమున్ను అగ్రామ్యమున్ను అవుతుంది. అప్పకవి నిరాకరించినవి కొన్ని అంగీకరించినట్టే, కేతన గ్రామ్యమన్నవి కొన్ని అగ్రామ్యములని ఈ శాస్త్రిలవారు సిద్ధాంతము చేసినారు. మేముకూడా ఈ పండితులవలెనే, ఇతరులు చేసిన సిద్ధాంతములు అమోఘములని విశ్వసింపక, అవి లోకవిరుద్ధములుగా తోచినప్పుడు విమర్శించి స్వయముగా యథార్థము లవునో కావో నిర్ణయించుకొంటున్నాము. ఇతరులు అందరూ ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా, ఎవరి తృప్తికోసము వారు మాతృభాషావిషయములో ఇట్టి మీమాంస చేయడమునకు అధికారము గలవాళ్లే గదా. మాతృభాష ఒక్కరిసొమ్ముకాదు; పండితులు గుత్తకొన్నదిగాదు.

46. అప్పకవి బాగా భారతము చదువుకోలేదనితోస్తుంది. బాగా చదువుకొని ఉంటే, 'రణము వర్ణించుచో వీరరసమునందు యుద్ధపంచకమునఁ దిక్కయొజ్జసారెఁ గాళ్లటంచు రచించుట గాంచి కవులు చెప్పుకొనిరి మీఁగాళ్లని చెలఁగి కృతుల' అని అతడు వ్రాయకపోవును, 'కాళ్లు' 'కాలు' శబ్దములు నన్నయే వాడినాడు. సుప్తార్థప్రకాశికలో ఉదాహరించిన మొదటి

వాక్యములో 'కడకాళ్లు' అని యున్నదిగాని 'కాళ్లు' అని లేదు; ఆ 'కడకాళ్లు'యినా ఉత్తమస్త్రీవీ కావు; ఉత్తమపురుషునివీ కావు. రెండవవాక్యము సామెత. వాటికన్న మంచిప్రయోగములుదాహరిస్తాము. ఆది. 5. 18 లో 'కుంతి...గంగనీళ్లఁగాళ్లు మొగంబుఁగడిగికొని' అన్నవాక్యమందు కుంతి వంటిఉత్తమక్షత్రియ స్త్రీవిషయములో 'కాళ్ళు' శబ్దమున్నది. ఆది 6. 289 లో 'భీమసేనుండు...కాళ్లు గడిగికొని యాచమనంబుసేసి' అని, భీముని వంటి ఉత్తమక్షత్రియ వీరుని విషయములో కూడా ఈ శబ్దము నన్నయే వాడినాడు. యుద్ధపంచకమందేకాక విరాట 1. 238 లో 'కాళ్లయొప్పిద' మని అర్జునునివిషయములోను, విరా 2. 17 లో 'కాళ్ళును జేతులు వ్రేల' అని మల్లునివిషయమందును, భీష్మ, 1. 181 లో అర్జునుడు తన అవస్థ కృష్ణునితో చెప్పుకొన్న 'నిరతముగాదు గాండివము నిల్వఁగనోర్వవుగాళ్లు' అనేవాక్యమున అర్జునుని విషయమందున్ను, తిక్కనవాడినాడు. నిర్వచనోత్తరరామాయణమందు కూడా (చూ. 6. 14) కృపపుట్టె నన్నకాళ్లంబడియెన్' అని వేంకటరత్నము పంతులవారన్నట్లే సరిగాఉన్నది. వీరరసమునందు యుద్ధపంచకమున కనబడేవి తెగినకాళ్లు మొదలయినవి గనక అవి వేంకటరాయశాస్త్రులవారు 'అన్నలచిన్నల'ను గురించి చెప్పినట్టే మెడికల్ కాలేజివిద్యార్థులు పరీక్షకోసము కోసిపెట్టుకొన్న శవాంగములని అంటారు గాబోలు. అప్పకవికూడా ఉత్సాహమునకు లక్ష్యముగా రచించిన పద్యములో (చూ. 4. 277) 'కృష్ణుఁడొడిసి కాళ్లు వట్టిపెన్ ద్రోహించావు మనుచుఖురునిద్రోచెఁ గాళ్లు మీఁదుగాన్' అని కాళ్లుశబ్దము యుద్ధ వర్ణనలో ఉచితముగానెంచి ప్రయోగించినాడుగాబోలు. పాండురంగ మాహాత్మ్యమందు (చూ. 1, 126) మృగవధాజీవి శుద్ధాంత మీననయనల 'నెఱికురులు', 'నిబ్బరంపు గుబ్బచన్నులు' 'తొడలపెక్కువ' తోపాటు 'కాళ్లు' కూడా కవి వర్ణించినాడు. సభ్యమో అసభ్యమో కవులకే తెలియవలెను. విజయవిలాసములోని 'కలికినెఱివేణిచెలువంబు కాళ్లఁబెనఁగ' అనే ప్రయోగ

ముంపఁగా, సారంగధరచరిత్రలోని 'మీఁగాళ్లు' ఎందుకు అప్పకవి ఉదాహరించినాఁడో! ప్రభావతీ ప్రద్యుమ్నమందు (చూ. 2. 86) 'కచ్ఛపంబులఁ బోలి మీఁగాళ్లు పనగు' అని పింగళి సూరన ప్రయోగము అప్పకవి చూడలేదు గాబోలు. ఆధునిక కవులలో కూడా 'కాళ్లు' వాడినవారు ప్రసిద్ధులున్నారు.

బ్ర. శ్రీ. వడ్డాది సుబ్బారాయ కవిగారు విక్రమోర్వశీయము 3 అం. ఉ...నీటుగ మేడమీఁద దిగినిల్చెంచేఁ దన కాళ్లుదొ్రిలఁబోటి పెనంగి ముంపరకుఁబుచ్చఁగ నూర్వశి నన్నుడాయునా' అనిన్ని, బ్ర. శ్రీ. మండపాక పార్వతీశ్వర కవిగారు:—'తనకాంచికాళ్లఁ బెనంగఁగా' అనిన్ని ప్రయోగించినారు. వీరు అప్ప కవీయము చదివినవారేగాని అప్పకవి అనుశాసనము నిరాకరించినారు. ఇకను, 'మోకాళ్లు', 'మీఁగాళ్లు' 'గుదిగాళ్లు' మొదలయినవి తరుచుగా సరస కవులు ప్రయోగించి ఉన్నారు. పింగళి సూరనప్రభావతీ ప్రద్యుమ్నములో (చూ. 2. 86) 'కచ్ఛపంబులఁ బోలి మీఁగాళ్లు పనరు' అని నాయికనున్ను, గణపవరపు వెంకటకవి ద్వాత్రింశదవయవవర్ణనలో 'మోకాళ్లు బొంగరములు' (చూ. ప్రబంధ రాజ. పు. 115) అనిన్ని వర్ణించినారు. తారాశశాంకవిజయములో— 'గుదిగాళ్లు వెన్నునఁ గూర్చినొక్కి మదన శాస్త్రమెఱింగి...' అని ఏ యూనివర్సిటీవారికీ భయపడకుండా, వేంకటరాయ శాస్త్రిల వారివంటి రసికులు మెచ్చుకొనేటట్టు రచించిన సరస వర్ణనలో 'గుదిగాళ్లు' అని ఉన్నది. ఇంతమంది కవుల సరసరచనలలో కనబడుతూ ఉన్నా, వేంకటరత్నము పంతులవారు వ్రాసిన 'మాపినతల్లి కాళ్లకు నమస్కారణంబు నొనర్చనప్డు' అనే వాక్యములో ఉన్న 'కాళ్లకు' శబ్దము నిందించి, వేంకటరాయ శాస్త్రిలవారు 'ఈ పదమును కవులు వాడినను వాడిరిగాక గ్రామ్యకష్యావగాహిగానున్నది' అన్నారుగదా; వారీప్రయోగములు ఎరుగక ఆక్షేపించినారని ఊహింతమా? లేక, ఈ కవులందరూ తెలివితక్కువచేత గ్రామ్య

శబ్దమువాడినారనిన్ని నన్నయాది మహాకవులందరి ప్రయోగములు ప్రమాణములు కావనిన్ని నిరసించిశాస్త్రిలవారు నిరాకరించి ఉంటారని ఊహింతమా? శాస్త్రిలవారు గొప్ప పండితులయితే అయిరిగాని; వారికన్న మాదృష్టికి ఈ కవులె ఎక్కువ గొప్పవారు. ఈ కవులకన్న శాస్త్రిలవారి దృష్టికి అప్పకవి గొప్ప పండితుడైతే ఆయెనుగాని మా కీ కవులేపూజ్యులు. లోకములోను, సత్కావ్యములలోను ప్రచురముగా ఉన్న 'కాళ్లు' శబ్దము అప్పకవిలక్షణము చొప్పున గ్రామ్యమని భ్రమపడి శాస్త్రిలవారు తాము వాడకుండా ఊరుకొంటే ఊరుకోవచ్చునుగాని, ఇతరులు వాడినప్పుడు గ్రామ్యమని నిందించడము అవివేక విలసిత మనిపించుకోదా?

47. (7) 'చెవులు' అప్పకవి గ్రామ్యమని నిషేధించిన ఈశబ్దము కూడా వేంకటరత్నము పంతులవారు ప్రసన్న రాఘవములోనే అనేక స్థలములలో వాడి ఉన్నారు. అదేమో శాస్త్రిలవారు ఈ నేరము ఉపేక్షించి ఊరుకొన్నారు; వింతగా ఉన్నది; పంతులవారిని తిట్టడమునకు అవకాశము దొరికితే వృథాపుచ్చ వలసిన వారు కారు. అప్పకవి అనుశాసనము అక్షరాలా అనుసరించ వలసినదే అని శిరసావహించి శాస్త్రిలవారు 'చన్నులు' మొదలయిన శబ్దములు గ్రామ్యములని ఆక్షేపించినట్లే, 'చెవులు' అసభ్యమని తలంచి మరికొందరు పండితులు ప్రాచీనాంధ్ర గ్రంథములు దిద్దుతున్నారు; గనుక మే మీశబ్దము అసభ్యము కాదని తిక్కనాది మహాకవుల ప్రయోగము లుదాహరించి సిద్ధాంతము చేస్తున్నాము. ఏ పండితుడైనా తనకు ఈ శబ్దమిష్టము కాకుంటే తానుమానుకోవచ్చునుగాని ఇతరులువాడితే దూషించడమునకు అధికారము గలవాడు కాడు. ఇతరుల గ్రంథములు పరిష్కరింప బూనుకొన్న పండితులు లేఖకదోషములు దిద్దవలసినదేగాని గ్రంథకర్త వాడిన శబ్దములు మార్చకూడదు. అట్లా మార్చినవాడు కూటకరణ దోషము చేసినవాడే; ద్రోహి.

48. పోతన భాగవతము చదివిన వారందరికీ భాగవత మాహాత్మ్యము వర్ణించి కవి రచించిన పద్యము నాలుకకొనను ఉంటుంది. ఒక్కరీతిగానే దేశమందు అంతటా:—

క. భూషణములు చెవులకు నఘపేషణములు మృత్యుచిత్త భీషణములు హృత్తోషణములు కల్యాణ విశేషణములు హరి గుణోపచిత భాషణముల్.

అనే పాఠము సుప్రసిద్ధమని విన్నాము. మేము చదువుకొన్న అచ్చుపుస్తకములో ఈ పాఠమే ఉన్నది. అయితే 1904వ సంవత్సరమందు ఆనంద ముద్రాక్షరశాలలో ముద్రితమయిన పుస్తకములో ఈపాఠము కనబడదు; మొదటి చరణములో 'చెవులకు' బదులుగా 'వాణికి' అనిఉన్నది. కళ్లు నులుపుకొని జాగ్రతగా మరీ మరీ చూచినాము. 'వా-ణి-కి' అని మూడక్షరములు స్పష్టముగాఉన్నవి. పూర్వము అచ్చుబడ్డపుస్తకములు మళ్లాచూచినాము. 'చె-వు-ల-కు' అనినాలుగక్షరములు ఉన్నవి. తాటాకుపుస్తకాలు చూచినాము. వాటిలోకూడా 'చెవులకు' అనే ఉన్నది. ఈమార్పును గురించి పీఠికలో ఏమయినా పరిష్కర్తలు, రాయదుర్గము నరసయ్యశాస్త్రిలవారు, తంజనగరం తేవప్పెరుమాళ్లయ్యవారు, వ్రాసినారేమో అనిచూచినాము; గాని అందులో ఏమీకానరాలేదు; అయితే బ్ర. శ్రీ. నాగపూడి కుప్పుసామయ్య బి. ఏ. గారు వ్రాసిన పీఠికలో (చూ. పు. 12) "శబ్దాలంకార విశేషమును బోతననానావిధచిత్రగతులవీనుల విందుగా రచియించియున్నవాఁడు" అని, "భూషణములు సెవులకు" అనేపద్యము, 'సెవులకు' అనేశబ్దముగలపాఠమే, ఉదాహరించినారు. కుప్పుసామయ్యగారు గ్రంథములో ఉన్న "భూషణములు వాణికి" అనేపాఠముచూచి, ఎత్తుకోక, "భూషణములు సెవులకు" అని తమకు సుపరిచితమై జిహ్వాగ్రమందున్న పాఠమే ఉదాహరించడము మా ఊహను బలపరస్తున్నది; ఇంతేకాక, ఈపద్యములో 'హరిగుణోపచిత భాషణములు' వాణికి భూషణము

లని చెప్పితే, తక్కినవిశేషణములు సంగతమయి పొందికగా కనబడవు;* పొందినా, పరిష్కర్తలు అప్పకవి అవివేకముచేతచెప్పిన తప్పులక్షణము ప్రమాణముగా చేసుకొని, ప్రసిద్ధమయిఉన్న పాఠముమార్చి, లేనిపాఠము చేర్చి, పోతనగ్రంథము పరిష్కరించి ఉంటే, అట్టిపరిష్కృతి ఘోరమయిన దుష్కృతి అవుతుంది; దానికిమరి నిష్కృతిలేదు. తంజపురి సేవ పెరుమాళ్లయ్యవార్లంగారు ఏతాటాకు పుస్తకములలో "భూషణములు వాణికి" అనే పాఠముచూచినారో, తక్కిన తాటాకుపుస్తకములో నున్న "భూషణములు సెవులకు" అనేపాఠముకన్న ఈ పాఠము మంచిదనిన్ని పోతన్న ఇట్లే వ్రాసిఉంటాడనిన్ని ఊహించడమునకు తమకు ఏమికారణములున్నవో, చెప్పవలసినవారయియున్నారు. అయ్యోపోతనామాత్యా! అయ్యో ఆంధ్రభాగవతమా! పోతన ఒంటిమిట్టవాడా? ఓరుగంటివాడా? అని తగవులాడుతున్నారు గాని, పోతనగ్రంథము తారుమారుఅయితేచూడరు, చింతించరు.

అప్పకవిబోధితులయిన యిప్పటికవిపుంగవులుతప్ప నన్నయమొదలుకొని మహాకవులందరూ 'వీనులు' 'చెవులు' అనే శబ్దములు పర్యాయపదములుగా, పద్యములో ఏదిఇమిడితే అదే వాడుతున్నారు. 'వీనులు' అనే శబ్దమునకు ఏకవచనము లేనందున, ఒకదానినిమాత్రమే చెప్పినపుడు 'చెవి' అనకతీరదు. 'సెడచెవులనిడితి' (ఆశ్ర. 1,21) మొదలయిన నుడికారములలో పలుకుబడి తప్పకూడదు; 'పెడవీనులు' అనరు. 'చేటచెవులవేల్పు' అనుటకు మారుగా 'చేటవీనులవేల్పు' అంటే అసహ్యముగా ఉంటుంది. ఆంధ్రనామసంగ్రహము, సాంబనిఘంటువు, ఆంధ్రభాషార్ణవము, మొదలయిన కోశములలో 'వీనులు' 'చెవులు' చేరి ఉన్నవి. 'చెవులకు నుత్సవంబొందుచుండ' (అర. 1. 357) అని నన్నయవాడినాడు. 'చెవులకునింపెసఁగ'

---

* ఆఖ్యాహి కథాసారం మమకర్ణరసాయనం (భాగ 1.3) అని శ్రీమద్భాగవతమాహాత్మ్యమందున్నది.

(శాంతి III 395) నాచెవులకింపారఁగ (శాంతి VII.135), 'చెవులారవింటి' (ఆశ్ర. II. 130) అని తిక్కన, చెవులుచల్లంజేయఁగ (శృ. శా. II.39) అని పిల్లలమర్రి పినవీరన-ఇట్లు కవులందరూ ప్రయోగించినారు. అప్పకవే బంధ కవిత్వలక్షణములో (IV. 384 సీ. పా) 'కవులకుఁ జెవులపండువులు సేయు' అని వ్రాసినాడు. 'కావ్యంబు సరసులైన కవులచెవులకు నెక్కునఁగాని నమ్మఁ డెందుఁ బరిణతిగలుగు కవీశ్వరుండు' (నిర్వ. 9) అని తిక్కన చాలా కాలము క్రిందటనే కవులకు 'చెవులు' పెట్టినాడు. 'పవడంపుజొత్తులచెవుల రూపడఁగంగ' అని అర్జునునికిన్ని చెవులుంచినాడు (చూ. విరా. 228). కవులకున్ను ఇతరపురుషులకున్ను 'చెవులు' పెట్టడము తప్పుకాదుగాని, 'ఉత్తమస్త్రీలకు చెవులు, పెట్టితే గ్రామ్యతాదోషము కలుగుతుంది' అని వాదించే వారిని పట్టుకొని పీడిస్తూఉన్న పిశాచమును పారదోలుటకు ఈ ప్రయోగమంత్రము ఉపచరిస్తుంది. (చూ. నిర్వ. VIII. 47)

చ. పొలయు సమీరణంబు నినుపుందనుపుం దగ నింపు నెమ్మనం
బుల నొకయింపుఁ బెంప రతిబోటులు విభ్రమ మొప్ప వీఁగుఁజ
న్నులపయిఁ గేలమర్చుచుఁ బనూలత లించుక గొంకఁ గుంతలం
బులు మెల పొందఁగాఁ జెవుల పొందునఁ జేర్చుచుఁ గూడి వేడుకన్.

ఇట్లు సీతాదేవికి, ఆవిడచెలులకు 'చెవులు' పెట్టుటకు తిక్కన జంక లేదు. అయితే అతడు అప్పకవీయము చదువుకోలేదు; అప్పకవీయము చదువుకొన్న బ్ర. శ్రీ. వావిలికొలను సుబ్బారావు పంతులవారు కుమారాభ్యుదయములో (1. సీ. పా.) 'శ్రీ విలాసంబు నిసీయను చెవులను గమ్మల గొలుసులఁ గదఁక నిలిపి' అని ప్రయోగించడము వింతకాదా? అంతకన్నా వింతకాదా ఈ సుబ్బారావు పంతులవారే తమ సులభవ్యాకరణములో (చూ. 3-వభాగము, పుట 25) 'చెవులలోఁ గమ్మలు పెట్టుకొని' అని ఉత్తమస్త్రీల వర్ణించుటయందు 'చెవులు' యోగ్యమయినపదము కాదనిన్ని 'వీనులఁ గమ్మలు మెఱుంగులు గ్రుమ్మరింప' అని చెప్పనగుననిన్ని బడిపిల్లల

కోసము అనుశాసించడము? లాక్షణికుల అనుశాసనమునకున్ను వారి వ్యవహారమునకున్ను వైరుధ్యమున్నప్పుడు వాటిలో ఏది శిష్టవ్యవహారానురోధముగా ఉంటే అదే గ్రాహ్యమవుతుంది. అప్పకవిగాని వావిలికొలను సుబ్బారావుపంతులవారు గాని, వేదము వేంకటరాయశాస్త్రులవారు గాని, ఏ లేశ్వరోపాధ్యాయులుగాని ఎవరు లక్షణముచెప్పినా, లోకవిరుద్ధమైతే చెల్లఁగూడదు. అప్పకవి, వేదము వేంకటరాయశాస్త్రులవారు, వావిలకొలను సుబ్బారావుపంతులవారు 'చెవులు' అనేశబ్దము అసభ్యమన్నా, వీరికంటే తక్కువవాడు కాడు,గణపవరపు వెంకటకవి 'చెవులు'అగ్రామ్యమని, 'చెవుల్ శ్రీల్' అని లక్షణము చెప్పినాడు. (చూ. ఈ వ్యాసము 43 వ పేరా). 'శ్రీలుదారౌట నాశ్రితపద్మకర్ణికాకృతిఁ జెవుల్ కమలకర్ణికల మెఱయ' అనిన్ని, 'శ్రీమించు చెవుల రొజ్జగలు మెఱయ' అనిన్ని ఆముక్త మాల్యదలో కవి 'చెవులు' ప్రయోగించడము సరస కవుల చెవులకు కటువుగా ఉన్నదా? తియ్యగా ఉన్నదా? ఇది గోపికాదిక్షుద్ర స్త్రీవర్ణన కనుక 'చెవులు' శబ్దము కవి వాడినాడని అప్పకవిశిష్యులు సమాధాన పడుదురేమో! శ్రీలయిన చెవులున్ను, శ్రీలను మించినచెవులున్ను, అసభ్యవర్ణనలో ఉచితమగునా? పుస్తకము విప్పి పద్యాలు బాగా చదువుకొంటే తెలుస్తుంది, సభ్యమో అసభ్యమో. 'చెవులు' లేకుంటే పండితుల కుండలాలు, పేరంటాళ్ల చెవాకులు, చెవుల పువ్వులు, ఎక్కడ పెట్టడము? వినడానికి 'వీనులు' పుట్టినా, గుసగుస లాడడానికి 'చెవులే' కావలెను. 'చెవులు' చర్చ యింతటితో చాలును.

50. (8) కన్నులు, 'చన్నులు', 'కన్నులు' గ్రామ్యమని అప్పకవి నిరాకరించినా డనుకొనేవారు కేవలము బాలిశులు. అప్పకవి నిరాకరించిన శబ్దములు 'కండ్లు', 'చండ్లు' గాని 'కన్నులు, 'చన్నులు' కావు. తాటాకు పుస్తకాలన్నిటిలోను 'కండ్లు,, 'చండ్లు' అనే వ్రాసి ఉన్నది. 1859 వ సం. లో మొట్టమొదట అప్పకవీయము పరిష్కరించి ముద్రించిన పండితుడు

తెలివి తక్కువచేత దిద్దినాను. అప్పటినుంచి ఇప్పటివరకూ ఆతప్పు అలాగే అచ్చుపడుతూ ఉన్నది. పండితులందరూ కండ్లు మూసుకొని కూర్చున్నారు. పాండిత్య మీలాగున్నది. కన్నులు గ్రామ్యమని అప్పకవి నిషేధించినా డనుకోవడము అజ్ఞానమువల్ల నని చెప్పవచ్చును గాని, ఆశబ్దము గ్రామ్యమని నమ్మికొని విడిచిపెట్టడము అవివేక మనక తప్పదు. మరి, ఆశబ్దము ఏదైనా గ్రంథములో కనబడితే, ఆ గ్రంథము వ్రాసినవానిని నిందించడము, గ్రంథము దిద్దడము అతిసాహసము కాదా? పండిత పరిష్కరణమువల్ల పాడుకావడము ఒక్క అప్పకవీయమే కాదు; సరసభూపాలీయముకూడాను. అచ్చుపుస్తకములో 4 వ ఆశ్వాసము 10 వ పద్యము చూడండి:—

క. పామరుల భాష గ్రామ్యము భామిని కటి గల్లములు విభాసిల్లు ననన్
గోమలి చన్నులుఁగన్నులు గాముని పండువు లొనర్చెఁ గడువడి ననఁగన్.

మావద్దనున్న వ్రాతప్రతిలో ఉత్తరార్ధము ఇట్లా లేదు. "గోమలిచండ్లు కండ్లకు నామని పండువు లొనర్చననిశముననగన్" అనిఉన్నది. (డ్లు అనే అక్షరముమీద 'డులు' అని వ్రాసిఉన్నది.) పూర్వులు ఎవరూ 'కన్నులు' గ్రామ్యమని చెప్పనే లేదు. మహాకవులు రచించిన గ్రంథాలు బాగాచదువకుండా అప్పకవీయములాటిలక్షణము మాత్రము వల్లించుకొని తప్పొప్పులు ఏర్పరించే తెలివిలేని లాక్షణికులు, ఇప్పటివారు కన్నులు, గ్రామ్యమని బడిపిల్లలకు వ్యాకరణాలలో వ్రాసి బోధపరుస్తున్నారు. 'గ్రాంథికభాష' తెలిసినవారు వేయిమందిలో ఒకడయినా ఉండడు గనుక పండితు లేమంటే అదే సత్యమని లోకులు నమ్ముతారు. "కానని వాని నూఁతగొని కానని వాఁడు విశిష్టవస్తువుల్ గానని భంగి" గుడ్డిపండితులను నమ్ముకొని తెలుగువారు మోసపోతున్నారు. ఈకాలమందు మరి యేదేశములోనైనా దేశభాషా పాండిత్యము ఇట్టి దురవస్థలో నున్నదా? దేశభాషతో తమకేమీ సంబంధము లేనట్టు దేశభాష గుడ్డిపంతులకు గుత్తకిచ్చివేసి, తాము కళ్లుమూసుకొని ఊరుకొన్న నాగరకులు మరియేదేశమందైనా క్రీ. శ. ఇరవైయో

శతాబ్దమందున్నారా? ఏమికర్మము! ఏమిపాపము' తెలుగుభాషకు, తెలుగు వారికి ఏమిఇంత దుర్గతి పట్టినది! దేశస్థులభాష, దేశమందున్న శిష్టులభాష, గ్రామ్యమట! పండితులకైనా బాగారానిది గ్రాంథికభాషట! అయ్యో! దేశభాషా! నిన్ను తృణీకరించడముచేత నేగదా నూటికి పదిమందైనా తెలుగక్షరాలు వచ్చినవాళ్లు దేశములో లేకపోవడము, చదువు నేర్చిన వాళ్లయినా తెలుగుపుస్తకము ముట్టుకోకపోవడము, ఇంగ్లీషుపుస్తకాలే ఎప్పుడూ చదువడము సంభవించినది! ఇకనైనా తెలుగువారు కండ్లు విప్పి చూతురా!

51. ప్రస్తుత మనుసరింతాము. విచక్షణులుకానిలాక్షణికులేమంటేనేమి? నన్నయాది మహాకవులందరూ 'కన్నులు' అనేశబ్దము సభ్యవర్ణనలోనే వాడి ఉన్నారు. నన్నయ గిరికాదేవిని వర్ణిస్తూ "కలికిక్రాల్గన్నుల తెలుపు" (ఆది. III 29) అనిన్ని; ఉత్తరను వర్ణిస్తూ 'చన్నులుఁ గన్నులు" (విరాట 1. 245) అనిన్ని తెనాలిరామకృష్ణుడు భగవంతుని "వేషదకన్నులవాని వెయినామములవాని (పాండు 1. 213) అనిన్ని, జక్కన "కన్నులు గండుమీలు" అనిన్నీ, వాడిఉన్నారు వందలుకాదు; వేలు ప్రయోగాలు ఉదాహరింపవచ్చును. 'కన్నులు' అనవలసినప్పుడెల్లా 'కనుదోయి' 'కనుఁగవ' అనవలసిన నియమము లేదు! లేదు! లేదు!

52. (9)బొడ్డు—ఈశబ్దముకూడా గ్రామ్యమట! స్త్రీలయినా పురుషులయినా ఉత్తముల 'బొడ్డు' 'పొక్కిలి' అనవలెనట! గుడ్డిలక్షణము! గుడ్డిపాండిత్యము! సభా. 1. 143 "ఒక్కొక్క చన్నును, చెవియును, చెక్కును, జనుబొడ్డు మూఁపు..." లోనిమాటలు మెడికల్ కాలేజీలో వాడవలసిన 'అన్నుల చన్నుల' వంటి వంటారు గాబోలు; పోనీండి. విజ్ఞా. ఆచా. "బొడ్డు క్రిందియంగములు విప్రుఁజోఁకిన నచటు గడుగవలయును" దీనిలో నున్న 'బొడ్డు' శానిటరీ డిపార్టుమెంటువారి పరిభాష అంటారా? వరాహ X. 58. 'బొడ్డుబంటిగా' ఇది ఇంజనీరింగు కాలేజీపరిభాష గాబోలు!

నాసికాపుటములు, నయనముల్, శ్రోత్రముల్, బొడ్డును, వక్షంబు భుజము లందు (52)—ఈవాక్యములో ఆరవయవముల పేళ్లున్నవి; వాటిలో 'బొడ్డు' ఒక్కటే ఏమిపాపము చేసుకొన్నది? దాన్ని మంత్ర శాస్త్రపరిభాషలో చేర్చుకొంటాముగాని, కావ్యాలలో ఉంపనీయ మంటారు గాబోలు! అయితే, ఇదో? కాశీ. V. 224 "అనంతరంబు బొడ్డునివురుకొంచుం బ్రాణాపాన సమానోదాన వ్యానంబులు తృప్తిబొంది నాకు నానందం బొసంగుంగాతయని యాశీర్వదించుకొనునది"—ఇది కుక్షింభరణ పరాయణుల పరిభాషే, గాని కావ్యాలలో బ్రాహ్మణసంతర్పణము వర్ణించరా? పానీంశి. భాగ II. 240. చ. "ప్రియుఁడను బొడ్డుఁదమ్మి తొలిబిడ్డను వేలుపుఁబెద్ద" భాగ IX. 376. సీ. ఒకవేయి తలలతోనుండు జగన్నాథు బొడ్డుదమ్మిని బ్రహ్మపుట్టెమొదట'. చిత్రభార. IV. 120...'బొడ్డుఁ దామర పువ్వునఁ బొడమినట్టి ముద్దు పాపఁడు నాలుగు మోములాఁడు'— ఈవాక్యములలో 'బొడ్డు' పురుషులది; మొగవాళ్ళకు 'బొడ్డు' న్నా ఆడవాళ్లకుమాత్రము 'బొడ్డు' పెట్టడము గ్రామ్యము; పొక్కిలే ఉండవలెను; కాంతా సమ్మితములయిన సత్కావ్యములలో సత్కవుల సాంప్రదాయము అదే; అని వాదించే పండితుల అజ్ఞానధ్వాంతభాస్కర మనే భేషజము ఇదిగో! పింగళిసూరన రచించిన ప్రభావతీప్రద్యుమ్నములో (చూ. II. 83) ప్రభావతిసౌందర్యము వర్ణిస్తూ హంసి ప్రద్యుమ్నునితో చెప్పిన వాక్యము చూస్తే తెలివివస్తుంది.

తే. నెన్నడిమి పేరిమింట నన్నెలఁతబొడ్డు,
పొన్నవిరి నిక్కముగఁజూచి చిన్నబోదు
రభ్రకుసుమ సౌరభ సాధనార్థహేతు,
వాశ్రయాసిద్ధమనియెడి యయ్యలెల్ల.

సూరనా సత్కవి! ప్రభావతీ ప్రద్యుమ్నమా సత్కావ్యము! ప్రభావతా ఉత్తమనాయిక! ప్రద్యుమ్నుఁడా ఉత్తమనాయకుడు! వాక్య

మా వాణి యనుగ్రహమున శబ్దసంస్కార పూతమయిన ముఖముగల ‘శుచి ముఖి’ పలికినది!

దుష్ట లక్షణమువల్లను గుడ్డిపండితుల అవిమృశ్యకారిత్వము వల్లను ఆంధ్ర భాషకు, ఆంధ్ర సారస్వతమునకు, ఎంతకీడు కలుగుతున్నదో చూచినారా?

అది, ఇది: వాఁడు; వీఁడు.

53. పూజ్యురాండ్లయిన ఉత్తమ స్త్రీలనుగురించి మాట్లాడేటప్పుడు ‘అది’ ఇది, అనే సర్వనామములు ఇప్పటి లౌకిక భాషలో శిష్టులువాడరు. అయితే, ఇప్పటి లౌకికభాష గ్రామ్యమని వేంకటరాయశాస్త్రులవారు నిరాకరించినారు; వారికి గ్రంథములలోని భాషమాత్రమే సాధువు; దానికి వ్యతిరిక్తమైనది, శిష్టజన వ్యవహారమందున్నా సాధువుకాదు. ఇట్టినియమము గల శాస్త్రులవారు నేటిభాషా మర్యాద ప్రమాణముగా చేసుకొనికాబోలు వేంకటరత్నముపంతులవారి ప్రయోగములను నిందించినారు; ఇదిమాకు వింతగానున్నది. ఆంధ్రప్రసన్నరాఘవములో (చూ. పుట. 26) రాముడు సీతను గూర్చి:—

“క. ఇదె నామదియను కలువకు, ముదంబునిడు శారదమగు పున్నమరేయై
పొదలెడు వెండియు నీయెడ, నిదియె జగన్మోహిని యన నెసఁగెడునాహా.

ఈప్రయోగమును నిందిస్తూ శాస్త్రులవా రేమన్నారో చూడండి:—
‘ఇది’, ‘ఇదియె’ యని సీతను రాముఁడు ప్రయోగించుట కడువిరసముగా నున్నది. వృద్ధ పత్యుచితము. (చూ. విమర్శము పు. 90). ప్రసన్నరాఘవమందే (చూ. పుట 29) రామలక్ష్మణసంభాషణములో, “లక్ష్మణుఁడు ఆర్యా! ఇది యగపడుచున్నది. రాముడు—అదియెట్లు తిరిగివచ్చెను?” అనేవాక్యము లున్నవి. శాస్త్రులవారి విమర్శములో (చూ. పు. 107). “ఇందు ‘ఇది’ యనుపదము సీతాపరముగా రాముఁడుగ్రహించినట్లు ఉత్తర

వాక్యమువలనం దెలియుచున్నది. లక్ష్మణునిచేత సీతను 'ఇది' యనిపించుట రామునిచేత 'అది' యనిపించుట రసాభాసముగా నున్నది. వృద్ధపత్న్యుచితమని తెలిపియున్నాఁడు" అని రెండవ మారు ఆక్షేపించినారు. మరి ఒకచోటకూడా 'ఇది' అని సీతనుగురించి రాముఁడన్న వాక్యములో ఉంటే, 'నాగరముగా లేదు' అని మాత్ర మన్నారు (చూ. విమర్శము పు. 251). ఇట్లు ముమ్మారు జంకులేకుండా 'ఇది' 'అది' అనేశబ్దములు ఉత్తమస్త్రీలనుగురించి భర్తలయినా వృద్ధపతులయితేనే తప్ప ప్రయోగించి వాడకూడ దని శాస్త్రిలవారు నిషేధించినప్పుడు, తమ అభిప్రాయమందు దృఢ విశ్వాసము గలవారనే ఊహించవలెనుగదా. మరి, చూడండి ప్రాచీనకవులు ఈశబ్దములు ఉత్తమ స్త్రీలనుగురించి చెప్పిన వాక్యములలో ఎట్లు వాడి ఉన్నారో.

54. మొట్టమొదట ఆదిమకవి నన్నయ రచించిన భారతములోనివే ప్రయోగాలు స్థూలదృష్టితో చూస్తే కనబడ్డవాటిలో మూడుపదులు ఉదాహరిస్తాము.

(1) ఆది. I. 29. సీ. "ఎవ్వరిసతియిది సెప్పుమా జాతవేద." (భృగుపత్ని).

(2) ఆది. I. 130. "ఇది నాకుఁ దొల్లి వరియింపంబడినభార్య"

(3) ఆది. III. 38. వ. "అదియును, యిమ్మునిశాపంబిచ్చునో యని వెఱచి యిట్లనియె" (సత్యవతి వ్యాసునితల్లి)

(4) ఆది. 3. 40 వ...'అది గంధవతి యనియు యోజనగంధియనియుఁ' బరగి)

(5) ఆది.4.49చ. ఇదిమునినాథకన్యయని యెంతయుఁ నిస్పృహవృత్తినున్న నా
హృదయము రాజపుత్రినని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిగించి నన్ మదనబాణ పరంపర కిప్పుడుండు నా
స్పదమయి సంచలించె నళి పాతి వికంపిత పంకజాకృతిన్.

ఇట్లు దుష్యంతుడు శకుంతలను వివాహము చేసుకోఁగోరి దానిని గురించి చెప్పినవాక్యములో ఆరాజుచేతనే నన్నయ 'ఇది' అనిపించినాడు. దుష్యంతుడు 'వృద్ధపతి' కాదు గదా! శకుంతలవృద్ధనారి కాదుగదా! వేశ్య కాదుగదా!

(6) ఆది. 4. 134 వ...ప్రతీపుండు దానిం జూచి...యిట్లేల నాకు రువెక్కి తనిన నది యిట్లనియె [గంగాదేవి, ముసలిదికాదు; ఉత్తుంగపయోధరద్వితయ]

(7) ఆది. 4. 137 వ...అది యును నట్ల చేయుదునని యదృశ్య యయ్యె ('అది' గంగాదేవి)

(8) ఆది. 4,143 చ. కనిముని కన్యయో దనుజకన్యకయో భుజగేంద్రకన్యయో
యనిమిషకన్యయో యిది వియచ్చర కన్యకయో...

ఇట్లు 'ఇది' అని గంగాదేవినిగురించి శంతనునిచేత నన్నయ అనిపించినాడు. శంతనుడు 'వృద్ధపతి' కాడు; 'సంప్రాప్తయౌవనుడు'.

(9) ఆది. 4.144 వ. అదియును నమ్మహీపతి రూపయౌవనసౌందర్య విలాసంబులకోటువడి ('అది' గంగాదేవి)) ... ...

(10) ఆది. 4.152 వ...అదియుం ద్రోలిచేసిన సమయంబు దలంచి ('అది' గంగాదేవి)

(11) ఆది.4.225 వ...దీర్ఘతముండు ప్రద్వేషిణినడిగిన నది యిట్లనియె ('అది' బ్రాహ్మణి)

(12) ఆది. 5.189 సీ.గీ....దివిజ నాయకుఁడతి భీతి నెఱిఁగి వాని తపముఁ జెఱుపఁబనిచె | జలజనయనఁ దరుణి జల పది యనియెడుదాని; నదియుఁ వచ్చె వానికడకు.

(13) ఆది. 6.217 తే....ఇది చాలనబల దీని కలుఁగఁగఁజనదు(హిడింబి)

(14) ఆది. 7.72సీ.గీ. సర్వలక్షణ ప్రశస్తాంగి యిది దివ్యకన్యయగు... ఇట్లు సంవరణుడు తపతిం జూచి పలికిన వాక్యములో 'ఇది' అన్నాడు. ఇతడు వృద్ధపతికాడు; 'అభినవ యౌవన విభ్రమోద్భాసితుడు'

(15) ఆది 7.213. క. గురువచన స్థితిమనకేగురకును నిది పత్నిగా దగుట్, ఇట్లు ధర్మరాజు తమ్ములతో ద్రౌపదినిగూర్చి చెప్పినప్పుడు 'ఇది' అన్నాడు. ద్రౌపదీ వివాహమునకు పూర్వము పాండవులు వృద్ధులుకారు గదా! ద్రౌపది నిత్యయౌవన' అని శాస్త్రులవారికి తెలుసును; తెలియక పోయినా, పెళ్లి నాటికి ముసలిది కాదుగదా? ఉత్తమస్త్రీయేకదా? ఇట్టి దానినే, ధర్మరాజుచేతనే, నన్నయభట్టు, 'ఇది' అనిపించినాడు!

(16) ఆది. VIII 104 సీ. అబ్జజువీడ్కొని యది దేవసభకుఁ బ్రదక్షిణంబొనరింప. (ఆది తిలోత్తమ)

(17) ఆది. VIII 108 క. ఇదినావల్లభ యిదినాహృదయేశ్వరి యనుచు గోరి యిరువురు మదనోన్మదులయి పరిగ్రహించిరి. ('ఇది' తిలోత్తమ; పరిగ్రహించినవారు సుందోపసుందులు వృద్ధులుకారు.)

(18) ఆది. VIII 154 క...ఆతని కదియిట్లనుచుఁ జెప్పె ('అది' వందయను నప్సరస).

(19) అర. II 75 వ. కావున నిది మదనుజీవితయనియు నన్వ్రత యనియు నన్ను విడువక నాయనుగమనంబునకు ననుమతుండవు గమ్ము. ('ఇది' దమయంతి).

(20) అర II. 77. వ॥ ఇది నన్నుంగానక తనబంధులయొద్దకుం బోయి దుఃఖంబునం బొరయకుండును ('ఇది' యని దమయంతినిగూర్చి నలు డన్నాడు).

(21) అర. II 141 వ. ఇది పతివిముక్తయై యొప్పకుండియుఁ దనపతివ్రతాగుణంబున నొప్పుచున్నయది ['ఇది' యని దమయంతినిగూర్చి సుదే

వుఁడను బ్రాహ్మణు డన్నాడు; అతడు ముసలివాఁడు కావచ్చును; గాని దమయంతికిపతికాడు.

(22) అర. 2. 147. వ. అయ్యా యిది యెవ్వనికూఁతురు? [దమయంతిని గురించి రాజమాత సుదేవునితో అన్నవాక్యము]

(23) అర. 2. 148 మధ్యాక్కర. నలినాక్షియిది విదర్భేశుతనయ పుణ్యశ్లోకుఁడైన నలుదేవి దమయంతిసుమ్ము [అని సుదేవుని ప్రత్యుత్తరము].

(24) అర. 2.154 వ. అదియునుఁగూఁతు నభిప్రాయంబు భీమున కెఱింగించిన [ఇక్కడ 'అది' భీమరాజు పట్టమహిషి, దమయంతి తల్లి].

(25) అర. 2. 193 వ. కేశినియును బాహుకుపలుకులు నాకారంబును దమయంతి కెఱింగించిన నది యాతని నలుంగా శంకించి, ['అది' దమయంతి]

(26) అర. 2. 203 వ. అది యప్పుడ భీము ననుమతంబున దమయంతి యొద్దకు బాహుకు రావించిన ('అది' దమయంతి తల్లి).

(27) అర. 2. 332 అదియును మునివరు నభిప్రాయం బెఱింగి... యిట్లనియె. ('అది' లోపాముద్ర; ముని అగస్త్యుడు.)

(28) అర. 3. 186 వ. అది పతిచేత ననుజ్ఞాతయై చని నాకు యౌవన వరం గావింపుండని ('అది' సుకన్య. దానిపతి భార్గవచ్యవనుడు వృద్ధేగాని అశ్వినులు వానిని నవ యౌవనుని చేసినారు.)

(29) అర. II. 302. క. ఈరాజపుత్త్రిఁ దోడ్కొని దారుణ పాషాణ దుష్పథంబులఁ జనఁగా నేర మిది నడవనోపదు, భూరిభుజా అని ధర్మరాజు ద్రౌపదినిగురించి భీమునితో అన్నవాక్యము. ధర్మరాజు ఇప్పటికి ఇంకా 'వృద్ధపతి' కాలేదే!

(30) అర. III. 306 తే, అబల యిది భవనాత్మత నిత్యాధ్వగమన ఖిన్నయైనది గజరాజ ఖేలగమన దీనినీవెత్తికొని చనుదెమ్ము—అనిభీముడు ఘటోత్కచునితో ద్రౌపదినిగూర్చి చెప్పినాడు. భీముడు వృద్ధపతికాడు.

నన్నయ వలెనే తిక్కన ఈశబ్దములు వాడినాడు; మచ్చుకు రెండు ప్రయోగములు చూపెండి: ఆయన గ్రంథము మొట్టమొదటిపర్వము మొదటి ఆశ్వాసములోనే పదిపుటలు తిప్పిచూస్తే కనబడ్డవి ఉదాహరిస్తాము.

(1) విరా. 1. 103 చ. ఇది గడుముద్దరాలు పనులేమియుఁ జేయఁగ నేరదు. ఇట్లు తిక్కన ధర్మరాజుచేత ద్రౌపదిని 'ఇది' అని అనిపించినాడు. ధర్మరాజు ఇప్పుడు వృద్ధపతి అని వేంకటరాయశాస్త్రులవా రంటారా?

(2) విరా. 1. 151 ఆ. అకట మనము వచ్చినది గడుదవ్వు నేఁడపారంబు సాత్తమనితలంచి తఱిమినడచితిమి లతాతన్వి యిది వడగొనియె మోచి తెమ్ము కొంతదవ్వు. ఈవాక్యములోకూడా ధర్మరాజుచేతనే ద్రౌపదిని 'ఇది' అనిపించినాడు తిక్కన. ఇట్టి ప్రయోగములు కావలసినన్ని తిక్కన భారతములో ఉన్నవి.

భారతకవులు ముగ్గురూ ఇట్లువ్రాసినారని చూపించడమునకు ఎఱ్ఱాప్రగ్గడ భారతములోనివికూడా కొన్నిప్రయోగములు ఉదహరిస్తాము.

అర. VII. 172. వ.అదియును సాళ్వపతియైన ద్యుమత్సేనుని కొడుకు సత్యవంతుండు రూపవంతుండనియును...విని వానియందుఁజిత్తంబు దగిలి యున్నను... ('అది' సావిత్రి)

అర. VII. 177వ. అనిననదియుఁ...దండ్రికిట్లనియె. ('అది' సావిత్రి)

అర. VII. 191 తే. విగతరాజ్యులమై ఘోరవిపినములకువచ్చి యిమ్మెయి దపమున్నవారమేము! బాలసుకుమారి యిది జనపాల యడవి నుండి మాతోడి యిడుమకు నోర్చునయ్య.

(ద్యుమత్సేనుడు తనకు కోడలుకానున్న సావిత్రినిగూర్చి 'ఇది' అనే శబ్దము ప్రయోగించినాడు)

అర. VII. 207 వ. సత్యవంతుఁడు నీవు త్రిరాత్రోపవాసంబునం జేసి యెంతయుం డస్సినదానవు రా నోపవనినది వానికిట్లనియె. ('అది'సావిత్రి)

57. భూరిప్రయోగ మహిమచేత నిష్కళంక మనతగినవాడుక నింద్య మని వేంకటరాయశాస్త్రులవారు ఎందుచేత దూషించినారు? భారతములో నన్నయాదులు తరుచుగా ఈశబ్దములు సత్సందర్భమందు వాడిఉన్నారని శాస్త్రులవారు ఎరుగరా? ఎరిగినవారయితే ఇది వాడినందుకు వెంకట రత్నము పంతులవారిని ఎకసక్కెములాడి నారేమి? రాముడు సీతను 'ఇది' అనుట 'వృద్ధపత్న్యుచితమని' నొక్కినొక్కి చెప్పెనకినారే! దుష్యంతునిచేత శకుంతలను, శంతనునిచేత గంగాదేవిని సంవరణునిచేత తపతిని, ధర్మరాజు చేత ద్రౌపదిని నలునిచేత దమయంతిని; ఇట్లు వృద్ధులుకాని ఉత్తమ పురుషులచేత, ఉత్తమ స్త్రీలయిన భార్యలను 'ఇది' అని నన్నయ అనిపించగా, ఔచిత్యభంగము లేనప్పుడు, రామునిచేత సీతను 'ఇది' అని వేంకటరత్న ముపంతులవా రనిపించితే ఎందుకుంటుంది? శాస్త్రులవారు ఇందుకు పంతుల వారిని నిందించి నన్నయాదులను నిందించినవార యినారు కారా? శాస్త్రుల వారు నన్నయాదుల ప్రయోగములు ఎరిగిఉండిన్ని పంతులవారిని ఆక్షేపించి నారంటే శాస్త్రులవారియందు దౌర్జన్యమో, దౌర్మనస్యమో, ఏదోదోషము ఆరోపించవలసివస్తుంది; శాస్త్రులవారు ఈ ప్రయోగములు ఎరుగరు అని చెప్పితే, వారికి ఆంధ్రభారతమయినా బాగా రాదని సిద్ధాంతమవుతుంది. ఏమి సమాధానము? పోనీ, నన్నయాదులు ఔచిత్య మెరుగనివా రని అందామా? అంటే, ఆంధ్ర సారస్వతమున కాధారమే ఉండదు!

58. అన్నట్టు చెప్పమరచినాము. శాస్త్రులవారు శ్రీనాథుని నైషధ మునకు సర్వంకష వ్యాఖ్య వ్రాసినారుగదా. శ్రీనాథుడు నలునిచేత దమ యంతిని 'ఇది' అని అనిపించినాడని ఎరిగేఉంటారు.

తే. అలకతిమిరాభిదృశ్యఫాలార్ధచంద్ర మెలఁత<u>యిది</u>కృష్ణపక్షాష్టమీ త్రియామ; దీని ప్రాపున నేలసాధింపకుండు విషమబాణుండు త్రిజగతీవిజయసిద్ధి. నైష. III. 160. ఈపద్యమునకు వ్రాసిన టీకలో 'మెలఁతయిది=ఈయువిద' అని శాస్త్రిలవారే అర్థముచెప్పినారు. అయితే, 1913వ సం,లో శాస్త్రిలవారు నైషధము చదువుకొన్నారు. ఆంధ్రప్రసన్నరాఘవ విమర్శము 1898వ సం.లో వ్రాసినారు; అంతకు పదిహేనేళ్లు పూర్వము. ఈవ్యాసము (21 వ పేరాలో) 'తేఁ దయ్యో మున్' అనేశబ్దమునుసరించి శాస్త్రిలవారు పంతులవారిని అనరానిమాటలనడము అజ్ఞాన విజృంభణమని ఊహించుటకు ఏకారణములు వివరించినామో, అవే ఇక్కడకూడా అనుసంధానము చేసుకోవలెను. ఆంధ్రప్రసన్నరాఘవము విమర్శించేనాటికి శాస్త్రిలవారికి భారతముగాని, అథమపక్షము నలచరిత్రైనాకాని, నైషధముగాని, బాగారాదని ఊహించడము తప్పుకాదు. ఆంధ్రపండితులమని పేరు పెట్టుకొన్న శాస్త్రిలవార్లుగానీ, పంతులవార్లుగానీ, మనుచరిత్రయినా చదువనివారు సాధారణముగా ఉండరుగదా; మనుచరిత్రమందు (IV. 38) క. అంత ననుఁగాంచి యది విపినాంతరమునఁ బాఱవైచి యరిగె... అని దేవతాస్త్రీపుంజకస్థలను 'అది' అని బాని కూతురిచేతనే ఆంధ్రకవితాపితామహుడు అనిపించినాడు. తల్లిని కూతురు 'అది' అంటే అనౌచిత్యము కాదని సమాధానము చేసుకోవచ్చుననేవారు, మొగుడు పెండ్లాన్ని 'ఇది' అంటే, అనౌచిత్యదోషము కలుగుతుందని వాదిస్తే, చెల్లుతుందా? నన్నయాదిమహాకవులకు గ్రాంథికాంధ్రము రాదని సిద్ధాంతమైతేనేకాని గ్రాంథికాంధ్రము శాస్త్రిలవారికి బాగావచ్చునని సిద్ధాంతముకాదు. ఏమంటారో శాస్త్రిలవారు?

59. విచక్షణులయితే, శాస్త్రిలవారు ఆలోచించుకొందురుగాక: మేముదాహరించిన మహాకవిప్రయోగములలో, 'అది', 'ఇది' అనేసర్వనామములకు బదులుగా వాడుటకు మరి ఏసర్వనామములు తెలుగులో ఉన్నవి? 'ఇది ముద్దరాలు' అనేవాక్యములో 'ఇది' తీసివేసి, 'ఈబిడ్డ',

'ఈమె', 'ఈకె', 'ఈపె', 'ఈయమ' 'ఈయమ్మ', 'ఈయవ్వ', 'ఈమెగారు' మొదలయిన శబ్దములలో ఏదయినా వాడితే, అనౌచిత్యగోషము పోతుందా? 'అది', 'ఇది' వాడినట్లే ప్రాచీనకవులు ఆశబ్దముల ద్వితీయాది విభక్తులు 'దానిని', 'దీనిని' మొదలయినవన్నీకూడా వాడిఉన్నారే; ప్రథమావిభక్తి తప్పైతే తక్కినవిభక్తులుకూడా తప్పులేకావలెను. ఇవన్నీ శాస్త్రిలవారు పసిచిపెట్టితే మౌనమువహించి మహామునులు కావచ్చును. వారిమాటచొప్పున గ్రాంథికభాష వ్రాసేవారుకూడా వారివంటి మహామునులవుతారు. వారిగ్రంథాలుకూడా మౌనముద్రవహించి, త్యాజ్యమవుతవి. అయితే, లోకవ్యవహారమునకు హానికలుగకుండా మాత్రము లౌకికభాషలో ఉన్న 'ఇది', 'అది' 'దీని' 'దాని' మొదలయిన శబ్దములు లోకులు వాడకమానరు. శిష్టసంప్రదాయమును అనుసరించి లోకులు అది, ఆవి(బి)డ, ఆమె, ఆపె, ఆకె, వారు, ఆయమ్మ, ఆయమ్మగారు మొదలయినవన్నీ ఏ సందర్భములో ఏది ఉచితమో, అదే వాడుతారు; చిన్నపిల్లలయినా తప్పు చేయరు. ప్రాచీనగ్రంథములు వెదకి ప్రమాణములు పండితులు కనుక్కొనే వరకూ వ్యవహారము ఆగదు. పండితులకు గ్రాంథికభాషేకాని లౌకికభాష అక్కర లేదుగనుక, వారి గ్రాంథికభాషలోని శబ్దముల ఔచిత్యానౌచిత్యములు విమర్శించవలసి వచ్చినది. గ్రాంథికభాషలో నన్నయాదులభాష అత్యుత్తమమైనది గనుక వారిగ్రంథములలోని ప్రయోగములనుపట్టి మావాదము సమర్థించినాము. తప్పుంటే, ఒప్పుకొని దిద్దుకొంటాము.

వాఁడు – వీఁడు

60. లౌకికభాష నింద్యమని నిరాకరించి, పరమపవిత్రమయినభారతభాష అభ్యసించిన శాస్త్రిలవారు, ఆరెండు భాషలకూగల వైధర్మ్యము మరచి, లౌకికభాషా లక్షణము ప్రమాణముగాచేసుకొని, భారతభాషను దూషించడము విపరీతముగాఉన్నది. ఈవైపరీత్యము (వీఁడు) అనేశబ్దమునుగురించి వీరుప్రకటించుకొన్న ఔచిత్యజ్ఞానమందు కనబడుతున్నది. ఆంధ్ర

ప్రసన్నరాఘవములో (చూ. పుట 40) జనకవిశ్వామిత్ర సంభాషణమందు రామునిచరిత్రము ఏమీ ఎరుగని జనకుడు, రాముని గుణములు విశ్వామిత్రుడు వర్ణించగా విని, సంతోషించి, అన్నవాక్యమిట్లున్నది:—'ఎట్లు వీఁడు వీరావతారుఁడు కుమారుండు?" ఈ వాక్యమునకు పూర్వము కుండలీకరణము చేసి "సహర్షంబుగ" అని పంతులవారు వ్రాసి ఉన్నారు. దీనివిమర్శములో శాస్త్రులవారి ఔచిత్య వైలక్ష్యము మరిఒకమారు ప్రకటితమయినది చూడండి పంతులవారికి ఎంతసరసముగా ఔచిత్యముబోధపర్చినారో శాస్త్రులవారు.

కడమ యన్ని విషయము లట్లుండ 'వీఁడు' అన్నందులకు రాముఁడు విశ్వామిత్రులవారు లేకున్న జనక రాజును ఏగతి పొందించి యుండునో? ఏమి పంతులవారి యౌచిత్య జ్ఞానము? ఇతఁడని యేని వ్రాయరాదా? మఱి యీ వాక్యమును ఇట్లు ప్రశ్నగా తెగులఁ బెట్టక, 'ఎట్లువీరావతారుఁడీ కుమారుండు!' అని యాశ్చర్యపడిన నెంతబాగుగా నుండును! శివ శివా! సర్వనామములను పృథక్కరించి వీరు ఈ గ్రంథము నెల్ల నేమి యసహ్యము చేసినారు! (పుట. 140 విమర్శము.)

61. పంతులవారు కుండలీకరణము చేసి, ('సహర్షంబుగ') అని వ్రాసినమాట శాస్త్రులవారు చూచిన్నీ, జనకుని వాక్యమందున్న 'వాఁడు' శబ్దము రాముని యెడల జనకునికి తిరస్కార భావ మున్నట్లు సూచిస్తున్నదను కోవడమునకు కారణము, ప్రాచీన కవుల సంప్రదాయము బాగా తెలియక పోవడమున్ను, లౌకిక భాషా మర్యాదలు (గ్రామ్యమని తామువితండావాదము చేసినా) ఒంటికి గట్టిగా పట్టి ఉన్నందున, వాసనాబలమువల్ల వాటిని వదలక పోవడమున్ను, కాక, మరేమిటి?

62. ప్రసన్నరాఘవమందు (చూ. పుటలు 94,95) రామరావణ యుద్ధము విద్యాధరుల సంభాషణ రూపముగావర్ణించిన పట్టున విద్యాధరుని వాక్యములో రావణుని 'వీఁడు' అని పంతులవారు విద్యాధరునిచేత అని

పించినారు. చూపండి ఆ వాక్యము: 'విద్యా...ఈ రావణుఁడేమి సామాన్యుఁడా! ఈ రావణుఁడు దక్క నే నెవఁ డిక్క యివడి నేచె?

శా. పోలంబల్కుదు మెట్టులీ దశముఖుం బోరన్ బడక్ వజ్రఘా
తాళుల్న న్వాడు వాండు వీడహ........"

63. ఈ పద్యమందు శాస్త్రులవారు చూపించిన ఇరువై దోషములలో శబ్దదోషము ఒక్కటే. అదే మా ఉపన్యాసమునకు విషయము గనుక తక్కినవి విడిచి అది చూపిస్తున్నాము. "రావణుని 'వీఁడు' అని తిరస్కారముగా పల్కుట సరిగా లేదని శాస్త్రులవారు పంతులవారి పద్యము దిద్ది 'వీఁడు' తీసివేసి దానికి బదులు 'ఇతండ'ని వ్రాసినారు.

64. పంతులవారి గ్రంథము చదివే వారికి, జనకుని వాక్యములో రాముని ప్రశంస, విద్యాధరవాక్యములో రావణుని ప్రశంస కనబడతవిగాని తిరస్కారము ఏమీ కనబడదు. శాస్త్రులవారి బుద్ధికి, లౌకికవ్యవహార వాసనా బలముచేత, 'వాఁడు', 'వీఁడు', 'అది' 'ఇది' అనేశబ్దములు, 'ఒరే' ఒసే', వలెనే 'నీచత్వసూచకములుగా తోఁచినవి.' అందుచేతనే విద్యాధర వాక్యములలో 'వీఁడు'కు బదులుగా 'ఇతఁడు' వాడవలసినదని ఉపదేశించినారు.

65. ప్రాచీన మహాకవులభాషలో 'వాఁడు', 'వీఁడు' అనే శబ్దములు తిరస్కార బోధకములు కానేకావు; 'అతఁడు' ('ఆతఁడు') 'ఇతఁడు' ('ఈతఁడు') అనే శబ్దములు 'వాఁడు', 'వీఁడు' కన్న ఎక్కువ గౌరవమును సూచించవు. పద్యాలలో ఏది ఇమిడితే అదే కవులు వాడి ఉన్నారు. నూరులకొలదిగా భారతములో నుంచే ప్రయోగములు ఎత్తి ఉదాహరించవచ్చును; గాని, చదివే వారికి విసుగు పుట్టునేమో అని జంకి కొన్ని మాత్రము చూపిస్తున్నాము.

(1) ఆది. 3. 194వ...శర్మిష్ఠా పుత్త్రిఁ బూరుం బిలిచి యడిగిన వాఁడు దండ్రి గోరిన యట్లుచేసిన

(2) ఆది. 2. 197 క. యముఁడ, గ్రతనూజుఁడు వాఁడయిన

(3) ఆది. 4. 160 వ. వీఁడు మర్త్యలోకంబునఁ బెద్ద కాలముండును (ప్రభాసుఁడను వసువు.)

(4) ఆది 4. 225 వ. వాఁడును దీర్ఘతముండనునాఁబుట్టి (బ్రాహ్మణుఁడు, గొప్పముని)

(5) ఆది. క. వాఁడు సంతతి గావించుచు విచిత్ర వీర్యక క్షేత్రమునన్ (బ్రాహ్మణుఁడు)

(6) ఆది. 4. 253. వ. వాఁడు మాతృదోషమున నంధుండు (ధృతరాష్ట్రుండును) వాఁడును పాండు దేహుండు (పాండురాజు.)

(7) అది 7. 113. వ. వాఁడు విశ్వామిత్రునాదేశంబున కల్మాషపాదునంతరాత్మ నావేశించి (రక్కసుఁడు)

(8) 7. వ. వాఁడంతః పురంబున నుండి (కల్మాషపాదుఁడు) వాఁడు నింతప్రొద్దు మాంసంబు వడయనేరననిన (బానసంబువాఁడు)

(10) ఆది. 7. 115 క. నీవు మనుష్యాదుఁడ వవుమని వాఁడిచ్చె శాప మన్నర పతికిన్ (బ్రాహ్మణుడు)

(11) ఆది. 8. 199 ఉ. వీరుఁడువీఁడు పాండవుఁడు సృష్టికులోత్తములైన సీరిదైత్యారు లెఱుంగకుండఁగ మహారథుఁడై తరుణిన్ సుభద్రనం, భోరుహ నేత్రఁ దోడ్కొనుచుఁ బోయెడి

(నన్నయ అర్జునుని పురరక్షకులచేత 'వీఁడు' అనిపించినాఁడు.)

(12) ఆది. 8 208 సీ....వాఁడంత యశ్రమ సాధ్యుఁడా? (అర్జునుడు)

(13) సభా. 1. 86 వ. వాఁడును బ్రాహ్మణ వచనంబునం జేసి యెల్ల రాజులకు నధికుండయి రాజసూయ మహాయజ్ఞ కరణంబునం జేసి దేవేంద్ర సాలోక్యంబువడసె నట్టి హరిశ్చంద్రు మహిమాతిశయంబు... (హరిశ్చంద్రుని 'వాఁడు' అన్నాడు నన్నయ)

(14) సభా 1. 138. వ. ఇట్లుపాస్య మానుండయి చండకౌశికుండు బృహద్రథునకు మెచ్చి నీ కిష్టంబు చెప్పు మిచ్చెదననిన...వాఁడిట్లనియె. (బృహద్రథుని 'వాడు' అన్నాడు)

(15) అర. 3. 131 వ. గాధియను రాజునూఁతు సత్యవతి యనుదాని భృగు పుత్త్రుండగు ఋచీకుం డను మహామునివివాహార్థియై యడిగిన నమ్మౌని వరునకు వాఁడిట్లనియె.

(16) అర. 3. 178 వ. వాఁడెల్ల వారినడిగి...చింతా పరుండై యున్నఁ డండ్రి కడకు వచ్చి సుకన్య యిట్లనియె (శర్యాతి)

(17) అర. 3. 371 క. ప్రియసాహసుండు ధీయుఁడు భయ పర హితుఁ డెందుఁబోయె బహురాక్షస సం, శ్రయ మిగ్గిరి గంధర్వానన్వయ సేవ్యం బేకచరుఁడు వాఁడెయ్యెడలన్.

66. హరిశ్చంద్రుని వంటి చక్రవర్తులను, బ్రాహ్మణ మునులను, బానసము వానిని రక్కసుని అన్నట్టే, నన్నయ 'వాఁడు' అని నిర్దేశించి, అర్జునుని సామాన్యులయిన భటులచేత 'వాడు' అనిపించినాడు చూచినారా? నన్నయ భావములో 'వీఁడు', 'ఇతడు' అనేశబ్దములకు ఏమీ భేదము లేదన్నందుకు ప్రయోగములు చూపిస్తున్నాము.

ఆది. 5. 244 క. అతఁడు మీకుం బ్రియ శిష్యుండట:ఈ వాక్యములో 'అతఁడు' ఏక లవ్యుడు; దీనికి వెనుకటి వచనము (238) లో నేనుబాణంబు లొక్కఁడయ్యేసిన యట్లక్కజంబుగా వాఁడేసిన అనిన్ని, తర్వాతి వాక్యము

(247) లో 'వెను వ్రేలు దునిమి...వాడిచ్చెదాని నాచార్యునకుఁ' అనిన్ని ఆ ఏకలవ్యుఁనే 'వాఁడు' అన్నాఁడు.

సభా. 1. 109 క. శిశుపాలుఁడు సంతతమును నాతని కొలుచు, అనిన్ని తర్వాతి వచనములో (హంసడింభకులు) వానికి వామదక్షిణ భుజంబులుఁబోలె వర్తిల్లుదురనిన్ని, రెండు సర్వనామములున్ను వాడినాడు. సభా. 2 41 సీ. లో శిశుపాలుడు కృష్ణుని మూఁడవ చరణములో 'వీఁడు' అనిన్ని గీతములో 'అతనిని' 'వాఁడు' అనిన్ని అన్నాఁడు. ఏమి విశేష మున్నది?

అర. 1. 115-ఆ. ఏను ధర్మసుతుఁడ నీతఁడు భీముండు వాఁడు విజయుఁడు అని ధర్మరాజు భీముని 'ఈతఁడు' అనిన్ని, అర్జునుని 'వాఁడు అనిన్ని అన్నప్పుడు, ధర్మరాజుకు భీముని యెడల గౌరవమున్ను, అర్జునుని యెడల అగౌరవమున్ను కలవని చెప్ప వచ్చునా? పద్యములో ఏమాట ఎక్కడ ఇమిడినదో ఆమాట అక్కడ నన్నయ వాడినాడని చెప్పక తప్పదు.

అర. 1. 374 'తరలము' శివుఁడు వీనికిఁ బ్రీతుఁడై దయసేసెఁబాశుపతాస్త్రము...యీతఁడు..., దేవకార్యము దీర్పఁగా... (376. క.)... దానవుల...వీఁడె భేద్యుఁడై వధియించుఁ' అని అర్జునుని ఇంద్రుడు 'వీనికి', 'ఈతఁడు', 'వీఁడు' అన్నాఁడు.

67. ఇటువంటివి ఎన్ని కావలిస్తే అన్ని ప్రయోగములు నన్నయ గ్రంథమునందే ఉన్నవి. తిక్కన, ఎఱ్ఱప్రగడ, శ్రీనాథుడు, పెద్దన మొదలయిన వారందరూ ఉత్తమ పురుషులను 'వాడు' అన్నవారే. వెంకటరత్నము పంతులవారు జనకుని చేత రామునిన్ని, విద్యాధరునిచే రావణునిన్ని 'వీడు' అనిపించినందుకు పంతులవారికి ఔచిత్య జ్ఞానము లేదని నిందించినప్పుడు, శ్రీనాథుడుకూడా పంతులవారి వలెనే 'వీడు' వాడినాడని శాస్త్రులవారు ఎరుగరేమోకాని, తర్వాత నైషధములో నేర్చుకొని

ఉన్నారు; గనుక, పరామర్శనార్థము 5 వ ఆశ్వాసములో 'వీఁడు' గలిగి నాలుగు పద్యములుదాహరిస్తున్నాము.

తే. వెలఁది వీఁడేలు నుజ్జనిపీటియందు (83) (ఉజ్జయనీపతి)

క. వ్రీడావతి యీ భూపతి గౌడ విడౌజుండు; వీఁడు కమనీయ రతి
క్రీడా రహస్యకోవిద చూడామణి; యెప్పు లెత్తి చూడుము వీనిన్ (90)

క. దళ శతదృ గర్వ గర్వ ప్రశమన హేలాధురీణ పటు వేగ నిరం
కుశ శైవ్య తురగ రింఖోవిశ కలిత దిగంత ధరణి వీఁడు లంతాంగీ
(105. కాశీరాజు.)

స్రగ్ధర. లీలంగట్టించెఁ బెక్కుల్నెలవులఁ జెలువుల్ వీఁడు... (కేకటాధీశ్వరుడు)

ఇట్లు శారద చేత సభలో మహారాజులను 'వీఁడు' అని శ్రీనాథుడని పించినప్పుడు, ఔచిత్య భంగము కలిగినదా? ఇట్టి మహారాజులనే మరి కొందరిని శారద చేతనే 'ఈతఁడు' అని ఆకవే అనిపించినాడు; చూడండి:—

క. గోవర్ధనాద్రి తటములఁ బ్రావృట్కాలముల విపిన బర్హిణనటన
ప్రావీణ్యము వీక్షింపుం డీవును నీతండు వేడ్కలింపెసలారన్.
(మధురాధిపతి)

క. పాటించి యితని వేఁడిన చాటు కవీశ్వరుల హస్తజలజంబులకున్
హాటక దీనారములు వరాటక సంఘాటములు వరాటేంద్ర సుతా.

'వీఁడు' అని పించు కొన్న రాజుల కంటె 'ఇతఁడు' అనిపించు కొన్నరాజులు ఎక్కువ వారని శ్రీనాథుని అభిప్రాయమా? అట్లయితే ఒక్క రాజునే ఒక పద్యములో 'వాఁడు' అనిన్ని, మరొక పద్యములో 'ఇతడు' అనిన్ని ఎట్లు వర్ణించినాడు? 90-వ పద్యములో 'వీఁడు' అన్న గౌడ విడౌజుని, 94-వ పద్యములో 'ఈతని చరిత మద్భుత కరంబు' అని

వర్ణించినాడు. ఇట్లే కాశీఖండములోను, భీమఖండములోను శ్రీనాథుడు 'వీఁడు, ఇతఁడు శబ్దములు సమానమైనయోగ్యతగలవిగానే ఎంచినట్టు ఊహించడము తప్పుకాదు.

68. మను చరిత్రములో, పెద్దనగారు వరూథినీ వల్లభుడయిన ప్రవరాఖ్యుని దాని సఖులచేత 'వాఁడు' అనిపించినారు చూడండి. ఉ.. ఇందునిభాస్యవాఁడనఁగ నింద్రుఁడొ చంద్రుఁడొ యా యుపేంద్రుఁడో... ఇందులో అనౌచిత్యము దోషము ఏ పండితులూ ఇది వరకూ చెప్ప లేదు; గాని, వేంకటరాయశాస్త్రులవారు వేంకట రత్నము పంతులవారియం దారోపించిన దోషము స్థిరపడితే, నన్నయ, తిక్కన, ఎఱ్ఱప్రగడ, శ్రీనాథుడు మొదలయిన వారితోపాటు ఆంధ్ర కవితా పితామహుడున్ను పంతుల వారి వలెనే ఔచిత్య జ్ఞానము లేక తమ కావ్యములను 'అసహ్యముచేసినవారు' కాకతప్పదు. అయితే ప్రాచీన భాషామర్యాద చొప్పున విమర్శించి నప్పుడు, వారి ప్రయోగములు సాధువు లేకాని అసాధువులు కావు. వేంకటరాయ శాస్త్రులవారి గ్రాంథి కాంధ్ర భాషాజ్ఞానము ఎట్లా ఉన్నదో చూచినారా? వారికి భారత మయినా బాగారాదు గదా!

69. ఈ కాలమందున్న శిష్టజనుల వ్యవహారము చొప్పున శబ్దముల సాధుత్వము, ఔచిత్యము ఏర్పర్చుకొంటే, 'వాఁడు', 'అతఁడు', 'అతను', 'ఆయన' 'ఆయనగారు' 'వారు' 'వారలు' మొదలయిన విన్ని; 'నీవు', 'మీరు', *'తమరు', 'దేవర' దేవరవారు మొద

---

* వేంకటరాయ శాస్త్రులవారి "ప్రతాప రుద్రీయ"మనే నాటకమునందు, 'తమ' శబ్దమునకు బదులుగా 'మీ' శబ్దము వాడిన ఢిల్లీ సుల్తానుకు తెలుగు భాష బాగారాదని రాజకుమారుడు, చిన్నపిల్ల వాడు ఆక్షేపించి నట్టున్నది. ఈ తేటు నేటి తెలుగులోనిదిగాని, గ్రాంథికాంధ్రములోనిది కాదు. చూడండి. (అంక. 10)

ఢిల్లీ సుల్తాన్—చినహోజావమ్మవారూ! మీ స్నేహితులు...;

లయినవిన్నీ ; ఎక్కడ, ఎప్పుడు, ఎవరినిగురించి, ఏది ప్రయోగించ వలెనో అక్కడ, అప్పుడు, వారిని గురించి అది ప్రయోగించకపోవడము వల్ల ఔచిత్య భంగము కలుగడమే కాక వ్యవహార హానికూడా సంభవిస్తుంది. రామయ్య అనే పేరుగల ఒక గొప్పఉద్యోగస్థుని 'మహారాజశ్రీ రామయ్య పంతులవారు' అనకుండా, కేతన తిక్కనను తిక్కఁ డన్నట్లు 'రామయ్య' అనిగాని, రాముఁడని గాని అననే కూడదు. 'రామయ్యగా' రంటే తగిన గౌరవము లేదు. 'రామయ్యపంతులు' అంటే తిరస్కారము. 'రామయ్య పంతులు' గారన్నా తృప్తికాదు 'రామయ్య పంతుల వా' రంటే బొటా బొటీగా సరిపోతుంది. ఆపైని ఏమున్నా అధికస్య అధికంఫలం. 'అయ్య వార్లంగారు' లోకములో సిద్ధ శబ్దము: 'అయ్య, అయ్యగారు,' అయ్య వారు సమానార్థకములు కావే. 'అమ్మ', 'అమ్మగారు', అమ్మవారు—పర్యాయపదములు కావే. ఇట్లే భాషలో అన్ని శబ్దములున్ను—విశేషములు, విశేష్యములు, సర్వనామములు, క్రియలు, అవ్యయములు, నిపాతములు, సుప్తిజంతములు—వాటి అర్థములున్ను—లోక వ్యవహారము చొప్పున ఉండవలెననే నియమము పండితులు ఒప్పుకోనే వరకూ నాఁటి తెలుగు భాషయొక్క సాధుత్వము ప్రాచీనాంధ్రగ్రంథములలోని భాషను పట్టి నిర్ణయించవలెను. పండితులకు గ్రాంథికమే గాని లౌకికము ప్రమాణముకాదు. సిద్ధిర్లోకాత్ అనే సూత్రానికి అటూ అర్థము చెప్పుతారు. అయితే, పాణిని, కాత్యాయనుడు, పతంజలి వైదిక లౌకిక భాష లనుశాసించినారు.

బాలుఁడు—'మీ' అంటారేమి? భాష బాగారాదా?

సభ్యులు—'భళి! భళి! అట్లు పుట్టుకతో రావలయుఁగాని తెచ్చుకొన్న వచ్చునా!'

సుల్తాన్—'వహవ్వా!...పొరబాటు. మన్నించండి. తమ స్నేహితులు ఢిల్లీలో ఉన్నారు.'

ఇచ్చిపుచ్చు మొదలయినవి

70. ఆంధ్ర ప్రసన్నరాఘవము సప్తమాంకమునందు కరాళకుని వాక్యములో "ఒకా నొకనిచేత నిచ్చి పుచ్చినది చిత్రపటము" అని ఉన్నది. (చూ. పుట. 87) శాస్త్రులవారీవాక్యము విమర్శించి, ఇట్లు వచించి నందుకు "వానిని ఉన్మత్త వైద్యశాలకు పంపవచ్చును" అని సిద్ధాంతముచేసినారు (చూ. విమర్శము పుట 275.) 'ఇచ్చి పుచ్చినది' అనుటకు 'ఇయ్యవసిల నది, అనిమార్చిన "వాక్యములోని యనన్వితి దోషము కొంత తీఱును. అని ఉన్మత్త చికిత్స చేసినారు. వేదము వేంకటరాయశాస్త్రులవారు అపూర్వ పండితభిషక్ మణులు గదా. వారి చికిత్స అతి చిత్రమయినది. దుష్టాంగము చక్కబర్చుట కోసము నిర్దుష్టమయిన అంగము ఛేదిస్తారు. కరాళకుని వాక్యములోఉన్న అనన్వితిదోషము 'ఇచ్చి పుచ్చినది' అనే వాక్యాంగమందు వారిశాస్త్రీయ దృష్టికి కనబడ్డది; గాని మా లౌకిక దృష్టికి ఈ వాక్యాంగమందుమాత్రము ఏదోషమున్నూ కనబడలేదు.

శాస్త్రులవారి శాస్త్రీయదృష్టిన్ని వారిసిద్ధాంతములున్ను అమోఘమైనవి కావని ఈ వ్యాసము పూర్వభాగములో రుజువు చేసినాము. 'లేడెయ్యోడికా' అనే శబ్దము 1898వ సంవత్సరము వరకు అసాధువు అని వారి సిద్ధాంతమయినా, శ్రీనాథుని శృంగార నైషధము 1913 వ సంవత్సరములో వారు చదువుకొన్నప్పుడు, ఆ సిద్ధాంతము మార్చుకోవలసి వచ్చినది కదా (చూ. ఈ వ్యాసము పేరాలు 16-18) మేము ఉదాహరించిన మహాకవి ప్రయోగముల చేత ఆసిద్ధాంతము పూర్తిగా రద్దయినదని ఒప్పుకోక తప్పదు. (చూ. పేరా 21)

71. వేంకటరత్నము పంతులవారు వాడిన 'ఇచ్చిపుచ్చినది' వంటిదే 'అడిగి పుత్తేడు' అనేప్రయోగము ఒకటి శ్రీనాథుని శృంగార నైషధములో ఉన్నది.

"తే. తెలివయినాళ్లు నడిగెపుత్తేఁడు నిన్ను" (మా. ఆ. 3. 123). శాస్త్రిలవారు ఈరూపము తప్పనుకొని, 'అడుగఁబుత్తేఁడు' అనితాముఆగ్రంథము తిరిగి ముద్రింపించి ప్రకటించినప్పుడు దిద్దినారు. తమ పరిష్కారణవైదగ్ధ్యము వెల్లడిచేయుటకు గ్రంథమునకు అనుబంధముగా "పూర్వ ముద్రణదోషములకు ఇంపలి సవరణలు" ప్రకటించినారు. అందులో 'అడిగిపుత్తేడు' అనేపాఠము పూర్వముద్రణము లందున్నదని స్పష్టముగా ఉదాహరించినారు. అయితే 'అడుఁగబుత్తేఁడు' అనేపాఠము ఎక్కడనుంచి శాస్త్రిలవారు తెచ్చి దూర్చినారో తెలియదు. గ్రంథావతారిక (పుట 17) లో రెండు వ్రాఁతప్రతులు తమకు ఎరవు దొరకినవనిన్ని, అందొకటి "శ్రీ శ్రీ పిఠాపురము రాజాగారు"న్ను రెండవది నెల్లూరిజిల్లాలో శ్రీ వరగలి రంగారెడ్డిగారి యొద్దనుండి శ్రీ కోవూరి సుబ్బరామయ్యగారున్ను ఇచ్చినారనిన్ని వ్రాసి ఉన్నది. ఇప్పుడు ఆ వ్రాఁత ప్రతులు ఎక్కడ ఉన్నవో మేము ఎరుగము. చెన్నపట్నములో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు సంగ్రహించిన వ్రాత పుస్తకములలో దీనికి రెండు వ్రాతప్రతులున్నవి. వాటి నెంబర్లు 99, 887. వీటిలోనున్న పాఠము తే 16-8-20 దీని పరిషత్తువారి పుస్తకాలయములో బ్ర. శ్రీ. పురాణపండా మల్లయ శాస్త్రిలవారి యెదుటను మేము స్వయముగా చూచినాము. పూర్వ ముద్రణములందు ఉన్నట్లే 'అడిగిపుత్తేఁడు' అని ఉన్నది. గవర్నమెంటు వారి పుస్తకాలయ మందున్న రెండు వ్రాతప్రతులలోకూడా ఇట్లే పాఠమున్నది. వాటినెంబర్లు 11-13-32,, 10-21-19. మా వద్దనున్న రెండుతాటాకు పుస్తకములలో నున్ను ఈపాఠమే కనబడ్డది. ఇట్లు ఆరు వ్రాత ప్రతులలోను పూర్వముద్రణములలో నున్ను మాకు కనబడ్డ పాఠమును బట్టి శ్రీనాథుడు 'అడిగిపుత్తేడు' అని వ్రాసి ఉంటాడుగాని, శాస్త్రిలవారు దిద్దినట్లు 'అడుగఁ బుత్తేఁడు' అని వ్రాసి ఉండడు, అని మేము ఊహించినాము. నన్నయాది పూర్వకవుల ప్రయోగములుకూడా మా ఊహను బలపర్చినవి. ప్రాచీనాంధ్ర భాషా స్వరూపము తెలిసినవారు ప్రాచీన గ్రంథములో ఇట్టి మార్పులు చేయరు.

72. నైషధములో శ్రీనాథుడు వ్రాసినట్లు పూర్వముద్రణములందు కంటికి కనబడినా, శాస్త్రిలవారికి 'అడిగి పృత్తేఁడు' తప్పుగా తోఁచుటకు కారణమేమిటి? ప్రాచీనాంధ్రములో ఇట్టి రూపము లున్నవని తెలియక పోవడమే. నేటి తెలుగులో ఇటువంటివి లేవు. శ్రీనాథుని పద్యమునందు తాము చేసిన సవరణనుపట్టి తమ టీకలో "తెఱవ=ఓయింతీ, (ఇంద్రుఁడు), ఇన్నాళ్ళున్= ఇంతకాలంబును, నిన్నున్ అడుగన్ పృత్తేఁడు=తన్ను వరింపుమని నిన్ను నోత ముఖమున ప్రార్థింపకయుండెను" అని వ్రాసినారు. 'అడిగి' అనే క్త్వార్థక రూపము ఇట్టిచోట్ల పొసగదనిన్ని 'అడుగన్'(=అడుగుటకు) అనే తుమున్నర్థక రూపము నేటి తెలుగులో ఉన్నట్లు వాడుట యుక్తమనిన్ని వారు ఊహించి యుందురు. 61వ పేరాలో మేము చెప్పినట్టివర్తమానాంధ్రభాషావాసనశాస్త్రిలవారి ఒంటికి దట్టముగా పట్టి ఉన్నందున, నేటి వాడుకకు విరుద్ధముగా ఉన్నరూపము ప్రాచీన భాషలో సాధువైనప్పటికిన్ని, ఆభాష బాగా తెలియనందున, వారికితప్పుగా తోఁచినది. * అయినా, నాదానికిమాత్రము

---

* ఈలాగుననే ప్రాచీనాంధ్రము బాగా తెలియనివారు, 'నీవు దెలిసితేని నిక్కము సెప్పు' అంటే, తప్పనుకొంటారు. వారి చెవులకు 'నీకు తెలిసితే' అనేది సాధువుగా వినబడుతుంది. ఇట్లే 'నన్ను నగెను', 'తలుపు దివ్వమనినఁ దివ్వండు', 'వాఁడు నన్నలిగెను', 'నేను నోఁచితిని', 'నన్నట్లునాకుము' మొదలయినవి నేటివారికి వింతగాను తప్పులుగాను తోఁచుట సాజమే. నేటి తెలుఁగులో 'వాడు వచ్చి నాలుగు దినములయినది', 'ఈ బియ్యము మంచివి', 'ఆ ధాన్యము మంచివికావు', 'నేనయినా వాఁడయినా వస్తాము' అనే వాక్యములలో అన్వయము ఎట్లున్నదో చూడండి. ప్రతిభాషలోను ఇట్టి పలుకుబడులున్నవి; లక్షణమునకు లొంగక పోయినా ఇట్టివి తప్పులనరాదు. ప్రాచీనాంగ్లేయభాష బాగారాక 18-వ శతాబ్దములోని ఇంగ్లీషుపండితులు ప్రాచీనాంగ్లేయ గ్రంథములు దిద్ది పాడుచేసినట్లే మన ప్రాచీనాంధ్ర గ్రంథములు ఆంధ్ర పండితులు తారుమారు చేస్తున్నారు. నాడెమైన ఆంధ్రభాషా పాండిత్యము నేడు దేశములో అరుదు.

చిన్నప్పటినుంచిన్ని ఒంటపట్టిన భాష నింద్యమనిన్ని, బాగా అలవడని ప్రాచీనభాష సాధువనిన్ని అంటారు. ఏమి చెప్పను! ఇప్పటి వ్యవహారమునకు విరుద్ధముగా మాట్లాడనూకూడదు వ్రాయనూకూడదు; ఆలాగున వ్రాసినా, మాట్లాడినా, వ్యవహారహాని కలుగడమేకాక, చదువుటకున్ను వినుటకున్ను అసహ్యముగా ఉంటుంది. ఈలాగున శాస్త్రులవారు సిద్ధాంతము చేస్తే మాకు సమ్మతమే; గాని, ఆ మతము వారు స్వీకరించక దానికి విరుద్ధముగా వాదిస్తున్నారు. గనుక, వారికి ఆదర్శమైన గ్రాంథిక భాషలో 'ఇచ్చిపుచ్చి' 'అడిగిపుత్తేఁచు' మొదలయిన రూపములు అసాధువులు కావు; సాధువులే, అని సిద్ధాంతము చేయుటకు నన్నయాది మహాకవుల ప్రయోగములు ప్రమాణముగా ఉదాహరిస్తున్నాము: చిత్తగించండి.

నన్నయ వాడుక:—

(1) అష్టమ వసువు భార్య పతికిట్లనియె: మర్త్యలోకంబున నుశీనర నరపతి కూఁతురు జితవతి యను కోమలి నా ప్రియసఖి యేనెప్పుడు దానికిఁ బ్రియంబు గోరుచుండుదు, నిమ్మొదవు నమ్ముదితకిచ్చి పుత్తము (ఆది 4. 158) (ఈఆవును ఆమెకు ఇచ్చి (సేవకునిచేత) పంపింతాము అని ఇప్పటి వాడుక.)

(2) భీష్ముండు...బ్రాహ్మణుల యనుమతంబున దాని (అంబను) సాల్వరాజున కిచ్చిపుచ్చి...... (ఆది. 4. 212)

(3) (పాండు విభుఁడు) వస్తువు లెల్లను ధృతరాష్ట్రున కిచ్చి పుచ్చి (ఆది 5. 67)

పాండురాజు వనమందుండెను. ధృతరాష్ట్రుడు హస్తినాపురమందుండెను. గనుక అతని కిమ్మని (ఇచ్చుటకు) (ఇతరులచేత పంపినాడని ఇప్పటి తెలుగులో అర్థము.)

(4) (విదురుండు) "దుర్యోధను చేసెడు దుష్క్రియ లిమ్ముగా సెఱింగి వానికిం బ్రతీకారంబు సెప్పి పుత్తెంచెద" ననియె (ఆది. 6. 147)

(5) వారణావతమ్మునవారు...కుంతీ పాండవుల పంచత్వంబు ధృతరాష్ట్రునకుం జెప్పి పుచ్చిన (,, 167)

(6) ఆ. ఒలసి యెంత కాలముండిన నేను మీఁదానఁగాన యొరుల ధనము నన్ను సెన్నఁడయిన నొరుల కిచ్చుచో ససురకు భోజనముగ నిచ్చిపుచ్చుఁడిపుడ (,, 257)

(7) పాండవ ద్రుపద ధృష్టద్యుమ్న కుంతీ ద్రౌపదులకు...నుచిత భూషణావళులు వేలువేలు యిచ్చిపుచ్చి (8. 37) (పాండవాదులు ద్రుపదుని పురమందున్నారు.)

(8) (నకులుఁడు) వాసుదేవునకు నిజాగమనం బెఱింగించి పుచ్చి (సభా. 1. 264.)

(9) ఆ. దాని సెఱఁగి ధర్మతనయుండు ధృతరాష్ట్రతనయునకు సమీర తనయుచేత దివ్యవస్త్రములును దివ్యభూషణములు నిచ్చిపుచ్చెఁ బ్రీతి యేర్పడంగ (" 2. 87.)

తిక్కనవాడుక:—

(10) (ద్రుపదుండు) 'పిలువందగిన రాజులం బిలిచిపుచ్చ వలయు' (అనగా 'పిలుచుటకు దూతలను పంపవలెను' అని అర్థము.) ఉద్యో. 1. 37.

(11) భూపతులకును...సెఱింగించి పుచ్చుట కార్యంబు...(ఉద్యో. 1. 37.

(12) (సంజయుండు) నారాయణునకుండనరాక యెఱింగించిపుచ్చి (" 1. 272)

(13) అంతఃపురంబున నున్న ధృతరాష్ట్రునకుం దనరాక యెఱిం గించి పుచ్చి (" 2. 2.)

(14) సంజయుండు వచ్చి వాకిటనిలిచి పణిహారులవలనఁ దన్నెఱిం గించిపుచ్చి (ఉద్యో 2. 115)

(15) ఉ. అంతలు సేసి పోనడిచి యక్కటసంజయుచేతఁ జెప్పి పు త్తెంతురె (3. 101)

(16) అచ్యుతుండు కరినగరంబున కరిగి మొగసాల నిలిచి యాంబి కేయునకుఁ దనరాక యెఱింగించిపుచ్చి...(శల్య 2. 360)

(17)"అనినీకొడుకునకుం జెప్పిపుత్తెంచితి"(అనిభీముడు గాంధారితో ననియె (స్త్రీ 1. 160)

(17) ఉ....ఇత్తల కేగుదేవల వదేత్తెఱఁ బొమ్మని చెప్పిపుచ్చినన్... (నిర్వ 6. 147)

(ఎఱ్ఱనవాడుక భారతకవులుముగ్గురున్నువాడినారన్నందుకుగాను

(1) గంధర్వ లాక్షణంబ చిత్రసేనునకు నంతయుఁ జెప్పి పుచ్చిన (అర. 5. 388)

(19) (అయ్యాదవేశ్వరుండు) ... యుగ్రసేన కళత్రంబులకు... భూషాంబరాదులిచ్చి పుచ్చి (హరి. ఉ. 4. 253)

కేతన వాడుక (దశకుమార చరిత్ర విజ్ఞానేశ్వరము.)

(19) తదీయవాస గృహద్వారంబున నిలిచి యెఱింగించి పుచ్చిన వాఁడును సంభ్రమంబున నెదురు వచ్చి (3. 87)

(20) ఉ. ఇత్తెఱఁ గంతయుం బతికి నేర్పడ నప్పుడె చెప్పి పుచ్చె భూపోత్తముఁడున్ రయంబున...నేఁగుదెంచి (4. 34)

(21) సింహ వర్మయు సహ్యాన్మహీపతుల కెఱింగించి పంచిన (4. 83)

(22) సీ. గీ. పేరుఁ బెంపును గలవాఁడు ప్రియముతోడ, నడిగి పుత్తెంచెనేని నెయ్యంబెఱింగి, రేపు మాపని యాసలు చూపి చూపి,, యింపు పుట్టించి తుదిఁ బిలిపింపవలయు (4. 14)

(23) గీ. లక్ష్మి కూరిమి సుతురాజ్య లక్ష్మివోని కామ మంజరి యను వార కాంతగలదు దానిచేత మీ యర్థ సౌందర్య తారతమ్య మేర్పడు మీరలు దాని కిపుడు.

వ. రో యిచ్చి పుచ్చుండు ... ... (5. 49)

(24) అదియును నప్పలుకులకు మోసపోయి చర్మ భస్త్రిక వలనం ధన దానంబులు సేయువిధం బడిగి పుత్తెంచిన, లోకంబెఱుఁగను దార కుండు విన్నవించిన తెఱంగెఱుంగుదురు కదా (6. 49)

(25) గీ. వచ్చి కోటచుట్టుముచ్చుట్టు వారంగఁ, బన్నిబిడ్డ నడిగి పనుచుటయును నియ్యకొనక వెడలి యేపునఁ దలపడి, యతఁడు పట్టువడియె నతనిచేత (6. 187)

(26) పుష్కరికచేతఁ గల్పసుందరి నాకెఱింగించి పుత్తెంచిన(8. 131)

(27) పదంపడి కనక రేఖచేత నతనికి నాక్రమంబును... జెప్పి పుచ్చి (11. 72)

(28) సింహ వర్మ నమాత్యుండు చనుదెంచి వినయంబునం బ్రణమిల్లి జలకంబు పెట్టియున్నది వేంచేయుండని దేవర వరవుఁడు విన్నవించి పుత్తెంచె ననవుడు (12. 43)

(29) రాజవాహనుడు...నదీతీరంబున సైన్యంబులు విడియించి య మ్మునీంద్రునకుం దనరాక యెఱింగించిపుచ్చి...(2. 82)

(30) క. నెయ్యమున నడిగి పుచ్చక, యియ్యకొనక యర్థ మీక యిర్వుర పరుఁడై కయ్యమున గెలిచి కన్యకఁ గ్రయ్యంబడి చేసికొనిన రాక్షసమయ్యెన్ (విజ్ఞా. ఆచా. 100).

నన్నెచోడని వాడుక:—

(31) నిజాగమన ప్రయోజనంబు కళ్యపునకు నెఱింగించి పుచ్చి(..112)

వాచన సోముని వాడుక:—

(32) (హంసడిభకులు పంచిన దూత) ద్వారకా నగర ప్రవేశంబు చేసి, యదువల్లభు నగరివాకిట హాయాప తరణంబుచేసి, తనరాక యెఱింగించి పుచ్చి యద్దేవ దేవుని యనుమతంబున సభా మండపంబునకుంజని (4, 139)

(33) సాత్యకి సాళ్వపురము చొచ్చి...వారికిఁ దన్ను శౌరి పుత్తెంచు టయుఁ జెప్పి పుచ్చెను. (4. 172)

మంచెన వాడుక:—

(34) క. ఏను జెప్పి పుచ్చిన యపుడె వ్వరుగాని పిలువఁగావత్తురె...
(కేయూ 2.51)

(35) సీ....దేవికన్నత ప్రమదముగాఁ జెప్పిపుచ్చి... ("2. 77)

(36) వ...క్రమ్మరఁ గళావతిచేతఁ జెప్పిపుచ్చి... (4. 182)

(37) వ...భాగురాయణుండు కలిపి పుత్తేర ... ... (4. 120.)

ఇంకా అనేక మహాకవులు ఈ విధమున వాడి ఉన్నారు.

73. ఈ ప్రయోగములున్ను ఇట్టివి ఇంకా అనేకములున్ను చూచి ప్రాచీనాంధ్రమందు "ఇచ్చి పుచ్చు" "అడిగిపుత్తెంచు" మొదలయినరూపములు వాడుకలో ఉండెనని మేము నమ్ముతున్నాము. మననాటి తెలుగులో లేకబోవుటచేత, మనచెవులకు ఈశబ్దములు తప్పులుగా తోచుట వింతే

కాదు. అయితే, తెలుగు పండితులు తెలుగు గ్రంథములు లెస్సగా చదివిన వారే; గనుక, వారికివి వింతగా ఉండవు; ఉండకూడదు. ఎవరిచెవులకు ఇవి వింతగా ఉండి తప్పులుగాతోచునో వారికి తెలుగు గ్రంథములతో పరిచయములేనట్టే తలంచవలెను; అట్టివారు తెలుగు పండితులుకానేకారు. గ్రాంథికాంధ్రమందు నిజమయిన అనురాగమున్ను, అభిమానమున్ను, ఉన్న పండితులు ముందు వెనుకలు ఆలోచించకుండా, తప్పొప్పులు తెలుసుకోకుండా, తమకు తెలయనివన్నీ తప్పులనిన్నీ, తమకు తెలిసినవే ఒప్పులనిన్నీ, నమ్మి కొని ప్రాచీనగ్రంథాలు దిద్దరు. తెలుగు సారస్వతము దిక్కుమాలిన దయినది. భాషాసంప్రదాయము తెలియని పండితమ్మన్యుల చేతులలో పడి భారతాదిగ్రంథములన్నీ చెడిపోయినవి. నేటివాడుకకు ప్రాచీనగ్రంథములలోని ప్రయోగములు ప్రమాణముగా విధించుటచేత, పరిష్కర్తలు కొందరు ఉద్దేశపూర్వకముగా గ్రంథములు దిద్దుతున్నారు. తాము అసాధువను కొన్న శబ్దములుతీసివేసి, తాముసాధు వనుకొన్నవి గ్రంథములోచ్చొప్పి సవరణలు చేయడము తమవాదమునకు ప్రమాణము కుదుర్చుకొనుటకే. ఇప్పటి తెలుగువారి వాడుకకు ఇప్పటి పెద్దలవాడుక ప్రమాణముగా, ఇతర దేశములలో ఉన్నట్టు, అంగీకరించక, ప్రాచీనుల వాడుక ప్రమాణముగా పండితులు పెట్టుకొని, ఎవరి యిష్టమువచ్చినట్టువారు ప్రాచీనుల గ్రంథాలలోని భాష తారు మారు చేస్తున్నారు. పండితులన్న వారందరి మతమున్ను ఒకటికాదు. వెంకటరత్నము పంతులవారికి సాధువయినవి వేంకటరాయ శాస్త్రుల వారికి సాధువులు కావు గదా; వీరిద్దరికీ ప్రమాణము ప్రాచీనుల భాషే. ఎవరికి అవకాశము దొరికితే వారు ప్రాచీనులభాష స్వమతానురోధముగా మార్చుటకు వెనుక తీయరు. శాస్త్రులవారు నైషధము పరిష్కరించక మునుపు భారతము బాగా చదువుకొని ఉంటే నిర్దుష్టమయిన శబ్దము దుష్టమని భ్రమపడి దిద్ది గ్రంథము పాడుచేయక పోదురు. *

* ఏమో చెప్పలేము. బహుశః భారతముకూడా దిద్ది పరిష్కరింతురని చెప్పవచ్చును.

నైషధము రచించిన శ్రీనాథుడు కాశీఖండమున్ను హరవిలాసమున్ను రచించినాడుగదా; ఆగ్రంథములయినా శాస్త్రిలవారు చదువుకొని ఉంటే వాటిలో ఇట్టి శబ్దములు కనబడును.

సీ. పా. ఉఱక దివోదాసు నుచ్చాటనముచేసి
యామేలువార్త మంథాద్రినున్న
హరునకుఁ జెప్పి పంపిరి హరుఁడును వచ్చెఁ
గాశికానగరికిఁ గరమువేడ్కఁ. (కాశీ. 6. 139)

హరవిలాసములో IV 63-వ పద్యమందు 'అడిగి పుత్తెంచినాఁడు' అనిఉంటే, శాస్త్రిలవారి వంటి పండితు లెవరో పూర్వకాలపు పలుకుబడి తెలియని వారు 'అడుగఁబుత్తెంచినారు' అని దిద్ది వేసినారు. శృంగార శాకుంతలములో కూడా 4వ ఆశ్వాసమందు, గీ. "పిలువఁ బుత్తేర తడసె" అనే పాఠము ఇట్టి పండిత పరిష్కరణముచేత సంప్రాప్తమయినది. చెన్నపట్నమందున్న ప్రతి కాగితములపై క్రొత్తగా వ్రాసినది తాటాకులమీద పూర్వులు వ్రాసిన గ్రంథములో ఎట్లుండునో చూడవలెను. నన్నయ అరణ్యపర్వము ద్వితీయాశ్వాసములో "దమయంతి నీకుశలం బడుగఁబుత్తెంచె" అని అచ్చుపుస్తకము లన్నిటిలోను ఉన్నది; ఒక తాటాకు పుస్తకములో "అడిగి పుత్తెంచె" అనిన్ని మరిఒక దానిలో "అడిగి రమ్మని పుత్తెంచె" అనిన్ని ఉన్నది. ఎఱ్ఱన హరివంశము మూడో ఆశ్వాసమందు "అతనికి రుక్మిణి నడిగి పుత్తెంచిన" (చూ. 11) అనిన్ని, గీ. రుక్మవతి యనంగ రుచిరాంగి రుక్మికి బౌత్రియైన కన్యఁ బంకజాక్షునాజ్ఞ నడిగిపుచ్చె...... (చూ. 221) అనిన్ని రెండు వ్రాత ప్రతులలో ఉన్నది; గాని, అచ్చులో "అడుగఁబుత్తెంచిన" "అడుగఁబుచ్చె" అని సవరణ అయినది. ఈలాటివి అన్నీ చూపించి చదివేవారిని విసిగించ కూడదని మానివేసినాము. ఆంధ్రభాషలో కొన్ని శబ్దములు రూపమందు, అర్థమందు, సంబంధమందు పూర్వకాలములో ఉన్నటు ఇప్పుడు లేవు; మారిపోయినవి. వాటి

పడికట్లు వేంకటరాయ శాస్త్రిలవారి వంటి పండితులకు బాగా తెలియక ఇట్లు భ్రమ ప్రమాదములకు లోనవుతున్నారు. శాస్త్రిలవారి కథా సరిత్సాగరము చూస్తే వీరికి గ్రాంథికాంధ్రభాషాలక్షణము బాగాబోధపడినట్లు కనబడదు. వాటినిగురించి ఈ వ్యాసము మూడో భాగములో వివరించి వ్రాస్తాము ; గాని ఇప్పుడు వీరిసాహిత్య మెట్టిదో తెలియజేయుటకు శృంగార నైషధములో వీరుచేసిన సవరణలలో నొకదాని పొంకము చదువరులకు చవిచూపి, ‘ ఇచ్చి పుచ్చు ’ విమర్శము చాలిస్తాము.

74. శృంగార నైషధములోని కడపటి పద్యము ముద్దులు మూటకట్టి వట్టున్నది. అందులో శ్రీనాథుడు చంద్రుని ఇట్లువర్ణించినాడు.

సీ. ముక్కంటి తలపువ్వు, మున్నీటి లేఁబట్టి,
కైటభారాతి రాకన్నుఁదమ్మి,
గగనలక్ష్మికి దంతకాంచ తాటంకంబు,
కలువల విందు, జక్కవల గొంగ,
వలరాజు వెల్లెల్లి వనజభాందవునుద్ది,
శిశిరాంశు రత్నంబు, చేదుమందు,
గన్నులపండువు, గ్రహసార్వభౌముండు,
సురలయూఁకటి పంట యిరులదాయ,
తే. శ్రీమహాలక్ష్మి సైదోడ శేషభువన
సౌధకల ధౌతకలశంబు చందమామ,
రాజవదన కల్యాణ పరంపరాభి
వృద్ధిగావించుఁగాత యీవిశ్వమునకు.

75. ఈ పాఠము ఆరు తాటాకు పుస్తకములలో ఉన్నది: (చూ. పేరా. 71) మాకండ్లతో మేము చూచినాము. వేంకటరాయ శాస్త్రిలవారు చూచిన వ్రాతప్రతులలో ఎట్లున్నదో మే మెట్లు చెప్పగలము ? వారేకన్నుల

తో జూచినారో ఎవరెరుగుదురు? వారిచ్చిన పాఠములో మూడవపాదమందు "శలరాజు వెల్లెల్లి" కి బదులుగా "వలరాజు వెల్లల్లి" అనిన్ని, నాలుగోచరణమందు "యిరులదాయ" కు బదులు "యిరులుదాయ" అనిన్ని, కడపటి చరణమందు "గాతయీా విశ్వమునకు" బదులుగా "గాతమీ విశ్వమునకు" అనిన్ని, ఉన్నది. ఈమూటిలో మొదటిదాని సారస్యము విచారించదగినది. రెండవదానిని గురించి, సీతారామాచార్యులవారు 'ఇరులు' శబ్దమేక వచనమన్నారని సమాధానము చెప్పినారు. అయితేనేమి 'పాలు' వంటిదే. మూడవదానిలో మకారము చిన్నయసూరిగారి 'అనుశాసనము' చొప్పున దూర్చినది. వీటికేమిగాని, "వలరాజు వెల్లల్లి" అనే పాఠమా, లేక వలరాజు "వెల్లెల్లి" అనేపాఠమా సాధువు? ఏది శ్రీసాథుని వంటి మహాకవి వ్రాసి ఉంటాడో సాహిత్యము గలవారు విచారింతురుగాక. మనశాస్త్రులవారు తమవ్యాఖ్యలో "వలరాజు వెల్లల్లి" అంటే, వలరాజుచేతి తెల్లగలువ ('నెచ్చెలి' యని పూర్వముద్రణ పాఠము, 'వెల్లల్లి' వ్రాఁతలలోనిపా.)" అని వ్రాసినారు; గాని, చంద్రుడు, మన్మథుని చేతిలోనిది గానీ, చెవియందలిది గానీ, తెల్లగలువవంటివాడు అని, సంస్కృతమందయినా తెలుగులోనయినా, పూర్వులయినా, ఆధునికులయినా, వర్ణించి ఉన్నారా? లేదనిచెప్పుటకు మావంటివారికి అధికారములేదు, మేము వట్టి లౌకికులము; మాకున్న కొంచెము సాహిత్యము అర్థగ్రహణమందు కొంత ఉపచరిస్తుందేమో గాని, సమయసిద్ధమైన సారస్యనిర్ణయమునకు చాలినది కాదు. మేమెరిగినంతమట్టుకు కవులు చంద్రుణ్ని మన్మథుని "వెల్లెల్లి" అనగా "తెల్లని గొడుగు" తో పోల్చియున్నారు; చూడండి:—

1. మనోజరాజస్య సితాతపత్రం శ్రీఖండచిత్రం హరిదంగనాయాః.

2. గగనవిపినసింహః కామభూపాతపత్రం నిఖిలదిగబలానాంకందు
కంక్రీడనాయ...

3. మృగాంకోఽయం ధత్తే గగన జలధేః ఫేనతులనాం సితచ్ఛత్రా
కారం మదన నృపతేర్విశ్వజయినః

4. యః శ్రీఖండతమాల పత్రతతి దిశః ప్రాచ్యాః స్మరక్ష్మాపతేః
పాణ్డుచ్ఛత్రతతి

5. కించత్రం స్మరభూపతేః కిముయశః పుంజం పురస్తాదిదం.

6. త్రిభువన జయినో మన్మథస్యాత పత్త్రం.

76. ఇట్టిప్రయోగము లున్నవి గనుకను, వ్రాతప్రతులలో—మేము చూచిన ఆరింటిలో—"వలరాజు వెల్లెల్లి" అనే పాఠమున్నది గనుకను. "ఆకాశవాపీసిత పుండరీకమ్" "వ్యోమసరః సరోజమ్" మొదలయిన వాటినిపట్టి చంద్రుణ్ణి పద్మముతో పోల్చినా, కలువ పువ్వుతో కవులు పోల్చి నట్లు మేము చదువుకొన్న గ్రంథాలలో కనబడలేదు గనుకను, శాస్త్రిల వారి సవరణ సరియయినది కాదని నమ్ముతున్నాము. శృంగార నైషధ ములో వారు చేసిన సవరణలుచాలామట్టుకు వ్రాత ప్రతులలోని పాఠము లకు, అనగా మంచిపాఠములకు విరుద్ధముగా ఉన్నవి. వాటినిగురించి పెద్ద వ్యాసము వేరే ఒకటి వ్రాయవలెను. జయదేవ కవివ్రాసిన సంస్కృతనాట కము తిన్నగా తెనిగించక వేంకటరత్నము పంతులవారు జయదేవునికి అప కీర్తి తెచ్చినారని శాస్త్రిలవారు మోటతిట్లు ఎన్నోతిట్టి "హా! జయదేవా!" అని మాటి మాటికి హాహా కారముచేసినారే; శ్రీనాథుని తెలుగుగ్రంథము ఉన్నది ఉన్నట్లుగా ఉంచక కూడని మార్పులు చేసి పాడుచేసినందుకు శాస్త్రిలవారిని ఏమనవలెనో మాకు తెలియదు. అయ్యో శ్రీనాథా! ఓ కవి సార్వభౌమా! నీయందు భక్తి తాత్పర్యములు గలవారమని చెప్పుకొన్నవారు, ఆంధ్ర పండిత భిషజ్ మణులు, వేదము వేంకటరాయశాస్త్రిలవారు కూడా, పూర్వపరిష్కర్తల వలెనే భ్రమ ప్రమాద దురహంకారములకు లోనై తబ్బిబ్బులుపడి నీ గ్రంథము పాడుచేసినారు! చక్కని ప్రాచీనప్రతులు

సంపాదించి, నీ గ్రంథములు అన్నీ శ్రద్ధతో చదివి నీభాష కట్టుబాట్లు లెస్సగా తెలుసుకొని, పాఠములు పరిష్కరించి, అచ్చొత్తించి తెలుగు సారస్వతమును ఉద్ధరించే పుణ్యాత్ములు, భాషాభిమానులు ఎప్పుడు పుట్టుదురో!

ద్రుతమునకు అచ్చుతో "సంశ్లేషము"

77. వేదము వెంకటరాయశాస్త్రులవారి దృష్టికి ఇది ఒక మహాపాతకముగా తోచినది. వేంకటరత్నము పంతులవారు ఇట్టి మహాపాతకములు ఆంధ్ర ప్రసన్నరాఘవమునందు ముమ్మారు చేసినారట: 5 వ పుటలో 'విజృంభణన్ననువు' అనిన్ని, 23 వ పుటలో 'అంగములన్నిడు' అనిన్ని, 53 వ పుటలో 'వాఁడున్నా' అనిన్ని. తమ విమర్శము 82 వ పుటలో ఇది మహాపాతకము అని నిషేధించుటకు గల కారణము శాస్త్రులవారు వివరించినారు చూడండి:—

"'లుక్సంశ్లేషౌనాచి' యను నన్నయ భట్టీయ సూత్రముచే నిది గ్రామ్యము. పంతులవారు ఈ సూత్ర నిషిద్ధములైన లుక్సంశ్లేషములలో సంశ్లేషమును తాము యథేష్టముగా చేసి తద్రక్షణార్థము ఆ సూత్రమే నన్నయాచార్యులది గాదని తొలుత వాదించి, ఆ సూత్రముగల శ్లోకమే ఆయనది గాదని ద్వితీయ వాదము వాదించి, నన్నయ భట్టీయమే నన్నయ భట్టుది గాదని తృతీయ వాదము వాదించి, లుక్కు చేసిన వారి లుక్కును ఆ సూత్రమునే ప్రమాణముగాఁ జూపి దూషించి, ఆత్మను భూషించుకొని యున్నారు."

శాస్త్రులవారి మతమందు 'విజృంభణఁ + అనువు' అని ఉన్నప్పుడు "విజృంభణన్ననువు" అని నాకు నాముడిచ్చి ద్విత్వనకారము వ్రాయడమే గ్రామ్య సంశ్లేష దోషము గాబోలు. 'విజృంభణఁ అనువు' అని రెండవ శబ్దము మొదటను అచ్చుంచి వ్రాస్తే దోషముకాదు కాబోలు! దోషమైతే,

తమ ప్రతాప రుద్రీయ మందు ముమ్మాటికన్న ఎక్కువగా ఇట్లు ఎందుకు వారు వ్రాతురు?

(1) ఉదా. గరడీలేగడికోటలే...విరతిలేకే వంశపారంపరిన్ అరికంఠాద్రి...(పుట. 25)

(2) ఉ...లీలనేసుచున్ ఓష...(పు. 60)

(3)ఉ...సిరిన్ ఆయగజాతకున్ (పు 97)

వీటిలోని ఉన్నట్టే, 'విజృంభణన్ననువు' లో కూడా పాదాంతమందే ద్రుతమున్నది. ఎక్కడనుంటే నేమి?

వ్రాతలో ఒక్క నకారపొల్లు మాత్రమే ఉన్నా అవ్యవధానముగా అచ్చు చేర్చి నోటను పలికి నప్పుడు 'న్న' పలికినట్లు చెవులకు వినబడక మానదు. వాస్తవముగా నోటనుపలికేది, చెవికి వినబడేది భాషగాని కంటికి కనబడే గీతలుకావు. ఈ స్వరతత్త్వమును గురించి కొంచెము క్రిందను 80 వ పేరాలో వ్రాస్తున్నాము.

78. అయితే, ఈ నన్నయ భట్టీయ సూత్రము అమోఘము కాదు. నన్నయాది మహాకవులు చాలామంది ఇందుకు విరుద్ధముగా సంశ్లేషము చేసి ఉన్నారు. ఈ నన్నయ భట్టీయమునకు టీక వ్రాసిన వారందరున్ను ఈ సూత్రమునకు విరుద్ధముగా కొందరు లక్షణము చెప్పి ఉన్నారని ప్రమాణీకరించే ఉన్నారు. అరవై అయిదు సంవత్సరముల క్రిందట "వర్తమాన తరంగిణీ ముద్రాక్షర శాలయందు మూడవ పర్యాయ మచ్చు వేయింపబడిన 'సటీకాంధ్ర శబ్ద చింతామణి' యందు "కొందఱచ్చుపరంబగునపుడు ద్రుతంబునకు ద్విత్వ రూపంబగు సంశ్లేషంబు గలుగునని సేవింతు న్నచ్యుతు నని యుదాహరింతురు" అని ఉన్నది. తాటాకు పుస్తకాలనేకము మేము చూచి ఉన్నాము. వాటిలోనున్ను ఇట్లేఉన్నది. ఇట్లు టీకలు వ్రాసిన వారేకాక

లక్షణ కర్తలు కూడా కొందరు ఈ మతము అంగీకరించినారు. ప్రథమా చార్యులవారు చేసిన అనుశాసనము పిమ్మటివారు మార్చినారు.

వేంకటరాయ శాస్త్రులవారివలెనే సంశ్లేష మనగా ద్విత్వరూపమను కొని ఈ వ్యాసమందట్లే వాడినాము.

ఐతే, "సంశ్లేషము" అనే పదము పారిభాషికము, దీనికి వ్యాకరణ శాస్త్రమందు ఏ అర్థమున్నదో మాకు స్పష్టముగా తెలియనందున బ్ర.వ రఘుల చిన సీతారామస్వామి' శాస్త్రులవారిని అడిగినాము. వారిచ్చిన జవాబు ఏమంటే—"సంశ్లేషమున కాంధ్ర వ్యాకరణములో నెచ్చటను సరియగు పరిష్కారము కనఁబడదు. ద్రుతమునకు హల్లు పరమగు నపుడె సామాన్యముగా సంశ్లేషము విధింపఁబడును, సంశ్లేష మనఁగా సంయోగించుట, కలసికొనుట. ద్రుతము సహజముగా నజ్విష్టమై యుండును; గానఁ బరహల్లుతోఁ గలియనేరదు. కాఁగా సంశ్లేషవిధాన వైయర్థ్యాన్యథానుపపత్తిచే ద్రుత స్వరలోపము సిద్ధించును. అపుడు పరహల్లుతో దానికి సంశ్లేషము తటస్థించును. ఈ యభిప్రాయముతోడనే యహోబలపతి "అలుకిచ సంశ్లేషస్స్యాత్" అను సూత్రవ్యాఖ్యానావసరమున "లుగభావేనస్యపరవర్ణేన సాకం సంశ్లేషశ్చ భవేత్" అని వ్యాఖ్యానము చేసియున్నాఁడు. కాని యీ విషయము "లుక్సంశ్లేషౌ నాచి" అనుదానికి విరోధించున ట్లగపడును. "వచ్చెను + అతఁడు" అనుచోఁ ద్రుతమునకుఁ బరవర్ణముతో సంశ్లేషము విరుద్ధముకానేరదుగదా. 'వచ్చెనతఁడు' అను రూపము సర్వసమ్మతముగదా. కాఁగా నిచట సంశ్లేషశబ్దమునకు హల్పరకస్థలములందు సంశ్లేషసంభావ్యతాయోగ్యమగుటంజేసి సంభవింపక తీరని ద్రుతస్వరలోపమేయని గ్రహింపక తీరదు. అట్లు గ్రహించినచో ద్రుతమున కచ్చు పర మగునపుడు ద్రుత స్వరలోపము రాదని తేలుచున్నది. అనఁగా 'వచ్చెన్ అతఁడు' అని యుండనేరదని తాత్పర్యము. పై కారణములచే సంశ్లేషమనగా "ద్రుతములుప్త స్వరమై పూర్వాచ్చునంటి యుండుట" అని అర్థము చేయుట

లెస్సయని తోఁచుచున్నది. పై యభిప్రాయమే “నో వాద్విత్వంక్వచిచ్ఛిష్టం” అను నథర్వణ కారికచే ధ్వనితమగుచున్నది. పై కారిక వల్ల నకార ద్విత్వము సంశ్లేష భిన్నమని స్పష్టపడుచున్నది.

(1) ద్వితీయాచార్యుఁడైన, అథర్వణుని“నోవాద్విత్వంక్వచిచ్ఛిష్టం” అనే కారికకు తృతీయాచార్యుఁడైన అహోబలుఁడు, ‘ఏతదా చార్యస్యాపి సమ్మతం’ ‘ఎన్నఁడున్నేని మోఘముగాదు’, ‘ధైర్యశక్తి కిన్నరుఁడుగ’ ఇత్యాది తత్ప్రయోగాత్’ అని భాష్యము వ్రాసినాఁడు. గనుక వీరిద్దరికిన్ని ద్విత్వరూపము ఇష్టమే.

(2) తంజావూరి సరస్వతీ మహల్ పుస్తకాలయమందు “సకలలక్షణ సంగ్రహంబైన బాలబోధయను లక్షణము” అనేపేరుగల తాటాకుల పుస్తకమొకటి ఉన్నది. అందులో ప్రస్తుత విషయమును గురించి లక్షణమెట్లున్నదంటే.

క. చెన్నగు నొరపొల్లలకు న్నచ్చులతోడి సంధి గూర్పఁగ నొకటం
బన్నగ శయనుఁడు హరియించున్న ఘములు భక్తులయినసుజనుల ననగన్.

ఇందుకు లక్ష్యములుగా ఆది పర్వము 7. 141 వ పద్యమందున్న ‘ఎన్నఁడున్నేని’ అరణ్యపర్వము 1. 321 వ పద్యమందున్న ‘ధైర్యవృత్తి కిన్నరుఁడుగ’ మొదలయినవి కొన్ని ఉదాహృతమయి ఉన్నవి. సుప్తార్థ ప్రకాశికలో కల్లూరి వేంకట్రామ శాస్త్రులవారు’ సర్వలక్షణ సారసంగ్రహమున’ నున్నది అని

క. ఎన్నగనకార పొల్లులకున్నచ్చులు సంధిఁజేసి కూర్పగవచ్చున్
బన్నగ పతిశయ నుండోర్చున్నఘములఁ బాపభక్త సులభుఁ డయినన్

ఉదాహరించినారు. ఈ గ్రంథము కూచిమంచి తిమ్మకవిదికాదు; తిమ్మకవి లక్షణములో ఈ పద్యము కనబడలేదు; చిత్రకవి పెద్దన్నది కాబోలు.

(3) రంగరాట్ ఛందస్సు (తాటాకులమీద వ్రాసిన ప్రతి) లో ఇట్టి సంధికి లక్షణ లక్ష్యము లున్నవి. (చూ. 43 b)

క. తెల్లమిగాను నకారము పొల్లులకున్ నచ్చుసంధి పొసగు గప్రలకున్
కొల్లలుగ రంగ ధరణీవల్లభు డిచ్చున్ నపార వస్తువులనిన్.

అర్థం—నకార పొల్లులవెనుక అచ్చులయిన అకార ఇకార ఉకారాదులకున్ను సంధి పొసంగును.

ఇందుకు లక్ష్యములు నన్నయ ప్రయోగములేకాక పారిజాతాపహరణములోనిది (1·45) ఉదాహృత మయి ఉన్నవి.

(4) సీతారామాచార్యులవారు తమ ప్రౌఢ వ్యాకరణములో (చూ. సంధి 3) "కొన్నియెడలఁ బ్రామాణిక ప్రయోగంబుల ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి" అనిలక్షణము చెప్పి, ఉత్తరహరివంశము లోనిది ఒకటిన్ని, భాగవతము సప్తమస్కంధము లోనిది ఒకటిన్ని, కళాపూర్ణోదయములోనిది ఒకటిన్ని ప్రయోగము లుదాహరించినారు.

(5) గుప్తార్థప్రకాశికలో కల్లూరి వేంకటరామశాస్త్రిలవారు ద్విత్వ విధి అంగీకరించక ద్రుతముపైని ద్రుతము వచ్చినదని సమాధానము చెప్పి "ఎన్నడున్ + ను + ఏని = ఎన్నడున్నేని" అయినదని ఉన్న రూపము తప్పనక, సాధించినారు (చూ. పు. 39) వీరికిన్ని ఇది ఇష్టమే.

79. స్వరతత్త్వము, శబ్దములు వ్యుత్పత్తి తెలియక తెలుగు పండితులు "ఎన్నడున్నేని" లోని ద్విత్వనకారము సాధించుటకు చిక్కులు పడ్డారు. భారతము పరిష్కరించిన పండితులు ఎవరికి తోచినట్టువారు ఈప్రయోగములు గల పద్యములు దిద్దివేసినారు. వావిళ్ళవారిముద్రణమందున్ను ఆనంద ముద్రణమందున్ను "ఎన్నడున్నేని మోఘముగాదు దిగ్ధరణీ రవీందు లెఱుంగఁగాన్" (ఆది VII 141) అని ఉన్నది. 1833 వ సంవత్సరములో వర్తమానతరంగిణీ ముద్రాక్షరశాలయందు అచ్చు పడ్డదానిలోను, 1893 వ సం

వత్సరములో వాక్సతీ నిలయముద్రాక్షరశాలయందు అచ్చుబడ్డదానిలోని "ఎన్నఁడౌనేని." అని ఉన్నది. కొన్నితాటాకు పుస్తకములలో "ఎన్నఁడు న్నేని మోఘముగాను దిగ్ధరణీందు భానులెఱుంగగాఁ" అని ఉన్నది. ఏదో ఒకలక్షణము వేదవాక్యముగా నమ్ముకొని, దానికి విరుద్ధముగా ఉన్న ప్రయోగము దిద్దడమునకు మనపండితులు వెనుకతీయరు. తమ కిష్టము కాని సంధి తప్పు అని ఒకసిద్ధాంతము; తమ కిష్టము కాని యతి తప్పు అని ఒక సిద్ధాంతము, భారతకర్త నన్నయే ఆంధ్రశబ్ద చింతామణి వ్రాసినవాడని ఒకసిద్ధాంతము; గనుక తమకిష్టమయినదే నన్నయ వ్రాసినాడు అని రాద్ధాంతము*.

---

* మరి ఒక విచిత్రము. 'ఏని' అనేరూపము అంగీకరించితే, సంధి దోషమో వడిదోషమో అంగీకరించవలసి వస్తుంది గదా! ఏమిదారి' దేవుఁడా? అని పండితులు తికమకలాడకుండా, మ. రామకృష్ణకవిగారు చిత్రంగా చిక్కు విప్పివేసినారు. వారు పరిష్కరించి ప్రకటించిన నన్నెచోడని కుమారసంభవము పీఠికలో ఇట్లు వ్రాసినారు:—"నన్నెచోళుఁడు, ఏనియనుశబ్దమును నేని యని నకారాదిగాఁగూడఁ ప్రయోగించెను కాబట్టియే నన్నయభట్టు—న్నేని దిగ్ధరణీ రవీందులు, అది-ఆ-ఒ అను నకారాదిగా బ్రయోగించె. ఇది తెలియక దుస్సంధియు, యతికి వైకల్పికభావమును నన్నయభట్టున కారోపించిరి" భేష్! పండితుల కెవరికిన్నీ తెలియని పరమ రహస్యము ఈ కవిగారు కనుక్కొన్నారు. 'ఏని' శబ్దమునకు 'నేని' అనే రూపాంతర మున్నదట! గ్రాంథికాంధ్ర భాషారహస్యములు పండితులకే తెలియనప్పుడు పామరులు ఆభాషజోలికి పోకూడదు గదా. ఏమంటే ఏమి తప్పో? మామట్టుకు మాకు భయముగా ఉంటుంది. అందుచేతనే తత్త్వ జిజ్ఞాసకుమాత్రము దానిని స్మరిస్తూ వాడుకభాషలో వ్యవహారము సాగిస్తున్నాము. సరేకాని, ద్రుతమునకు అచ్చుతో సంశ్లేషము దుస్సంధి అని నన్నెచోడని వాడుకనుబట్టి కవిగారు సిద్ధాంతముచేసినట్లా? చూడండి.

80. తత్త్వముచొప్పున 'ఉన్' అనేదిసముచ్చయము, అరవములో, కన్నడములో 'ఉమ్' అని దీనిరూపాంతరము ఉన్నది. తెలుగు - వేదముఁ పురాణముఁ; అర - వేదముమ్ పురాణమ్; కన్న-వేదవుమ్ పురాణవుమ్' తె-'ఎప్పుడుఁ=అర-'ఎప్పోదుమ్' తె-'అమ్మయుఁ అన్నయుఁ! అర.

నన్నెచోడుడే ఏలాగున వ్రాసినాడో:—"పొన్నలుఁ గొండఁ గోఁగులును బూరువులున్నొగిఁ—బూనకుండఁగా" (చూ. 447 వ 'బూరువులున్నొగి' అంటే 'బూరువులున్ + ఒగి' అనికాదా? కాకుంటే 'నొగి' అనే రూపాంతర మున్నదంటారేమో కవిగారు! శబ్దతత్త్వము చొప్పున అజాదిగా ఉండవలసిన శబ్దములు నకారాదిగా వ్యవహారములోనికి రావడము మాకు వింతకాదు. 'నేను' 'ఏను' అనే సర్వనామములు అట్టివే. ఈలాటివి చాలా ఎరుగుదుము. ఇంగ్లీషులోని newt, nickname అనే శబ్దములు వాస్తవముగా అజాదులు. కొందరు బడిపిల్లలు "ఇది నుత్తమమైన పద్ధతి" అని వ్రాస్తున్నారు! పండితులుకూడా అట్లువాడితే 'నుత్తమము' రూపాంతరమై గ్రాంథికాంధ్రము నసాధువుకాదా? గ్రాంథికాంధ్రములో నీరిణం, ఈరిణం; వతంస, అవతంస; మొదలయినరూపాంతరములు ఎన్నో సంస్కృతమందే ఉన్నవే; ఇవి ఏలాగున సంప్రాప్తమయినవి? ప్రాచీనుల వాడుక ఏలాగున ఉన్నదో తెలుసుకోవలెదంటే', ప్రాచీనగ్రంథాలు సావకాశముగా పరీక్షించవలెను. అది ఏలాగున ఉన్నా మనవాడుకకు సాధకమూకాదు; బాధకమూ కాదు. పూర్వుల వాడుకనుబట్టి మనవాడుక దిద్దుకోలేము; మనవాడుకనుబట్టి పూర్వుల వాడుక దిద్దగూడదు. ఆకాలములో అది ఈకాలములో ఇది, రెండూ సాధువులే. రూపములో మార్పు కలుగడము దోషమైతే, బ్రతికి ఉన్నవన్నీ మారుతూ ఉంటవి గనుక దుష్టమయినవి అని సిద్ధాంత మవుతుందే! భాషాతత్త్వజిజ్ఞాసువులు భాషాధర్మము భాషాప్రయోజనము లెస్సగా ఎరిగినవారైతేనే కాని భాషాతత్త్వము పట్టుపడదు.

అమ్మైయుమ్ అన్నైయుమ్. 'అమ్మయును' అనేదానిని అమ్మ + యు + ను అని పండితులు విడదీసి, 'యు' 'ను' సముచ్చయములని చెప్పుతారు-గాని ఆ సిద్ధాంతము తత్త్వమునకు దూరము. ఇప్పటి తెలుగు పండితులలో వావిలికొలను సుబ్బారావుపంతులుగారికి మాత్రము 'ఉన్' అనేరూపము కొంచెము పొడకట్టినట్లున్నది; అరవముతో పరిచయము కలుగుటచేత కాబోలు. ఈ 'ఉన్' అనేది నొక్కి పలికి నప్పుడు నకారము ఎక్కువకాలము పలుకక తప్పదు. ఇప్పటి తెలుగులో కూడా రెండున్ + అర=రెండున్నర, ఏడున్ + ఒకటి=ఏడున్నొకటి అని వాడుతున్నాము. నన్నయ కాలమందు 'రెండు వేలున్నే నూట పదునొకండు' 'మూఁడు వేలున్నే నూట యిరువది' రెండు వేలున్నె నమన్నూట' మొదలయినవి వాడుకలో ఉండేవి. శ్రీనాథుడు కాశీఖండములో 'ఇరువదియొక్క వేయున్నాఱు నూఱువారంబులు' అను ప్రయోగించినాడు. 'ఒకటిన్నర' అన్నప్పుడుకూడా 'ఇన్' నొక్కిపలుకుతాము—ఒకటిన్. అరన్. నకారమేకాదు; ఏహల్లయినాసరే పదాంతమందు పొడిగించవచ్చును, ఉదా. జగత్ + ఉ జగత్తు 'సంస్కృతములో' 'తత్' త్ అంటే తెలుగులో 'అది' అని అర్థము; "ఇంగ్లీషులో 'కమ్' మ్ అంటే, తెలుగులో 'రా' అని అర్థము. ఈ వాక్యములలో కిందను గీతలు గల మాటలు 'తత్తంటే' 'కమ్మంటే' అని వ్రాస్తున్నాము. సంస్కృతములో కూడా 'తస్మిన్ + ఇదమ్'=తస్మిన్నిదమ్ ఇంగ్లీషులో in + er = inner, big + er = bigger. కన్నడములో కణ్, + ఉ = కణ్ణు; పాలీలో తమ్ + ఏవ = తఞ్ఞేవ. ఏకాక్షర శబ్దములలో హ్రస్వాచ్చు ఉన్నప్పుడు తెలుగులో ఇట్లు హల్లు పొడుగుగా పలుకకతప్పదు. దీర్ఘాచ్చు ఉన్నప్పుడున్ను ఎక్కువ అక్షరములున్నప్పుడున్ను, కొసనున్నవర్ణము ఏకారణముచేతనైనా నొక్కిపలికితేనే పొడుగవుతుంది, లేకుంటేకాదు. ఉదా:—ఇంగ్లీషులో 'టైమ్' మంటే' తెలుగులో 'కాలము'; 'వన'మంటే, అడవి వనము, వనమ్ము—ఈ రెండు మాటలలో, మొదటి దానిలోని నకారముపై

నున్న అకారము రెండవ దానిలోనినకారముపైనున్న అకారమున్న ఎక్కువ పొడుగు; దానికి పరముగా ఉన్న మకారము రెండవ మాటలోని మకారముకన్న హ్రస్వముగా ఉంటుంది. ఇట్లే 'వాకు'లోని ఆకారము కన్న 'వాక్కు'లోని ఆకారము కొంత హ్రస్వము; ఎక్కువ పొడుగయిన అచ్చుకుపరముగా ఉన్నహల్లుకన్న పొడుగు తక్కువైన అచ్చుకుపరముగా ఉన్న హల్లు ఎక్కువ పొడుగుగా ఉంటుంది. అచ్చులవలెనే హల్లులున్న దీర్ఘముగా పలుకవచ్చును. హల్లుదీర్ఘమునకు వ్రాతలో ద్విత్వమునురుపు. ఇది ఎవరిమట్టుకువారు పరిశీలించి తెలుసుకోవలసినవిషయము తగినయంత్రములుంటే ప్రత్యక్షమవుతుంది ఈస్వరతత్త్వమున్న శబ్ద తత్వమును తప్పయినా ఒప్పయినా, మన పండితులతో చేసేప్రస్తుత వాదమునకు బాధకమూకాదు, సాధకమూ కాదు; అది మాప్రతిపక్షులకు మేము బోధపర్చ లేము; వారు బోధపర్చుకోరు.

81 ప్రకృతమనుసరింతాము. ద్రుతముతో అచ్చుకు సంశ్లేషము కలుగుతుందా కలుగదా? అనే విషయము గురించి ప్రస్తుత జిజ్ఞాస. వేంకటరత్నము పంతులవారు కలుగుతుంది అన్నారు; వేంకట రాయశాస్త్రులవారు కలుగదు అన్నారు. కొందరు లాక్షణికులు అట్టి సంశ్లేషము సాధు వన్నారు; కొందరు అసాధు వన్నారు వీరిలక్షణము తప్పని వారివారున్న, వారిలక్షణము తప్పని వీరివారున్న తగువు లాడుతున్నారు. సాధువన్నవారు లక్ష్యముగా ఇచ్చినప్రయోగాలు అపపాఠాలు అని అసాధు వన్నవారు నిరాకరించినారు. ఇప్పుడు మనము తత్త్వమెట్లు తెలుసుకోవడము? అచ్చువేసే యంత్రములు మన దేశములో లేనప్పుడు పుట్టిన లక్షణ గ్రంథములందు ఏ పద్యములు లక్ష్యములుగా ఉదాహృతమయి ఉన్నవో ఆపద్యములలోని పాఠములు అపపాఠములు అంటే, కావని ఏలాగున సాధించడము? స్వమతాభిమానము చేతను అజ్ఞానము చేతను మునుపు కూడా పాఠాలు యథేష్టముగా దిద్దిమార్చి గ్రంథాలు తాటాకుల మీద వ్రాసినారని తోచేటట్లు

అప్పకవి చెప్పినాఁడు, అయితే మత భేదమున్నప్పుడు వ్రాత ప్రతులలో ఆభేదము కనబడవలెను. మనకు దొరికిన ప్రతులన్నిటిలోను పాఠము ఒక్క లాఁగునఁ ఉన్నప్పుడు అవి అన్నీ ఒక్కదుష్టమూలమునుబట్టి వ్రాసినవనవలెనా? లేక, గ్రంథకర్తే ఆలాఁగున వ్రాసినా డనవలెనా? ఇదమిద్ధమని సిద్ధాంతము చేయుట బహు దుష్కరము గదా. ఇట్టివాటిలో గ్రంథకర్తకు తప్పమరి యెవరికిన్నీ సత్యము నిశ్చితము కాదు. గ్రంథకర్త స్వకృతమును గురించి చెప్పిన మాట యందైనా మోసమున్నదని చెప్పి విశ్వాసార్హము కాదనుటకు ఇతరులకు అవకాశము లేకపోలేదు. గనుక, వాది ప్రతివాదులకు వాద విమర్శకులకు, తత్త్వజిజ్ఞాసువులకు, అందరికీ ఒక్కలాఁగున ప్రత్యక్షము కాని విషయములలో సంభావ్యతాసంభావ్యతలు మాత్రమే విచారించ తగినవి.

82. వర్తమాన వ్యవహారమునకు ప్రవర్తకముగా సద్యోనిర్ణయము చేయవలసినప్పుడు, అప్పటికి ఏది సంభావ్యమని ఊహించ వచ్చునో దానిని బట్టి నిర్ణాయకులు నిర్ణయించక తప్పదు. అన్ని దేశములలోను న్యాయ స్థానములందులౌకిక వ్యవహారముతో సంబంధించిన వివాదములన్నీ ఇట్లే నిర్ణ యిస్తున్నారు. అయితే, ప్రాచీన కాలపు వ్యవహారములను గురించి గాని, ప్రకృతి ధర్మమును గురించిగాని, ఆధ్యాత్మిక విషయములను గురించి గాని, తత్త్వజిజ్ఞాస గలవారు ఒకరుచేసిన సిద్ధాంతమును ఒకరు ఖండిస్తూ, సావ ధానముగా సాక్ష్యమే కాక ప్రమాణములు కూడా మాటిమాటికి పరీక్షించి, అసంభావ్యములు తొలగించి సంభావ్య మయినవే అంగీకరించి, పక్షపాతము లేకుండా తమ బుద్ధికి నిశ్చితమని తోచిన అభిప్రాయము నిరూపిస్తారు. లౌకిక వ్యవహారములో సద్యఃప్రవృత్తి కోసము సద్యోనిర్ణయము అగత్య మయినా, తత్త్వజిజ్ఞాసలో అగత్యము కాదు. యథార్థము తెలిసేదాకా విమర్శ జరుగుతూనే ఉంటుంది. దీనికి కాలపరిమితి లేదు. నిజమని ఒక కాల ములో అందరూ నమ్మేటి విషయము మరిఒక కాలములో అబద్ధమై

హాస్యాస్పదము కావచ్చును. భాషా జిజ్ఞాస కొంతమట్టుకు దేశచరిత్ర జిజ్ఞాస వంటిది. మేము ఈ వ్యాసము వ్రాస్తూఉన్న దినమందు మనదేశ చరిత్రకు కావలసిన భోగట్టా అంతా ఏలాగున తెలుస్తుంది? ఈ కాలములో వార్తా పత్రికలున్నవి గనుక ఏవోకొన్ని వృత్తాంతములు వాటిలో ప్రకటిస్తారు గాని దేశమందు అంతటా జరిగిన సమాచారము యావత్తూ వాటిని బట్టి తెలియదు. జరిగిన పనులలో ఏవిగొప్పవో ఏవికొద్దివో అవిజరిగినప్పుడు బుద్ధిమంతు లయినా ఊహించలేరు; ఏదిఏలాగున పరిణమించునో ముందుగా తెలియదు గదా. మనదేశమునకు కొంచెము కాలములో సంభవించే గొప్ప మేలుగాని కీడుగాని కారణమైనపని నేటి ఉదయమే జరిగి ఉండవచ్చును; అది యెవరికిన్నీ తెలియక పోవచ్చును. మేలుగాని కీడుగాని జరిగినతర్వాత దానికి గల నిజమైన కారణము తెలియక ఎవరికి తోచినట్టువారు ఊహించి, అనేక కారణములు చరిత్రకారులు కల్పించ వచ్చును; వాటిలో ఒకటైనా వాస్తవము కాకపోవచ్చును. ఇట్టి దోషములు చరిత్రలో కేవల సంభావ్యమే కాకుండా, యథార్థముగా సంభవించినవని చరిత్ర బాగా చదివినవారే చెప్పినారు. అయినా చరిత్రపఠనము నిరర్థకము కాదు; దానివల్ల బుద్ధివికాసము కలుగుతుంది. ప్రాచీనచరిత్ర సర్వవిషయములలోను మనకాలమందు ప్రవృత్తికి పరమప్రమాణము కాదనిమాత్రము జ్ఞప్తియందు ఉంచుకోవలసినది.

83. చరిత్రజిజ్ఞాసకు దొరికేసాధన సామగ్రి వంటిదే భాషా జిజ్ఞాసకు దొరికేదిన్నీ. ఇప్పుడు మేము వ్రాస్తూఉన్న వ్యాసము మా అలవాటు చొప్పున మా తెలుగు భాషలో రచిస్తూఉన్నాము. మా ఉత్తరప్రత్యుత్తరములుకూడా ఈభాషలోనే వ్రాస్తాము. సంభాషించినప్పుడున్ను ఈ తెలుగే వాడుతాము. అయినా అన్నివిధములయిన వ్రాతలలోను సంభాషణలలోను మాభాష ఏమీభేదము లేకుండా, ఎల్లప్పుడూ ఒక్కలాగున ఉంటుందని ఒప్పుకోలేము. మా సన్నిహిత బంధువులభాషకున్ను మాభాషకున్ను కొంచెము వ్యత్యాసము ఉండకపోదు. తెలుగుభాష అనేక కోటిముఖముల

ప్రవహిస్తూ ఉన్నప్పుడు తెలుసువారందరూ నేడు సరిగా ఒక్కలాంటి తెలుగే వ్యవహరిస్తున్నారని చెప్పలేము. దేశమునుబట్టి, జాతినిబట్టి, వృత్తిని బట్టి, మతమునుబట్టి, విద్యనుబట్టి, వయస్సునుబట్టి, నాగరకతనుబట్టి, ఎంతో కొంత వ్యత్యాసము ఏర్పడక తప్పదు. అయినా, "నేటి నాగరకుల తెలుగు" లో సాధర్మ్యము అధికముగాను వైషమ్యము తక్కువగాను ఉన్నందున, దానిని విశేషించి, ప్రత్యేకించి, సగటున, అనగా మొత్తము మీద, పరీక్షించి, ఒక్కలాటిదే అనవచ్చును. అన్ని దేశములలోను అన్ని కాలముల లోను వ్యవహారిక భాషలు ఇంచుమించుగా ఇట్లే ఉంటున్నవి. మన కాలములో అచ్చుపుస్తకములు అచ్చు వార్తాపత్రికలు పోస్టు, వ్రాత మూలమయిన లౌకిక వ్యవహారము ఉన్నందున, వీటిని బట్టి "నేటి నాగరక తెలుగుభాష" కు లక్షణము చెప్పవచ్చును; గాని, సంపూర్ణమైన లక్షణము నిరూపించుట అసాధ్యమనక తప్పదు. వ్యవహారములో ఉన్న భాష యావత్తూ కాకితాలమీద కనబడదు. వ్యవహారములో ఉన్న శబ్దాలన్నీ ఆవశ్యమైనవే: ఒక్కటి విడిచినా వ్యవహార హాని కాక తప్పదు. పొల్లు మాటలు కోశాలలో ఉంటవిగాని వ్యవహారములో ఉండవు. వచనము, విభక్తి పురుషము, లింగము, కాలము, మొదలయిన భేదములు, వర్ణలోప వర్ణాగమ వర్ణవ్యత్యయ లక్షణమయిన సంస్కారములనుబట్టి, తెలుసుకొని, శబ్దార్థము గ్రహించి వ్యవహారమందు ప్రవర్తించడము శైశవము నుండిన్నీ అలవాటయి, పండిత పామరులు అందరున్ను తడవుకోకుండా, అచ్చులు హల్లులు యథాశ్రుతముగా ఉచ్చరిస్తూ, ఇంచుమించుగా ఒక సంఘములో ఒక్కలాగున భాషిస్తారు. అర్థమునకు బాధకముగాని వ్యత్యాసములు వ్యవహారములో ఎవ్వరిమనస్సునున్ను తట్టనే తట్టవు. మాట్లాడినట్టే చదవడము అలవాటయినవారు అన్నిమాటలున్ను అర్థమవుతూ ఉంటే, వ్రాతలోనైనా ఇట్టి వ్యత్యాసాలు పాటించరు. ఇంత పరిచితమైనదయినా దేశ భాష బహు చంచలమయినది; అతి చపలమైనది. దాని లక్షణము నిశ్చయ

ముగా నిరూపించుట ఆకాశమునీద చుక్కలు లెక్కపెట్టుటవంటిది. ఎన్ని సూత్రాలు పన్నినా వ్యవహారమునకు సరిపడవు. ఉత్సర్గాలకు అపవాదములు; అపవాదములకుకూడా అపవాదములు విధించినా, మాటిమాటికి "బాహుళకము" "వైకల్పికము" అని, 'ఆకృతిగణా' లని," ప్రయోగానుసారముగా గ్రాహ్యమని, లక్షణవిరుద్ధ మయినను ఆర్యవ్యవహారము "గ్రాహ్య" మని, లక్షణమునకు లొంగని శబ్దములకు గతి కల్పింపక తప్పదు. సాధన సామగ్రి సమృద్ధిగాగల 'నేటి నాగరక భాష' అంతా లక్షణములో ఇముడ్చుట దుష్కరముగా ఉన్నపుడు, పూర్వకాలపు నాగరక భాషాలక్షణము సంపూర్ణముగా తెలుసుకొని, ఆభాష స్వాధీనము చేసికొన్నట్టుగా ఆంధ్రపండితులు నటిస్తే ఎట్లు నమ్మగలము? మనకాలములో ఉన్నట్టు ఆకాలములో వార్తాపత్రికలు లేవు; వ్యవహారమంతా ఇంచుమించుగా వ్రాత అక్కరలేకుండా మూజబానీగా జరిగేది. నన్నయ మొదలుకొని తిక్కన దాకా తెలుగు భాషా స్వరూపము తెలిపే సాధనములు ఏ మున్నవి? నన్నయ వ్రాసిన గ్రంథమొక్కటే గదా; ఆకాలపు శాసనములయినా అట్టే లేవు; ఉన్న వయినా పండితుల దృష్టికి ప్రమాణముకావు. తెలుగుదేశమందున్న తెలుగువారి అందరిభాషా నన్నయభాషలో అంతర్భూతము అయి ఉండదు. నన్నయ వాడుకొనే తెలుగుభాష అంతా అతడు వ్రాసిన కొంచెము గ్రంథములో చేరి ఉండదుగదా; అందులోని కథ చెప్పుటకు ఏశబ్దములు కావలెనో అవే అతడు వాడినాడు. అతడు తన గ్రంథములో వాడని శబ్దములున్ను, వాడని ప్రత్యయాదులున్ను వేనవేలు గ్రంథస్థముకాక నశించినవికావా? నన్నయవ్రాసినమూడుపర్వములలోనున్న భాషఅంతా కంఠపాఠము చేసినా, నేటి వ్యవహారమునకు కావలసినవ్రాతలు నన్నయభాషలో వ్రాయలేము. ఇట్లే తక్కినగ్రంథాలలోని భాష. పండితులకు ప్రమాణమయిన తెనుగు గ్రంథాలు శృంగార ప్రబంధాలున్ను పురాణములున్ను, వాటిలోనున్న భాష వ్యవహారమందున్న భాషలో అత్యల్ప భాగమయి ఉంటుంది. ఏకాలములోనయినా దేశభాష అనేది అప్పటి లోకవ్యవహారమునకు సరిపడి, సమగ్రము

గానే ఉంటుంది; గాని, అందులో ఏమీ లోపముండదు. మనుష్యులజ్ఞానమంతా వారిభాషలో ప్రతిబింబమయి ఉంటుంది. అజ్ఞానములో కొంచెము మాత్రమే గ్రంథస్థమయిన విషయముతో సంబంధము కలిగి ఉంటుంది. అది వ్యక్తపర్చుటకు కావలసిన శబ్దములే కాని తక్కినవి కవులు వాడరు. ప్రాచీన గ్రంథములలో ఉన్న భాషమాత్రము ఆధారముగా చేసుకొని, కావలసినయెడల లక్షణము చెప్పవచ్చునుగాని, ఆలక్షణము దానికి సంపూర్ణమయినా, ప్రాచీన నాగరక భాషాలక్షణమని చెప్పవల్లకాదు. గ్రంథములలో చేరక నశించిన శబ్దములు అనేకములు తెలియరానందున, లక్షణము అసమగ్రము కాక తప్పదు. అట్టి అసమగ్రలక్షణమును బట్టి తప్పొప్పులు నిర్ణయించకూడదు. మాటకు, గ్రంథస్థమయిన ఒకధాతువునుండి పుట్టిన చేదాద్యర్థము, తుమున్నాద్యర్థకము, ప్రేరణార్థకము, కదృంతములు మొదలయినశబ్దములన్నీ గ్రంథస్థము కానప్పుడు వాటిరూపములు ప్రాచీన కాలమందు ఎలాగున ఉండేవో తెలుసుకొనుటకు సాధనమేమిటి? తెలుగులో ధాతుపాఠము గణపాఠము ఎర్పడలేదు. తెలుగు భాషాలక్షణము అత్యల్పము. ఆకాస్సలోను వైవిధ్యము, వైరుధ్యముకూడా ఉన్నది. గనుక తెలుగులో తప్పొప్పులు లక్షణమునుబట్టి తెలుసుకోలేము; గ్రంథములే ఆధారము. అయితే, గ్రంథములలో సమగ్రముగా భాష లేదుసరేకదా, గ్రంథస్థమయిన భాషమారుతూ వచ్చినది; ఒక్కొక్క కాలములో ఒక్కొక్కవిధముగా ఉన్నది. దీనికితోడు గ్రంథాలలోని పాఠాలు ఎవరి యిష్టము వచ్చినట్టువారు దిద్దుతూ ఉన్నారు. లక్షణము పుట్టినప్పటినుండిన్ని పండితులే ఈపాడుపనిచేస్తున్నారు. ఇట్టికూటకరణమువల్ల తత్త్వనిర్ణయము దుష్కర మవుతుంది. భాషా తత్త్వజిజ్ఞాస భాషా చరిత్ర జిజ్ఞాస భాషాభిమానులకు లేనందున మన భాషకున్ను మన గ్రంథములకున్ను ఇట్టి దౌర్భాగ్యము సంప్రాప్త మయినది. గ్రంథాలలో భాష, శాసనాలలోని భాష ఉన్నట్టు, మారకుండా ఉంటే భాషా చరిత్రకు నమ్మదగిన ఆధారముగా ఉండును. ప్రాచీనాంధ్ర కావ్యములలో ఉత్తరాంధ్ర శబ్దములున్ను, ఉత్తరాంధ్ర కావ్యములలో ప్రాచీ

నాంధ్ర శబ్దములున్ను, చేర్చి భాషాసాంకర్యము చేయడముచేత భాషకు అవస్థాంతర ప్రాప్తి ఎప్పుడు ఏలాగున కలిగినదో తెలిపే జాడలు మరుగుపడినవి.

84. ఇట్టిస్థితిలో, "ద్రుతమునకు అచ్చుతో సంశ్లేషము" గ్రాంథికాంధ్రములో ఉన్నదని నమ్మేవారు తమకుగల ప్రమాణములు చూపించిఆప్రమాణములు అంగీకరించదగిన వన్నందుకు హేతువులు చెప్పవలెను గదా. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, నాచనసోమన, పోతన పింగళి సూరన, మడికిసింగన, వెన్నెలకంటి సూరన, పెద్దన, ముక్కుతిమ్మన, మొదలయిన 18 గురు కవుల ప్రయోగములు రమారమి యాభై ఉదాహరిస్తాము. ప్రతిపక్షులు వీటిలోని పాఠములన్నీ అపపాఠములు అని రుజువు చేసేదాకా 'రెండున్నర' 'ఒకటిన్నర' అనేశబ్దములు గ్రాంథికాంధ్రమందు సాధువని నమ్మటమాత్యముకాదు; తప్పు అని రుజువుచేసే పూచీ ప్రతిపక్షులయందే ఉంటుంది; రుజువుచేసే దాకా ఆశబ్దము అసాధువు అని వారు నిందించకూడదు; నిందించుట అవివేకము. గ్రాంథికాంధ్ర మందిట్టి శబ్దములు లేనే లేవని సిద్ధాంతమయినా, నేటి వ్యవహారములో ఉన్నవి; శిష్టులు నోటను పలుకుతున్నారు; చేతితో వ్రాస్తున్నారు. "ఆర్య వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబు"! వేంకటరాయశాస్త్రులవారున్ను వారిపక్షమువారున్ను 'రెండునఱ' 'ఒకటియునఱ' లేక 'ఒండునఱ' అని ప్రయోగించి తత్ఫలము అనుభవింతురు గాక. రెండవతరగతి ఆనందవాచకపుస్తకము, 20 వ పాఠములో "రెండునఱ' అని గ్రంథకర్తలు వ్రాసినారు. కాని, వారిని చూచి ఇతరులు ఈ శబ్దములు త్యజించరు. త్యజించ కూడదని మేము ఉపదేశిస్తున్నాము. మా మట్టుకు మేము త్యజించలేము. ఈ చర్చచాలును; ఇకను ప్రయోగములు చూడండి.

85. నన్నయ ప్రయోగములు వ్రాత ప్రతులలో ఉన్నట్టుగానే ఉదాహరించి, అచ్చుపుస్తకములలోని మార్పులు తెలియ జేస్తాము. వీటిలో 3 వది 6 వది పూర్వలాక్షణికులు ఉదాహరించినారు.

(1) క. గురుకులము నందు గురులకుఁ బరిచర్య లొనర్చు చున్న పరిమితనిష్ఠా (ఆది 1. 92)

(అచ్చులో "లొనర్చి తానపరిమితా....)

(2) క. నరవరుఁడగు శంతనున కమర నదికిన్నెట్లు సంగమంబయ్యో (ఆది IV. 119) (అచ్చులో—" నదికినెట్లు)

(3) మత్తకోకిలము...దీని నెట్టులు గ్రమ్మరింతు మదీయ భాషణ మెన్నఁడు న్నని మోఘముగాదు దిగ్ధరణీందు భానులెఱుంగఁగాన్ (ఆది VII. 141) [చూ. పేరా 80)

(4) క...నీకున్ నేనపహరించి యిత్తు...(సభా. II 122)

(నన్నయ గ్రంథములో నేను శబ్దమునకు బదులుగా ఏను శబ్దమే తక్కిన చోట్ల కనబడు తున్నందున, ఇక్కడ ఈ ప్రయోగము ఉదాహరించడ మయినది.)

(5) క...ఇంద్రప్రస్థ పురంబున కింద్ర గురుప్రతిభుఁ డరిగి యింద్ర సమానున్ నింద్రయశు ననుజ సహితు నృపేందుని ధర్మసుతుఁ గాంచె నెంతయుఁ బ్రీతిన్ (,, 155) (అచ్చులో 'ఇంద్రయశు'కు బదులుగా జంద్రయశు అని ఉన్నది. నాలుగు పాదములలోను మొదట యింద్ర శబ్దము నన్నయ వాడినట్లు రసికులకు తోఁచక మానదు. వ్రాత ప్రతిలో కూడా కనబడుతున్నప్పుడు ఈ సంభావ్య మనుటకు సంశయ ముండకూడదు.)

తిక్కన ప్రయోగములు.

(6) ఉ...ఎఱిగింపునావుఁడున్, అయ్యతి ముఖ్యుఁ డన్నరవారాగ్రణికిం (విరా. 1. 190)

(అచ్చులో, ఎఱిగింపుడు న్నరయా, పయ్యది నావుడున్...పాఠాంతరములున్నవి.)

(7) చ...వడిగొని గోగణంబుఁ బొదువం బఱతెంచితి మెల్లవారము
న్నొడఁబడి (,, 4: 200)

(అచ్చులో—బఱచితిరెల్లవారుము న్నొడఁబడి...)

(8) క...యతని నా, శుగములఁ బొదవివెన్నె మ్మొయి (భీష్మ2. 239)

అచ్చులో యతనినా శుగములఁ బొదివిననెమ్మొయి. గాని వ్రాత ప్రతిలో వేరేదోషమున్నది.

(9) క. వివిధోత్పాతంబులకు న్నన నీపతికిఁదోఁచు కీడునకు, (శాంతి. 11. 308) అచ్చులో 'తంబులకున్న వళులలోఁ దోఁచుఁ కీడునకు' యతిలో దోషమున్న దనిన్ని సంధిలో దోషమున్నదనిన్ని భ్రమపడి కాబోలు దిద్దినారు.

నన్నయ తిక్కనల కాలములో ఇట్టి "సంశ్లేషము" విరళముగా ఉండేదంటే అంగీకరించవచ్చును, గాని లేనే లేదంటే నమ్మలేము. పోతన గారి కాలములో తరుచుగా ఉండేవని ప్రయోగములను బట్టి ఊహిస్తున్నాము.

ఉదా:—సంస్కృతములో 'ఏవంచేత్', 'నోచేత్' అని తరుచుగా 'చేత్' అనేశబ్దము కొన్నిటికి చేర్చి వాడుతారు. తెలుగు వ్యాకరణములో 'చేదర్థక మనేది' ఈ మాటను పట్టివచ్చినదే. అయితే, ఇది ఋగ్వేదములో ముమ్మారే వాడినట్లు కనబడ్డదట. వేదములో విరళముగా ఉన్న 'చేత్' సంస్కృతములో ప్రచురముగావాడుకకు వచ్చినది గదా? సంస్కృతములోకృత్వా,గత్వాఅని త్వాంతములుగానే క్త్వార్థక రూపము లుండును గాని, ఋగ్వేదములో కృత్వీం, గత్వీ అనిత్వీఅంతమందు గలిగి ఉండునట; తొమ్మిది ధాతువులకు మాత్రముత్వాంతిక్త్వార్థకము లున్నవట; అథర్వ వేదములో-త్వీ అంతమంను గలవిలేవట. ఋగ్వేదమందు విరళముగా ఉన్నత్వీ రూపములు బ్రాహ్మణములలో అరుదయి అథర్వవేదములో కనబడకుండా పోయినవి; తర్వాత వ్రాసిన సంస్కృతగ్రంథాలలో ఎవ్వరున్ను-త్వీ అంతమందుగల క్త్వార్థకములు

వాడనే లేదు. వేదమందు విరళముగా ఉన్న త్వాంతరూపములు తరుచయి, సంస్కృతములో త్వీ-అంతములు కనబడకుండా చేసినవి. కర్తవ్యవంటి తవ్యాంత శబ్దములు ఋగ్వేదములో లేవు; అథర్వవేదములో జనితవ్య, హింసితవ్య అనే రెండు శబ్దములు మాత్రమే ఉన్నవట. బ్రాహ్మణములలో విరళముగాను, తర్వాత వ్రాసిన సంస్కృతభాషాగ్రంథములలో తరుచుగాను ఇట్టివి ఉన్నవి. అహంగతవాన్, త్వంకృతవాన్ అని అపరిమితముగా నవీన సంస్కృత గ్రంథములలో అన్ని క్రియలకు-తవన్ చేర్చి పండితులు వాడుతూ ఉన్న రూపములు ప్రాచీనసంస్కృత గ్రంథములలో విరళమట; వేదములో లేనే లేవట. ఈలాగున ఇంగ్లీషులో ఇంచుమించుగా మూడువందల సంవత్సరములయి వాడుకలో ఉన్న it (=తెలుగులో 'అది') అనే శబ్దము పూర్వకాలములో లేనే లేదు; దీనికి బదులుగా hit అనే రూపము ఉండేది. 1327 వ సంవత్సరములో వ్రాసిన ఒక గ్రంథములో రెండు రూపములున్ను కనపడ్డ వట. అప్పటినుండి క్రమక్రమముగా hit శబ్దము తగ్గి it శబ్దముయొక్క వాడుక ప్రచురమయి తుదకు hit భాషలో కనబడకుండా పోయినది. నేటి ఇంగ్లీషులో it అనేమాటకు బదులుగా hit వాడితే తప్పుగదా. సంస్కృతములో 'గత్వా' అనే రూపమునకు బదులుగా 'గత్వీ' అంటే తప్పు కాదా? ఆలాగే తెలుగులో కూడా నియమముండవలెను. భాషాతత్త్వ జిజ్ఞాస, భాషాచరిత్ర జిజ్ఞాస మన ఆంధ్ర పండితులకు లేనే లేదు. లోకములోని శిష్టుల వాడుకను బట్టి లౌకికభాషకు అనుశాసన మేర్పడవలెనని అనేకులకు తెలియదు. గనుక మన తెలుగు భాషకు, తెలుగు గ్రంథములకు ఇట్టి దౌర్భాగ్యము పట్టినది. ఉపదేశకులు, మార్గదర్శకులు, ఆచార్యులు తత్త్వదూరు లయినప్పుడు లోకమునకు అపరిమితమైన హానికలుగునని మనము జ్ఞప్తియందుంచుకో వలెను. భాషాతత్త్వ మెరుగని వారు భాషా పండితులు కాజాలరు. అట్టివారు తాము మోసపోయి ఇతరులను మోసపుచ్చి లోకమునకు చాలా కీడు చేస్తున్నారు. దుర్బుద్ధిచేత కాదు అజ్ఞానము చేత.

86. గ్రాంథికభాష అనగా ఒక్క నన్నయ తిక్కనల భాష మాత్రమే కాదుగదా. ఇంకా చూడండి ప్రయోగాలు. ఎఱ్ఱాప్రగడ హరివంశము పూర్వభాగములో మూడు పద్యాలలోనున్ను ఉత్తరభాగములో రెండు పద్యాలలోనున్ను ఇట్టిసంధి వ్రాతప్రతులలో కనబడినది. జ్ఞాపకము పెట్టుకొని ఉన్నాము; ఆప్రయోగములు ఇక్కడ వుదాహరిస్తాము.

1. మ. ఇన చంద్రద్యుతి కోటికిం జొరఁగ రాకెల్లప్పుడు న్నాత్మభా, వన. (వ్రాతప్రతి) అచ్చుపుస్తకములో... కెల్లప్పు డాత్మానవధా, వన.”
(పూ. 4. పుట 99, పద్యం 192)

2. క. సకల చరాచర...వాసుదేవుం, డొకఁడున్నాధారశక్తి... (వ్రాతప్రతి) అచ్చుపుస్తకములో...వాసుదేవుం, డొకరుఁడ యాధారశక్తి.
(పూ. 5. పుట 104, పద్యం 32)

3. క. ఈదేవి యట్లు దుఃఖితయై దూలఁగ నూరకుండ ననునే మన శున్, ఆదిభవుండవు అచ్చులో...దుఃఖితయై తూలఁగ...మనకీ, వాదిభవుండవు.
(పూ. 5, పు. 104)

4. మ. ప్రగుణోత్సాహులు యాదవోత్త...తొల్లి యే, మగలున్నె మ్మెయిఁ బోరొనర్చిరె...(వ్రాతప్రతి) అచ్చులో...మగలున్ మైమయి...
(ఉ. 4. పుట 151, పద్యం 143)

5. మ. (మూడవ చరణములో) నీవును న్నట్టిభా, వనుపాటించి (వ్రాతప్రతి) అచ్చు...“నీవు నన్నట్టి”...(ఉ. 7. 123)—రెండు పాఠములున్ను సందర్భోచితముగానే ఉన్నవి.

6. శా. (3వ చరణము) ఈ కార్యంబొనరించి యుండఁజు ఋణంబెల్లం దగన్నీఁగుమ...
(ఉ. 10, పు. 283)

ఒక వ్రాత ప్రతిలో “తగన్ ఈఁగు” అని విసంధిగా ఉన్నది. శ. ర. లో ‘ఈఁగు’ ‘నీఁగు’ యొక్క రూపాంతరమని ఉన్నది. తత్త్వము

తెలిసేవరకూ ఏలాగనుకున్నా సరే ' ఏనికి ' ' నేని ' రూపాంతర మని రామకృష్ణ కవిగారు నన్నయను కాచినారు గదా.

పోతరాజు ప్రయోగములు:—

1. మ...దావాగ్నిన్ వెసన్నార్తు నే, నన...
(II. 180. 3వ చరణము)

2. మ...సూనృతే తరులనుం భూమంశులు నైన్నన...
(II. 198. 2వ చరణము)

3. ...తలంపన్, అరసి నను గాచుటెల్లను... (III. 155.)

4. దండకము. ఎబ్బంగి వర్తింతు మేనిల్కడన్నుందు మీజీవలోకంబె. (III. 203)

5. ,, భోగంబులం బొందుచున్నన్న యిక్కార్య (III. 203)

6. ,, పరంజోతి వన్నన్ ప్రపంచంబవన్న న్నధిష్ఠాతవన్నన్.
(III. 203)

7. మ...జరయున్నంతము నొంచ, (ఆనందముద్ర: జరయున్నాంతము. (III. 306)

8. ఉ...నావుడు, న్నానయశాలి. (III. 348, 4వ చరణము)

9. మ...పూర్వమందు జగముల్ నిర్మించునాఁడాదిన, ప్పాలం బుట్టించిన మీఁద నవ్వసుమతిం బుట్టించి తిన్నట్టు య, ప్పాలలో. (ఆనంద: బుట్టించితింబుత్ర) (III. 405.)

10. చ...గజనిభుఁడుద్ధతిన్ననఁటి కంబములున్. (III. 451)

11. మ...నే, నె నయన్ వన్యమృగంబయకాదు బలిమిన్నే తెంచు బోఁటి యీ శునకశ్రేణివధింతు, (ఇట్లుపూర్వ ముద్రణము లందున్ను, వ్రాతప్రతు లందున్ను; కాని, ఆనంద: బలియై యే తెంచు.) (III. 653)

12. క...బలిమి గలదేని నాతోఁ గలన న్నాదరించిపోరఁగఁడఁగుము
(ఆనంద: గలనను. 645)

13. క...తామరసాక్షు, న్ననిమిష మునియోగిజనావన దక్షున్.
(III. 703)

14. మ...విభ్రాజమానాంశుదున్, అనురాగ...శోభాలోకనున్నై
(3. 754)

15. మ...వరింతున్నంచు నేతెంచె: (ఆనంద; వరింతున్ వేగయాంచెంచె.
(3. 778)

16. మ...నీవక్షుని, న్ననువర్తించినవాఁడు సంసరణ కర్మారంభుఁడై నిచ్చలున్ జననంబందుచుఁ జచ్చుచున్ మరల నోజంబుట్టుచున్నాండెడిన్.
(4. 48)

17. చ...కనకకుశాజినాయసనికాయవినిర్మిత పాత్రసీమము, న్నను పము.
(4. 81)

18. ఉ...సర్వము న్నతని దివ్యకళామయమంచు. (7. 142)

19. శా...నార్గింట సుత్రంబులన్, ఏకాస్త్రంబున సారథిన్. (8.333)

20. క...అనుచు, న్నిన్ని దినంబుల నుండియు. (8. 563)

21. శా...భూకాంతాదులున్నర్థశా, మాశన్. (8. 572)

22. మత్త...విద్యల మూలగో, ష్ఠి న్నెటింగిన (8. 593)

23. మ...సహస్రంబు న్నజస్రంబు. (9. 537, 2వ చరణము)

24. క...క్రందుకొ నెన్నారివారిఁ గావలివారిన్.
(10. పూ. 142. వ్రాతప్రతి)

25. క...యోజనమున్నర మేరధ, రాజంబులు నుగ్గులయ్యె.
(10. పూ. 229)

28. క...సత్సంసర్గు, న్నారాధిత భర్గున్. (10. పూ. 282)

పద్మపురాణ మందు సింగన ఇట్టి సంశ్లేషము కావించినాడు: పోతన వలెనే పాదమధ్యమందు కూడాను.

1. క...కనియెన్, ఆతని కుత్తర మిచ్చుట. (7. 63)

2. క...సుబాహులన్, అనిఁగూల్చెను. (8. 70)

3. శా. ఆయార్తధ్వ...పోయెడి, స్వేయు స్నేల దశాస్యమస్తకము లుర్వింగూల్తు. (8. 164)

4. క...వినవలయున్నతని చరిత వినుపింపుదగన్ ?

87. శ్రీమద్భాగవతములో (ఇప్పటి ఆనంద ముద్రణములో) పరిష్కర్తలు దిద్దక విడిచి పెట్టినవే అనేకము లిట్టి ప్రయోగములున్నవి. పోతరాజుగారి గ్రంథములో ఇట్టివి ఉండవని కొందరి భ్రమ. ఇట్టి ప్రయోగములు తప్పని భ్రమపడి, పోతరాజు గారియెడల గౌరవముచేత, ఇట్టి తప్పులు ఆయన వ్రాయవలసినవాడు కాడని ఆలాగున ఊహించి ఉంటారు. ఇవి తప్పులని తెలివితక్కువ వాళ్లెవరో అంటే, ఆమాట నిజముచేసి, విమర్శించకుండా పరిష్కర్తలు గ్రంథాలు 'దిద్ది' పాడుచేస్తున్నారు; తెలియక లోకులున్నూ నమ్ముతున్నారు. పోతన్న గారి కృతులలోనివే ఇరవై ఆరు ప్రయోగాలు ఉదాహరించినాము. వీటిలో అయిదు ఆనంద ముద్రణములో కనబడవు. పూర్వముద్రణములలోనున్న వాటిలో కొన్ని యిందు మాయమయినవి. వ్రాతప్రతులలోనున్నని కొన్ని పూర్వ ముద్రణములలోనే పోయినవి. ఏమిలాభము కలిగినదో పరిష్కర్తలకు కొన్ని ప్రయోగములు చెరిపివేసినంతమాత్రాన! తక్కినవాటివల్ల పోతన్న ఈరూపము వాడినట్లు ఏర్పడదా? కొలదిగా ఉంటే ప్రయోగవైరళ్యమని చెప్పి ఆరూపమునకు అసాధుత్వము సాధించ వచ్చునని కాబోలు ఈ పండితమ్మన్యుల తలంపు. శబ్దానుశాసనమంటే ఏమిటో తెలిసినవారైతే యిట్టితలంపులు తలచి ఉండరు. వింతగా ఒక్కరూపము కనబడ్డా

దానిని నిరాకరించి విడిచిపెట్టకూడదు. దానికి కూడా అనుశాసనము చేసితీర వలెను. నన్నయ తిక్కన ఎఱ్ఱనల కాలములో విరళముగా ఉన్నా పోతరాజు నాటికి ఈరూపము ప్రచురముగా ఉండెనని నిశ్చయముగా చెప్ప వచ్చును. వేదం వెంకటరాయశాస్త్రులవారు పోతరాజుగారికంటె గొప్పపండి తులైతే కావచ్చును; వారియందు భక్తి గలవారు వారిమాట శిరసావహించ వచ్చును గాని పోతరాజుగారి ప్రయోగము ప్రమాణముగా చేసుకొన్న వారిని శాస్త్రులవారు తిట్టితే, పోతరాజుగారినే తిట్టినవారవుతారు. మేమది వినసహించలేము. శాస్త్రులవారికి తెలిసి ఉండదు పోతరాజుగారు తరుచుగా ఈ ప్రయోగము వాడినారని. శాస్త్రులవారు భారతము బాగా చదువుకో లేదని తేలినట్టే, భాగవతము కూడా బాగా చదువుకోలేదని తేలి నది; అదే రహస్యము; అది మేము బయలు పెట్టవలసివచ్చినది; తత్త్వ జిజ్ఞాసలో చేయక తప్పనిపని గనుక సాహసించినాము. తెలుగుభాషకు, తెలుగు సారస్వతమునకు, తెలుగు వ్యవహారమునకు, తెలుగు దేశమునకు ఇట్టి పండితుల భ్రమ ప్రమాదాహంకారముల వల్ల అపరిమితమయిన కీడు కలుగుతున్నదని నమ్మి, ఆకీడు తొలగించడము లోకోపకారకమయిన పని అని ఉపదేశిస్తున్నాము. మాచేతనయినంత మట్టుకు అట్టిపని చేస్తున్నాము. గనుక మొగమోటము లేకుండా మాకు సత్యమని తోచిన సంగతులు స్పష్ట ముగా విశద పరుస్తున్నాము. మా ప్రతి పక్షుల ప్రాచీనాంధ్ర భాషాభి మానము కేవలము వేడబమని తెలియనందున, వారు ఆదర్శముగా చూపించే భాష కృత్రిమము, అసంభావ్యము, అదృష్టపూర్వము అయినా, ప్రవాద మోహితులయి, విమర్శించి సత్యము తెలుసుకోలేక, అసత్యమునే గురియం దుంచుకొని, వాస్తవమయిన దేశభాష నింద్యమని ఉపేక్షించి, తెలుగు వారు తమ దేశాభివృద్ధికి గొప్ప ఆటంకము కలుగజేసుకొన్నారు. సులభము, సుబోధము, సర్వజన సామాన్యము అయిన దేశభాషవల్ల కలిగే మేలు ఎట్టిదో ఎరిగిన వారికి ఈ ఆటంకము మిక్కిలి దుఃఖకరముగా ఉంటుంది.

అందుచేత వారు, ఎంత నింద వచ్చినా, సరే; ఎవరికి కోపము వచ్చినా, సరే; ఏమి నష్టము కలిగినా, సరే; అని వెనకదీయకుండా నిజము చెప్ప వలసిన వారవుతున్నారు.

ఇంకా మరికొందరు మహాకవుల ప్రయోగములు చూపిస్తున్నాము:—

1. నాచన సోముడు సామాన్యుడుకాడు. అతని ఉత్తర హరివంశము వీరేశలింగంపంతులుగారున్ను వావిళ్లవారున్ను ముద్రించినారు. సీతారామాచార్యులవారు ప్రౌఢవ్యాకరణములో ఉదాహరించిన సోముని ప్రయోగము ఈ రెండు ముద్రణములలోను కనబడదు; పరిష్కర్తలు దిద్ది రూపుమాపినారు. తంజావూరి పుస్తకాలయమందున్న వ్రాత ప్రతిలో సీతారామాచార్యులవారు ఉదాహరించినట్లున్నది. అచ్చు పుస్తకముల రెంటిలోనూ పాఠము యెట్లున్నదంటే:— (6. 226, 2 వ, 3 వ చరణములలో).

మ... ఘనచక్రాయుధనిష్ఠురక్షతగళ ద్రక్తార్ద్ర సర్వాంగున
న్ననుఘూతాప్రతిమ ప్రగల్భ పరివాదాంతర్హితోద్వక్రమున్.

సీతారామాచార్యులవారి పాఠము:—"ఘన...గళ ద్రక్తాస్యసర్వాంగుని, న్ననుఘూ...వాదాంతర్ధితో..."

వ్రాత ప్రతిలో "ఘన...గళద్రక్తార్ధ సర్వాంగుని, ననుభూతా ప్రమథ ప్రగ...ర్హితో..." లేఖకుని పొరబాటు స్పష్టము. 'న్నను' అని ఉండవలెను.

మేము మరిఒక ప్రయోగము చూపిస్తాము. అది అచ్చుపుస్తకములలోనున్ను వ్రాతపుస్తకములోనున్ను ఒక్కలాగే ఉన్నది. సందేహమున కేమీ అవకాశము లేదు.

క: అవ్విబుధ జగతిలోపలఁ, గ్రొవ్వుదఱిగి సురగణంబు క్షోభము నొందెన్
ఇవ్విధమునను త్పాతము, నివ్వటిలం దొడఁగుటయును నిష్కరుణతతోన్.
(6. 159)

2 మనుచరిత్రము 3. 48 వ పద్యము, 4 వ చరణములో "రతి పర్యోద కున్నను పైన చేతులన్" అనే పాఠము కొందరున్ను' "రతి పర్యోదకున్నను పైనచేతులన్" అనేపాఠము మరికొందరున్ను అంగీకరిస్తారట. అచ్చుపుస్త కము టీకలో ఆలాగున ఉన్నది. మావద్ద నున్న వ్రాతప్రతిలోనున్ను మండ పాక పార్వతీశ్వర శాస్త్రిలవారి వద్దనున్న వ్రాతప్రతిలోనున్ను మొదటి పాఠమే ఉన్నది. మాదృష్టికి అదే సందర్భోచితముగా ఉన్నది. తాటాకు పుస్తకాలలో రెండవపాఠము కనబడే వరకూ పాఠాంతర మున్నదని చెప్ప కూడదు. అచ్చు పుస్తకాలలో ఇట్టి చోట్ల పండితమ్మన్యులు పాఠాలు మార్చివేసినారు గాబోలు.

3 పారిజాతాప హరణము 1. 45 వ పద్యమందు ప్రస్తుత ద్విత్వనకా రమున్నట్లు చెప్పిన లక్షణమునకు లక్ష్యమున్నదని రంగరాట్ చ్ఛందస్సులో ఉదాహృతమయి ఉన్నది. అందులోని పాఠము ఇట్లున్నది.

క. వచ్చినమునిపతి కెదురుగ వచ్చి నమస్కృతులొనర్చి వనితయుఁ దానున్
నొచ్చెంబు లేని భక్తివియచ్చర రిపుభేది సలిపెనాతిథ్యంబుల్.

ఇప్పటి అచ్చుపుస్తకములో మూడవచరణము మొదటిమాట "బొచ్చెంబు" అని.

4 కళాపూర్ణోదయము 7. లోనిది ప్రౌఢవ్యాకరణములో ఉదాహృత ము. మ. తరుణీశాతకటాక్షవీక్షలకొనర్దారొన్న చోట్లుంబలె, న్నరు శోభా...

5. విష్ణు పురాణము 3. 172 లో "మూడున్నర"

6. పాంచాలీ పరిణయము ఆ 1. పు 5 "తొండముంగొని తగన్నెగఁ జిమ్మ"

7. కుచేలోపాఖ్యానము 3. 85—"శ్రీయుతుఁడై యన్యులకున్నే ఘొండ"

8. శుకసప్తతి 3. పుట 131. క...వినుచుంటి నంత వేపులు, తిని యెన్నీమాఱు వండిదించిన డెల్లన్. 1 పుట. 156. చ. మించినయెడ న్నొకచో"

9. సానందోపాఖ్యాన 95 మత్తకోకిల...వైఖరి, బొందితి న్నేమిగా వల్తెఁ"

10. రామరాజీయము...."సంహారులు న్నైన." (?)

11. తిమ్మకవిరాజశేఖరవిలాసము. 3. 109. "ఉ. వారక యీ పురిన్నేచట,"

12. రామస్తవ రాజము. 2. మ. తాపత్రయం, బెఱుఁగన్నీయన్గో.

13. లక్ష్మణకవి లంకావిజయము I. 12, మ. వాచస్పతి న్నార్యునిన్.

14. కవిజనాశ్రయము; పు. 57, మనోహరవృత్తము 3వ పాదము "ఆరంగఁ బడన్ను భయార్థములన్"!

పుట. 61, కందములక్షణము,—వానిపాదం, బుల నిడునది మూఁడు నేను మూఁడున్నేనుణ్.

88. అముద్రిత గ్రంథచింతామణి మయూఖము 1895 సం. మేనెల సంచికలో మనశాస్త్రిలవారు, "ద్రుతమున కచ్చుతో సంశ్లేషమును గురించి" వ్రాసిన ఉపన్యాసమందు, ఆంధ్రశబ్ద చింతామణిసూత్రమున్ను దానికి అప్పకవి వ్రాసిన టీకను ప్రమాణముగా, పెట్టుకొని, అందుకు విరుద్ధముగా వాదించిన వారిచ్చిన రెండు ప్రయోగములు అపపాఠములనినిరాకరించినారు; గాని అవి అపపాఠములన్నందుకు హేతువులు చెప్పలేదు. ఈ రెండు ప్రయోగములలో ఒకటి పోతరాజు భాగవతము 7. 142 వ పద్యములోనిది; రెండోది నాచనసోముని ఉ. హరివంశము 6. 226 వ పద్యములోనిది; ఇవి

మేము ఉదాహరించే ఉన్నాము. శాస్త్రులవారు లక్ష్యములు తెలుసుకోకుండా, లక్షణము మాత్రము నేర్చుకొని తెలుగుపండితులయినందున, లక్షణమే—అనగా తాము చదువుకొన్నదే—పరమప్రమాణమనుకొన్నారు; గాని, లక్షణము ఏలాగు పుట్టినదో ఆలోచించుకొన్నారుకారు. లక్షణము చెప్పినవారికి దివ్యదృష్టి ఉండెనని భ్రమపడ్డారు గాబోలు. ఎట్లయినా, లక్షణమందు వైవిధ్య మున్నదని తెలియక, తాము చదువుకొన్నదే లక్షణమని విశ్వసించి, దానికి విరుద్ధముగా ఇప్పటివారు వ్రాస్తే నిందించడమునకున్ను, పూర్వులు వ్రాసిఉంటే అపపాఠమని దిద్దడమునకున్ను సాహసించినారు. "సర్వమున్నతని" అనే అచ్చు పుస్తకములపాఠము దాహరించిన వారిని ఎట్లు అధిక్షేపించినారో చూడండి:—లక్ష. విరుద్ధమయిన నీపాఠమున నింత నమ్మికమేమి? "సర్వమా విభుని" అని యచ్చుపుస్తకములలో నున్నయెడల "సర్వమున్నతని" అని యెవరైన దిద్దుదురా ? "మా విభు" అనుటకుగాని యట్టి యవిరుద్ధమయిన మఱి యేపాఠమునకుఁగాని బదులుగా నీపాఠబా టచ్చునం జొచ్చియుండరాదా, లేదా సర్వము + ఉన్న + అతని అనియేల విభాగము కాఁగూడదు? ఇదియకవిహృదయమని నాయభిప్రాయము. సర్వము=ఈ విశ్వమెల్ల, ఉన్న=సత్పదార్థమయిన, అతని=ఆహరియొక్క" యని యన్వయము. శ్రుతి. "సదేవ సౌమ్యేదమగ్ర ఆసీత్" అని యుపనిషత్తులుద్ఘోషించెను సదాత్మకమయినబ్రహ్మమే యావిష్ణుఁడనియుఁ దన్మయమే విశ్వమనియుఁదాత్పర్యము." ఈ వ్యాఖ్యానము ఎట్లున్నదంటే వేంకటరత్నము పంతులవారి యాంధ్రీకరణమును గురించి శాస్త్రులవారన్నట్లే "కొండుభట్లు కమ్మవారికి శాంతాకార పురాణము చెప్పిన చొప్పున" బహు జోగుజాగా" ఉన్నది. (చూ. పుట. 16) "సర్వమావిభుని" అనే పాఠము కంటికి కనబడుతూ ఉంటే ఎవరైనా ఎందుకు దిద్దుతారు ? ఆప్రశ్నకు అవకాశమే మిటి ? అదిసాధువుకాదనిఎవరన్నారు ? ఐతే, అదిఅచ్చుపుస్తకములలో లేదు; దానిజోలేమున్నది? అచ్చుపడ్డ పాఠము "సర్వమున్నతని" అనేది

అసాధువన్నవారు వ్రాతప్రతులలో ఏపాఠమున్నదో చూచి మరిదిద్దవలెను. చెన్నపట్నమందు కావలసినన్ని ప్రతులు 1895 వ సం॥ లో ఉండెను గదా, ఎందుకు పరిశీలించలేదు? శాస్త్రిలవారు అట్టి పరీక్ష చేయకుండా ఏలాగున "సర్వమావిభుని" అనేపాఠము పోతరాజు వ్రాసి ఉంటాడని ఊహించినారు? కర్ణపిశాచి చెప్పినదా? యోగనిద్రలో వారున్నప్పుడు కనబడినదా? ఈపాఠము కవివ్రాసిఉంటే శ్రుతులనుబట్టి తాము తెలుసుకొన్న పరమార్థము కవి హృదయమని సాధించడమునకు వల్లపడదు. వారు కనుగొన్న కవి హృదయము వాస్తవమైతే, వారూహించిన పాఠము వాస్తవము కాదు. పాఠము వాస్తవమైతే, కవి హృదయము వారనుకొన్నదికాదు. వివేకము లేనివారి విమర్శము ఇట్లే ఉంటుంది. 1895 వ సం.లో పండితులకు తెలిసిన వాటి కన్న ఇప్పుడు ఎక్కువగా ఈ విమర్శకు కావలసిన ప్రయోగములు దొరికినవి. వ్రాతప్రతులలో, ఓపికతో వెదకవలెను గాని, కావలసినన్ని కనబడతవి. పాదాంతమందుముద్రితము నిలిపి తర్వాత అచ్చుఉంచితే దోషముండదనిన్ని, లక్షణవిరుద్ధము కాదనిన్ని, కొందరి భ్రమ. పాదమధ్యమందు సంశ్లేషముగల ప్రయోగములుకూడా మే ముదాహరించిన వాటిలో ఉన్నవి. అట్టిదైనా తప్పనికదా అచ్చులో దిద్దినారు. ద్విత్వశ్లేషములున్నవని సిద్ధాంతము. పండితులు తమ యిష్టముచొప్పున ప్రక్రియ చెప్పవచ్చునుగాని 'రెండున్నర' అనేశబ్దము అసాధువనకూడదు, అంటే చెల్లదు.

స భి కు లు

89. ప్రసన్నరాఘవమందు 6 వ పుటలో సూత్రధారుని వాక్యమిట్లున్నది:—

"బావా! నిజకవిత్వ తత్త్వ వినోద ముదితు లీ సభికు లెట్లన్నువాని యొక్క కవితచేతఁ జొక్కుదురు?"

ఇందున్న 'సభికులు' అనేశబ్దమును నిందిస్తూ వేంకటరాయశాస్త్రిల వారు తమ విమర్శమందు వ్రాసిన దేమంటే'—

"సభికులనఁగా జూదమాడించువారు, 'సభికా ద్యూతకారకాః" అమరము. అట్టివానికొకనికి మదరాసులో ఈ నడుమ 250 రూపాయలు దండము విధింపఁబడినది. అమరుఁడు ఈ యర్థము నీ శబ్దమునకు కంఠోక్తముగాఁ జెప్పుటయు, 'సభాసదస్సభాస్తారాస్సభ్యాస్సామాజికాశ్చ తే" అని సభ్యపర్యాయములలో ఈ శబ్దమును చెప్పమియుఁ జూచి, దీని కిది రూఢ్యర్థమనియు సభ్యార్థమందు దీనిని వ్యవహరించుట లేదనియు నెఱుకపడుచున్నది. యోగముచే సభ్యార్థమును సాధించుపక్షమున, 'సభాద్యూతమాశ్రయత్వేనాస్యాస్తీతి ప్రీహ్యాదిత్వాత్ఠన్" అని రామాశ్రమీయము. 'రూఢిర్యోగమపహరతి' అనఁగా రూఢి యోగమును హరించు ననున్యాయ మేమిచేయను! మత్వర్థముచే సభ్యార్థమును సాధించుట క్లిష్టము. ఇన్నిటికిని విరుద్ధముగా ఎట్లో యోగాశ్రయముచే "ఓసభికులారా!' యని సభ్యులను సంబోధించుట, [విధవ శబ్దమును గొప్ప ప్రభువని యర్థముగా మూత్రాది గణమందు చేర్పనెంచి] వారినే 'ఓ విధవలారా' యనుటవలె నున్నది. సభ్యులు సభిక శబ్దతత్త్వము నెఱింగినచో ఈ రెండు సంబోధనలచేతను సంబోధయితలకు తుల్యఫలమే గలుగును." (పు. 23)

90. వీరి వద్దనేర్చుకొని కాబోలు బ్ర. శ్రీ., వావిలకొలను సుబ్బారావు పండితులవారు తమ సులభ వ్యాకరణమందు (మూ. పు. 16, 3వ భాగము.):

"వ్యాసలేఖకుఁడేది సంస్కృత శబ్దమయినది, యేది తెలుగుమాటయైనది యెఱింగి యుండవలయును. * ఎఱుంగకున్నఁ బెక్కుఁ దప్పులు వ్రాయవలసివచ్చును....పశుసమూహమును బోధించు సమజ శబ్దము సమాజపర్యాయముగను, జూదగాండ్రను బోధించు సభిక శబ్దము సభ్య పర్యాయము

* ఇందుకు సులభోపాయము అమరము కంఠపాఠము చేయుటే అని వారే బోధించినారు.

గను వాడుట ప్రశస్తముగాదు. సభికులారాయని దూషించునపుడు చెప్ప వలయుఁగాని భూషించునపుడు చెప్పరాదు."

91. ఇట్లు 1912 వ సంవత్సరమున విద్యార్థులకు శబ్దార్థము బోధించినపండితులవారు, 1893 వ సంవత్సరము నవంబరు తే 12 దిని తమ్ము గౌరవించుటకు సభచేసి, గజమాలతో సంభావన చేసిన నెల్లూరి పండితులకు పారితోషికముగా తాము సమర్పించిన పంచరత్నములలో నాలుగవ దాని యందు, వారిని తాము భూషించ నుద్దేశించిన వారై, "సభికులారా" అని ప్రయోగించి,దూషించినవారైనారు. చూడండి ఆవాక్యము (అముద్రిత పు. 4)

సీ. గీ....మీబోటి సచ్చరితులు, జగతి వెలయుట, గొదవేమి సభికులార!

బహుశా ఈపద్యము రచించే నాటికి ఈ పంతులవారి పాండిత్యము బాగా పరిపక్వతము కాలేదని తోస్తుంది. వీరున్ను వీరివంటి పండితభిషక్కులున్ను తమ భేషజాలుచేత బడిపిల్లలను మోహింప జేస్తూ ఉంటారు. వీరి భేషజ తత్త్వము బయలు పడిన తర్వాత 'ఆహా! యొజ్జలపుచ్చకాయ వితమూరా' అని నవ్వుకొంటారని ఎరుగరు. ఈ భిషక్కుల భేషజాలు చాలా ఉన్నవి. అవి వేరే ఒక వ్యాసములో ప్రదర్శింపదలచి ఉన్నాము. ప్రస్తుత విషయముతో సంబంధించినది గనుక ఇదిమాత్రము ఇక్కడ ఉట్టంకించినాము. అముద్రిత గ్రంథచింతామణి పత్రికా సంపాదకులు పూండ్ల రామకృష్ణయ్యగారు ఈ పంచరత్నములు తమ పత్రికలో ముద్రించి ప్రకటించినప్పుడు, ఈ సభిక శబ్దమందు దోషమున్నదని విమర్శకులు ఎవరూ చూపించలేదు.

92. ఇట్లే 1880 సం. లో అముద్రితగ్రంథ పత్రికాధిపతియగు వీరనాగయ కవిగారు రచించిన 'శ్రీబక్కింగ్‌హామ్ సింహపురీ సందర్శనము' 1885 సం. మందు ముద్రితమయినప్పుడు, అందు రెండు పద్యములలో సభిక శబ్దము ప్రయుక్తమై ఉన్ననూ ఏల ఆక్షేపించలేదు. ఆపద్యము లుదాహరిస్తూన్నాము.

క. ఇక్కరణి సభికు లండఱు,
బక్కింగాం సార్వభౌము భావంబునకున్
జెక్కు తెలుంగుల మెప్పులు,
నెక్కొన ఘటియించి రాత్మనిపుణత మెఱయన్. (29)

ఉ. ఈ సభికోత్తము ల్వసుమతీశుని యాగ మనం బెఱింగి... (30)

93. అయితే, 1897 వ సం, లో కొక్కొండ వెంకట రత్నంపంతుల వారు ప్రసన్న రాఘవములోనున్ను, కోలాచలం శ్రీనివాసరావు పంతులవారు సుఖమంజరీ నాటకములోనున్ను ఈసభికశబ్దము, సుబ్బారావుపంతుల వారున్నూ వీరనాగయకవిగారున్ను వాడినట్టే సభ్యార్థమందు వాడినప్పుడు, దీనిని గురించి విమర్శములు ఆరంభ మయినవి. అముద్రితగ్రంథ చింతామణి పత్రికాధిపతులయిన పూండ్ల రామకృష్ణయ్యగారున్ను వేదం వేంకటరాయ శాస్త్రులవారున్ను జట్టుగా ఉన్నట్టు తోస్తుంది. వీరు ఉభయులూ కలిసి వేంకట రత్నము పంతులవారిని శ్రీనివాసరావు పంతులవారిని ఆక్షేపించి, నిందించి, దూషించి, వారు గ్రాంథి కాంధ్రము రానివారని తోచేటట్టు అనేక వ్యాసములు వ్రాసినారు. తక్కిన విషయములతో మన కిక్కడ పనిలేదు. వేంకట రత్నము పంతులవారు వాడిన సభిక శబ్దమును గురించి శాస్త్రులవారు వ్రాసినది (89 వ పేరాలో) ఉదాహరించినాము కదా. శ్రీనివాసరావుగారి ప్రయోగమును మొట్ట మొదట రామకృష్ణయ్యగారు— 'సభికు లనగా జూదగాండ్రు సభికాద్యూతకారకాః అని అమరము. గాన, నిచటి సభయందు జూదగాండ్రుండుటకు కారణమేమి' అని ఆక్షేపించినారు. అందుపైని, శబ్ద రత్నాకరమందు ఈ సభిక శబ్దమునకు 'సభయందుండు ధర్మజ్ఞుఁడు' అనే అర్థ మున్నదనిన్ని, కొందరు కవులు ప్రయోగించి ఉన్నారనిన్ని, శశిలేఖా పత్రికలో రావుగారు సమాధానము చెప్పినారు. రామకృష్ణయ్యగారు శబ్దరత్నాకరములోని అర్థ మసంబద్ధమని, 'సంస్కృతేతరప్రయోగముల కేమిగాని సంస్కృతమున నిట్టి ప్రయోగములున్న రావు

గారు వానిం జూపఁ 'బ్రార్థిషులు' అని తిరిగీ అధిక్షేపించినారు. శ్రీనివాస రావుగారు చూపించిన ప్రయోగములను అంగీకరించక శేషాద్రి వేంకటేశ్వర రావుగారు పత్రికాధిపతిగారికి ఒకజాబు వ్రాసినారు. దానిలోని వాక్యము లుదాహరిస్తాము: 'అవి అన్నియు నాధునిక కవిప్రయోగము లగుటచే వానింగురించి నేనేమియు వ్రాయ నక్కఱలేదు. మీ వాదము ప్రకార మీ శబ్దమునకు సభ్యుఁడను నర్థము నైఘంటికముకాదు. కాకపోయినను లోకమునఁ గొందఱు సభ్యులనుటకు బదులు సభికులని వాడుచుండుట నిజము. ఇట్లే శ్రీనివాసరావుగారును పొరబడి దీనిం బ్రయోగించి, మీ వలన నాక్షేపింపబడి యెట్లయిన నా పదమునకు సభ్యుఁడను నర్థమును నమర్థింప యత్నించు చున్నారని తోఁచెడిని...సభ్యపర్యాయములలో నమరుఁడు సభిక శబ్దము చెప్పమి యేలొకో? దానికిఁ గారణమరయవలవదా? ఆ యర్థ మీ శబ్దమునకు రూఢి విరుద్ధ మగుటయే కారణము. రూఢ్యర్థము ద్యూతకారులు గావున నదిచెప్పఁబడినది. దాని నెఱుఁగక సభ్యార్థమున నాధునిక కవులు చేసిన సభిక ప్రయోగముల నెన్నింటింజూపిన నేమి ప్రయోజనము? ఈ కోలాచలముగారి వాదము చీఁకటితోనే తాంబూల మేమిరా? ఉల్లి గడ్డలతో జల్దియన్నముం దింటిని. ఉల్లి గడ్డ లేలరా? సెగ సెంకటము. ఛీ ఛీ ఎక్కడ తగిలించుకొంటివి? నాకును మా నాయనకును మా వదినె తగిలించినది. మా యింట నందఱికి సెగ సంకటమే' అన్న సామి తెగానున్నది. ఎంత సరసముగా ఉన్నదో చూచినారా సభిక శబ్ద విమర్శము?

" ఈ సభికుల్ గనుంగొనఁగ నిట్లయితిన్ వగనాకు వింతయే " అని విరాట పర్వము 2. 176 వ పద్యమందు సభ్యార్థమందు తిక్కన సభిక శబ్దమువాడినట్లు ఒకరు ఆప్రయోగము చూపిస్తే, ఈ వెంకటేశ్వరరావుగారు ద్రౌపదీ వాక్యమున మత్స్యరాజు నాస్థానమువారు... అందలి ప్రముఖులా సమయమున జూదమాడుచుండిరి గావున నాసభయందు ధర్మరాజుయొక్క పూర్వకృత దుర్ద్యూత దోషముచేతఁ దనకిట్టి భంగపాటు కలిగె ననియు

భావమగునట్లుగాన సభవారి నందఱిని 'సభికులు' అని వచించినది, ఈ పద్యమునకు మూలభూతమైన శ్లోక సముదాయములో సభికులను నీవాటకు ధూర్తాపి అనిఉన్నది. "ధూర్తోక్షదేవ కితవోక్షధూర్తో ద్యూతకృత్సమాః" "సభికా ద్యూతకారకాః" అని అమరము. ద్రౌపది కీచక పాద తాడనము పొందిన విరాట సభయందు జూదము జరుగుచుండెను. "విఘ్నంకరోషి మత్స్యానాం దీవ్యతాం రాజసంసది=జూదమాడుచున్న మాత్స్యులకు విఘ్నముం జేయుచున్నావు" అని ధర్మరాజు ద్రౌపదితో అన్నట్టు సంస్కృత భారతమందున్నది, అని సమాధానము చెప్పినారు. వీరి వాదములో నాకు బోధపడని వింతయేమిటంటే-అమరములో సభికశబ్దార్థము ద్యూతకారకాః' అని ఉన్నదంటూ, "సభికులనగా జూదగాండ్రు" అని రామకృష్ణయ్యగారున్ను, "జూదగాండ్రను బోధించు సభిక శబ్దము సభ్యపర్యాయముగ వాడుట ప్రశస్తము గాదని" సుబ్బారావుగారున్ను, ద్యూతకృత్, ద్యూత కారక శబ్దములున్ను వాటి అర్థములున్ను తారుమారుచేసి తబ్బిబ్బులు పడినట్టు కనబడుతున్నది. వీరిమిత్రులు వెంకటరాయశాస్త్రులవారున్ను వేంకటేశ్వర రావుగారున్ను వీరిభ్రాంతిపోగొట్టక ఉపేక్షించినారేమి? సభిక శబ్దమునకు సంస్కృతములో ఏమి అర్థమున్నదో ప్రయోగములు చూపి ఎవరూ చెప్పరేమి? సభికులనగా ద్యూతకారకులుగాని ద్యూతకృత్తులు కారుగదా.

94. సభిక శబ్దమునకు 'ద్యూతకారకః,' అనే అర్థము అమరములో ఉన్నదన్నమాట నిజమే. అయితే, అమరుడు చేసిన నామలింగానుశాసనము సంస్కృత గ్రంథము లందున్న సంస్కృతభాషాశబ్దములకే చెల్లవలెను. సంస్కృతభాష లౌకిక భాషగా వాడుకలో ఉన్నప్పుడు ఆ భాషలోని శబ్దములున్ను వాటి అర్థములున్ను ఏర్పడ్డవి. ఆ భాషయొక్క వాడుక పోయిన తర్వాత, ఆభాషలో గ్రంథములు వ్రాసేవారు పూర్వము ఏర్పడి ఉన్న శబ్దములున్ను వాటికి ఏర్పడిఉన్న అర్థములున్ను లెస్సగా తెలుసుకో వలసిన నియ

మము ఉచితమయినదే. సభాశబ్దమునకు సంస్కృత భాషలో అనేకార్థము లున్నవి. (1) గృహము, (2) సమాజము, (3) ద్యూతము—(సభాద్యూతం. సభాగృహమితి రుద్రః) రాజుకొలువుకూటము 'రాజసభా' ధర్మ నిర్ణయము చేసే సభ. 'ధర్మసభా' మల్లయుద్ధమందు జయాపజయములు నిర్ణయించే సభ "మల్లసభా" అక్షజూదరుల సమాజము 'ద్యూతసభా' జూదమాడే గృహము కూడా 'ద్యూతసభా'. ఏ సభలోనయినా కూర్చున్నవారు 'సభ్యులు', 'సభాసదులు', 'సభాస్తారులు', ఈశబ్దమును 'రాజ నియుక్తులకున్ను' ఉత్తినే కూర్చుండిచూచేవారికిన్ని చెల్లును. చాణూరముష్టికులతో రామకృష్ణులుమల్లయుద్ధము చేసినప్పుడు కంసునిచేత నియుక్తులయిన మల్లసభాధి కృత్తులు మల్లసభాసదులని సంస్కృత భాగవత మందున్నది. యాజ్ఞవల్క్య స్మృతిలోనున్ను దాని వ్యాఖ్య విజ్ఞానేశ్వరీయములోనున్ను 'ద్యూతసభా' 'ద్యూతః', 'సభికః', 'ధూర్తకితవః' 'గృహః' మొదలయిన శబ్దములకు ధర్మశాస్త్రమందు ద్యూతసమాహ్వయమనే వివాదపదనిరూపణములో పారిభాషిక పదములుగానిర్వచనము లున్నవి. 'సభికుడు' రాజుచేత 'నియుక్తుడై'యిన 'ద్యూతసభాధికారి' 'ద్యూతసభాపతి' 'ద్యూతసభాధ్యక్షుడు', అనే పేళ్లుకూడా ఉన్నవి. సభాపతి శబ్దము సభిక శబ్దమువలెనే 'ద్యూతగృహస్వామీ' అనే అర్థము కలిగి ఉన్నది. 'ద్యూతసభ' ప్రసిద్ధమయిన స్థలమందుండవలెను. నిర్ణీతమయిన 'శుల్కము' గెలిచిన జూదరులు 'సభాధికారికి' చెల్లించవలెను, 'సభికుడు' నిర్ణీతమయిన సుంకము రాజుకు చెల్లించవలెను. తగవులు పరిష్కరించే అధికారము 'సభికుని' యందే ఉన్నది. అతని మాట మీరినవారిని రాజు దండించవలెను. కొన్ని తగవులు తీర్చుటకు పంచాయితీవారిని నియమించవలెను. అందులోని 'సభ్యులు' ద్యూతసభాధికారులే; సాక్షులు జూదరులు. ఇప్పుడు ఆబ్కారీ ఉద్యోగస్థులు, ఇజారాదార్లు, లైసెన్సులు, డిపోలు అంగళ్లు మొదలయినవన్నీ ఉన్నట్టే, పూర్వము ద్యూత వ్యవహారము; నిర్వహించే డిపార్టుమెంటు

ఒకటి సాంగముగా రాజ్యములో ఉన్నట్టు కనబడుతున్నది. దీనివల్ల రాజుకు కొంత ఆదాయము వచ్చేది. ఈకాలములో పన్నులు వసూలుచేసే అధికారము కలవానికి కలెక్టరు అనే హోదా ఉన్నట్టే, ద్యూత సభాధికారికి 'సభికః'. అనే హోదా ఉండేది. 'సభికులు' అన్నవారు జూదమాడేవారు కానేకారు; రాజుచే నియుక్తులయిన అధికార్లు; ద్యూతక్రీడల సూపర్వైజర్లు సూపరింటెండెంట్లు ద్యూతము వ్యసనమైనా, ద్యూతకృత్ నింద్యుడైనా, సభికత్వము నింద్యము కాదు. సురాపానము నింద్యమైనా, అబ్కారీ కంట్రాక్టరుగాని అబ్కారీ డిపార్టుమెంటువారుగాని నీచులు నింద్యులు కారు. వినోదార్థము ఇప్పుడు చదరంగము చీట్లపేక వలెనే, పూర్వము రాజులు తమ సభాగృహములలోను, సంసార్లు తమ యిండ్లలోను, ద్యూత మాడుకొనేవారు. అట్టిచోట్ల ద్యూతకారకు లయిన 'సభికులు' అనే అధికార్లుండరు. అందుచేతనే సభాపర్వములో ద్యూతవర్ణనమందు ఎక్కడా సభిక శబ్దము ప్రయుక్తము కాలేదు. జూదమాడేవారుద్యూతకృత్తులు, ధూర్తులు, కితవులు. విరాటసభలోకూడా ద్యూతకృత్తులేగాని ద్యూతకారకులులేరు.

94. పూర్వకాలమందున్న రాజ్య వ్యవస్థను పట్టి ఏర్పడ్డ వ్యవహారములో 'సభా' అంటే, 'ద్యూతసభ' అనే అర్థముండేది; గనుక 'సభిః' 'సభ్యః' 'సభాపతిః' 'సభాధికారీ' 'సభాధ్యక్షః' పర్యాయ పదములుగా 'ద్యూత' అనేమాట ముందు లేకుండానే వాడుకలో ఉండేవి. ఇప్పుడు 'కలెక్టరు' అనే శబ్దమునకు ముందు 'రెవిన్యూ' అని చేర్చి 'రెవిన్యూ కలెక్టరు' అనవక్కరలేదు. కలెక్టరు అంటే, బిల్ కలెక్టరని యెవరూ అనుకోరు. ఆ ప్రకారము గానే పూర్వకాలమందు సభిక శబ్దమునకున్నూ సభాపతిశబ్దమునకున్నూ ద్యూతసభతో గల సంబంధముచేత 'ద్యూతకారకాః' అనే అర్థము వచ్చినది. ఆ అర్థము సభిక శబ్దమునకు మాత్రము అమరుడు చెప్పినాడు. "సభా (ద్యూతసభా) ఆశ్రయత్వే నాస్త్యస్యేతి సభికః" అని ఒకరు, 'సభా (ద్యూతమ్) ఆశ్రయత్వే నాస్త్యస్యేతి సభికః' అని ఒకరు,

'వ్రీహ్యాదిత్వాత్ ఠన్' అని ఒకరు, 'వికార సంఘేభిష్ఠికః' అని ఒకరు. 'ద్యూతం కారయతీతి ద్యూతకారకః పణాన్తాత్ స్వార్థేకః' అని ఒకరు— ఇట్లు లక్షణము చెప్పినారు. సభిక శబ్దమునకు 'సభీకః' అని శబ్ద రత్నావళిలో రూపాంతరమున్నది. 'సభ్యః' అంటే 'సభికః' అనే అర్థముకూడా ఉన్నదని జటాధరుడు చెప్పినాడు. శబ్దకల్పద్రుమములో 'సభాపతిః=సభికః ద్యూతగృహస్వామీ' అని ఉన్నది. ఆప్టే (Apte) గారి ఇంగ్లీష్-సంస్కృత కోశములో 'Courtier' అంటే సభ్యః 'సభికః' అని కూడా ఉన్నది. శబ్దరత్నాకరములో 'మెంబరు=సభికుడు' అని ఉన్నది. సభ్యసభిక శబ్దములు సమానార్థకము లయినట్లే కదా.

95. సభా శబ్దమునకు ద్యూతమనిన్ని ద్యూతసభ అనిన్ని ఏభాషలో వ్యవహారమున్నదో, ఆ సంస్కృత భాషలోనే సభిక శబ్దమునకు 'ద్యూత కారకః' అనే అర్థము రూఢమయిన దని చెప్పడము యుక్తము; గాని, సత్సమాజార్థమందే సభాశబ్దవ్యవహారము గల తెలుగుభాషలో...సభా శబ్దము నుండి పుట్టిన సభిక శబ్దమునకు తత్సంబంధమువల్ల కలిగిన సభ్యార్థము నిషేధించి, తెలుగువారి వ్యవహారములో సభాశబ్దమునకు లేని అర్థము విధించుట కేవలము అయుక్తము; అందువల్ల లోక వ్యవహారమునకు విరుద్ధమయి పండితుల భాష హాస్యాస్పదమవుతుంది. 'పండితులను సభికులారా' అని ఎవరైనా సంభోధిస్తే, తమ్మును నిందించినారని వారనుకోవడము; పండితులు జూదమాడేవారిని 'సభికులారా' అని సంభోధిస్తే, లోకులు నవ్వడము—ఇంతే ఫలము. తెలుగుభాష వేరు; సంస్కృత భాష వేరు. తెలుగు ఇప్పుడు ప్రజల వాడుకలో ఉన్నది. సంస్కృతము గ్రంథాలలో మాత్రమున్నది. సంస్కృత శబ్దములు తెలుగులో చేరిన తర్వాత తెలుగువారి వాడుకను పట్టే వాటి అర్థము, ప్రయోగము నిర్ణయించ వలెను; గాని, సంస్కృత భాషాలక్షణమును పట్టి నిర్ణయించ వల్ల కాదు. యజ్ఞములు చేసేకాలములో యజమాన శబ్దమునకు 'యజ్ఞము చేస్తూ

ఉన్నవాడు' అనే అర్థమే ఉన్నది. ఆ శబ్దము విశేష్యము కాదు; యజ్ అనే క్రియ యొక్క శత్రర్థకరూపము. యజ్ఞాలు నామావశిష్ట మయినతర్వాత 'యజమానః' అంటేగృహపతిః అనే అర్థము వచ్చినది. తెలుగులో 'యజమానులు' అంటే గృహపతులు అనే అర్థమేకాక, సేవకులకు స్వాములు, అధికారులు మొదలుగా గల మరికొన్ని అర్థములు పుట్టినవి. బహువచన రూపము యజమానులుగా నున్నందున, తెలుగుభాషావ్యవహార వాసనచేత ఇకారాంతశబ్దమని భ్రమపడి అపండితులు 'యజమాని' అని ఏకవచనరూపము ఊహించి, వాడుకలోనికి తెచ్చినారు. 'యాజమాన్యము' అనే శబ్దము ఇప్పుడు వాడుకలో ఉన్నది. 'మహమ్మదల్లీ సాయబుగారి యాజమాన్యము క్రింద నొక సభ జయప్రదముగా జరిగెను' అని పత్రికలలో వ్రాస్తున్నారు. ఇట్లే తెలుగువారివాడుకలో ఉన్న సంస్కృత శబ్దాలు వేనవేలు రూపమందుగాని, అర్థమందుగాని, రెంటియందునుగాని ఏదోమార్పుచెందిఉన్నవి. గ్రంథములలో కొన్ని దూరినవి; కొన్ని వ్యవహారములో మాత్ర మున్నవి. పాణిన్యాదుల అనుశాసనము చొప్పున వాటి రూపము లేదని, కోశకారులు చెప్పిన అర్థములకు విరుద్ధమని, సంస్కృత భాషాపండితులు నిందించి, సంస్కృతములో ఉన్నట్టు తెలుగులో వాడమంటే చెల్లుతుందా? భాషా తత్త్వము బోధపడ్డ పండితులు ఇట్టిపని తల పెట్టుదురా? వాడుకమారుతూ ఉంటుందని తెలిసినవారు. గనుక, వాడుక ఏలాగు ఉంటే ఆలాగే శబ్దాలకు అర్థము చెప్పుకోవలసి ఉంటుందనే గదా 'తదశిష్యం సంజ్ఞా ప్రమాణత్వాత్' (1. 2. 58), 'లుబ్యోగా ప్రఖ్యానాత్ (1. 2. 54), యోగప్రమాణేచ తదభావే౽దర్శనంస్యాత్ (1. 2. 55), ప్రధాన ప్రత్యయార్థ వచన మర్థస్యాన్య ప్రమాణత్వాత్ (1. 2. 57), కాలోపసర్జనంచ తుల్యమ్ (1. 2. 57) అనిచెప్పినియమాలు చేయడము మాని వేసినారు పాణిన్యాదులు.

95. ప్రతిభాషలో నున్న అన్య భాషాశబ్దములు ఎక్కువగానో, తక్కువగానో చేరిఉంటవి. వేరువేరు భాషలు మాట్లాడే జనులు పరస్పర

సంబంధము కలవారైతే, ఒకభాషలోని మాటలు మరియొకభాషలో కలియక తప్పదు. అన్యభాషా గ్రంథములు చదువుకొన్నవారు ఆభాషలోని శబ్దములు తమ భాషలోనికి చేర్చుకోవడమునకు అనేక కారణము లుంటవి, అట్లా చేర్చుకొన్న శబ్దములు లౌకికభాషలో నుండక, కేవలము గ్రంథస్థమయి ఉంటే, అవి వాస్తవమైన దేశభాష (అనగా పండితపామర సామాన్యముగా దేశస్థులు వ్యవహరించే భాష) లోనివవని చెప్పకూడదు. అన్యదేశ్యములయినా, లౌకికభాషలో చేరినవయితే, అవి గ్రంథమందున్నా, దేశస్థులకు దేశ్యపదముల వలెనే పరిచితమయి ఉంటవి. దేశభాషా పండితులు లెస్సగా విమర్శించి, దేశభాషలో నున్న ప్రతిశబ్దమునకున్ను వ్యుత్పత్తినిరూపించి, ఇది దేశ్యము, ఇది అన్యదేశ్యము, అని ఏర్పర్చగలరు; గాని, ఇతరులందరూ లోక వ్యవహారములో ఈభేదము తెలుసుకోకుండానే, తెలిసినా, పాటించకుండానే, భావబోధకముగా ఏమాట ఏవేళకు స్ఫురిస్తే ఆమాటే వాడుతారు. ఏభాషనుండి ఏశబ్దము తమభాషలోనికి వచ్చినదో, కనుక్కొని, ఆభాషలో ఆశబ్దము యొక్క తత్త్వము ఏమిటో తెలుసుకొని, ఆతత్త్వము చొప్పున ఆశబ్దముయొక్క రూపము, అర్థము, ప్రయోగము బోధపర్చుకొని, అన్యదేశ్యములు వాడవలెనని నియమముంటే, పండితుల కయినా, నాలుక కదలదు సరేకదా, కలమయినా నడుస్తుందా ? మన తెలుగు భాషలోఉన్న శబ్దములు తెలుగు మాటలేకాక, సంస్కృతమునుండి వచ్చిన తత్సమాలు, పాళీమొదలయిన ప్రాకృతముల నుండి వచ్చిన తద్భవాలు, అరవము కన్నడము నుండివచ్చిన అన్య ద్రావిడములు, హిందూస్తానీ, ఇంగ్లీషు, ఫ్రెంచి, పోర్తుగీజు, మలై మొదలయిన వాటినుండి వచ్చినవిన్ని కలవుగదా; ఈచెప్పిన భాషలన్నీ అభ్యసించడమునకు తగిన ఓపిక భాషాతత్త్వాన్వేషణమందు అభిలాష కలవారికి ఉంటే ఉండేనిగాని, సంసారములో ఈదులాడే అందరికీ ఉంటుందా ? అంత ఓపికఉన్నవారి కయినా, ఈ చెప్పినన్నిటిభాషలలో నుండివచ్చినశబ్దముల తత్త్వము నిరూపించడము సాధ్యమా ? అదిసాధ్య

మయినా, లోక వ్యవహారమందు సిద్ధమయి స్థిరపడి ఉన్న శబ్దముల రూప మున్ను అర్థమున్ను సంబంధమున్ను ప్రయోగమున్ను తాము నేర్పిన తెలుగు శబ్దతత్త్వమునకు విరుద్ధముగా కనబడితే, దిద్దివ్యవహారము మార్చడము సాధ్యమా? తాము నిరూపించిన తత్త్వము తాముగాని ఇతరులుగాని పునర్వి మర్శము చేసినప్పుడు తప్పని తెలిస్తే, తిరిగీ లోకవ్యవహారము మార్చవలసి వస్తుందే! ఈలాగున లౌకికభాష 'సంస్కరించడమునకు' ఏదేశమందున్నూ ఎవ్వరున్నూ ఎప్పుడున్నూ పూనుకోలేదు. బాగా ఆలోచించుకొంటే అది పిచ్చిపని అని బోధపడకమానదు.

96 సంస్కృతభాషాపాండిత్యముకల తెలుగుపండితులు సంస్కృత శబ్దముల లక్షణ మెరిగినవారు గనుక అవిమాత్రము ఆలక్షణముచొప్పున వాడ గలరేమోకాని, వాటివలెనే తెలుగులోనికి వచ్చిన సంస్కృతేతర భాషాశబ్ద ములు ఆయా భాషల లక్షణము చొప్పున వాడగలరా? అసలు, అట్టి శబ్దములు యేయే భాషలనుండి తెలుగులోనికి వచ్చినవో తెలుగు పండితులు చెప్పగలరా? కోశాలలో అట్టి శబ్దముల వ్యుత్పత్తిని గురించి వ్రాసిన వ్రాతలలో చాలాతప్పు లున్నవే. ప్రాకృత భాషలనుండి వచ్చిన శబ్దముల కయినా వ్యుత్పత్తి సరిగా తెలియక అన్నీ 'వైకృతము' లని చెప్పి ఊరుకుంటారే. ఐతే, సంస్కృతేతర శబ్దములన్నీ—ప్రాకృత భవములుకానీ, అన్యదేశ్యములుకానీ, దేశ్యములేకాని తెలుగుభాషలో ఏకాలమందు ఏలాగున తమసహచరులు వాడుతారో, ఆకాలమందు ఆలాగుననే పండితులుకూడా వాడకతప్పదు. అన్యదేశ్యములు అన్యదేశ భాషాలక్షణమునకు విరుద్ధమయినప్పుడు ఆయా భాషల లక్షణము ఎరిగినవారు తప్పు పట్టితే, తెలుగు పండితులు ఏమిసమా ధానము చెప్పుతారు? 'అన్యదేశ్యాలు అనేకభాషలనుండి వచ్చినవి. ఆభాష లన్నిటి లక్షణమున్ను మేము నేర్చుకోలేము. తెలుగులో ఆశబ్దములు ఏరూప మున్ను ఏఅర్థమున్ను కలిగి ప్రసిద్ధముగా ఉన్నవో, అట్లేగాని మరిఒకలాగున వాడలేము; ఆలాగున వాడుట తప్పుకాదు" అనిగదా సమాధానము చెప్ప

వలెను. ఇట్లే ఇంగ్లీషు భాషలోనికి వచ్చిన అన్యదేశ్యాల విషయమై ఇంగ్లీషు పండితులు ఇంగ్లీషు భాషా వివరణములో స్పష్టముగా వ్రాసినారు. ఈ లోకములో ఎన్ని భాష లున్నవో ఇంచుమించుగా అన్నిటిలోని శబ్దాలున్ను ఇంగ్లీషుభాషలో చేరినవి. అవి ఇంగ్లీషువారు సాధారణముగా ఏ చొప్పున ఉచ్చరిస్తారో, ఏ అర్థమందు వాడుక చేస్తారో, అట్లే సాధువుగా నిశ్చయించుకొన్నారు. ఐతే వాటి వ్యుత్పత్తి నిరూపించినప్పుడు సాధ్యమయినంత శ్రద్ధతో పరీక్షించి ఆయాభాషలలో ఆయాశబ్దములకు గల రూపములున్ను అర్థములున్ను వ్రాస్తారు. ఆ అనుశాసమునకు వాడుక విరుద్ధముగా ఉంటే తప్పుకాదు. సంస్కృతమునుండి తెలుగులోనికి వచ్చినశబ్దములు తెలుగువారి వ్యవహారములో రూపమందు అర్థమందు మారితే ఆమార్పు అంగీకరించక తప్పదు. అన్యదేశ్యములను గురించి తెలుగు పండితులు చెప్పే సమాధానమే సంస్కృత శబ్దములను గురించి సంస్కృత భాషా లక్షణము తెలియని తెలుగువారు చెప్పగలరు. "ఏశబ్దము సంస్కృతమో, ఏశబ్దము ప్రాకృతమో; ఏది దేశ్యమో, ఏది అన్యదేశ్యమో, ఆచర్చ మాకెందుకు ? సిద్ధాంత కౌముదిలోను అమరములోను ఎట్లుంటే మాకేమి? తెలుగున వ్యవహరించే టప్పుడు సంస్కృతము వచ్చినవారున్ను రానివారున్ను ఒక్కలాగునే మాట్లాడుతున్నారు. సంస్కృతము బాగా చదువుకొంటేనేకాని తెలుగు వ్రాయకూడదని నియమించడము అవివేకముకాదా? అట్టి నియమము చెల్లుతుందా? సంస్కృత పండితులయినా, గ్రంథాలలోనే సంస్కృతశబ్దాలు సంస్కృత భాషా లక్షణమునకు విరుద్ధముగా వాడుతున్నారే." అని మావంటివాళ్ళు సమాధానము చెప్పుతారు.

97. సభిక శబ్దము గురించి ఇంతమట్టుకు పేకులాడిన వేంకటరాయ శాస్త్రులవారు సంస్కృతమందు బ్రహ్మాండ నాయకులట గదా! ఇంతోటి సంస్కృతపండితులు తమ కథాసరిత్సాగరములో సంస్కృత శబ్దాలు ఏలాగున వాడినారో చూడండి.

"ఒకరిమీఁద నొకరికి అనుమానము కలిగెను. (పు. 31) వివాహ లగ్నము, ఇప్పుడే నిశ్చయించుటకు ఏమి అభ్యంతరము? (పు. 272), మొదటి ప్రతిజ్ఞను జ్ఞాపక పఱిచి (226), గుట్టు రుజువు చేసెదను (276), మహాధనుఁడైన వర్తకుఁడు (84), రత్నవర్తకము (86) నందె అతనిని ఆటంక పఱిచెను. (4)) శివశర్మమాత్రము నిరాటంకముగా ప్రవేశించును. (26), ఇతని సంగతి వాసవదత్తచెవికి అంది (74), ఉత్సవము అనేకదినములు జరిగి (నివర్తించినది) (189), ఆశాపము మూఁడు నెలలకు నివర్తించును. (477). ప్రేరేపింప (445), అపమారు (281), అపనమ్మకము, (797), కుచోద్యము.

ఇవిన్నీ, వీటివంటివి ఇంకా ఏవో ఆగ్రంథమందే కాక వీరు వ్రాసిన తక్కిన గ్రంథములందుకూడా ఉన్నవిన్నీ, తప్పులు అని సంస్కృత శబ్ద తత్త్వమును పట్టి వీరిలాటి సంస్కృత పండితులు కొందరు ఆక్షేపిస్తారే; ఇవి తప్పులయితే, సభికశబ్దము అసాధువని ఆక్షేపించడము గొంగళీలో తింటూ వెంట్రుకలు ఏరినట్లు కాదా? అయితే, మేము మాత్రము ఈశబ్దములలో లోకవ్యవహారానుసారముగా ఉన్నవన్నీ, సాధువులనే వాదిస్తాము. మేము చెప్పేసజ్జాయిషీ చిత్తగించండి. ఇవిన్ని ఇట్టిశబ్దములు ఎన్ని ఉంటే అన్నిన్ని, సంస్కృతమునుండి వచ్చినా, తెలుగువారివ్యవహారములో సిద్ధశబ్దములయినవి. సంస్కృతములో వాటికున్న అసలురూపమున్ను, అర్థమున్ను, ప్రయోగమున్ను సంస్కృత పండితులకైనా సంస్కృత గ్రంథములలో మాత్రమే స్ఫురించును. లోకవ్యవహారములో ఉన్నరూపము, అర్థము, ప్రయోగము మాత్రమే తెలుగుభాష వాడుకున్నప్పుడు తటుక్కున మనస్సుకు తట్టుతవి. తెలుగువారిలో సంస్కృతము వచ్చినవారు ఒకరు ఉంటే, సంస్కృతము రానివారు పదివేలమంది ఉంటారు. వారూ వీరూ కలిసిమెలిసి, పరస్పర సంబంధము గలవారై ఎల్లప్పుడూ ఒక్క విషయమును గూర్చి ఒక్కవిధముగానే భావబోధకముగా వ్యవహరిస్తూ ఉంటారు;

గనుక, సంస్కృతము చదువుకొన్నవారి భాషకున్ను అది చదువుకోని వారి భాషకున్ను, వైషమ్యము తగ్గి, సామ్యము స్థిరపడుతుంది. సంస్కృతాలు వర్ణలోప వర్ణాగమ వర్ణవ్యత్యయాది బహువిధముల మారిగదా తద్భవాలయినవి. ఈమార్పు అపండితుల నోటనయిన దనవలెను; గాని, పండితులు తెలియక చేసిన దన వల్లకాదే. అపండితుల సంఖ్య ఎక్కువగా నున్నందున వారితో సహవాసము, సంభాషణము అనివార్యమయి, వారివాడుక పండితులకు అలవాటు కాకతప్పదు. పండితులన్నవారు పుట్టేసరికే వారిపూర్వులు వ్యవహారము కోసము లౌకిక భాష తయారుచేసి ఉంచినారు. పుట్టినది మొదలుకొని వారు ప్రతిదినము, ప్రతిక్షణము అదేవాడుతున్నారు. 'అపండితులు' అంటే హీనజాతులవారని తలచ కూడదు. అగ్రవర్ణముల వారిలోనే, తగు మనుష్యులన్న వారిలోనే, శిష్టులన్న వారిలోనే, పండితుల బంధువులలోనే, వారికుటుంబము వారిలోనే, సంస్కృత భాష బాగా అభ్యసించని వారున్నారు కారా? వారే అపండితులని మా అభిప్రాయము. ఏభాషలోనుండి వచ్చినవయినా దేశభాషలోని మాటలన్నీ దేశములో నున్న అగ్ర వర్ణముల వారి నోటనే నలిగి, వ్యవహార యోగ్య మయి, సాధుత్వము పొంది, సంస్కార నిరూపణమునకు తగి ఉంటవి. లౌకికభాషలన్నీ ఇట్లే ఏర్పడ్డవి. ఇట్టి లౌకిక భాషకే ఒక దానికి పాణిన్యాదులు శబ్దానుశాసనము చేసినారు. అదే సంస్కరణము. ఇక వేంకటరాయ శాస్త్రులవారు వాడిన అనుమానాది శబ్దములు, కుండలికరణము చేసిన 'నివర్తించినది' తప్ప, లౌకిక వ్యవహారానుసారముగా ఉన్నవి; గనుక, సాధువులు. నన్నయ మొదలుకొని కవులందరూ ఇట్టి శబ్దములు వాడుతూ ఉన్నారు. 'పృషతుపరోక్షంబున; (ఆది 4. 218) అంటే 'పృషతుడు చనిపోయిన పిమ్మట' అని అర్థముగదా, సరిగా ఇట్లు పరోక్ష శబ్దము సంస్కృత గ్రంథములందున్నదా? ఎట్టి <u>ఘట్టములను</u>, నెట్టి యాపదలను, నెట్టి తీర్థములను ఘుట్టెఁబడిన వంతలెల్లఁబాయును (ఆది 4. 83) అనేవాక్యములో నన్నయవాడినట్లు ఘట్టశబ్దము సంస్కృతములో

వాడుదురా? శ్రీనాథుడు భేషజమనే శబ్దము మోసమనే అర్థమందు హరవిలాసము (3. 90) లో వాడినాడుగదా; ఈ శబ్దము ఈ అర్థములో వ్యావహారిక భాషలో తెలుగువారు వాడుతున్నది గాని సంస్కృతమందున్నదా? తిక్కన 'అనుమానము' అనే శబ్దము సందేహార్థమందు ప్రచురముగా వాడి ఉన్నాడు (చూ. విరాట 1. 260, 2. 102, 268) అయితే సంస్కృత నిఘంటువులో అనుమానమ్—అనుమితి కరణం, అనుమితిః, అనుమా; వ్యాప్తి విశిష్టపక్ష ధర్మతాజ్ఞాన జన్యజ్ఞాన మనుమితిః' అనిఉన్నదిగాని 'సంశయము', సందేహము అని లేదే. తిక్కన కాలమందు, మన కాలమందున్నట్లే, తెలుగు వారి లౌకికవ్యవహారములో అనుమాన శబ్దమునకు సంస్కృతమందు లేని ఈ అర్థమున్నందున, ఆ శబ్దము సంస్కృత భాషలోనిదైనా, తెలుగువారి వాడుక ప్రకారమే సంశయార్థమందు భారతమున ప్రయోగించి, ఆ శబ్దము నుండి తెలుగున పుట్టిన క్రియా రూపము 'అనుమానించు' (చూ. విరా 2. 34) కూడా యథేష్టముగా తన గ్రంథమున వాడి, తెలుగుభాష స్వతంత్రమైనదనిన్ని తెలుగు కవులకు లోక వ్యవహారమే ప్రమాణ మనిన్ని అతడు ఉపదేశించినవాడయినాడు. శబ్ద రత్నాకరములో 'దీని నీ యర్థమునం గొందఱు దేశ్యమని చెప్పి యున్నారు' అని ఉన్నది? అంటే తాత్పర్యమేమి? ఈ శబ్దము సంస్కృత భాషలోనిదే కాని, దానికీ అర్థము ఆ భాషలో లేదు; అర్థమును పట్టి శబ్దాల జాతులు ఏర్పర్చ వలసి ఉంటే, ఈశబ్దము దేశ్యముగా వర్గీకరణము చేయవలెను' అనిగదా? సరే; ఆలాగున చేయగోరే వారు ఆలాంటిశబ్దాలు దేశ్యములలో చేర్చుకో వలెనుగాని అసాధువులని నిరాకరించ కూడదు. గనుకనే శబ్దరత్నాకరములో సభిక శబ్దమునకు (1) సభయందుధర్మజ్ఞుడు; (2) జూదమాడించువాఁడు (3) న్యాయవాది; అనిమూడర్థములు చెప్పినారు; రెండవ అర్థము మాత్రమే అమరములో ఈ శబ్దమునకున్నది; తక్కిన రెండర్థములు తెలుగులో ఈ శబ్దమునకు వచ్చినవి. వచ్చిన వాటిని పారదోలడము ఎవరికీ శక్యముకాదు; వాటిని ఉపేక్షిస్తే వ్యవహార

పోనికలుగుతుంది. వివక్షితార్థము చెప్పడమునకు వ్యవహారములో ఉన్న శబ్దము మానుకొని, వ్యవహారములో లేని శబ్దము నెవరికి తెచ్చుకోవడము వృథా ప్రయాసమే; గాని, సార్థకము కాదు; గనుక అట్టి పని అవివేకమని పించుకొంటుంది. తెలుగునిఘంటువునందు, కావలసిఉంటే, ఈఅర్థమందిదిదేశ్యము అని తెలియజేయ వచ్చును. వేంకటరాయ శాస్త్రులవారే నిఘంటు నిర్మాతలయితే, సీతారామాచార్యులవారు చెప్పిన అర్థములు నిరాకరింతురుగాబోలు! శబ్దరత్నాకరమందు ప్రయోగము లుదాహరించక పోవడములోపమే. ప్రాచీన కావ్యములలో ప్రయోగము లుండగా అవి ఇయ్యక ఉత్తరాంధ్రకావ్యముల లోనివి ఇవ్వడము కూడా లోపమే. అనుమాన శబ్దమునకు సందేహార్థమందు కవికర్ణ రసాయనములోనిది ఒక్క ప్రయోగము మాత్రమే శబ్దరత్నాకర మందు ఉదాహృతమయి ఉన్నది. అందు చేతనే కాబోలు, ఉత్తరాంధ్ర భాష ఉపేక్షించి, ప్రాచీనాంధ్రభాష మాత్రమె వాడుతామని దీక్షపట్టిన* శాస్త్రులవారు తమ కథాసరిత్సాగరము మొదటి కూర్పులో అనుమాన శబ్దము లౌకిక భాషలో ఉన్నట్టుగానే సందేహార్థమందు వాడి, రెండవకూర్పులో ఆశబ్దము తీసివేసి, దానికి బదులుగా 'సంశయ' శబ్దము దూర్చితప్పు దిద్దుకోవడము సంభవించినది. అట్టివారు జంకుకళంకు లేని కవిచంద్రు లనిపించుకొంటారా? ఈ శబ్దము ఆ అర్థమందు వాడుక చేయడములో 'కళంకు' ఉన్నదని 'జంకు' పుట్టకపోతే, ఉత్తనే ఎందుకు సవరణ చేసినారు? మాటలు సరిగా వాడడము చేతకాక, పండితులు తప్పుపట్టి ఆక్షేపిస్తారేమో అని దిగులుపడుతూ, "అయ్యవారేమి చేస్తున్నారు? అంటే, తప్పులు దిద్దుకొంటున్నారు;" అన్నట్లు మాటిమాటికి శబ్దాలు మార్చుకొనే

---

* 'వలన'కు రూపాంతరమని శబ్దరత్నాకరమందు ఆంధ్ర కవితా పితామహుని ప్రయోగ సహితముగా ఉదాహృతమయిఉన్న 'వల్ల' వాడి నందుకు వెంకటరత్నం పంతుల వారిని శాస్త్రులవారు దూషించినారు (చూ క్రింది పేరా. 'వల్లబెల్లము'.)

వారు సిరికి పండితులు గాని "జంకు కళంకులేని కవిచంద్రులు" ఎన్నటికిన్ని కారు, ఈ అనుమాన శబ్దమును కవిబ్రహ్మ కాపాడుతున్నాడన్న జ్ఞాన ముంటే, స్వపాండిత్యమందు విశ్వాసము లేక పోయినా, శాస్త్రిలవారి కీ జంకు పుట్టకపోవును. ఒక్క తిక్కనే కాదు, అతని తర్వాతి వారు మహా కవులు చాలామంది ఈ శబ్ద మిట్లు వాడి ఉన్నారు. వీరందరి గ్రంథాల లోనూ కనబడుతూ ఉన్న ఈ శబ్దము, తమ గ్రంథము మొదటికూర్పులో కనబడి, రెండవకూర్పులో అంతర్ధాన మయినంత మాత్రాన, లోకములో లేకుండా పోతుందా? గ్రాంథిక భాషనుండి బహిష్కృతమవు తుందా? ఈ శబ్దము వాడిన కవులందరికన్న శాస్త్రిలవారు గొప్ప వారయిపోతారా? వీరి గ్రంథము మొదటికూర్పుమాత్రమే చదివి, రెండవ కూర్పు చూడని వారికి ఈ శబ్దము వీరి కిష్టమయినదని తోచదా?

98. తమ కథా సరిత్సాగరము మొదటికూర్పులో శాస్త్రిల వారికే తప్పులుగా తోచి రెండవకూర్పులో దిద్దుకొన్న మాటల సంఖ్య 'ఎక్కం', 'దాహం', 'శతం' దాటి సహస్ర స్థానమునకు ఎక్కుతుంది. ఇవిన్ని అంతకు పూర్వము వీరు వ్రాసిన గ్రంథములలో కొన్ని తెలుగుమాటలున్న చూస్తే ఇట్టి తెలుగు వ్రాసినవారు తెలుగుపండితులని ఎట్లా పేరుపొందినారో గదా అని ఆశ్చర్యము కలుగుతుంది. వీటిని ఈ వ్యాసము మూడవభాగములో వివరిస్తాము గాని ఇక్కడ అనుమానము వంటి మరి ఒక శబ్దమును వాడటములో శాస్త్రిలవారు పడ్డ పాట్లు చెప్పి ప్రస్తుత మనుసరిస్తాము. కథా సరిత్సాగరములో అనుమాన శబ్దము వాడినట్లే అభ్యంతర శబ్దము వాడినారు. రెండవ కూర్పులో మొదటిది దిద్దుకొన్నట్లే, రెండోదికూడా దిద్దుకొని దానికి బదులుగా ఆటంక శబ్దము వాడినారు. అభ్యంతరశబ్దము శబ్దరత్నాకరమందున్నది. దానికి చెప్పి ఉన్న అర్థములలో మూడవది 'ఆటంకము' సంస్కృతములో ఆతంక శబ్దమున్నదిగాని ఆటంక శబ్దము లేదు; దానికున్న అర్థములలో శంక భయము అనేవి చేరిఉన్నవి; 'నిరాతంకముగా' అంటే 'శంక లేకుండా'

'భయము లేకుండా' అని అర్థము. సరిగా ఈ అర్థములో మొదట పండితులు ఈ శబ్దమునేవాడి ఉంటే, అది అపండితులనోటను 'నిరాటంక' మయి, 'అడ్డము లేని'దనే అర్థము పొందినది. ఆటంక శబ్దము సంస్కృతముగా పండితులు అంగీకరించక, తెలుగులో సాధువని ఒప్పుకొని, కొందరు దేశ్యమని, కొందరు తద్భవమని అంటారు. శబ్ద రత్నాకరములో ఆటంక శబ్దము దేశ్యమని ఉన్నది. ఇది దేశ్యమైతే వేంకటరాయశాస్త్రిలవారు 'నిరాటంకముగా' (చూ 26. 83) అని చాలామాట్లు ప్రయోగించి, రెండవ కూర్పులో దిద్దకుండా విడిచి పెట్టినారే. సంస్కృతమందున్న కొన్ని శబ్దాలలోని తకారము రూపాంతరములలో టకారముగానున్నది; గాని 'ఆతంకము' అట్టి శబ్దములలో చేరిఉన్నట్టు మాకు తెలియదు. పండితులు కొందరు అసాధువనే 'నిరాటంకముగా' అనేది వాడుటకు 'జంకులేని కవిచంద్రులు' అభ్యంతర శబ్దము తప్పనుకొని, జంకి దిద్దుకొన్నారుగాని, తాము మెచ్చుకొన్న ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో మ. శ్రీ. జయంతి రామయ్య పంతులవారు అభ్యంతరమనేకాక 'నిరభ్యంతరముగా' అని కూడా నిరాటంకముగా వాడుతున్నారు. (చూ. 2. పు. 97). అన్నట్టు చెప్పవచ్చి మరచిపోయినాము. కథా సరిత్సాగరము రెండవకూర్పు అచ్చుపడ్డది గనుక అభ్యంతర శబ్దము అందులో దిద్దుకొనుటకు అవకాశము దొరికినదిగాని ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శములోనే 318 వ పుటలో 16 వ పంక్తిలో 'వాని కవికల్గుట కేమభ్యంతరము' అనే వాక్యములో అభ్యంతరము స్పష్టముగా కనబడుతున్నది. ఆ పుస్తకములో ఆ వాక్యము చూచిన మా వంటివాళ్లము ఈ శబ్దము శాస్త్రిలవారి కిష్టమని తలంచుట తప్పా? వీరు బృహదాంధ్ర నిఘంటు నిర్మాతలై యుంటే ఈ శబ్దమున కీ యర్థము చెప్పుదురా? శబ్ద రత్నాకరములో లేనిదీ, కేవలము వాడుకలో మాత్రమున్నదీ గదా 'కుచోద్యము' అనే శబ్దము? ఇది కన్నడ కోశములో తత్సమముగా 'మోసము' అనే అర్థము కలిగి ఉన్నట్టు కనబడుతున్నది. బ్రౌణు దొరవారి

నిఘంటువులో 'కుచోద్యగాడు' మొదలయిన వాడుక మాటలుండుట వింత కాదు. ఈ శబ్దము కథా సరిత్సాగరములో 'నేనుచేసిన కుచోద్యమెఱిఁగి నన్ను శపించెను.' (చూ. 624) అనే వాక్యమందు శాస్త్రిలవారు ప్రయోగించినారు. ఇది సంస్కృత మయితే, ఆప్టెగారి కోశములోగాని శబ్దకల్పద్రుమములో గాని చేరలేదేమి? కోశాంతరములలో ఉన్నదేమో? మేము చదివిన సంస్కృతపుస్తకములలో గాని తెలుగుపుస్తకములలో గాని ఇది ఉన్నట్టు మాకు జ్ఞప్తియందు లేదు. సిద్ధ శబ్దమని అభిమానముచేత వ్యాకరణ సూత్రాలు నలిపి, తెంపి, ముళ్ళువేసి, దానిని సాధువుగా సాధిస్తారా? ఇది సాధువుగా తెలుగుగ్రంథములో వాడుటకు జంకులేనివారు సభిక 'శబ్దము' విధవ శబ్దమువంటి దనడమునకు తగిన కారణమేమో తోచకుండా ఉన్నది. శాస్త్రిలవారిబుద్ధి అలౌకికము; కేవల శాస్త్రాధీనము; గనుక "విధవా" అన్నా "గొప్ప ప్రభువా" అని అన్నట్టే భావించగలరుగాని లోకములో మరి యెవ్వరూ అట్లా భావించరు. అందుచేత మావంటి వాళ్లకు లోకమే ప్రమాణము. అయితే విధవ శబ్దానకు గొప్ప ప్రభువనే అర్థము సాధించగల శాస్త్రము లోకవిరుద్ధ మయినది; గనుక అది లోకానికి ప్రమాణము కాదు. లోకవిరుద్ధ మయినా శాస్త్రమే పండితులకు ప్రమాణము గనుక వారే దానిని పట్టి అన్ని కర్మలు అనుష్ఠించవలసినవారు. వారి కిష్టమయితే, దోషమును గుణముగా సిద్ధాంతము చేయనూ గలరు; ఇష్టము కాకుంటే, లోకులందరూ గుణముగా గ్రహించినది దోషమని నిరాకరించనూ గలరు. శ్రీనాథుడు 'పణినాసత్య' శబ్దమున్ను, పెద్దన 'పణిననూను' శబ్దమున్ను, సంస్కృత భాషా లక్షణమునకు విరుద్ధముగా ప్రయోగించిఉన్నా, శాస్త్ర రహస్యములు తెలిసినవారు గనుక మన శాస్త్రిలవారు 'మహాకవి ప్రయోగములుగాన ప్రామాదికములు గావను విశ్వాసముచే స్థితగతి చింతనగా ప్రక్రియయూహ్యా' మని, నామైకదేశగ్రహణే నామమాత్ర గ్రహణమ్ అనే న్యాయము చొప్పున 'పణి + నః' అంటే పణియొక్క

నప్తా; మనుమఁడు" అని సుశబ్దములుగా సిద్ధాంత పర్చినారుకారా? 'వాచాటో బహుగర్హ్యవాక్' అని శాస్త్రాభిధాన ముండగా, శ్రీనాథుడు 'వాగ్మి' అనే అర్థమందు వాచాటశబ్దము ప్రయోగిస్తే, సహించినారుకారా? సీతారామాచార్యులువారు గ్రామ్యమన్న అవధారు శబ్దము శ్రీనాథుని నైషధమందు కనబడినప్పుడు శాస్త్రులవారు దానికి ప్రక్రియ చెప్పినారుకారా? 'తల్లమాంబ' వంటి శబ్దములు అహోబలుడు తప్పని దూషిస్తే 'పెద్దనాదిమహాకవులును ఇట్టిప్రయోగములు చేసియున్నారు; కాన వీనికి గతినరయుట యుచిత' మని సమాధానము కల్పించినారుకారా? వారణాసి అని శ్రీనాథుడు లౌకికరూపము ప్రయోగిస్తే 'వారాణసి' అని శాస్త్రవిహితమైన శబ్దమునకు విరుద్ధముగా ఉన్నా, తద్భవము గానోపునని అంగీకరించినారుకారా? ఇటువంటివి ఎన్నో ఒప్పుకొన్నవారు 'నిషధేశు బచ్చుకున్' అని నైషధములో శ్రీనాథుడే ప్రయోగిస్తే, 'జఘన్య ప్రయోగ'మని నిందించినారే; శ్రీనాథుడు నైషధములోనే 'పసుపుకు' అనిన్ని 'పిచ్చుకుంటుకు' అనిన్నీ ప్రయోగించినాడు. అనేక కవులు ప్రయోగించిన రూపములు ఇట్టివి వేలకొలదిగా ఉన్నా, శాస్త్రులవారి కిష్టము లేదు గనుక, సీతారామాచార్యులవారు వీటికి చెప్పిన సమాధానము నిరాకరించి నిందించినారు. తమకు ఇష్టమయితే, మహాకవుల ప్రయోగములు ప్రామాదికము లనకూడదు; వాటికి 'గతినరయుట యుచితమంటారు; ఇష్టముకాకపోతే, మహాకవి ప్రయోగములు వేనవేలున్నా జఘన్యాలంటారు! ఏమి చెప్పను? వారి న్యాయము మాకు అయోమయము.

99. వేంకటరాయశాస్త్రులవారు అంగీకరించినా, అంగీకరించక పోయినా, మాకు యుక్తమనితోచినట్టు ఈశబ్దమును గురించి మేము సిద్ధాంతము చేసుకొంటున్నాము. ఈశబ్దము లోకములో సభ్యార్థమందే శిష్టులు వాడుతున్నారు. సభాశబ్దమునకు ద్యూతమని కాని, ద్యూతశాల అనికాని తెలుగులో అర్థము లేనేలేదు. గనుక, సభికశబ్దమువలన ద్యూతముతో సంబం

ధించిన భావము ఏదీ స్ఫురించదు. తెలుగులో 'సభా' శబ్దమునకు శిష్టులుగల పరిషత్తే అర్థము; గనుక సభికశబ్దముచేత దానితో సంబంధించిన సభ్య భావమే స్ఫురిస్తుంది. ఈవాడుకను అనుసరించే నేటిపెద్దలు గ్రంథములలో ఈశబ్దము ప్రయోగిస్తున్నారు. విజ్ఞానేశ్వరీయ మను ధర్మశాస్త్రమునకు ఆనూరి సరస్వతీ తిరువేంకటాచార్యులవారు రచించిన "వ్యవహారకాండ తాత్పర్య బోధిని" అనే ఆంధ్రటీకలో "బ్రాహ్మణోత్తములను ముగ్గుర నైనను అయిదుగుర నైనను ఏడ్గుర నైనను, తన సభయందు సభికులనుగా నుంచుకొనవలయును. ఈనియుక్త సభికులు ప్రభువు న్యాయ వ్యతిరిక్తముగా తీర్పు సేయుచునెడల అట్లుకాదని నిరాకరించి న్యాయప్రకారము తీర్పు సేయింపవలయుననియు అట్లు చేయనియెడల నియుక్త సభికులకు దోషము సంభవించును. ప్రాడ్వివాకుం డనఁగా వాది ప్రతివాదులను ప్రశ్న చేసిన వారు చెప్పెడి మాటలలో ఇది విరుద్ధం బిదియవిరుద్ధం బని సభికులతోఁగూడి నానావిధములుగా విచారించువాఁ డనియర్థము. ఇట్టివి అనేక ప్రయోగము లున్నవి.

ఆరేండ్లక్రిందట యూనివర్సిటీవా రేర్పరచిన కాంపోజిషన్ కమిటీలో మనశాస్త్రిలవారుకూడా సభికులలో ఒకరుగా ఉండి, నిర్దుష్టమైన ఆంధ్రభాషకు ఆదర్శములనతగిన గ్రంథములని కొన్ని అంగీకరించి పేర్కొన్నారు. వాటిలోనుండి ఉదాహరించిన ప్రయోగములు శాస్త్రిల వారు అంగీకరించవద్దా? (1) చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి మహాపురుషుల జీవితములు. సభికుఁడు (చూ. పు. 8, 9, 11, 13); సభికులు (పు. 17) సభికత్వము (68); (2) లక్ష్మీకాంతరావుగారి చీనాదేశపు చరిత్ర—సభికులు (139, 206, 218, 224); (3) వారి అశోక చరిత్రము—సభికులు (6, 281); (4) లక్ష్మీనారాయణగారి అక్బరుచరిత్ర—సభికులు (9, 12, 15, 28, 40); (5) సీతారామశాస్త్రిలవారి కథలు—

సభికులు (63); (6) గురజాడ శ్రీరామమూర్తిగారి కవిజీవితములు—సభికులు (174, 222) ఈ శబ్దము అన్నిటిలోనూ సభ్యార్థమందే ఉన్నది. ఇట్లు గ్రంథములందేకాక, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మొదలయిన సుప్రసిద్ధ పత్రికలలో తరుచుగా ఈశబ్దము కనపడుతున్నది. శాస్త్రిలవారు నిర్దుష్టమైన భాష గలదని మెచ్చుకొన్న ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలో ప్రకటిత మయిన ఆంధ్రసాహిత్యపరిషత్తు పరీధావి సంవత్సర కార్యనివేదన మందే, "పాఠశాలలలో గ్రామ్యగ్రంథములు చదివింపకుండునట్లు సభికు లేక గ్రీవముగా నిశ్చయించిరి." అనే వాక్యములో సభ్యార్థమందే సభిక శబ్దము ప్రయుక్తమయి ఉన్నది. ఈ చెప్పిన సభికులలో చేరినవారే అయినా, శాస్త్రిలవారు పల్లెత్తు మాటయినా, అప్పుడు కాదు ఎప్పుడయినా, అనలేదు. మ. పానుగంటి లక్ష్మీనరసింహరావుపంతుల వారి 'సాక్షి' అనే గ్రంథ మందు నాటకము చూడవచ్చినవారిని ఉద్దేశించి 'సభికులు' సభ్యార్థమందు వాడినారు. (మూ. పుట 185) ఈ కవిగారి భాష నిర్దుష్టమయినదని మ. కూచినరసింహం పంతులవారు ప్రమాణీకరించినారు.

100. పైని ఉదాహరించిన వాక్యములు వేంకటరత్నముపంతుల వారివంటివారు ఆధునికులు వ్రాసినవి; ప్రమాణము కావంటే, పూర్వుల గ్రంథములలోనుండి కూడా ప్రయోగములు ఉదాహరించగలము. ఆది కవీశ్వరుడు నన్నయభట్టు ఆది.2. 132 సీ. గీ.లో 'భక్ష్యభోజ్య లేహ్య పానీయ ములమీఁద సభికులైన విప్రజనులమీఁద' అని వ్రాసినట్టు కొన్ని తాటాకు పుస్తకములలో పాఠము మేము చూచినాము. వావిళ్లవారు అచ్చువేసిన పుస్తకములలోకూడా ఉదాహృతమయిఉన్నది. ఉన్నా, అది అప్రసిద్ధమైన పాఠమంటే, తిక్కన విరాటపర్వము 2.76 లో ఉ. "ఈ సభికుల్ గనుంగొనఁగ నిట్లయితిన్ వగ నాకు వింతయే" అనే ద్రౌపదీవాక్యములో, 'సభికులు' అనే శబ్దము సభ్యార్థమునందు ప్రయుక్తము అని మే మంటాము. కాదు, ఇక్కడ 'సభికులు' శబ్దమునకు 'ద్యూతకారకులు' అని అమరములో

చెప్పిన అర్థమేమంటే, అందుకు మా ఆక్షేపము,—విరాటుడు, ధర్మరాజు మొదలయినవారు 'ద్యూతకృత్తులు'గాని 'ద్యూతకారకులు, కారు; అమరములో 'ద్యూతకృత్' అని వేరేశబ్దమున్నది. 'సభికులు' జూదమాడేవారు కానేకారు; (ద్యూత) సభాధికారులు (ద్యూత) సభాపతులు; రాజుచేత నియుక్తులయి నిర్ణీతమైన సుంకము రాజుకు చెల్లిస్తూ, ధర్మశాస్త్రమందు విధించినప్రకారము ప్రసిద్ధమైన ద్యూతశాలలో, కావలసినసాధనములుంచి, జూదరులలో గెలిచినవారినుండి సుంకము పుచ్చుకొంటూ, జూదముతో సంబంధించిన తగవులు తీర్చవలసిన అధికారస్థులు. ద్రౌపదీవాక్యములోని సభిక శబ్దమునకు ఇట్టి సభాపతులు అని అర్థము చెప్పవల్లకాదు. 'ద్యూతకృత్తులు' అనే అర్థము సభిక శబ్దమునకు లేదు. మరి ఏ అర్థమైనా చెప్పవలెనుగాని ఈ అర్థము పొందదు. తిక్కన తర్వాతి కవుల వాడుకనుబట్టి చూస్తే, తిక్కనకూడా అట్లేవాడుట సంభావ్యమనవచ్చును. ఇది మా సజ్జాయిషీ.

పోతరాజు భాగవతము 4.39. క. చనుదెంచిన యాదక్షుఁడు వనజజునకు మ్రొక్కి భక్తివశులై సభికుల్, దనకిచ్చిన పూజలు గైకొని...' అని తాటాకు పుస్తకములలోని పాఠము (చూ 148) అచ్చులో 'సభికుల్' అనే మాటకు బదులుగా 'సభ్యుల్' అని ఉన్నది. ఎవరు దిద్దినారో? పోనిండి, అచ్చుపుస్తకములో (ఆనందముద్రణములోనే) ప్రత్యక్షముగా కనబడుతూ ఉన్న ప్రయోగమొకటి మేము గుర్తుపెట్టుకొన్నది ఉదాహరిస్తాము. అది విశ్వసింపక తప్పదుగదా. ఇంకా ఉంటవి; వెతికితే కనబడతవని మాకు నమ్మక మున్నది. దీనినిపట్టి పోతననాటినుండి కవులు సభిక శబ్దము సభ్యార్థమందు వాడుతూఉన్నట్టు సిద్ధాంత మవుతుంది.

క. చూచెదరుగాని <u>సభికులు,</u> నీచిన్న కుమారకులకు నీ మల్లురకున్
ఓ చెల్ల యీడుగాదని సూచింపరు పలికిఁ దనుకుశోకముగాదె.

(10. పూ. 1350:—)

1. ఉత్తరనైషధము 4. 217:—

క. ఇభయాన యోర్తురత్న ప్రభలీనెడు సీసమిడిన రాజేంద్రుఁడు ప్రా
గభిముఖముగఁ గూర్చుండెను సభికులుఁ బ్రాసీనులైరి సముచిత లీలన్.

(దమయంతీ వివాహవర్ణనలోనిది ఈ గ్రంథము బ్రహ్మశ్రీ. పురాణ పండ మల్లయశాస్త్రిలవారు పరిశోధించినదట.

2. ఉత్తరరామా. 8 పు. 152:—

క. కొలువుండి యకుమారులఁ బిలిపించి సమీప భూమిఁ బ్రీతి వసింపన్
సెలవిచ్చినఁ బ్రతిబింబయుగళము న్వలెనున్న వారిఁగనుఁగొని సభికుల్.

(రాములవారిసభలో కుశలవులు రామాయణము పాడుటను గురించినది)

3. ,, 8 పు. 163:—

క. కులగురుఁడైన వసిష్ఠుని నలఘుమతుల మంత్రివరుల నార్యుల హితులం
బిలిపించి జమునిరాక మొదలుకొని సకలంబుఁ దెలిపెఁ దత్సభికులకున్.

4. ,, 8 ,, :—

క. ఆమాటలువిని సభికస్తోమము విధిచేష్ట యనుచు మూఱఁగ...

5. కృష్ణరాయ విజయము 2. 15:—

శా. విద్యారణ్యులనంగ నెవ్వరతఁ డేవిద్యన్ బ్రకాశించె నీ...
తెస్సగా దెల్పుఁడీ,యాద్యంతంబునటన్నఁ దత్సభికులాహ్లాదంబుతో నుండగన్.

6. కాళహస్తిమహా 211:—

తే. అదియుఁ దాఁ గాంచి సభికు లాహ్లాదమందఁ
దగవుఁ దలపోసి చిత్తంబుబిగియఁబట్టి

(బ్రహ్మసభలో నున్నవారు 'ఆది' సరస్వతి)

7. జైమినిభారతం 8. 185:—

క. క్రతువులకు నెల్ల హరికర్మకరుఁడు గామి స్వర్గ ఫలమాత్ర మిపుడు సాక్షాత్కరించి, శౌరియున్నాఁడు మామకాస్యమున ననుచు సభికులకుఁ జెప్పెనన గృష్ణ సహిత ఋషులు.

8. నారాయణకవి పంచతంత్రము మిత్రభేదము, 551. ఈ పద్యములోని సభికులు 'ధర్మాధికారు'లని 549.

చ. అని పలుకంగ నా సభికులప్పు డెఱింగి యితండు సెట్టి నీ
యిను మొసఁగుం గుమారకుని నిమ్మని వారలు చక్కఁ బెట్టినన్
మనమున సమ్మతించి 'తమకుండదట నా' సభవారు తీర్చి చె
ప్పినగతి నట్లచేసిరని పెంపెసఁగన్ గథ సెప్పి యిట్లనున్.

వాయుపురాణము కవులచరిత్రలో ఉదాహృతము (చూ. పు. 361) కృతినాయకుని కొలువుకూటమువర్ణన.

సీ. అతులిత శాస్త్రేతిహాసంబు లొకవంక
నొకవంక దండనాయకగణంబు.

(ఉత్తరార్ధము)

గీ. కొలువుకూటంబునందు కలిత వచన
గౌరవము మీఱ సభికులఁ గాంచి పలికె.

9. చిత్రభారతము 5. 59:—

గీ. అయిన నీకొక యతి రహస్యంబు గల్గఁ
దెలియఁ జెప్పంగఁ బూని యేతెంచినాఁడ
నిచటి కాంతల సభికుల నెల్ల ననుపు,
మంత్ర భిన్నంబుగాకుండ మానవేంద్ర...

10. రామస్తవరాజము, 3:—

క. వచ్చిన కాంతామణి గని
యచ్చెరుపడి సభికు లెల్ల నానందముతో
ముచ్చటపడు జొచ్చి తమలో....

ఈ వచ్చినది ముక్తికాంత; ఈ సభికులు రాజయోగ సామ్రాజ్యాధిపతి సభలో నున్నవారు.

11. చెన్న బసవపురాణము, వీరసంగమయ్య పెండ్లి కథలోనిది.

చ. అని వచియింపఁ దత్సభికు లంఎలు సంతసమంది బాపురే!
వననిధి మేఖలా వలయవాసి జనంబుల యందు బంధు భా
వన దిలకింప వీరి పరివారలఁ గాంచితి మే యటంచుఁ బె
క్కనుతు లొనర్చి రత్తఱి నకుంఠిత కౌతుక మావహిల్లఁగన్ (4.85)

12. చెన్నబసవ పురాణము, దక్షుని యజ్ఞశాల యందున్న వారిని గురించినది.

సీ. గీ. పాపరక్షులు వదలిన మీఁది కెగసి
యొకటి యాకట్టు హరియించె నొకటి వాని
మోముపైఁబడి బంగ్లాడ మోదె సభికు
లెల్లవిస్మయ చిత్తులై తల్లడింప. (5. 318)

101. నన్నయ ప్రయోగము అచ్చుపుస్తకాలలో కనబడ లేదనిన్ని, తిక్కన ప్రయోగమునకు విరుద్ధార్థము చెప్పిన్ని, అవి నిరాకరించినా, అచ్చుపుస్తకాల లోనివే మేము చూపించిన ప్రయోగాలు ప్రమాణముగా శాస్త్రిల వారు అంగీకరిస్తారా? అంగీకరించరా? పరమ భాగవతోత్తముడు, కవిరాజు పోతన్న; భువనభాసురకృతి నిర్మాత, 'వాణినారాణి' అన్నవాడు పినవీరన; దిగ్గజములాటివాడు ధూర్జటిలాటివాడు కుమారధూర్జటి, ప్రౌఢ కవి కంకంటి పాపరాజు; లాక్షణికులకు లక్ష్యములిచ్చినవాడు తరిగొండ ధర్మన్న; సుప్రసిద్ధుడయిన నారాయణకవి; విష్ణు భక్తుడు మల్లన; శివభక్తుడు

పాపన; వీరందరూ ప్రయోగించినట్టే వేంకటరత్నము పంతులవారు సభిక శబ్దము ప్రయోగించి ఉన్నప్పుడు, అందుకు ఆయనను దూషిస్తే, ఈ చెప్పిన కవి పుంగవులను దూషించినట్టుకాదా? అట్టిపాపమునకు వేంకటరాయ శాస్త్రులవారు సాహసిస్తే, సాహసించిరిగాక; వారికి ప్రాపకులుగా నున్న వారును, వారిశిష్యులును వారి ఆప్తులున్ను, వారి సాహసము కొనియాడితే, కొనియాడిరిగాక; పామరలోకము పరమార్థము ఆలోచించక గతానుగతిక మయి వారిని పొగడితే, పొగడెనుగాక; మేముమాత్రము సహించలేము. మేమేకాదు, మావలె ఇట్టిపని గర్హించేవారు అనేకులున్నారు. సత్యము తెలిసినతర్వాత పక్షపాతములేకుండా మంచి చెడ్డలు ఏర్పరించేవారు లేక పోలేదు. తెలుగువారందరూ పండితులు కారంటే ఒప్పుకొంటాము గాని, అవిచక్షణులు అంటే, సమ్మతించము. దురాగ్రహముచేతను, దురభిమానము చేతను ప్రత్యక్షప్రమాణ మున్నా ప్రతిపక్షుల మాట విశ్వసింపక పండితులే కొందరు వివేకము విడిచిపెట్టుట అసంభవము కాదని అందరూ ఎరిగినదే.

శ్రీనాథుని ప్రయోగములే అభారత ప్రయోగములని, జఘన్య ప్రయోగములని, చెప్పి నిరసించి పంక్తి గిలించే పండితులు వ్రాసే గ్రంథాలలో వేయింట తొమ్మన్నూటతొంబైతొమ్మిదిపాళ్లు ఉత్తరాంధ్ర శబ్దాలే ఉంటవి. భారతభాష బాగా బోధపడక అదివాడినప్పుడు తబ్బిబ్బులు పడుతూనే ఉంటారు. ఉత్తరాంధ్రపు వాడమని పెగ్గెలు (పగ్గెలు?) పలికే అయ్యలు ఉత్తరాంధ్రకవులుకన్న గొప్పవాళ్లమనుకొంటారుగాబోలు. కడపుశబ్దము గ్రంథాలలో వాడుకచేయుటకు వెనుకదీయని ఆంధ్రపండితులు లౌకికభాష గ్రామ్యమని నిందించి పరిత్యజించి అభారతప్రయోగములు ఒల్లమని ప్రగల్భాలు పలికితే, సామాన్యులు మోసపోతారుగాని, వివేకులు నవ్వరా? వార్తాకము వర్జించ మన్నారు. ధర్మశాస్త్రములో వంకాయ తినకూడదు; అలాబు అభక్ష్యము గనుక అనపకాయ నిషిద్ధము, అని అంప

రికి ఉపదేశించి, ఇంటివద్ద దీక్షితులుగారు వంకాయకూర, అనపకాయ ముక్కలు ములంకాడలువేసినపులుసు, దేవునికి నైవేద్యముపెట్టి తింటూ ఉంటే ఇంట్లోవాళ్లుకూడా నవ్వుతారా నవ్వరా? ఎందుకు వట్టివేషాలు? భేషజాలు? కదపు (కదుపు) శబ్దము ప్రాచీనగ్రంథాలలో చూచినట్టు మాకు ఏమీ జ్ఞాపకము లేదు. కోశాలలో లేదు; వ్యాకరణాలలో లేదు. ఎందుకుంటుంది? 'కదలు' *ధాతువుకు ప్రేరణార్థకము 'కదల్పు' గాని కదపు కాదుగదా. ఇదిభాషలోనికి ఎప్పుడు వచ్చినదో ఇంకా చెప్పలేముగాని నేను దేశమందు అంతటా వాడుకలో ఉన్నది. శిష్టులుకూడా వాడుతున్నారు; లకారము పోయినదని అందరూ ఎరుగరు; ఎరిగినవారయినా ఎవరూ నొచ్చుకోరు. ఏలాగయితేనేమి, కదపు (కదుపు రూపాంతరము) భాషలో స్థిరపడ్డది. సరికొత్త తెలుగుమాట గదా ఇది! నూతనప్రియులు కాని వా రెవరుంటారు? వృద్ధపండితులు, పండితభిషఙ్మణులు, ఎప్పుడూ భాషాదేవి చేతినాడిపరీక్షిస్తూ, రోగాంతకరములు పొడచూపగానే నిదానించవలసినవారు, మన వెంకటరాయశాస్త్రిలవారే తమ కథాసరిత్సాగరమందు 195-వ పుటలో, 10-వ పంక్తిలో 'కదపక' అని ప్రయోగించి కేవలలౌకికభాషలో ఉన్న సరికొత్తతెలుగుపదము 1891-వ సంవత్సరములో తమ గ్రంథమందు చేర్చుకొని, వెలితీసివేసి, గ్రాంథికము చేసివేసి, పుణ్యము కట్టుకొన్నారు: పంచములకు బ్రాహ్మణులతో సమముగా మన గవర్నమెంటువారు హక్కులు కలుగజేసినట్టే. సమముగా అంటే, లౌకికవ్యవహారమందని మా అభిప్రాయముగాని, యజ్ఞాలలో ఋత్విజులుగాను, శ్రాద్ధాలలో భోక్తలుగాను ఉండడములో సమానమని కాదు. "కదపు" శబ్దమునకు మనశాస్త్రిలవారు యోగ్యత అనుగ్రహించిన తర్వాత,

---

* కథా సరిత్సాగరమందు 'కదులు' రూపాంతరమున్నది (చూ. పుట. 496) శ. ర. లో లేదు. ప్రాచీనుల ప్రయోగములలో ద వర్ణము యతిస్థానమందున్నది. గనుక 'కదులు' కొత్త తెలుగు.

బ్రహ్మశ్రీ. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులవారు తాము రచించుచున్న సరికొత్తభారతములో ‡ ఈసరికొత్త పదమునకు నన్నయశబ్దములతో సమానమైనస్థానము పద్యములోనే ప్రసాదించినారు. మ. పానుగంటి లక్ష్మీనృసింహారాయ కవిపుంగవులుకూడా తామురచించిన గ్రంథములలోను, అన్నిటికి శిరోమణి అనదగిన 'సాక్షి' లోను 'కదపు' శబ్దమును ముమ్మారు ఆదరించి, "స్థిరోభవ, వరదోభవ, సుపన్నోభవ," అని ప్రతిష్ఠాపించినారు. 'లౌకిక భాష పాకీచచ్చుడిభాష' ⁋ అని పైకినిందించినా, సదయహృదయులున్ను పక్షపాతము లేనివారున్ను గనుక ఇతరపంచములతోపాటు పాకీ చచ్చుడులకు లౌకికవ్యవహారములో గవర్నమెంటువారివల్ల కలిగిన హక్కులు చెల్లక తప్పవని ఎరిగి, కదపుయొక్క 'తోబుట్టువు' 'మెదపు' ను * కూడా స్వీకరించి తమ ఔదార్యము ప్రకటించినారు. నేను ఆంధ్రగ్రంథములు వ్రాసేవారు అపరిమితముగా ఉన్నారు. 'కదపు' శబ్దము వాడేవారుకూడా ఇంచుమించుగా అందరున్నారు. ఎవరు లెక్కపెట్టగలరు? ఈలాటి 'పాకీచచ్చుడి' మాటలు వందలు, వేలు ఉన్నవి వారిగ్రంథాలలో; అందుచేత అవి బాపన మాట లయిపోయినవి.

---

‡ చూ. వనపర్వము 4. 273. శా. 4 వ పాదమందు. పూ, నిక్కంగై కొంచు నొకింతయేని కదుపన్ లేక మ్మహోపుచ్ఛమున్.

⁋ చూ. పు. 3, 168. తుదకు 'రామవాక్య' మంగీకరించక తప్పినది కాదు.

* చూ. పుట. 34.

† కల్పలతా సంపాదకులు బ్రహ్మశ్రీ ఆచంట వేంకటరాయసాంఖ్యాయనుల వారికి మేము కొనియాడుచున్న వ్యావహారికభాష యిష్టమయినది కాదని కొందరు భ్రమపడుతున్నారు. సాంఖ్యాయనులవారు వర్తమానాంధ్రభాషా ప్రవర్తక సమాజములో చేరినవారే. వారికి అనిష్టమైనవి అపశబ్దాలున్నూ గ్రామ్యాలున్ను; అవి మాకూ అనిష్టమే. శిష్టులనోటను

వల్ల బెల్ల మయినదట!

102. 'వలన'కు బదులుగా వేంకటరత్నము పంతులవారు 'వల్ల' వాడినారని శాస్త్రిలవారు నిందించి, ఆంధ్రకవితాపితామహునియందు కూడా దోషము ఆరోపించినారు; చూడండి వారి విమర్శము—'ఏపొరబాటుననో ఈ భాషకెల్ల ఒకమాఱు మనుచరిత్రలోపడిన వల్లను బెల్లముగా ప్రయోగించుకొన్నారు! (చూ. అనుబంధము పుట 4) పెద్దనగారే పొరబాటు పడ్డారట! ఆంధ్రభాషలో మఱెక్కడా ఎవరూ, 'వల్ల' వాడ లేదట; ఆంధ్రసారస్వతమంతా గాలించి, వెదకి తాము చూచినట్లే సగర్వముగా సిద్ధాంతము చేసినారు. ఎట్టి ప్రాగల్భ్యము! ఎంతటాబు! ఈ భేషజాలకు లోకులు మోసపోతారు. 'వల్ల' ప్రయోగించిన కవులు వందలున్నారని వారెరుగరు. 106-వ పేరాలో మే ముదాహరించిన ప్రయోగములు చూచిన వారికి శాస్త్రిలవారి బడాయి బట్టబయలు కాకమానదు. అంతే కాదు; ఈ శాస్త్రిలవారి విమర్శము 'ఒజ్జల పుచ్చకాయవిద' మని స్పష్టముగా చూపిస్తాము. 'వల్ల' యందు ఇంతదోష మున్నదని శాస్త్రిలవారికి ఎప్పుడు తెలిసినదో మేమెరుగముగాని, 1891-వ సంవత్సరమున వారు కథాసరిత్సాగరము రచించినప్పుడు వారికి తెలియలేదని చెప్పగలము. తెలిసి ఉంటే, తమ గ్రంథములో తామే వాడి ఉందురా? చూడండి 524-వ పుట;

అట్టివిరావు—హాస్యానకు తప్పు; హాస్యమం దది ఉచితమే. కల్పలత మొదటి సంపుటము 2-వ, 4 వ సంచికలలో "కదుపుచు" కదుపక అని ఉన్నవి. (చూ. కట్టెపెంపలము, 3-వ పుట, 2-వ వరుస 22-వ పంక్తి). సాంఖ్యాయనులవారు రచించిన రహస్యదర్పణమందుకూడా "కదపఁబడు" కనబడుతున్నది; (చూ. 6-వ పుట, 5-వ పంక్తి) ఇటువంటి కొత్త తెలుగులు అనేకముగా గ్రంథములలో వాడేవారు వ్యవహారికభాషను నిందించేవారని మేము నమ్మలేము.

మూడవపంక్తిలో ఉన్నది—'అతనివల్లనుండి' అని. మరి యిరవై సంవత్సరములయిన పిమ్మట, ఈ గ్రంథము రెండవమారు ముద్రించి నప్పుడైనా, వేనవేలు సవరణలు చేసుకొన్న "కళంకులేని కవిచంద్రులు" ఈ "వల్ల" ఉన్నదున్నట్లే ఉంచినారుగాని దిద్దుకోలేదు; అది నిర్దుష్టమని నమ్మకము లేకుంటే దిద్దక విడుతురా? గనుక 1911-వ సంవత్సరముదాకా శాస్త్రిల వారికికూడా 'వల్ల' బెల్లమేగాని చేదుకాదని సిద్ధాంతీకరించుటకు వారి గ్రంథమే ప్రమాణము. మరి ఇంకా, 1914-వ సంవత్సరములో ప్రకటించిన యూనివర్సిటీ 'ఇంటర్మీడియెట్ కాంపోజిషన్ కమిటీవారి రిపోర్టు, 20-వ పుటలో, మనశాస్త్రిలవారు, సబ్‌కమిటీ మెంబరుగా నుండి, చేసిన శబ్దానుశాసనమున్నది. అందులో 'వల్ల' 'కన్న' సంస్కారములకు, వారు స్వయముగా నియమము అంగీకరించినారు. ఈరెండు విభక్తులున్ను తమగ్రాంథిక భాషలో ఉన్నందున సాధువులయినవి కాబోలు 'వల్ల' కథా సరిత్సాగరములో నున్నది. 'కన్న' వారు రచించిన 'అలంకార సారసంగ్రహాన మందు 41-వ పుటలో ఉన్నది. అవి పూర్వులు అనేకులు వాడినవే; వీరి అనుశాసనమువల్ల వాటికి సాధుత్వము కలిగినదా? లేక వాటివల్ల ఈయు' అనుశాసనము సాధువయినదా? వివేకులు ఆలోచింతురుగాక.

103. శాస్త్రిలవారికి కూడా 'వల్ల బెల్ల' మయి ఉండగా, పంతుల వారికి మాత్రమే బెల్ల మయినట్లు ఎత్తి పొడిచి, వారితో పాటు పెద్దన గారికి కూడా నెత్తిమీద నొక పెట్టు పెట్టినారే! ఇంతసాహసమునకు కారణమేమి? 1895 వ సంవత్సరములో ప్రసన్నరాఘవము విమర్శించి నప్పుడు మన శాస్త్రిల వారికున్న ఆంధ్రభాషా పాండిత్యమంతా అల్ప లక్షణమును పట్టి సంపాదించినది; గాని, లక్షణమునకు ఆధారమయిన కావ్యములు చదివి నేర్చుకొన్నది కాదు. చింతామణి మంత్రము జపించినా, సిద్ధ సారస్వత సంసిద్ధి అయినట్టు కనబడదు. వారు చూచిన లక్షణ గ్రంథములు ఆంధ్ర శబ్ద చింతామణి, అప్పకవీయము, చిన్నయసూరి బాలవ్యాకరణముమాత్రమే

అయి ఉండును. ఈ వ్యాకరణాలలో ఇమిడ్చి ఆంధ్రభాష అంతా ఎవరూ అనుశాసించి ఉంచలేదు. వీటిలో 'వల్ల' పంచమీ విభక్తి ప్రత్యయముగా సంస్కార నియమము కాలేదు. వ్యాకరణాలకు విరుద్ధమయినదే కాక, వ్యాకరణాలలో చెప్పనిది కూడా అసాధువే అని శాస్త్రిలవారు భ్రమపడి ఉండిరి. చిన్నయసూరి తాను రచించిన 'మిత్రలాభము' నందు, 5 వ పేరాలో 'లోభమువల్ల' అనిన్ని 6 వ పేరాలో 'యీ మాటలవల్ల' అనిన్ని రెండుమాట్లు వాడి ఉండిన్ని, తాను రచించిన వ్యాకరణములో దానికి అనుశాసనము చేయకుండా మరచి పోయినాడు. చిన్నయసూరి చెప్ప మరచిన లక్షణము చెప్పడానికి సంకల్పము చేసుకొని, సీతారామాచార్యులవారు 'త్రిలింగ లక్షణ శేషము' అనే 'ప్రౌఢవ్యాకరణము' రచించినా, అందులో 'వల్ల'కు అనుశాసనము చేయలేదు; అయితే, ఆ వ్యాకరణమునందే కొట్ట కొసను ముక్తలక్షణ వివేచనము, 2 వ సూత్రమందున్న వాక్యములో 'వలను' కుబదులు 'వల్ల' ప్రయోగించినారు; ఇంతేకాక, వారి శబ్దరత్నాకరములో 'వల్ల' చేరిఉన్నది; అందుకు ప్రమాణముగా పెద్దనగారి ప్రయోగమున్ను ఉన్నది; 'వలను'కూడా 'వల్లగా' మారినందుకు 'సూచన లేమియు వల్లగావు' అని పారిజాతాపహరణమునుండి ప్రయోగ ముదాహృతము. గనుక ఆచార్యులవారి మతమందు 'వల్ల' సాధువే కాని అసాధువు కాదుగదా. వీరికి పూర్వమే చాలా కాలము క్రిందట పుట్టిన ఆంధ్రవ్యాకరణములు సంస్కృతమున రచించినవి రెండు మేము చూచి ఉన్నాము. ఒకటి ఆంధ్రకౌముది; ఇది నాగరాక్షరముల ముద్రితమైనది. ఇంకొకటి అముద్రితముగా ఉన్న అథర్వణ వ్యాకరణము; మ. కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు గవర్నమెంటువారి పుస్తకాలయ మందున్న ప్రతిని బట్టి వ్రాయించినది. ఆంధ్రకౌముదిలోని 117 వ సూత్రము 'సుసునుల చేతకొరకు వల్లక్వందుప్—సుప ఏతేస్యుః' అనిన్ని, 126 వ సూత్రము 'ఉంచి, కన్న, పట్టి, కంటె, నుండి, వల్ల, వలన, వంకోండ్యోః జసిసః' అనిన్ని, మొదటిదానిలో సామాన్య

ముగా ఏడు విభక్తులను ప్రత్యయములచేత తెలియ జేసినప్పుడు పంచమీ విభక్తిని 'వల్ల' చేత నిరూపించి, రెండవదానిలో పంచమీ విభక్తి ప్రత్యయములు వివరించి, తక్కిన వాటితో పాటు వల్ల తిరిగి చెప్పినట్లు ఉన్నది. అథర్వణ వ్యాకరణము చతుర్థ కాండములో శ్లోకరూపముగా 'ఉంచి కుండా వల్ల వలన వంక యుండీతి పంచమీ నిర్ధారణే కన్న కంటే దేశ్యోపారు షిరిష్యతే' అని సూత్రమున్నది. (చూ. అథర్వణుఁడు ఆంధ్ర విజ్ఞానసర్వస్వము) గణపవరపు వేంకటకవి రచించిన ద్విరూప కోశమందు 'వలన'కు 'వల్ల' రూపాంతర మని ఉన్నది:—

క. కల్లెలు కల్లెములన న, వల్లున గల్లనఁగ వలన వల్లన యనఁగా (11)
నొల్లము వల్లము నాఁగను, కుల్లాయ కుళాయి నాఁగఁ గొలలు నుపేంద్రా.

1834-వ సంవత్సరములో ముద్రితమైన రావిపాటి గురుమూర్తి శాస్త్రులవారి వ్యాకరణములోను ఆ పిమ్మట పుట్టిన వ్యాకరణాలలోను తరుచుగా 'వల్ల'కు అనుశాసన మేర్పడి ఉన్నది.

104. ఇవి ఏవిన్నీ మన శాస్త్రులవారెరిగి ఉండ రనుకొంటాము. వారు చదువుకొన్న కొంచెము లక్షణమే వారికి పరమ ప్రమాణమయినది. అందుచేతనే కాబోలు, 1910-వ సంవత్సరమందు వారు పరిష్కరించిన సారంగధర చరిత్రలో దిద్దుటకు వల్లపడినచోట్ల 'వల్ల' 'వలన' గా మార్చినారు. అయితే, వల్లపడనప్పుడు, పద్యమంతా మార్చితే పాడవుతుందని అట్టె పెట్టినారు. ఉదా: 261 లో పూర్వ ముద్రణమున 'నుడువుల వల్లనే' అని ఉండి, వీరి పరిష్కరణముచేత 'నుడువుల వలననే' అయినది; ii 279, iii 98, iii 155, వీటిలో 'వల్ల' నిలిచిఉన్నది. మను చరిత్ర—పూర్వ పరిష్కర్తలు కొన్ని చోట్ల పాడుచేయక పోలేదు—మన శాస్త్రులవారే మొదట పరిష్కరించి ఉంటే, ఒక్క పద్యములో మాత్ర మున్నది గనుక, అందున్న ఒక్క 'వల్ల' వేళ్లతో పీకి పారవేసి, పెద్దన్న గారికి 'వల్ల' ప్ర

యోగించిన దోషము లేకుండా చేసి, పుణ్యము మూటకట్టు కొందురు. "అల్పోపి దోషః ప్రమాదే నాప్యనుపేక్షవ్యః' అని గదా పండితుల భాషా శౌచవిధి. ఇట్టివారు వ్రాసిన' కథాసరిత్సాగరము రెండు కూర్పులలోను "వల్ల' ఎందుకు ఉన్నది? అంటే, మాకుతోచిన సమాధానము చెప్పుతున్నాము. ఈ గ్రంథమంతా ఉత్తరాంధ్ర మందే మొదట వ్రాసి, ప్రాచీనాంధ్రములోనికి యథాశక్తి పరివర్తనము చేసి ఉంటారు. వేనవేలు కేవలము ఉత్తరాంధ్ర ప్రయోగము లనపగినవి రెండవ కూర్పులో మారినవి. ఈ 'వల్ల' మార్చడము మరచి పోయినారో, లేక, అప్పటికి 'వల్ల' అసాధువు కాదని తెలుసుకొన్నారో. తాము వ్రాసినవే ఇతరులు వ్రాస్తే, తప్పుపట్టి దూషించడమునకు ఈ శాస్త్రిలవారు జంకేవారు కారని మేము రుజువు చేసిఉన్నాము. ఈ వల్లను గురించి పంతులవారిని ఆక్షేపించడము ఇంకొక దృష్టాంతముగదా. తాము అసాధువన్నది తాము వాడినట్టే నటించగలరు. ఈ దుర్నోద్యము వీరికి సాజముగా మొదటినుండి ఉన్నది. ఖలః సర్షపమాత్రాణి పరచ్ఛిద్రాణి పశ్యతి, ఆత్మనో బిల్వమాత్రాణి పశ్యన్నపి నపశ్యతి.

105. భారతాది ప్రాచీన గ్రంథములలో 'వల్ల' లేదు. ప్రాచీనభాషలో "వలను' విశేష్యము, ఉదా. "కలహంసపలికిన పలుకులు గణియించు, వడి దానిపోయిన వలనమాచు" దీనికి బహువచనరూపము 'వలంకులు'. ఇది ఔపవిభక్తికము గనుక 'వలనన్' 'వలనికి' మొదలయిన ప్రథమేతరరూపములున్నవి. 'వలనన్' హేత్వర్థకముగా వాడుటచేత క్రమక్రమముగా పంచమీ విభక్తి ప్రత్యయమైనది. ఉత్తరాంధ్రములో పెద్దన, పోతన, మొదలయిన వారికాలమందు 'వలన' 'వల్న'గాను, 'వల్న' 'వల్ల' గాను వాడుకలోనికి వచ్చిఉండును. తమపూర్వులు వాడినశబ్దము లేకాని వాటికి భిన్నముగాఉన్నా తమకాలమందు వాడుకలోనున్న శబ్దము ప్రయోగించకూడదన్న పిచ్చినియమాలు ఆ కాలములో లేవు. గనుక, పెద్దనపోతనలు 'వల్ల' వాడినారు. పోతన 'వలదు' కు బదులుగా 'వల్దు' అని తరుచుగా వ్రాసినాడు. నన్నయ

తిక్కనలు ఇదివాడినట్టు మే మెఱుగము* అనేకశబ్దములలో మధ్యాక్షర మందున్న అచ్చు—ఉకార, ఇకారములే కాక అకారముకూడా—లోపించి నది. 'వలచు' 'వల్చు' అని నన్నయకాలములోనే అయినది; మరికొన్నిటి లోనిమార్పు తిక్కనకాలములో అయినది. ఇట్లే ఏకాలముబట్టి రూపములు వ్యవహారములో ఉంటే అట్టిరూపములు కవులు యథేష్టముగా వాడేవారు. అదే సత్సంప్రదాయము. వలన—వల్న—వల్ల: ఈమూడురూపములున్ను ప్రాతప్రతులలో కండ్లారా చూచిఉన్నాము. లకారనకారములు కలిసిపోయి 'వల్లఁ' అని కొంతకాల ముచ్చారణ ఉండినట్టు స్వరతత్త్వమునుపట్టి ఊహించ వలెను. నేఁడు తెలుఁగులో 'నెలనాళ్ళు' నెల్లాళ్లు' అని అంపిగూ అంటారు. కొందరు 'నల్లాంళ్లు' అని ఉచ్చరిస్తారు; ఇదే మధ్యకాలములోనిది. సల్లా పము 'సంలాపము' నుండి పుట్టినది. సంస్కృతమందు అముష్మిన్ + లోకే= అముష్మిల్లోఁకే అని నకారలకారములు సంయుక్తమయినప్పుడు న్ + ల్ = ల్లఁ అని ఉచ్చారణ ఉంటుంది. 'దానిలో' 'మనలో' అవి తొందరగాపలికి నప్పుడు 'దాన్లో' 'మన్లో'—'దాంల్లో' 'మంల్లో' అని వినబడును. తెలుఁగు భాషాధర్మముచొప్పున లకారనకారములకు వర్ణవ్యత్యయము సంస్కార ముగా కొన్నిటిలోనున్నది. మనభాష పేరు 'తెలుఁగు', 'తెనుఁగు' అని ఉండడమే తార్కాణము. మొట్టమొదట ఈపేరులోనిది లకారమో నకా రమో నిశ్చయముగా చెప్పలేము. ఉత్తరాంధ్రములోమాత్రము లకారము నకారముకావడము భాషాధర్మమే * మధ్యాక్షరములోని అచ్చుపోయి పర

---

*మ. త్రిపురానవేం. సూర్యప్రసాదరావుకవిగారు ద్రో., 5. 324 వ పద్యములో తిక్కన 'వల్దు' వాడినట్టు పూర్వముద్రణములం దున్నదని చెప్పినారు. ఆనందముద్రణములోనే తర్వాత పాఠముమార్చి పుట అడుగున మార్పు సూచితమయి ఉన్నది.

* కొలను-కొల్ను-కొల్లు అని 'పాలకొలను' అనే గ్రామనామము 'పాలకొల్లు' అయినదట: ములుకోల=మును (ని) కోల 'మలనాడు' మల్లా

మంగున్నవాళ్లుతో సంయుక్తమయినప్పుడు, కొన్నిమాటలలో ద్విత్వము విన బడుతుంది ఉ. మరపు=మప్పు. సంయుక్తవర్ణములలో రెండవది మొదటి దానితో కలిసినందుకు ఉదా. అగ్ని=అగ్గి; యజ్ఞన్న=యగ్గన్న.

106. ఈచర్చ మాప్రతిపక్షులకు ఇష్టమయినాకాకున్నా, 'వల్ల' యొక్క సాధుత్వము సాధించుటకు పండితులకు ప్రయోగములే ప్రమాణము; గనుక, కొన్ని ఈదిగువను ఉదాహరిస్తున్నాము. ఇవి ఏగ్రంథములనుండి ఎత్తిరాసినామో అవి అప్పకవ్యాదిలాక్షణికులు ప్రమాణముగా అంగీకరించి నవే. పండితులు 'వల్ల' ను పరిత్యజించినా, అదిమాత్రము వారిని పరిత్యజించదు. కంఠము పట్టుకొని ఉంటుంది. లోకమంతా అల్లుకొనిఉన్నది; లోకమును పరిత్యజిస్తేనే కాని ఎవరున్ను దానిని పరిత్యజించలేరు. ఇది దేశభాషాతత్త్వము. శిష్టులవాడుకచేత 'వల్ల' వలెనే అన్నిశబ్దములున్ను సాధువులనక తప్పదు. తప్పదు. తప్పదు.

1 ఆముక్తమాల్యద.

చ...మబ్బులనిలముంచు నీలఘన పుంజమువల్ల బలాకమాలికల్. (4. 120)

2 ఉ. రామా.

సీ. పా. ఝుళిపించు విచ్చుకత్తులవల్ల దుళకించు (పు 326)

3 కువల.

సీ. గీ. అదియు నావల్లఁ దెలిసి యియ్యాధిపవర్య (4. 164)

డయినదని కిటెల్ కన్నడనిఘంటువులో ఉన్నది. ఇట్లే 'కలను' కల్లు' అయినదేమో. 'పల్లు'కు మారుగా కొందరు 'పన్ను' అంటారు. వెలుతురు పల్లి=వెణుతురు పల్లి, పిలుగు=పినుగు, గొలుగు=గొనుగు, ములుగు=మునుగు (అనికొందరుచ్చరిస్తారు.) (పనస) తొల=తొన; లాంగల=నాఁగలి; లింబ=నిమ్మ.

4 చంపూ. రామా.

సీ. గీ. యామినీచరవల్లభుఁ డనుచు నల్లగంధవహాత్మజుని వల్లఁగరము
తలఁకె (7. 54)

5 చెన్న బ.

ఉ. చేడియ వల్ల నించుక ప్రసిద్ధి వహించెనుగాని నిల్చిమా (1. 84)

6 నిర్వ. విచి. రా.

ఉ...తప్పునా।వల్లను గర్వెనంచు జనవల్లభు దేవి నొసంగనైతిమా।
కల్ల...(6. పు. 218)

7 పట్టాభి.

ఉ. కోపమువల్ల మీతపము గుర్తింగగ నోచన సేయరైతిరె. (6. పు.166.

8 బహులా.

క. అల్లేమచనుహాళాహాళి, వల్లనె కాపల్ల వళివివాదావళిరా నల్లవళా
వళిగలయూ కల్లోలము లెసఁగ హల్లకల్లోలముగన్ (2. 56)

9. బిల్హా.

సీ. ఈకళానిధివల్లనే కదా దిక్కు దిక్కులవారలెల్లను తెలివిగనుట;
యీవసుధుని వల్లనే కదా విబుధులు కోరికల్ దీరంగఁ గుడుపుగనుట;
యీమహావిభు వల్లనే కదా సభ్యులెన్నఁగ నిశాచరులెల్ల దిగులు గనుట
యీసత్ప్రభుని వల్లనే కదా మోదించి కువలయం బెచ్చుగాఁ గూర్మి
[గనుట. (2. 55)

10. భాగవతము.

ఆ...ఎలమిఁ బుణ్యపాపముల శేషములవల్లఁ బుట్టుచుండు రవనిఁ
బుణ్యచరిత. (5. 161)

11. సీ. గుణము వికారంబుఁ గోరికయును లేని నీవల్ల జగములు నెఱిజనించు
(13)0. 1. 21

12 మథువిల

సీ. పా. బహుళావధానముల్ పఱపి నాలుగునగల్ సేసి నందితి మల్ల

ధీరువల్ల (ఆకవులచరిత్ర 493)

13. మనుచరిత్రము.

చ. చలిమల వల్లనల్లసిలు చల్లఁదనంబును నూనకుండినన్. (2. 10)

14. రామరాజీయము. వల్లను (ప్రాసస్థానమందు ల్ల) **267.**

15. ,, వల్లను... ... (94)

పుస్తకము పోయినందున పద్య ముదాహరించలేదు.

15. రంగనాథరామాయణము.

నేరము నావల్ల నెమకిన లేదు (కిష్కి)

15. రామాయణము.

తే. అధిపుఁడు కరంబుచాఁచి నాగారువల్లఁ, బాముఁబట్టంగ. (4.163)

17. వెంకమా.

సీ. పా. నీవు చెప్పినమీఁద నావల్లనే తప్పు గలదని తోఁచె నిమ్మ్లే

(6. పు. 183)

18. శశిరేఖాపరిణయము.

సీ. గీ. బలుఁడనీ వల్ల మాకింత బాధగలిగె. (పు. 72)

19. శివరహస్యము.

ఉ... నీ, వల్లను సంభవించుమటి వ్యాప్తిని నీ వఖిలంబు (1. పు. 15)

20. సీ...గీ...అందువల్లను భయమంది యనుదినంబు (1. పు. 18)

21. ఉ. ఎవ్వనివల్లఁ బుట్టి జగమెల్లను సంతతముం బ్రవర్ధనం బెవ్వని వల్ల లీనమగు నెవ్వని యందు ధ్రువం బనుగ్రహం బెవ్వనివల్లఁ సర్వమిది

యెవ్వనివల్ల దిరోహితంబునౌ (2. పు. 31.)

22. సమీర.

తే...కలిగె నావల్ల నేవల్లఁ బలుకు దాన (2. 115)

23. సారంగ. గీ...కల్ల నావల్లఁ గోరంత గలిగెనేని (2. 279)

24. ,, గీ. చెల్లఁబో నీకు సాక్ష్యముతల్లి నైన తల్లి కీగతి యొదవెగా పన్నఁగనుట వల్ల నీవల్ల ధారుణి వల్ల భాజ్ఞ మీఱియారీతి వచ్చుట మేగఁటమ్మ (2. 95)

25. ,, గీ...ఈరమణివల్ల సంశయం బెలుకపడక. (3. 155)

26. సురాభా.

చ...మై, దొఱఁగుట యంతకంటె బలుదోషము గ్రక్కున నీనివల్లనే. (పు. 19)

గంధము

107. ఆంధ్ర ప్రసన్నరాఘవమునందు 'గందపుఁజెట్టు' (పుట 9), 'గందపుఁబూఁత (10), 'గందము' (70) అని చాలాచోట్ల దకారము వర్గ తృతీయవర్ణముగానే ఒత్తులేకుండా కనబడినశబ్దములు ఉపేక్షించి, 79వ పుట లోకనబడిన 'గంధపుఁజెట్టు' ఎత్తుకొని శాస్త్రిలవారు "సంస్కృతమయిన గంధశబ్దమునే వీరు చందన పరముగా ప్రయోగించినా" రని అధిక్షేపించినారు. ఇందు దోష మేమున్నదో! లోకములో చందన పరముగా గంధ శబ్దము ప్రసిద్ధమై ఉన్నది. * కాపులు మొదలయినవారు కొందరు 'గందము' అని వాడుతారు గాని చదువుకొన్నవారందరూ గంధమంటారు. ఇప్పటి కాపుల వాడుకే గ్రాంథి కాంధ్రమని శాస్త్రిలవారు కథాసరిత్సాగర

* స్మార్త బ్రాహ్మణులు నుదుటను 'గంధాక్షితలు' ధరిస్తున్నారు కారా? కొందరు పెట్టుకొనే అక్షితలు (అక్షింతలు) ఏకవచనము; నల్లగా ఉంటుంది! చిత్రము!

ములో తరుచుగా 'గండము' (చూ. పు. 320), మంచి గందము కలయంపి (368), గంధపు ప్రమాను (367), ఎఱ్ఱగంధము (677), అని వ్రాసినారు; సరే కాని, ఒత్తు ఉన్నప్పుడు లేని అర్థము ఒత్తుపోగానే వచ్చునా? తెలుగులో 'అబద్ధము' అంటే, 'అసత్య'మని లోకములో వాడుక ఉన్నది గాని ఆంధ్రకావ్యములలో మాకు కనబడలేదు; శబ్దరత్నాకరమునందు దానికి అనర్థకము అని అర్థమున్నది. 'నిబద్ధ' వంటి వైకృత మున్నట్లైతే 'అబద్దము' అని అర్థము ఉన్నదేమో మే మెరుగము. శాస్త్రిలవారు కథాసరిత్సాగరమందు 'అబద్ధము' అసత్యార్థమునందు 712 వ పుటలో వాడినారు. ఈ వ్యాసము రెండవభాగములో ఇట్టిశబ్దములనుగురించి వివరముగా వ్రాయదలచినాము; గనుక ఇప్పుడు ఈచర్చ పెంచము.

కర్త్రార్థక ప్రయోగము

108 "ఎక్కుడంబడెదయ్యో కు" అని ప్రసన్నరాఘవమునందు 16 వ పుటలో కర్త్రర్థక ప్రయోగము పంతులవారు వాడినారని మన శాస్త్రిలవారు తప్పుపట్టి, "ఆంధ్రభాషా స్వభావాననుగుణము" అని దానిదోషము నిరూపించినారు. తమ విమర్శ. 139 వ పుటలో "కర్త్రర్థకము జెల్ల మేని కావింప బడియె" నని వ్రాయమని చెనకినారు. ఆంధ్రభాషా స్వభావానను గుణముగా శాస్త్రిలవారు వ్రాసిన వాక్యాలు ఎన్నివందలు కావలిస్తే అన్ని ఉదాహరించ వచ్చును. (ఈ వ్యాసము మూడవభాగములో చూతురుగాని). "ఆంధ్రభాషా స్వభావము" అన్నప్పుడు ఏ ఆంధ్ర భాషయొక్క స్వభావమో? ఇప్పటి ఆంధ్రభాష వారికి గ్రామ్యమే ఆయెను; ఇక, ప్రాచీనాంధ్ర భాషయొక్క స్వభావము కావ్యములలో కొంత కనబడినా, అంతా కనబడదాయెను; ఆకనబడినంతమట్టుకైనా శాస్త్రిలవారివంటి కేవల లక్షణ పరాయణులకు పట్టు బడదాయెను. యోగసమాధిలో కనబడేది కాదాయెను; తర్కముచేత సాధించ శక్యము కానిదాయెను. మరి యెట్లు "ఆంధ్రభాషా స్వభావానుగుణముగా" వ్రాయడము? కర్త్రర్థక

ప్రయోగము పంతులవారికి బెల్లమని వెక్కిరించిన శాస్త్రిలవారికి ఈప్రయోగము అమృతప్రాయమయినట్లు మాకు కనబడుతున్నది. చూడండి మచ్చుకు రెండుమూడు వాక్యాలు కథాసరిత్సాగరములోనివి: "ఆమూషకుఁడు ...క్రోధవర్మ భార్యతో సంగమించి అతనిచేత చూడఁబడి సముద్రములో వేయఁబడి చచ్చెను" (3 8). "మనము...యీలోఁతు సుడిలో...జలము చేత విసరిపారవేయఁబడినారము" (21); "ఇదిగో ఆసన మలంకరింపఁ బడునుగాక" (405); "ఈసరస్సులో వేయఁబడిన వెదుళ్లు" (418). ఏదో దేనిలో అందముగా లేదని వెక్కిరించిన దని సామెత చెప్పుకొంటారు. అలాగున ఉన్నది శాస్త్రిలవారు పంతులవారిని కర్మార్థక ప్రయోగము కోసము వెక్కిరించడము.

109. ఈ కర్మార్థకప్రయోగమునుగురించి శాస్త్రిలవారు చేసే వాదములో ఒక వైచిత్ర్యమున్నది. మావంటి వర్తమానాంధ్ర భాషాభిమానులు కొన్నాళ్లక్రిందట ఈ కర్మార్థకప్రయోగము ఆంధ్రభాషా స్వభావానుగుణముకాదని వాదించినప్పుడు మన శాస్త్రిలవారు తాము రచించిన గ్రామ్యదేశ నిరసనములో (మా. పుట 20) ఆ వాదమును ఖండిస్తూ, కర్మార్థక ప్రయోగవాదము ఎలాగున సిద్ధాంతీకరించినారో చూడండి:—

"ఇప్పటి గ్రామ్య వ్యవహారమందు కర్మార్థకరూపములు అరుదగుట వాస్తవమే. తొల్లియు ఇవి విరళమే అయెనేని, ఈ భాషను మంచి దశకుం దెచ్చిన యా సంస్కృత విద్వాంసులు దీనియందలి లోపముం దీర్చుటకై 'పొందుట' యర్థముగు 'పడు' ధాతువును అనుబంధముగా కల్పించి పొందెడి వానిం జెప్పెడి యీ ప్రయోగమును సాధించుట కడుం బొందికయై యీభాషాభివర్ధనుల మహిమాతిశయంబును తద్వ్యవహార వైరళ్యము వ్యవహర్తల యజ్ఞానంబును సూచించుచున్నవి".

ఇట్లు కర్మార్థకప్రయోగమును కొనియాడి, దానిని వాడినవారిని స్తుతించి, వాడనివారియందు అజ్ఞానము ఆరోపించిన వేదము వేంకటరాయ

శాస్త్రిలవారు వేంకటరత్నము పంతులవారిని కర్మార్థక ప్రయోగములు వాడినందుకు నిందించిన వేదము వేంకటరాయశాస్త్రిలవారే సుమండీ! అయితే, వారి మతిములో ఇట్టి వైషమ్యము ఎందుకు కలిగినది? అంటే, ఒకటే సమాధానము కనబడుతున్నది. శాస్త్రిలవారికి తత్త్వజిజ్ఞాస లేదు; విసంవాద ప్రియులు. ప్రతివాదులు కాదన్నది అవుననిన్ని, అవునన్నది కాదనిన్ని సిద్ధాంతము చేయడమే వారికి కావలసినది. 'జంకు కళంకులేని' వారమని వారేగదా చెప్పుకొన్నారు. వారు గొప్పపండితులని వారిశిష్య బృందమునకు పరమ విశ్వాసమున్నది. వారేమన్నా 'బళాబళీ' అనేవారున్నారని వారికి బాగా తెలుసును. మరిజంకేల! కళంకుంటేనేమి? కవిచంద్రులు గదా శాస్త్రిలవారు; వారియందు కళంకు వారిశోభను వృద్ధి చేస్తుందనే వారికిన్ని వారిశిష్యులకున్ను సమ్మతము. ఏమదృష్టము!

అఱవ తెలుఁగు

110. వేంకటరత్నము పంతులవారి తెలుఁగు 'అఱవతెలుఁగు' గని (పుట 227) 'మదరాసు తెలుఁగు' గని (80) 'చెన్నపట్టణపు తెలుఁగు' గని (89) 'గుజరాతీపేట తెలుఁగు' గని మాటిమాటికి ఎత్తిపొడిచినారు. వాస్తవముగా శాస్త్రిలవారివంటి అఱవ తెనుగు పండితులవల్లనే మన తెలుగు భాషకు ఇప్పటి దురవస్థ సంభవించినది. చెన్నపట్టణములో తెలుగుగ్రంథములు అచ్చుపడడము, అక్కడున్న అఱవతెలుగు పండితులు గ్రంథములు పరిష్కరించడము, ఆంధ్రగ్రంథాలు పాడు కావడమునకు ముఖ్యకారణము. ఎందునాపొందని నేటి అధ్వానపు తెలుగు పరవస్తు చిన్నయసూరిగారి మూలముగా దాపరించనది. ఆయనకాలములో వచనాలు వాడుకభాషలోనే అందరూ వ్రాసేవారు. ఆయనమాత్రము వింతతెలుగు వ్రాసేవారు. ఇప్పుడు తెలుగువచనము వ్రాసేవారందరికిన్ని వారు మూలపురుషులట! వారి వచనములో బీజరూపమున మాత్రము ఉన్నరచనా దోషములన్నీ శిష్య పరంపరా ప్రాప్తములయి నేటివారియందు పరిణామము పొందిన

టున్నది. అది అట్లుండనీయండి; వేరేవ్యాసములో వివరించి నిరూపించ వలసిన విషయము. వారి నీతిచంద్రికలోని తెలుగు నిర్దుష్టముకాదు.

111. గ్రాంథికాంధ్రభాష లెస్సగా తెలియక నిర్దుష్టమయిన శబ్దములనేకము దుష్టమని మనశాస్త్రులవారు పంతులవారిని నిష్కారణముగా నిందించినారని దృష్టాంతములు చూపించే ఉన్నాము. అటువ తెనుగని శాస్త్రులవారు నిందించిన శబ్దము గ్రాంథికమయిన సుశబ్దమని ఋజువు చేస్తాము; చూడండి ప్రసన్న రాఘవము 71-వ పుటలోని ఉత్పలమాల మూడవ చరణమందున్న 'రఘువంశపక్కమే' అనేశబ్దమును ఎత్తుకొని తమ విమర్శము 226 వ పుటలో ఇట్లు చెప్పినారు.

'పక్షపాతమునకు పక్కమనుట అటువములో వాడుక. చెన్నపురి యటువ తెనుగులోగూడ నీ వాడుకగలదు. ఆఫలమిట నీ రాఘవములో ప్రసన్నమైనది. కవితాతత్త్వములో నిట్లుశిష్ట వ్యవహారానుగుణముగా ప్రయోగములు చేయవలసినదని యున్నది. కావున నౌత్తరాహులారా! ఆక్షేపింప కుడు.'

112. మేము ఔత్తరాహులమే; అటువ తెలుగు మాకు అనిష్టమయినదే. అయితే, పంతులవారి గ్రంథాలలోగానీ, శాస్త్రులవారి గ్రంథాలలోగానీ, మూలపురుషులయిన చిన్నయసూరిగారి గ్రంథాలలోగాని, వారిని అనుకరించిన ఇతరుల గ్రంథాలలోగానీ, 'పండిత విరచితము' 'పండిత సంస్కృతము' అని పుస్తకముమీద కనబడగానే, ఏ అచ్చు పుస్తకమయినాసరే, అందున్న భాషలో తప్పులెన్నుటకు సామాన్యులు సాహసించగలరా? వాడుకలో లేని అపూర్వశబ్దములుంటే, ఏవో గ్రంథాలలో ఉన్నవిగాబోలు అనుకొంటారు. వాడుకలోనివే వాడుకకు విరుద్ధముగా కనబడితే, వాడుకభాష గ్రామ్యము గనుక దానికివిరుద్ధముగా ఉన్నవే తప్పకుండా గ్రాంథికములు అనుకొంటారు. బడులలోను కాలేజీలలోను విద్యార్థులు చదువుకొనే తెలుగు పుస్తకాలు అన్నీ తప్పుల కుప్పలు. పరిశీలనచేసే దిక్కు

లేదు. ఔత్తరాహులైతేనేమి? దాక్షిణాత్యులైతేనేమి? దేశభాషా స్వభావమునకు అనుగుణముగా గ్రంథాలలోని భాష ఉండవలసినదని విధి లేనప్పుడు, ప్రాచీనగ్రంథాలలోని భాష ఇప్పుడు వాడుకలో లేక అపరిచితమైనప్పుడు, పండితులయినా పామరులవలెనే తప్పొప్పులు కనుక్కోలేక, ప్రక్కమిక్కనకుండా ఊరుకోవలసినదే. తప్పులున్నవని తెలిసినవారయినా ఊరుకుంటారు గాని ఏమీచేయరు. పాపము! ఏమిచేయగలరు? వారి ఏడుపు ఎవరు వింటారు? అరణ్యరోదనము! దిక్కులేక గ్రాంథికాంధ్రము రెంటికి చెడ్డ రేవడిలాగున్నది. ఆదరణలేక దేశభాష గ్రామ్యమన్న పేరు పొందినది. ఎట్టిపండితులైనా, ఎట్టితగుమనుష్యులైనా, ఎట్టి నాగరకులైనా తెలుగువారు గ్రామ్యమే మాటాడుతారుగాని సభ్యభాషలో సంభాషించలేరన్న అపకీర్తి అందరికిన్ని వచ్చినది. ఇందుకు ఎవరూ దుఃఖించరు. ఎందుకు ఈ సోది? భాషాభిమానముగాని, స్వాభిమానము గాని లేనివారితో చెప్పుకొంటే లాభములేదు. ఎవరైనా ఎప్పుడయినా వినరా? అని మొఱ్ఱపెట్టుకున్నాము. ఇకను ప్రకృత మనుసరిస్తాము.

113. 'పక్షము' అనేశబ్దము ఈపద్యమందు పంతులవారు 'పక్షపాతము' అనేఅర్థమందు వాడిఉంటే శాస్త్రిలవారు అన్నట్టుతప్పేనా? వారి శిష్యులు తప్పేఅంటారు. వారిపేరు వినగానే జోహారుచేసేవారున్ను తప్పే అని తలకాయ ఎగరవేస్తారు. శ్రమపడ నక్కరలేకుండా విమర్శించేవారు శబ్దరత్నాకరము చూచి, అందులో 'పక్షము'కు 'పక్షపాతము' అర్థము చెప్పి ఉండనందున పంతులవారు పొరబడ్డారనే సిద్ధాంతముచేస్తారు. ప్రాచీన ఐతే గ్రంథాలలో ఈ శబ్దము ఈ అర్థమందు వాడిఉన్నారేమో వెదకివెదకి చూడవలెను. ఎవరైనా వాడిఉంటే, అది గ్రాంథికమని రుజువవుతుంది. వెదకిన వారికి కనబడనంతమాత్రాన అదిగ్రాంథికముకాదని సిద్ధాంతముకాదు; ఏమో? వారు చూడనిగ్రంథమందెక్కడైనా ఉన్నదేమో? ఏశబ్దమయినా ప్రాచీన భాషలో లేదని రుజువుచేయడము కేవలముఅసాధ్యము. ఇప్పుడున్నగ్రంథ

ములలో దేనిలోనూ లేదని రుజువుచేయడము చాలా దుష్కరము. ఏద యినా ఉన్నదన్నందుకు సాక్ష్యము తేగలముగాని లేదన్నందుకు సాక్ష్యము తేలేము. 'పక్షము' అంటే, 'పక్షపాతము' అనే అర్థము చెప్పక తప్ప నట్లు ఎఱ్ఱన హరివంశములో రెండుచోట్ల ఆశబ్దము వాడినాడని మేము జ్ఞాపకముంచుకొన్నాము. గనుక, శాస్త్రిలవారే పొరబాటుపడి నిష్కా రణముగా పంతులవారిని తిట్టినారని చెప్పుటకు సాహసించినాము. చూడండి ఆ రెండు ప్రయోగములు:—

(1) హరివంశములో, కృతిపతి వేమారెడ్డి కవినిగూర్చి చెప్పినవాక్య మిట్లున్నది.

తే. సకలభాషా కవిత్వవిశారదుఁడవు, సాధుసమ్మతుఁడవు, నిత్య సౌమ్య
మతివి,భవ్యుఁడవు గాన నీమీఁదఁ బక్షమేను గలిగి యుండుదు నెప్డు
నెఱ్ఱ నార్య. (పూ 1. 38)

(9) అందే, యముడు సూర్యునితో ఛాయాదేవి కోపించి యిచ్చిన శాపమును గురించి చెప్పినవాక్యము అచ్చులోనే ఇట్లున్నది.

ఉ. ఎంతయు గల్గినం బ్రజలకేక విధంబగు లాలనంబుఁ జే
యందగరే పవిత్రలు మదంబ మమున్ ముగురన్ సహింపదే
చందము పిన్నవారలకుఁ జాలఁగఁ బక్షము సేయు దీనికిన్
డెందములోనఁ దాలిమి ఘటింపకయే నిటు తప్పుచేసితిన్.

(పూ. 1 183).

వ్రాతప్రతులలో కొంచెము పాఠభేదము లున్నను, ఈరెండు పద్యములలో 'పక్షము గలిగియుండుదు', 'పక్షముసేయు' అనే వాక్యములు అచ్చులోనున్నట్లే ఉన్నది; సందేహము లేదు. విమర్శించకుండా శాస్త్రిలవారన్నమాట, వేదవాక్యముగా నమ్మి, పంతులవారిని లోకమంతా ఈవిషయములో దూషించినా, మేముమాత్రము శాస్త్రిలవారిమాట తప్పనక

వల్లగాదు. ఎఱ్ఱన ప్రయోగము చూచినతర్వాతకూడా శాస్త్రిలవారిమాట చెప్పిన పంతులవారిని దూషిస్తే ఎఱ్ఱనను దూషించినవార మవుతాము.

114. పంతులవారి తెలుగులో శాస్త్రిలవారు చూపించిన 'అఱవ తెలుగు' కన్న శాస్త్రిలవారి తెలుగులో మాకంటబడిన 'అఱవ తెలుగు' ఔత్తరాహుల మైన మాచెవులకు ఎక్కువ వింతగా ఉంటుంది. మచ్చుకు రెండుమూడు ప్రయోగములు చూడండి. 'చెప్పికాఁగానే' (పుట 4) 'చెప్పుకొనియైనతర్వాత, (10) 'బయటవచ్చి' (72) 'పారణచేసికాఁగానే (141)' మూకుడు నడిమి బొక్క (158) 'పసులసాలమేడ' (253) 'ఈకొయ్యలు (కర్రలు) నుండును' వెవ్వేఱు (=వేఱువేఱు) (252) బాణములచేత యుద్ధముచేసెను (83) ఆ కొండ యడివారమున దివ్యమైనతోట వేయించెను. (244) వీటిలో 'వెవ్వేఱు' "అడివారము' శబ్దరత్నాకరమందు లేవు; మే మెరిగినంతమట్టుకు తెలుగుదేశమందు పుట్టిన తెలుగుగ్రంథాలలో మాకు కనబడలేదు. అఱవ తెలుగు మాట్లాడే మన శాస్త్రిలవారివంటివారు వ్రాసిన తెలుగులోమాత్రము చూచినాము. అడివారము కేవలము అరవము. 'మలైయడివారమ్' కొండ అడుగుభాగము. సింహాచలము వద్దనున్న గ్రామమునకు అరవవైష్ణవులు పెట్టినపేరు ఇప్పుడు 'అడివ్వరమ్' అనివాడుకలో ఉన్నది, 'అడవిలో నున్న ఊరు' అని ఇప్పటివారు వ్యుత్పత్తి చెప్పుతారుగాబోలు.

భావింపుచున్నాఁడు

115. ప్రసన్నరాఘవము 15 వ పుటలో భావింపుచున్నావు అని ఉన్నది. ఇది తప్పట ఎందు చేతనో? చిన్నయసూరి చెప్ప లేదని కాబోలు. వ్రాతప్రతులన్నిటిలోను ఆంధ్రశబ్ద చింతామణికి టీక వ్రాసిన బాలసరస్వతి 'రక్షింపు చున్నాఁడు' అనేరూపము అనుశాసించినట్లున్నది. భారతాది ప్రాచీన గ్రంథముల వ్రాతప్రతులలో మేముచూచిన వాటిలో 'పుచున్నాఁడు' అనేరూపమే ఉన్నది; 'చుచున్నాఁడు' అరుదు. భాషాతత్త్వము చొప్పున 'చుచున్న' సాధుభాషగా కనబడదు. తత్త్వము మాటకేమి? పోనీండి;

ఆంధ్రశబ్ద చింతామణిక్రియా పరిచ్ఛేదము 15వ సూత్రమునకు టీక ఇట్లున్నది.

'అనుబంధ ప్రార్థన యోరిత్యాది సూత్రముచేతఁ బత్వము, పోషింపుచున్న; వ్యతిరేకార్థేల్పటిలిత్యాది సూత్రముచేత డువర్ణకము, పోషింపుచున్నాఁడు; వర్ణాగమో విశేషః అను సూత్రముచేత దీర్ఘము పోషింపుచున్నాఁడు. ఇట్లు నుతింపుచున్నాఁడు, జయింపుచున్నాఁడు, అనుభవింపుచున్నాఁడు, భరింపుచున్నాఁడు, వసింపుచున్నాఁడు, ఇత్యాదులు.

ఈ ప్రమాణము చొప్పున పంతులవారి వ్రాత ముమ్మాటికి సాధువే.

ఇత్వసంధి

నన్నయకాలమునుండి ఇత్వసంధి ఉన్నది. చూ. రాతిరెల్ల (ఆది 6-160) చెఱొక్క (ఉద్యో 1. 219), తిత్తొల్చి (నైష 7. 81). పూర్వము విరళమయినా అంత కంతకు ప్రచురమయినది. శాస్త్రులవారి కిది బోధపడక, తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లని వాదిస్తారు. నైషధము 3. 202 'దీనంబ్రులు' అని ఉంటే దిద్దినారు. సరసభూపాలీయములోని 'వానన్న' దుష్టసంధి అన్నారు; జైమినిభారతములో 'వానరపము' అని ఉన్నది. (చూ. శ. ర. ఆనతిచ్చు) అనేకులు ఈసంధి అంగీకరించినారు. బాలకవిశరణ్యములో ఈ విషయము చర్చిస్తాము. ఇక్కడింతే చాలును.

క్త్వార్థకేకారసంధి

117. శాస్త్రులవారి దృష్టికి ఇది మహాపాతకము. బాలకవిశరణ్యములో కావలసినన్ని ప్రయోగాలు ఉదాహరిస్తాము. ఒక్క చిన్నయసూరి తప్ప తక్కిన లాక్షణికులు ఇది అంగీకరించినారు. ప్రాచీనాంధ్రములో విరళమన్న మాట వాస్తవము. భాషాతత్త్వమునుపట్టి అట్లు కాక తీరదు; గాని ఉత్తరాంధ్రములో పదాంతమందున్న అచ్చుల ఉచ్చారణమారుటచేత సంధి అవుతున్నది గనుక ఈసంస్కారము ఒప్పుకోక తప్పదు.

ముందుకు; ఎందుకు

118. వేంకటరత్నము పంతులవారు తమ గ్రంథము 55 వ పుటలో 'ముందుకు జరిగె' అనిన్ని 80 వ పుటలో 'ఎందుకు' అనిన్ని వ్రాసినారని మనశాస్త్రులవారు నిందించినారు. ఈ రెండు శబ్దములు వారు అసాధువు లనడము వింతకాదు. ఎందుచేత నంటే, అభారత ప్రయోగములు వారు అంగీకరించరట; ఇవి భారతములో లేవు అభారత ప్రయోగములు వారు అంగీకరించడము వారి గ్రంథములలోని భాషను గురించి కాదు సుమండీ ఇతరుల గ్రంథములు విమర్శించి నప్పుడే వారు వ్రాసేభాష, ఇంచుమించుగా అంతా అభారత భాషే. ఇది వింతకాదు: 'ముందుకు', 'ఎందుకు' అసాధువులనుటకు వారు చెప్పిన కారణము వింతగా ఉన్నది. వింతే కాదు; ఆ కారణము చూచి నిర్ఘాంతపోయినాము. ఎంత పుచ్చిన మిరియాలైనా జొన్నల పాటి చేయవా? అనుకొనేవాళ్లము. శాస్త్రులవారి ఆంధ్రపాండిత్యములో ఇదవరకు ఎన్నిలొట్లు కనబడ్డా నెరసుమాట చెప్పవలసి వచ్చినప్పుడు, సగటుకు తీసిపోదు అనుకొన్నాము. 'ముందుకు' తప్పన్నందుకు వారు చెప్పిన కారణము చూచిన తర్వాత మాత్రము—నిజము చెప్పక తీరదు—వీరియందు ఏమీ ఆధిక్యమున్నట్టు ఒప్పుకోవడమునకు మా మనస్సు ఒప్పకుండా ఉన్నది. నగాగమము లేనందున 'ముందుకు', 'ఎందుకు, అసాధులట! ఓహోహో! గ్రాంథికాంధ్రభాషా పాండిత్య పరమావధి 'ముందుకు' అంటే తప్పట! 'ముందునకు' అంటే సాధువట!! చదువుకోక మునుపు కాకరకాయ; చదువుకొన్న తర్వాత కీకరకాయ అన్నట్టున్నది కుప్రత్యయమునకు పూర్వము నగామము తప్పకుండా ఉండవలెనట! ఆంధ్రశబ్దచింతామణిలో 'నఃకా' అనే సూత్రము ఇక్కడ పట్టించవలెను! పాండిత్యము ముదిరిపోయి, పండిపోయి, చివికి, ప్రిదిలి రసము కారిపోతున్నట్టు ఉన్నది. ఇట్టి పండితుని రసికుఁడని అంకెరుఁ జేర్చికొంటివటే! సీసీ ఆంధ్రీ అని బ్రహ్మదేవుడు నాలుగుచేతుల తర్జనులున్ను నాలుగు ముక్కులమీద

పెట్టుకొని ఉండడా? ఆంధ్రవాణి సిగ్గుచే తలవంచుకొని ఉండదా! బ్రహ్మ సభలోనున్న నన్నయాది మహాకవు లందరున్నూ మొగాలు వ్రేలవేసుకొని ఉండరా? అని అనుకొంటున్నాము.

119. 'ముందుకు', 'ఎందుకు' అనేవి లోకములో ఇప్పుడు సుప్రసిద్ధములయిన శబ్దములు. శబ్దరత్నాకరమందు 'ఏల' కు 'ఎందుకు' అని అర్థమున్నది. ప్రాచీనాంధ్రములో ఇవి లేవన్నమాట నిజమే; గాని, ప్రాచీనాంధ్రములో 'ముందునకు' 'ఎందునకు' లేనే లేవే! 'ముందటికి', 'ముందటికి' అనేవి మాత్రము ఉన్నవి. ఇవి నేను కూడా మనము వ్రాస్తున్నాము; ఈ రెంటికి అర్థములో కొంత భేదము నేటి వ్యవహారములో ఏర్పడ్డది; ఆ భేదము పూర్వము లేదు. 'ఎందుకు' కు బదులుగా పూర్వులు 'ఎందులకు' వాడేవారు; గాని 'ఎందులకు' అంటే 'ఎక్కడికి' అని ప్రాచీనులభాషలో అర్థము? 'అందులకు' అంటే 'అక్కడికి', ఇందులకుఅంటే 'ఇక్కడికి', నేనుకూడా 'అందులకు' అనేశబ్దము మనము వాడుతున్నాము. ఉదా. 'మీకు తెలియగలందులకు వ్రాసినాను' ఇట్టి సందర్భమందు నన్నయాదులు 'అందులకు' వాడలేదు. నేను 'అందులకు' వాడుకలోఉన్నా, 'ఇందులకు', 'ఎందులకు' లేవు. అందుకు, ఇందుకు, ఎందుకు—ఇవి నాలుగయినువందలసంవత్సరములై కవులు స్వేచ్ఛగావాడుకుంటున్నారు. భోజరాజీయము, కేయూరబాహుచరిత్ర, మల్లనవరాహపురాణము, వసుచరిత్ర, చంద్రికాపరిణయము, రుక్మాంగదచరిత్ర, ప్రభావతీప్రద్యుమ్నము—ఇటువంటివాటిలోనే ఉన్నవి. ఇక ఇలాదేవీయము, కువలయాశ్వచరిత్ర, కృష్ణరాయవిజయము, చిత్రభారతము, దశావతారచరిత్ర, బిల్హణీయము, మిత్రవిందాపరిణయము, రాధామాధవసంవాదము, రామరాజీయము, రామస్తవరాజము, విజయవిలాసము, వేంకటేశ్వరమాహాత్మ్యము, శశాంకవిజయము, సారంగధరచరిత్ర మొదలయిన అనేకకావ్యములలో 'అందుకు' 'ఇందుకు' 'ఎందుకు' ప్రయుక్తమయిఉన్నవి. వీటిలోని ప్రయో

గములన్నీ బాలకవి శరణ్యములో 'రాజుకు' అనే శబ్దమునుగురించి మేము ప్రకటించే ప్రసంగములో ఉదాహరిస్తాము. ఇక్కడ నాలుగు ప్రయోగములు మాత్రము మచ్చుకు చూపిస్తాము:—

మల్లన వరాహ.

మ. అనుభవ్యంబగు మిందుకుం బనుసుహాఖ్యానంబు (9. 8)

,, క...స్పర్ధించి నిందుకుం బగ (9. 86)

వసు చరిత్ర. మ...పంచమశబ్ద మిందుకు సుప్రజ్ఞాలంబు రాజిల్లునే (3, 141)

చంద్రికా. పరి. సీ. గీ...అందుకోర్వం జాల...(4 162)

వందలు వందలుగా తెలుగు కావ్యములలో ఇట్టి ప్రయోగములున్నవే. ఇవి శాస్త్రిలవారికి తెలియనే తెలియవని ఊహించవలెనా? తెలిసినీ పంతులవారియందు దోషము ఆరోపించినారనవలెనా? "ఎందుకు" తప్పనిన్ని "ఎందునకు" ఒప్పనిన్ని బడిపిల్లలకు బోధిస్తున్నారే! ఎంత అవివేకము! తెలియవంటే, శాస్త్రిలవారు ఆంధ్రసారస్వతము పాలిమేరయినా ఎరుగరని చెప్పవలసి వస్తుంది. తెలుసునంటే, ఈ చెప్పిన కవులంతరిభాష అసాధువనిన్ని వారికంటె వారు సాధుతరమైన తెలుగు వ్రాయగలవారనిన్ని చెప్పవలెను; లేదా, కేవలము ఈర్ష్యచేత పంతులవారిని నిందించినారని అయినా చెప్పవలెను. ఏది సంభావ్యము?

120...'ముందుకు' అని నేటి వ్యవహారములో సిద్ధశబ్దము. వేంకటరత్నము పంతులవారి ప్రయోగము భాషాస్వభావానుగుణముగానే ఉన్నది; తప్పుకాదు, శాస్త్రిలవారు సాధువని విధించిన 'ముందునకు' కేవలము లోకవిరుద్ధము. నేడు ఎక్కడా లోకములో వినబడదు; పూర్వకాలపు గ్రంథములలో మాకు ఎక్కడా కనబడలేదు. నన్నయ తిక్కనాది కవుల

కావ్యములనేకాక ఉత్తరాంధ్రకవులకావ్యములలోకూడా తరుచుగా ముందటికి, 'ముందటికి, కనబడ్డవి. ఇవి నేడున్ను లోకమం దున్నవి. కొన్ని ప్రయోగము లుదాహరిస్తాము; చూడండి:—

ద్రోణ. 1. 204. పాండవయోధులు...యుధిష్ఠిరు ముంపటికి వచ్చి.

,, 4 822. క. పటుకరముల మీఁదికి దాఁ|పటికిన్ వలపటికి నపర
భాగమునకు ముం|దటికిఁ జపలనడపె సము | త్కట రయమున
శిరముఁ గందుకక్రీడఁగతిన్.

శాంతి 3. 557క...వీనినేల నాముంపటికిం, గానిచ్చితివి.

పాండురంగ 4. 224 చ...|చిల్కలుపడఁ గొట్టిముంపరికి దాఁగక,

మల్లన వరాహ 3. 23. గీ...ముంపరికివచ్చి.

ప్రభావతీ. 2. 42. సీ. అంతనిశ్చల ప్రసారిత పతితంబులై, డినుచుఁ గాముని ముందటికిని గొంత.

నీలాసుంద 3. 64 క. అటువలె ముం, పటికినిఁ జని.

'ముంపర' వాస్తవముగా వేరే శబ్దము కాదు, 'మీఁదు' 'కింపు' శబ్దములనుండి, 'మీఁదటి-కి', అనే రూపములు వచ్చినట్టే, 'ముందు' శబ్దమునుండి 'ముంపటి-కి', 'క్రిందు'నుండి క్రిందటి-కి' వచ్చినవి; 'అయితే' 'మీఁదికి' 'క్రిందికి' అనేవి కూడా వాటినుండి వచ్చినవి గాని, దీనినుండి 'ముంది' కి రాలేదు, ఉత్తరాంధ్రమందు 'అందుకు' 'ఇందుకు', 'ఎందుకు 'వలెనే 'ముందుకు' వచ్చినది.

121. ఆంధ్రశబ్ద చింతామణిలోని 'నఃకా' అనేసూత్రమున్ను, బాలవ్యాకరణమందున్న 'కువర్ణకంబు పరంబగునపు డుకారబుకారంబులకు నగాగమంబగు' అనే సూత్రమున్ను, అయినదానికీ కానిదానికీ పట్టించి, లోక

విరుద్ధమయిన శబ్దములు పుట్టించే వారికి వ్యాకరణ మంటే ఏమిటో తెలియదని చెప్పవలెను. ఆగమ శాస్త్రము నిత్యము కాదు. ఉత్సర్గము కంటె అపవాదము బలీయము. అపవాదము లున్నప్పుడు వాటిని చెప్పకుంటే, శాస్త్ర మప్రమాణము గాని శబ్దము తప్పుకాదు. వ్యాకరణ శాస్త్రముయొక్క పడికట్లు తెలియని పండిత ప్రభువులు లోకములో ప్రసిద్ధ మయిన శబ్దములు శాస్త్ర విరుద్ధములని భాషించి, లోక విరుద్ధమయినవి శాస్త్రముచేత సాధింపనెంచి స్వభావసిద్ధమయిన రూపములుమార్చి 'దిద్దుతున్నారు'. తమ బొల్లి భాష బడిపిల్లలకు నేర్పుతున్నారు. 'ఆనందవాచక పుస్తకముల'లో కూడా 'ముందునకున్ను' అట్టివే ఇంకా అనేక అపశబ్దములున్ను ఉన్నవి. మన శాస్త్రులవారు, వాడినవే ఇట్టి అపభ్రంశములు ఈవ్యాసము మూడవ భాగములో ఉదాహరిస్తాను.

ఆంధ్రపత్రిక ముద్రాలయమున ముద్రితము, చెన్నపురి. 1933.